'గ్రామం ప్రగతిపథంలో ఉంటే ఎవ్వరూ మురా కక్షల జోలికి వెళ్లరు'

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 18 సంచిక: 225

గురువారం 6-11-2025

అడవి.. ఆమె
ప్రసిద్ధ వైల్డ్‌లైఫ్ ఫిల్మ్‌మేకర్ రీటా బెనర్జీపై కథనం
11 లో

పైచేయి కోసం..
భారత్, ఆస్ట్రేలియా మధ్య నేడు నాలుగో టీ20 మ్యాచ్
12 లో

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

నేడే బిహార్ తొలి దశ పోలింగ్
బిహార్ శాసనసభ ఎన్నికల్లో భాగంగా తొలి దశలో 121 నియోజకవర్గాల్లో నేడు పోలింగ్ జరగనుంది.
వివరాలు 6లో ▸


రైలు ఢీకొని ఆరుగురు మృతి
ఉత్తరప్రదేశ్‌లోని చునార్ రైల్వేస్టేషన్‌లో రైలు దిగి పట్టాలు దాటుతున్న ఆరుగురు మహిళలను మరో రైలు ఢీకొట్టింది.
వివరాలు 6లో ▸

రాహుల్ హైడ్రోజన్ బాంబు
పాతిక లక్షల నకిలీ ఓట్లు, ఈసీ అండదండలతో హరియాణా ఎన్నికల్లో బీజేపీ గెలిచిందని కాంగ్రెస్ నేత రాహుల్ ఆరోపించారు.
వివరాలు 6లో ▸

వర్జీనియా ఎల్జీగా హైదరాబాదీ
హైదరాబాద్ మూలాలున్న అమెరికా రాజకీయ నేత గజాలా హష్మీ వర్జీనియా లెఫ్టినెంట్ గవర్నర్‌గా విజయం సాధించారు.
వివరాలు 6లో ▸

• బాబు 'ప్రైవేట్' జపం..
వైద్య విద్యార్థులకు శాపం

కొత్త మెడికల్ కాలేజీలకు అడ్డుపడ్డ కూటమి సర్కారు.. కన్వీనర్ కోటా సీట్లకు కోత

ఏపీలో గతేడాది 700.. ఈ ఏడాది 1,750 ఎంబీబీఎస్ సీట్లు పోయాయ్

రెండేళ్లలో 2,450
మెడికల్ సీట్లు కోల్పోయిన మన విద్యార్థులు

సీట్లు పెరగకపోవడంతో మనకు తీవ్ర అన్యాయం.. వైద్య విద్య కలలు ఆవిరి

ఏపీ, తెలంగాణ మధ్య మెడికల్ సీట్ల కటాఫ్‌లలో తీవ్ర వ్యత్యాసం

తెలంగాణలో నీట్ ఓపెన్ కేటగిరీలో 406 మార్కులకే కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు

ఏపీలో 484 మార్కులు వచ్చినా ఓసీ విద్యార్థులకు దక్కని కన్వీనర్ సీటు

బీసీ-ఏలో 341 మార్కులు వచ్చిన విద్యార్థికి తెలంగాణలో కన్వీనర్ సీటు

2 లో

అదే విభాగంలో వందకుపైగా మార్కులు అదనంగా తెచ్చుకున్నా ఏపీ విద్యార్థులకు నిరాశే.. దేశ చరిత్రలో మెడికల్ కాలేజీలు తమకొద్దని చెప్పి చరిత్రకెక్కింది చంద్రబాబు ఒక్కరేనని సర్వత్రా విమర్శలు

మన విద్యార్థులకు మెడికల్ సీట్లు.. పేదలకు చేరువలో నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్యం లక్ష్యంగా ఒకేసారి 17 మెడికల్ కాలేజీల నిర్మాణానికి మాజీ సీఎం వైఎస్ జగన్ శ్రీకారం

పులివెందుల బోధనాస్పత్రి నుంచి వైద్య పరికరాలను తరలిస్తున్న దృశ్యం

4 బోధనాస్పత్రుల్లో అత్యాధునిక పరికరాలు ఔట్!

2 లో

- కొత్త మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌కు కట్టబెట్టేస్తూ ఆస్పత్రుల్లో సేవలకు మంగళం.. పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, ఆదోని బోధనాస్పత్రులు నిర్వీర్యం
- 4 చోట్ల ఆధునిక పరికరాలు తొలగించేస్తున్న కూటమి సర్కారు
- ఆయా ఆస్పత్రుల్లోని సీనియర్ వైద్యులు పాత జీజీహెచ్‌లకు సర్దుబాటు.. పేదల ఆరోగ్య భద్రతకు గొడ్డలి పెట్టులా చంద్రబాబు సర్కారు నిర్ణయాలు

ఆకలితో అలమట..

తుపాను గండం దాటినా కష్టాల సుడిగుండంలోనే మత్స్యకారులు

14 లో

- వేటకు వెళ్లినా చేపలు పడని దైన్య స్థితి
- ఉప్పాడ ప్రాంతంలో సాయం కోసం ఎదురుచూపులు
- సొంత నియోజకవర్గంలో పవన్ పలకరింపునకే నోచుకోని పరిస్థితి
- జగన్ హయాంలో ఉన్న భరోసా ఇప్పుడు లేదని ఆవేదన

కాకినాడ జిల్లా ఉప్పాడలో చేపల వేట లేకపోవడంతో వలలు సరిచేసుకుంటున్న మత్స్యకారులు

సాయం కోసం ఎదురుచూస్తున్నాం

మాకు సముద్రంలో చేపల వేట తప్ప మరొకటి తెలీదు. రోజుల తరబడి సముద్రంలో వేటకు వెళ్లినా చేపలు పడటంలేదు. తుపాను దెబ్బకు మరింత ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నాం. ఇప్పుడు మా ఇంట్లో ఆడవాళ్లు పనులకు వెళ్లి మమ్మల్ని పోషించాల్సిన పరిస్థితి వచ్చింది. ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూస్తున్నాం.

- ఎం.పెంటయ్య, ఉప్పాడ

నకిలీ మద్యం కేసు దర్యాప్తు..
ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

14 లో

- సీఎస్, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీకి జారీ చేసిన న్యాయస్థానం
- సీబీఐకి ఇవ్వాలన్న జోగి రమేష్ పిటిషన్‌పై స్పందించిన కోర్టు
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం
- ఈ నెల 12న తదుపరి విచారణ

12 లో
తొలిసారి ఐసీసీ వన్డే ప్రపంచకప్ సాధించిన భారత మహిళల జట్టు బుధవారం న్యూఢిల్లీలో ప్రధాని మోదీని కలుసుకుంది. ఈ సందర్భంగా మహిళా క్రికెటర్లందరితోనూ మోదీ సరదాగా ముచ్చటించారు.

న్యూయార్క్ మేయర్‌గా మమ్దాని

తల్లి మీరానాయర్‌తో కలసి మమ్దాని అభివాదం

- చరిత్ర సృష్టించిన భారతీయ అమెరికన్ యువకుడు
- తొలి ముస్లిం, పిన్నవయస్కుడైన మేయర్‌గా రికార్డు
- 50 శాతానికి పైగా ఓట్లతో జయకేతనం
- ట్రంప్ మద్దతిచ్చిన ఆండ్రూకు పరాభవం

- వివరాలు 6లో

ఇదండీ సంగతి

అంతలా విసిగించకు.. కావాలంటే నీకు మలిదశలో ఓటేస్తాలే!!

సామాజిక న్యాయ మహా శిల్పం ప్రాంగణంలో చెత్తాచెదారం, నాచుతో నిండి ఉన్న ఫౌంటైన్

అంబేడ్కర్ పైనా కూటమి కక్ష!

సామాజిక న్యాయ మహాశిల్పంపైనా చంద్రబాబు సర్కారు కుయుక్తులు

10 లో

- విజయవాడ నడిబొడ్డున మహోన్నత ఆశయంతో నిర్మించిన వైఎస్ జగన్
- జగన్ పేరు చిరస్థాయిగా నిలుస్తుందని అక్కసు
- ప్రాంగణంలోకి తప్ప మహాశిల్పం లోపలికి అనుమతించని సర్కారు.. పారిశుద్ధ్య నిర్వహణ గాలికి.. ప్రాంగణమంతా చెత్తా చెదారం
- జీతాల కోసం ఆందోళన చేశారనే అక్కసుతో సిబ్బందిని తొలగించే ప్రయత్నాలు

శ్రద్ధాంజలి

జననం: 03-May-1941
మరణం: 05-Nov-2025

కీ॥ శే॥ డాక్టర్ చలమలశెట్టి సురేంద్రనాథ్

కల్మష మెరుగని మనసుతో అందరి హృదయాలలో సుస్థిరస్థానా మేర్పరచుకుని
మా ఉజ్వల భవితకు బాట వేసిన మహావ్యక్తి, మీరు చూపిన మార్గంలో నడుస్తూ
మీ ఆశయాల సాధనకు కృషి సాగిస్తూ......
మీ ఆత్మకు శాంతి చేకూరాలని భగంతుని ప్రార్థిస్తూ..

భార్య
చలమలశెట్టి వెంకట లక్ష్మి

కుమారులు – కోడళ్ళు
చలమలశెట్టి సునీల్ & హిమ బిందు
చలమలశెట్టి వెంకటేష్ & అర్చన
చలమలశెట్టి అనిల్ & స్వాతి

మనమలు – మనమరాండ్లు
వేద, సుజయ్ తేజ,
సిద్ధ,
సుర్యాన్ష్, ఆర్యన్ష్

క్లుప్తంగా...

గవర్నర్‌కు వైఎస్ జగన్ అభినందనలు

కర్ణాటక లా వర్సిటీ గౌరవ డాక్టరేట్ ప్రకటించడంపై హర్షం

సాక్షి, అమరావతి: గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు కర్ణాటక లా వర్సిటీ గౌరవ డాక్టరేట్‌ని ప్రకటించటంపై హర్షం వ్యక్తం చేస్తూ 'ఎక్స్'లో వైఎస్ జగన్ బుధవారం పోస్టు చేశారు. 'న్యాయమూర్తిగా ఎన్నో కీలక తీర్పులు ఇచ్చిన జస్టిస్ అబ్దుల్ నజీర్ గారు, నేడు గవర్నర్‌గా కూడా రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడడంలో ముందున్నారు. చట్టం, న్యాయ పరిరక్షణకు విశేష కృషి చేసిన ఆయనకు కర్ణాటక స్టేట్ లా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ (హానరరీ డాక్టర్ ఆఫ్ లాస్) ప్రకటించడం రాష్ట్రానికి గర్వకారణం. ఇది వారి అంకితభావానికి లభించిన గుర్తింపు. ఈ సందర్భంగా గవర్నర్ జస్టిస్ నజీర్ గారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాను' అని జగన్ పోస్టు చేశారు.

నేడు విద్యార్థి విభాగం నేతలతో వైఎస్ జగన్ భేటీ

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ గురువారం పార్టీ విద్యార్థి విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల అధ్యక్షులతో సమావేశం కానున్నారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం జరగనుంది. విద్యార్థుల సమస్యలపై వైఎస్ జగన్ చర్చించనున్నారు.

ప్రత్యేక పారిశ్రామిక పాలసీ ప్రకటించాలి

దళిత పారిశ్రామిక సంఘాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేక పాలసీ రూపొందించాలని.. బకాయిలు పూర్తిగా తక్షణమే చెల్లించాలని టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని దళిత పారిశ్రామిక సంఘాలు డిమాండ్ చేశాయి. ప్రత్యేక పాలసీ లేకపోవటం వల్ల.. నిధులు దుర్వినియోగమవుతున్నాయని దళిత్ ఇండస్ట్రియల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు మామిడి సుదర్శన్ మండిపడ్డారు. గత ప్రభుత్వంలో వైఎస్సార్–జగనన్న బడుగు వికాసం వల్ల ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు లాభం జరిగిందని చెప్పారు. ప్రస్తుతం ప్రత్యేక పాలసీ లేకపోవడంతో ఎస్సీ, ఎస్టీలకు రావాల్సిన సబ్‌ప్లాన్ ఫండ్స్, ఇతర నిధులను ఇష్టారీతిన జనరల్ వారికి ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్టాండింగ్ కౌన్సిళ్ల నియామకం

సాక్షి, అమరావతి: హైకోర్టులో పలు వర్సిటీలు, ప్రభుత్వ సంస్థల తరఫున వాదనలు వినిపించేందుకు వీలుగా పలువురు న్యాయవాదులను స్టాండింగ్ కౌన్సిళ్లుగా నియమిస్తూ న్యాయ శాఖ ఉత్తర్వులిచ్చింది. ఏపీ స్పోర్ట్స్ అథారిటీ (శాప్) స్టాండింగ్ కౌన్సిల్‌గా జి.సాయి నారాయణరావు, ఆర్‌జీయూకేటీ కి ఎం.శివకుమార్.. పద్మావతి మహిళ వర్సిటీకి వల్లభనేని శాంతిశ్రీ, ఏపీ హ్యాండీ క్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బసు నాంచారయ్య నాయుడు, రాయలసీమ ప్రాంతంతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ, ఏపీ ట్రైబల్ వెల్ఫేర్, ఏపీ సోషల్ వెల్ఫేర్, ఏపీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీలకు తర్లాడ వినోద్ కుమార్ నియమితులయ్యారు.

17 నెలల్లో 34 మంది సలహాదారులు

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వంలో సలహాదారుల నియామకం, పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు తిరిగి నియామకాలు కొనసాగుతూనే ఉన్నాయి. మొన్నటి వరకు 33 మంది సలహాదారులను నియమించగా తాజాగా దేవదాయ శాఖలో స్థపతిగా పనిచేసి పదవీ విరమణ చేసిన ఎస్.సుందర రాజన్‌ను దేవదాయ శాఖ కమిషనర్‌కు సలహాదారుగా నియమించారు. ఈ పదవీలో ఆయన ఏడాది పాటు కొనసాగుతారు. ఈ మేరకు దేవదాయ శాఖ కార్యదర్శి హరి జవహర్‌లాల్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కూటమి సర్కారులో సలహాదారుల సంఖ్య 34కు చేరింది.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ వద్దు

చిత్తూరులో ఏఐఎస్ఎఫ్ ధర్నా

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటీకరణ చేయడం దారుణమని ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి శివారెడ్డి, రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి చెప్పారు. ప్రైవేటీకరణ వల్ల అన్ని వర్గాల పేద విద్యార్థులు పూర్తిగా నష్టపోవాల్సిన దుస్థితి ఏర్పడుతోందని మండిపడ్డారు. ప్రైవేటీకరణను వెనక్కు తీసుకోకపోతే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఇచ్ఛాపురం నుంచి హిందూపురం వరకు ఏఐఎస్ఎఫ్ చేపట్టిన బస్సుయాత్ర 15వ రోజు బుధవారం చిత్తూరు కి చేరుకుంది. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆ సంఘ నాయకులు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు.

చంద్రబాబు 'ప్రైవేట్' జపం..

వైద్య విద్యార్థులకు శాపం

కొత్త మెడికల్ కాలేజీలకు అడ్డుపడ్డ కూటమి సర్కారు.. కన్వీనర్ కోటా సీట్లకు కోత

గుంటూరులో ఉంటున్న కోటేశ్వరరావు ఓ ప్రైవేట్ కంపెనీలో అకౌంటెంట్. మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఆయన కుమారుడు అశ్వర్థ్ నీట్ యూజీ–2025లో 484 మార్కులు సాధించాడు. ఈ ఏడాది పేపర్ సరళిని బట్టి మంచి స్కోర్ సాధించాడని, కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు వస్తుందని అశ్వర్థ్ తల్లిదండ్రులు భావించారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో ఓపెన్ కేటగిరీలో 491 స్కోర్ వరకు కన్వీనర్ సీటు వచ్చింది. ఏడు మార్కుల తేడాతో అశ్వర్థ్ కన్వీనర్ కోటా సీటు కోల్పోయాడు. గుంటూరుకే చెందిన అశ్వర్థ్ స్నేహితుడు ధీరజ్ నీట్‌లో 475 స్కోర్ చేయగా 16 మార్కుల తేడాతో కన్వీనర్ కోటా సీటు చేజారింది. 'డాక్టర్ కావాలని మా అబ్బాయి చిన్నప్పటి నుంచి ఎన్నో కలలు కనేవాడు. అప్పులు చేసి రూ.5 లక్షలు ఖర్చు పెట్టి విజయవాడలోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదివించా. అక్కడే నీట్ కోచింగ్ తీసుకుని రేయింబవళ్లు కష్టపడి చదివాడు. మంచి మార్కులొచ్చినా మావాడికి కన్వీనర్ కోటా సీటు రాలేదు. ఈ ప్రభుత్వం కనీసం ఒక్క వైద్య కళాశాలను ప్రారంభించినా మావాడికి కచ్చితంగా కన్వీనర్ సీటులో వచ్చేది. ప్రభుత్వం వైద్య కళాశాలలను ప్రారంభించకపోవడంతో అన్యాయం జరిగింది..' అని అశ్వర్థ్ తండ్రి కోటేశ్వరరావు ఆవేదన చెందుతున్నారు. దేశ చరిత్రలో ప్రభుత్వ ఆధ్వర్యంలో రూపుదిద్దుకున్న మెడికల్ కాలేజీలను తమకొద్దని చెప్పి చంద్రబాబు చరిత్రకెక్కారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రభుత్వ కోటా రెండోదశ ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో కటాఫ్ మార్కుల మధ్య వ్యత్యాసం ఇలా..

రిజర్వేషన్	ఏపీ ఏయూ	ఏపీ ఎస్వీయూ	తెలంగాణ
ఓపెన్	491	479	406
బీసీ–ఏ	461	444	341
బీసీ–బీ	450	448	396
బీసీ–సీ	459	427	343
బీసీ–డీ	482	442	403
బీసీ–ఈ	409	448	395
మైనార్టీ	397	437	395
ఎస్సీ–1	338	278	126
ఎస్సీ–2	409	413	354
ఎస్సీ–3	381	377	368

సాక్షి, అమరావతి

వైద్య విద్య కలలు ఛిద్రం..

ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టడం కోసం రాష్ట్రంలో అశ్వర్థ్, ధీరజ్ లాంటి వేల మంది విద్యార్థులకు టీడీపీ కూటమి సర్కారు ద్రోహం తలపెడుతోంది. మన విద్యార్థుల వైద్య విద్య కలలను ఛిద్రం చేస్తోంది. ప్రభుత్వ ఆధ్వర్యంలో గతేడాది నాలుగు, ఈ దఫా ఏడు కొత్త వైద్య కళాశాలలు ప్రారంభం కావాల్సి ఉండగా చంద్రబాబు ప్రభుత్వం మోకాలడ్డటంతో ఈ ఒక్క విద్యాసంవత్సరమే ఏకంగా 1,750 ఎంబీబీఎస్ సీట్లను మన విద్యార్థులు నష్టపోయారు. బాగా చదివి నీట్‌లో మంచి స్కోర్ చేసినప్పటికీ కూటమి సర్కారు నిర్వాకాలతో ఏపీ విద్యార్థులకు కన్వీనర్ కోటాలో ఎంబీబీఎస్ సీటు దక్కలేదు. అదే తెలంగాణలో.. గతేడాది ఎనిమిది, ఈదఫా ఒకటి చొప్పున కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలలు అందుబాటులోకి రావడంతో మెడికల్ సీట్లు మరిన్ని పెరిగాయి. తద్వారా తెలంగాణ విద్యార్థులకు వైద్య విద్య చదివే అవకాశాలు మెరుగుపడ్డాయి. రెండో విడత కౌన్సెలింగ్ ముగిసే సమయానికి తెలంగాణలో ఓపెన్ కేటగిరిలో నీట్‌లో 406 మార్కులు స్కోర్ చేసిన విద్యార్థికి కూడా కన్వీనర్ కోటాలో సీటు లభించింది. కానీ ఏపీలో మాత్రం పోటీకి తగ్గట్టుగా మెడికల్ సీట్లు పెరగకపోవడంతో ఏయూ రీజియన్‌లో 491, ఎస్వీయూ పరిధిలో 479 మార్కుల వరకు మాత్రమే కన్వీనర్ సీటు దక్కింది. ఈ లెక్కన చూస్తే తెలంగాణలో కంటే 73–85 మార్కులు ఎక్కువగా వచ్చినప్పటికీ ఏపీ విద్యార్థులకు కన్వీనర్ కోటాలో మెడికల్ సీటు దక్కకపోవడం గమనార్హం.

రిజర్వేషన్ విద్యార్థులకు తీవ్ర అన్యాయం

రాష్ట్ర విద్యార్థులకు వైద్యవిద్య అవకాశాలు మరింతగా పెంచడంతోపాటు ప్రజలకు ఉచితంగా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు చేరువలో అందించే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్ 17 కొత్త వైద్య కళాశాలలకు శ్రీకారం చుట్టారు. వాటిలో 2023–24లోనే ఐదు కళాశాలలు ప్రారంభించడం ద్వారా 750 మెడికల్ సీట్లు రాష్ట్రానికి అదనంగా సమకూర్చారు. చంద్రబాబు గద్దెనెక్కిన వెంటనే కొత్త వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టడం కోసం గతేడాది నాలుగు మెడికల్ కాలేజీలు (పులివెందుల, మదనపల్లి, మార్కాపురం, ఆదోని) ప్రారంభం కాకుండా అడ్డుపడ్డారు. పులివెందుల వైద్యకళాశాలకు ఎన్ఎంసీ అనుమతులు ఇచ్చినప్పటికీ.. తమకు వద్దంటూ కూటమి సర్కారు లేఖ రాసింది. ఎట్టకేలకు పాడేరులో మెడికల్ కాలేజీ ప్రారంభమైనా.. 150 సీట్లు రావాల్సింది 50 మాత్రమే వచ్చాయి. ఇలా గత విద్యాసంవత్సరం 700 సీట్లు రాష్ట్రానికి సమకూరకుండా చంద్రబాబు ప్రభుత్వం అడ్డుపడింది. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన ముందస్తు ప్రణాళిక ప్రకారం ఈ విద్యాసంవత్సరంలో మరో 7 వైద్య కళాశాలలు (పాలకొల్లు, నర్సీపట్నం, అమలాపురం, పిడుగురాళ్ల, పెనుగొండ, పార్వతీపురం, బాపట్ల) ప్రారంభమై 1,050 ఎంబీబీఎస్ సీట్లు రాష్ట్రానికి అదనంగా సమకూరాల్సి ఉండగా ఒక్క వైద్యకళాశాలను కూడా చంద్రబాబు సర్కారు ప్రారంభించలేదు. ఇలా టీడీపీ కూటమి సర్కారు కక్షపూరిత విధానాలతో రెండేళ్లలో 2,450 మంది ఏపీ విద్యార్థులు వైద్యవిద్యకు దూరమయ్యారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విద్యార్థులు తీవ్ర అన్యాయానికి గురయ్యారు. తెలంగాణతో పోలిస్తే ఏపీలో రిజర్వేషన్ విభాగాల్లో కటాఫ్ వ్యత్యాసం 100 మార్కులు, ఆపైన ఉండటమే దీనికి నిదర్శనం. రెండోదశ కన్వీనర్ కోటా కౌన్సెలింగ్‌లో తెలంగాణలో బీసీ–ఏ విభాగంలో 341 మార్కులు సాధించిన విద్యార్థులకు కన్వీనర్ కోటా సీటు దక్కడం గమనార్హం. అదే ఏపీలోని ఎస్వీయూ పరిధిలో తెలంగాణలో కంటే వందకుపైగా అదనంగా మార్కులు స్కోర్ చేసినా ఏపీ విద్యార్థులకు కన్వీనర్ కోటా సీటు దక్కని దుస్థితి నెలకొంది.

కొత్తవి తేకపోగా.. ఉన్నవాటికి ఎసరు..

కొత్తగా ప్రభుత్వ వైద్య కళాశాలలు ఏర్పాటు చేసి ప్రజలకు ఉన్నత వైద్యం, విద్యార్థులకు వైద్యవిద్య అవకాశాలు పెంపొందించాలని దేశంలో అన్ని రాష్ట్రాలు పోటీపడుతున్నాయి. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు సైతం కేంద్రంతో సంప్రదింపులు జరిపి కొత్త ప్రభుత్వ వైద్యకళాశాలలకు అనుమతులు తెచ్చుకుంటున్నాయి. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో టీడీపీ కూటమి పార్టీలు కీలక భాగస్వాములుగా కొనసాగుతున్నాయి. ఇంత అనుకూలమైన పరిస్థితులున్నప్పటికీ సద్వినియోగం చేసుకోకుండా మన విద్యార్థుల వైద్య విద్య కలలను చిదిమేస్తూ చంద్రబాబు సర్కారు కుట్రపూరితంగా వ్యవహరిస్తూ గత ప్రభుత్వం పట్టుబట్టి సాధించిన వైద్య కళాశాలలను ప్రైవేట్ చేతుల్లో పెడుతుండటం పట్ల తల్లిదండ్రులు, విద్యార్థులు మండిపడుతున్నారు. వైద్యులై ప్రజలకు సేవలు అందించాలనుకున్న పేద, మధ్య తరగతి విద్యార్థుల ఆశలను చిదిమేశారని ఆగ్రహం వ్యక్తమవుతోంది. బాబు ప్రభుత్వం కొత్త కాలేజీలు తేకపోగా గత సర్కారు తెచ్చిన వాటిని సైతం ప్రైవేట్‌పరం చేయడమేమిటని నిలదీస్తున్నారు. అదే ఈ ప్రభుత్వం అడ్డుపడకుంటే ఏపీకి అదనంగా 2,450 మెడికల్ సీట్లు సమకూరి తమ పిల్లలకు కచ్చితంగా ఎంబీబీఎస్ సీట్లు వచ్చి ఉండేవని తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

ఒక్క కాలేజీ ఏర్పాటైనా మా పాపకు సీటొచ్చేది..

మా అమ్మాయికి నీట్‌లో 480 మార్కులు వచ్చాయి. తాను ఏయూ రీజియన్‌లో లోకల్. అక్కడ 491 మార్కులకే కన్వీనర్ కోటా సీటు ఆగిపోయింది. 11 మార్కుల తేడాతో మా అమ్మాయికి కన్వీనర్ కోటా సీటు దూరమైంది. మేనేజ్‌మెంట్ కోటాలో చేర్చి ఎంబీబీఎస్ చదివించే స్థోమత లేదు. ఈ ప్రభుత్వం ఒక్క మెడికల్ కాలేజీని ప్రారంభించినా మా అమ్మాయికి కచ్చితంగా సీటు వచ్చి ఉండేది. కొత్త మెడికల్ కళాశాలలు ప్రారంభించకపోవడంతో మాలాంటి వాళ్లకు అన్యాయం జరుగుతోంది.

– రోషిరెడ్డి, వైద్యవిద్య ఆశావహ విద్యార్థిని తండ్రి, వైఎస్సార్ కడప జిల్లా

ఇప్పటికైనా విరమించుకోవాలి

రాష్ట్రం విడిపోయే నాటికి తెలంగాణలో మనకంటే తక్కువ మెడికల్ సీట్లున్నాయి. ఇప్పుడు ఆ రాష్ట్రంలో 10 వేలకు చేరువలో ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఏపీలో మాత్రం ఏడువేల సీట్లు కూడా లేవు. సీట్లు పెరగకపోవడంతో మన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన కళాశాలలను ఈ ప్రభుత్వం పీపీపీలో ప్రైవేట్‌కు ఇస్తోంది. ప్రైవేట్‌కు వైద్యకళాశాలలు అప్పగిస్తే ప్రజలు, విద్యార్థులకు నష్టమే గానీ లాభం లేదు. అన్నివర్గాల నుంచి ప్రైవేటీకరణపై వ్యతిరేకత ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం పీపీపీ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి. ప్రభుత్వం ఆధ్వర్యంలోనే కొత్త వైద్య కళాశాలలు ప్రారంభించి విద్యార్థులకు మేలు చేయాలి.

– డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, అధ్యక్షుడు, ఏపీ మెడికోస్ పేరెంట్స్ అసోసియేషన్

నాలుగు బోధనాస్పత్రుల్లో అత్యాధునిక పరికరాలు ఔట్!

కొత్త మెడికల్ కాలేజీలు ప్రైవేట్‌కు కట్టబెట్టేస్తూ ఆస్పత్రుల్లో సేవలకు మంగళం

సాక్షి, అమరావతి: కొత్త మెడికల్ కాలేజీలను ప్రైవేట్‌పరం చేస్తూ ప్రభుత్వ ఆస్తులను పచ్చ గద్దలకు దోచిపెట్టేందుకు పీపీపీని తెరపైకి తెచ్చిన టీడీపీ పెద్దలు ఏకంగా బోధనాస్పత్రుల నిర్వీర్యానికి ఒడిగట్టారు. మెడికల్ కాలేజీలకు అనుబంధంగా ఉన్న పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, ఆదోని బోధనాస్పత్రుల్లో వైద్య పరికరాలను తొలగించి పేదల ఉన్నత వైద్యానికి ఉరి బిగించారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో 17 కొత్త వైద్య కళాశాలల ఏర్పాటులో భాగంగా నాలుగు చోట్ల ఏపీవీవీపీ ఆస్పత్రులను 350 పడకల సామర్థ్యంతో బోధనాస్పత్రులుగా తీర్చిదిద్దారు. అన్ని ఆస్పత్రుల్లో అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ స్థాయి సీనియర్ వైద్యులను నియమించి వైద్య సేవలను బలోపేతం చేశారు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలకు చేరువలో నాణ్యమైన వైద్య సేవలు అందుతున్న సమయంలో చంద్రబాబు గద్దెనెక్కడంతో అంతా తలకిందులు అయింది. కొత్త వైద్య కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టాలని కూటమి సర్కారు తీసుకున్న నిర్ణయం పేదల ఆరోగ్య భద్రతకు గొడ్డలిపెట్టులా మారింది.

ఆధునిక పరికరాలన్నీ తొలగింపు

2024–25 విద్యా సంవత్సరంలో ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభించడానికి వీలుగా వైఎస్సార్‌సీపీ హయాంలో సిద్ధమైన పులివెందుల వైద్య కళాశాలకు ఎన్ఎంసీ గతేడాదే 50 ఎంబీబీఎస్ సీట్లను మంజూరు చేసినా చంద్రబాబు ప్రభుత్వం కుట్రపూరితంగా అడ్డుకుని లేఖలు రాసి రద్దు చేయించింది. అంతేకాకుండా పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, ఆదోని బోధనాస్పత్రుల నిర్వీర్యానికి అడుగులు వేసింది. ఈ క్రమంలో తొలుత ఆయా ఆస్పత్రుల్లోని అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ స్థాయి సీనియర్ వైద్యులను ప్రభుత్వం పాత జీజీహెచ్‌లకు సర్దుబాటు చేసింది. దీంతో ఒక్కసారిగా వైద్య సేవలు పతనం అయ్యాయి. పది ప్రభుత్వ కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టాలని నిర్ణయించిన కూటమి సర్కారు తొలి విడతలో పులివెందుల, మదనపల్లె, మార్కాపురం, ఆదోని వైద్య కళాశాలలను బలి పెడుతోంది. ఇందులో భాగంగా ఆ నాలుగు చోట్ల బోధనాస్పత్రులకు గత ప్రభుత్వం సమకూర్చిన అత్యాధునిక పరికరాలను తొలగించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం. ఆ ఉత్తర్వులకు అనుగుణంగా నాలుగు ఆస్పత్రుల్లో 51 రకాల అత్యాధునిక వైద్య పరికరాలు పాత జీజీహెచ్‌లకు తరలింపు పనులను వైద్య శాఖ ముమ్మరం చేసింది. గైనిక్, పీడియాట్రిక్స్, ఆప్తమాలజీ, జనరల్ మెడిసిన్, సర్జరీ లాంటి స్పెషాలిటీ విభాగాల్లో రోగులకు నాణ్యమైన వైద్య సేవల కోసం బోధనాస్పత్రులకు అత్యాధునిక పరికరాలను గత ప్రభుత్వం సమకూర్చింది. కొత్త వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై అన్ని వర్గాల ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అవుతోంది. ఆ కళాశాలలను ప్రభుత్వమే నిర్వహించాలని ప్రజలంతా డిమాండ్ చేస్తున్నా లెక్క చేయకుండా మొండిగా వ్యవహరిస్తూ వైద్య పరికరాలను సైతం తొలగిస్తూ పేదలకు వైద్యం సేవలను మమ అనిపించడం నివ్వెరపరుస్తోంది.

పులివెందుల బోధనాస్పత్రిలోని పరికరాలను తరలించేస్తున్న ప్రభుత్వం

మదనపల్లె మెడికల్ కళాశాలకు చెందిన కంటిపరీక్షల యంత్రం

టెరిషరీ కేర్ బలోపేతానికి తూట్లు

ప్రభుత్వ వైద్య రంగంలో ప్రైమరీ, సెకండరీ, టెరిషరీ.. మూడు లేయర్లుగా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ విస్తరించి ఉంటుంది. ప్రైమరీ కేర్‌లో విలేజ్ క్లినిక్‌లు, పీహెచ్‌సీలు ఉంటాయి. సెకండరీ కేర్‌లో సీహెచ్‌సీలు, ఏరియా, జిల్లా ఆస్పత్రులుంటాయి. టెరిషరీ కేర్‌లో బోధనాస్పత్రులు సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రులు ఉంటాయి. తీవ్రమైన జబ్బుల బారినపడిన వారికి మెరుగైన చికిత్సలు అందించడంలో టెరిషరీ కేర్ ఎంతో కీలక పాత్ర పోషిస్తుంది. 2019 నాటికి రాష్ట్రవ్యాప్తంగా కేవలం 11 ప్రభుత్వ వైద్య కళాశాలలు, వీటికి అనుబంధంగా బోధనాస్పత్రులు మాత్రమే ఉండేవి. దీంతో మారుమూల ప్రాంతాల్లోని ప్రజలు మెరుగైన చికిత్సల కోసం 100 నుంచి 150 కి.మీ దూరంలో ఉండే పాత జీజీహెచ్‌లకు వ్యయ ప్రయాసలకోర్చి చేరుకోవాల్సి వచ్చేది. అక్కడా రోగుల తాకిడి తగ్గట్టుగా పడకలు, వైద్యులు, సిబ్బంది లేకపోవడంతో చికిత్సల కోసం నరకం చూడాల్సిన దుస్థితి ఉండేది. ఈ పరిస్థితులకు చెక్ పెడుతూ టెరిషరీ కేర్ బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు చేరువలో చికిత్సలు అందించడం కోసం ఏకంగా రూ.8 వేల కోట్లకుపైగా నిధులతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 17 కొత్త వైద్య కళాశాలల నిర్మాణం ప్రారంభించారు. తద్వారా అప్పటి వరకూ జిల్లా, ఏరియా, సీహెచ్‌సీలున్న చోట ప్రభుత్వం ఆధ్వర్యంలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలతో బోధనాస్పత్రి అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళిక రచించారు. ప్రభుత్వం ఆధ్వర్యంలోనే గుండె, మెదడు, కిడ్నీ, కాలేయ సంబంధిత జబ్బులు, క్యాన్సర్ లాంటి వ్యాధులకు ఉచిత చికిత్సలు అందుబాటులోకి తెచ్చేలా వైద్యులు, ఇతర సిబ్బంది, అధునాతన పరికరాలు సమకూర్చేలా కార్యాచరణ రూపొందించారు. ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీకి అడ్డుకట్ట వేసేలా అడుగులు వేశారు. ఆ కళాశాలలను ప్రైవేట్‌కు కట్టబెట్టబెడుతూ టెరిషరీ కేర్‌కు చంద్రబాబు సర్కారు తూట్లు పొడుస్తోంది. వైద్యం పేరిట కార్పొరేట్ శక్తులు ప్రభుత్వ ఖజానా, ప్రజలను దోచుకునేందుకు పచ్చజెండా ఊపుతోంది.

మదనపల్లె ప్రభుత్వ వైద్య కళాశాల సామగ్రి తరలింపు

మదనపల్లె రూరల్: అన్నమయ్యజిల్లా మదనపల్లె ప్రభుత్వ మెడికల్ కళాశాలకు సంబంధించిన సామగ్రిని బుధవారం ప్రభుత్వం అక్కడి నుంచి తరలించింది. ఈ సందర్భంగా ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిని, సర్వజన బోధనాసుపత్రిగా మార్చినప్పుడు డీఎంఈ నుంచి వైద్యకళాశాలకు సామగ్రి వచ్చిందన్నారు. ప్రస్తుతం డీఎంఈ కార్యాలయ ఉత్తర్వుల మేరకు హైక్యాస్ట్ ఎక్విప్‌మెంట్‌ను ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి పంపాల్సిందిగా ఆదేశాలు రావడంతో సామగ్రిని తరలించామని తెలిపారు.

ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటుకు అప్పగింత సరికాదు

- నెల రోజులుగా ఉద్యమం కొనసాగుతున్నా పట్టకపోవడం దారుణం
- వైఎస్ జగన్ హయాంలో పులివెందుల మెడికల్ కాలేజీకి అత్యాధునిక పరికరాలు
- ఇక్కడి పరికరాలను తరలిస్తున్న కూటమి ప్రభుత్వం
- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల: ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు అప్పగించడం సరికాదని.. దీనికి వ్యతిరేకంగా ప్రజలు పెద్దఎత్తున ఉద్యమిస్తున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని కడప వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నెల రోజులుగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేస్తున్నట్టు పేర్కొన్నారు. ప్రజల వద్దకు వెళ్లి కోటి సంతకాల సేకరణ చేపడుతున్నామని, ఇంత పెద్దఎత్తున ప్రజలలో ప్రైవేటీకరణ పట్ల నిరసన వస్తున్నా

కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. వైఎస్ జగన్ సీఎంగా ఉన్నప్పుడు పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఆ భవనాలన్నీ పూర్తి చేసి ఆస్పత్రిని అక్కడికి తీసుకొచ్చి మెడికల్ కళాశాలకు సీట్లు మంజూరు చేయించారని గుర్తు చేశారు. మంజూరైన సీట్లను వద్దని చెప్పి వెనక్కి పంపిన ఘనత కూటమి ప్రభుత్వానిదని ఎద్దేవా చేశారు. ఆ మెడికల్ కళాశాల, ఆస్పత్రిలో అత్యాధునిక పరికరాలను అప్పట్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. పులివెందులలో ఉన్న అత్యాధునిక పరికరాలను గుంటూరు, కర్నూలు ప్రభుత్వ వైద్య కళాశాలలకు తరలిస్తున్నారన్నారు. నెల రోజులుగా ప్రైవేటీకరణపై ఆందోళన జరుగుతున్నా స్పందించకపోగా.. పులివెందుల మెడికల్ కళాశాలకు సంబంధించిన అత్యాధునిక పరికరాలను వేరే ప్రాంతాలకు తరలిస్తున్నారంటే ఈ ప్రాంతం, ప్రజల పట్ల చంద్రబాబు ఎంత నిర్లక్ష్య వైఖరితో ఉన్నారో చెప్పడానికి ఇంతకన్నా ఉదాహరణ అక్కర్లేదన్నారు.

వీలైతే నాలుగు మంచి కార్యక్రమాలు చేయండి

'పులివెందుల ప్రాంతంలో ఉన్న కూటమి నాయకులు, ఇన్‌చార్జిలు, జిల్లాకు సంబంధించిన టీడీపీ నాయకులందరినీ గట్టిగా అడుగుతున్నా. మీరు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎన్నో దారుణాలు జరుగుతున్నాయి. ఎంతసేపూ ఈ జిల్లాలో వైఎస్సార్‌సీపీకి సంబంధించిన ఫీల్డ్ అసిస్టెంట్లను, అంగన్‌వాడీ ఉద్యోగులను, యానిమేటర్లను ఉద్యోగాల నుంచి పీకేశామా లేదా వైఎస్సార్‌సీపీ నాయకులపై కక్షసాధింపు చేశామా అన్నట్టు వ్యవహరించడం ఏమిటి. ఇవి కాదు మీరు చేయాల్సింది. చేతనైతే నాలుగు మంచి కార్యక్రమాలు చేయండి' అని అవినాష్‌రెడ్డి హితవు పలికారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ ఆపే దిశగా టీడీపీ వాళ్లంతా ప్రభుత్వంతో పోట్లాడాలని, పులివెందుల మెడికల్ కళాశాలలోని పరికరాలు తరలిపోకుండా చూడాలని అన్నారు. టీడీపీ నేతలు ఆ పని చేయకుండా ఎంతసేపూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. పులివెందుల, జిల్లా అభివృద్ధిపై టీడీపీ నేతలు ఫోకస్ పెట్టాలని, మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ కాకుండా పోరాటం చేసి ఆపాలని డిమాండ్ చేశారు.

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఆహారంలో వచ్చిన పురుగు

ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో విద్యార్థుల ఆందోళన

వారం రోజులుగా ఫుడ్ పాయిజనింగ్ అవుతోందని ఆవేదన

మంగళగిరి టౌన్: గుంటూరు జిల్లా మంగళగిరి మండలంలోని ఎస్ఆర్ఎం వర్సిటీ విద్యార్థులు బుధవారం రాత్రి ఆందోళనకు దిగారు. ఆహారం నాణ్యతగా లేక అనారోగ్యాల పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజులుగా ఫుడ్ పాయిజనింగ్ అవుతుండటంతో అస్వస్థతకు గురైన పలువురు విద్యార్థులకు మంగళగిరి, తాడేపల్లి, విజయవాడలోని పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఈ విషయాన్ని గోప్యంగా ఉంచుతున్న వర్సిటీ యాజమాన్యం.. ఎవరైనా బయటకు చెబితే ఊరుకోబోమని విద్యార్థులకు ఫైన్లు వేస్తూ బెదిరిస్తున్నట్లు తెలిసింది. తాజాగా రాజమహేంద్రవరానికి చెందిన ఒక విద్యార్థిని తాను ఆదివారం ఎస్ఆర్ఎం హాస్టల్ మెస్‌లో భోజనం చేశానని, మరుసటి రోజు నుంచి వాంతులు, విరేచనాలు కావడంతో రాజమహేంద్రవరం వెళ్లి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నానని పేర్కొంటూ సోషల్ మీడియాలో పోస్ట్‌చేసిన వీడియో వైరల్‌గా మారింది. మూడురోజులుగా వందలాదిమంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని మీడియా ద్వారా బహిర్గతం కావడంతో బుధవారం అధికారులు వర్సిటీని తనిఖీ చేసినట్లు తెలిసింది. యాజమాన్య వైఖరిని నిరసిస్తూ విద్యార్థులు బుధవారం రాత్రి మరోసారి ఆందోళనకు దిగారు. భోజనం నాసిరకం, లక్షల్లో ఫీజులంటూ నినాదాలు చేస్తూ బైఠాయించారు.

రహదారి భద్రతకు ప్రమాదం

మనది ప్రపంచంలో రెండో ప్రమాదకర దేశం

రోడ్డు ప్రమాదాల్లో ఏటా 2 లక్షల మందికిపైగా మృత్యువాత

- ప్రపంచంలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో 18 శాతం మన దేశంలోనే
- హైవేల విస్తీర్ణం పెరిగినా సురక్షిత ప్రయాణాలు లేవు
- రాష్ట్రంలో భయానక ప్రమాదాలు
- 2024–25లోనే 10,522 మంది మృతి
- ఓవర్ స్పీడ్, డ్రంక్ డ్రైవింగ్, ట్రాఫిక్ రూల్స్ పట్టించుకోకపోవడం ప్రధాన కారణాలు

సాక్షి, అమరావతి: మన దేశంలోని రహదారులపై భద్రతకు ప్రమాదం వాటిల్లింది. ప్రపంచంలో రెండో అతిపెద్ద రహదారి నెట్‌వర్క్ ఉన్న దేశం అయినా రోడ్డు భద్రతలో మాత్రం అత్యంత ప్రమాదకర దేశాల్లో ఒకటిగా నిలిచింది. దేశంలో కేవలం రెండుశాతం రోడ్లు మాత్రమే జాతీయ రహదారులు కాగా.. వాటిపైనే 35 నుంచి 40 శాతం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాద మృతుల సంఖ్యను బట్టి చూస్తే ప్రపంచంలోని 199 దేశాల్లో మన దేశం రెండో స్థానంలో ఉందంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో తెలుస్తోంది. ఏటా మన దేశంలో 2.06 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్న వారిలో ఇది 18 శాతం. దీనివల్ల సామాజిక, ఆర్థికరంగాల్లో జరిగిన నష్టం రూ.1.47 లక్షల కోట్లని అంచనా. దేశ జీడీపీలో ఇది ఒక శాతానికి సమానం. రోడ్డు ప్రమాద మరణాలు చైనాలో అత్యధికంగా ఏడాదికి 2.48 లక్షలు ఉండగా ఆ తర్వాత స్థానంలో మన దేశం ఉంది. అమెరికాలో 48 లక్షల మంది, బ్రెజిల్‌లో 34 లక్షలు, బంగ్లాదేశ్‌లో 32 లక్షల మంది రోడ్డు ప్రమాదాల్లో చనిపోతున్నారు. ప్రపంచంలో నిత్యం జరుగుతున్న మరణాలకు గల కారణాల్లో రోడ్డు ప్రమాదాలు ఎనిమిదో కారణంగా ఉన్నట్లు ప్రపంచ ఆరోగ్యసంస్థ (డబ్ల్యూహెచ్‌వో) ప్రకటించింది.

ఆంధ్రాలో భయానక ప్రమాదాలు

మన రాష్ట్రంలోనూ రోడ్డు ప్రమాదాలు భయానకంగా ఉన్నాయి. ఇటీవల కర్నూలు జిల్లా చిన్నటేకూరులో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు దగ్ధమైన ఘటనలో 19 మంది సజీవ దహనమయ్యారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా మీర్జాగూడలో కొద్దిరోజుల కిందట ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొనడంతో 19 మంది మృతిచెందారు. గత ఆరేళ్లలో మన రాష్ట్రంలో లక్షకుపైగా ప్రమాదాలు జరిగాయి. వాటిలో 45 వేలమంది ప్రాణాలు కోల్పోయారు. దేశంలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న నగరాల్లో విశాఖపట్నం, విజయవాడ 21, 22 స్థానాల్లో ఉన్నాయి. 2024–25లో ఈ ప్రమాదాలు 5 శాతం పెరిగినట్లు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. 2024–25లో 24,511 ప్రమాదాలు జరగ్గా వాటిలో 10,522 మంది మరణించారు. జాతీయ రహదారులపై ఇష్టానుసారం పార్కింగ్ చేయడం వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. వెనుక నుంచి ఢీకొనడం వల్ల జరిగే ప్రమాదాలు మన రాష్ట్రంలో అత్యధికం. మానవలోపాలు, కండిషన్‌లో లేని వాహనాలు ఈ ప్రమాదాలకు కారణాలుగా ఉన్నాయి.

ప్రమాదాలకు ప్రధాన కారణాలు

- ఓవర్‌స్పీడ్ : 70 శాతానికిపైగా రోడ్డు ప్రమాదాలు ఈ కారణంతోనే జరుగుతున్నాయి
- డ్రైవర్లు రూల్స్ పాటించకపోవడం, డ్రైవింగ్ నైపుణ్యాలు లేకపోవడం
- మద్యం తాగి వాహనాలు నడపడం
- రాంగ్ సైడ్ డ్రైవింగ్, హైవేలపై వాహనాలు నిలపడం
- మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం
- వాహనాల సమస్యలు: ఓవర్‌లోడింగ్, కండిషన్‌లో లేని వాహనాల వినియోగం
- సేఫ్టీ డివైసెస్ లేకపోవడం: హెల్మెట్, సీట్ బెల్ట్ పెట్టుకోకపోవడం
- రోడ్ల నిర్వహణ సరిగా లేకపోవడం, రోడ్ సేఫ్టీ ఆడిట్ చేయకపోవడం
- మిక్స్‌డ్ ట్రాఫిక్: పెద్ద వాహనాలు, కార్లు, బైకులు, పాదచారులకు ఒకటే మార్గం కావడం
- సరైన లేన్ మార్కింగ్ లేకపోవడం, మార్కింగ్ ఉన్నా లేన్ డిసిప్లిన్ పాటించకపోవడం
- ట్రాఫిక్ నియమాల అమలులో తీవ్ర నిర్లక్ష్యం

ఇండియా రోడ్ నెట్‌వర్క్

- మొత్తం రోడ్ల నిడివి 68 లక్షల కిలోమీటర్లు
- జాతీయ రహదారులు: 1.45 లక్షల కిలోమీటర్లు
- రాష్ట్ర రహదారులు: 1.8 లక్షల కిలోమీటర్లు
- ఎక్స్‌ప్రెస్ వేస్: 3 వేల కిలోమీటర్లు

ట్రాఫిక్ లోడ్: ప్రపంచ రహదారుల మొత్తం పొడవులో 2 శాతం మాత్రమే మన దేశంలో ఉంది. కానీ రహదారి ట్రాఫిక్‌లో పదిశాతం కంటే ఎక్కువ ట్రాఫిక్ ఉంటోంది.

దేశంలో అత్యంత ప్రమాదకర జాతీయ రహదారులు

1. ఎన్‌హెచ్-44 (శ్రీనగర్-కన్యాకుమారి)
2. ఎన్‌హెచ్-48 (ఢిల్లీ-చెన్నై)
3. ఎన్‌హెచ్-16 (చెన్నై-కోల్‌కతా)
4. ఎన్‌హెచ్-66 (ముంబై-కేరళ తీర రహదారి)
5. ఎన్‌హెచ్-19 (ఢిల్లీ-కోల్‌కతా, పాత గ్రాండ్‌ట్రంక్ రోడ్)
6. ఎన్‌హెచ్-65 (హైదరాబాద్-పుణె-ముంబై)

రాష్ట్రంలో అత్యంత ప్రమాదకర జాతీయ రహదారులు

1. **ఎన్‌హెచ్-16 (చెన్నై-కోల్‌కతా తీర రహదారి):** రాష్ట్రంలో ప్రమాదాల హాట్‌స్పాట్‌లలో నంబర్‌వన్. విశాఖపట్నం, రాజమహేంద్రవరం, గుంటూరు, విజయవాడ, నెల్లూరు జిల్లాల్లో ప్రమాదాలు ఎక్కువ. అధిక వేగం, లారీ ట్రాఫిక్, రాత్రివేళ లైట్ సమస్యలు ఈ ప్రమాదాలకు ప్రధాన కారణాలు.
2. **ఎన్‌హెచ్-44 (హైదరాబాద్-కర్నూలు-తిరుపతి):** కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోంచి వెళ్లే ఈ పొడవైన రహదారిపై వేగం నియంత్రణ లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి.
3. **ఎన్‌హెచ్-71 (తిరుపతి-నెల్లూరు):** తిరుపతి-రేణిగుంట-నెల్లూరు మార్గంలో హెవీ ట్రాఫిక్, పొడవైన స్ట్రెయిట్ రోడ్ కావడం వల్ల వేగంపై నియంత్రణ ఉండడం లేదు.
4. **ఎన్‌హెచ్-65 (హైదరాబాద్-విజయవాడ):** వాణిజ్య వాహనాల రద్దీ, చిన్న వాహనాల వేగం కలిపి ఈ మార్గాన్ని ప్రమాదకరంగా మార్చాయి.
5. **ఎన్‌హెచ్-216 (మచిలీపట్నం-కాకినాడ-ఒంగోలు):** వర్షాకాలంలో గుంతలతో నిండిపోతుంది. రాత్రివేళ లైట్ లేకపోవడం వల్ల ఘోర ప్రమాదాలు జరుగుతున్నాయి

అత్యంత ప్రమాదకర రాష్ట్ర రహదారులు

1. **తిరుపతి-కడప:** తిరుపతి, కడప మధ్య పర్వత మార్గాలు, వంకరల రోడ్డు. మలుపుల్లో నియంత్రణ కోల్పోవడం వల్ల తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి.
2. **గుంటూరు-మాచర్ల-నాగార్జునసాగర్:** కొండప్రాంతాలు, మలుపులు ఎక్కువ. ట్రాక్టర్లు, ఆటోలు, బస్సులు కలిసి నడవడం వల్ల ప్రమాదాలు అధికం.
3. **విజయనగరం-సాలూరు-అరకు:** కొండ ప్రాంతం, పచ్చని దట్టమైన అడవుల మధ్య రహదారి.
4. **ఒంగోలు-కందుకూరు-కావలి:** తీరప్రాంతం కావడం వల్ల వర్షాకాలంలో రోడ్లు దెబ్బతింటున్నాయి. లారీలు, బస్సులు వేగంగా నడవడం ప్రమాదాలకు కారణం.

పర్యాటక ప్రాజెక్టులకు భూ కేటాయింపులపై మార్గదర్శకాలు విడుదల

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని పర్యాటక ప్రాజెక్టులకు భూ కేటాయింపుల్లో భాగంగా యూనిఫాం ఫ్రేమ్‌వర్క్‌పై మార్గదర్శకాలను ఖరారు చేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 3-స్టార్ హోటల్‌కు 80–120 గదులు, రూ.50లక్షలకుపైగా పెట్టుబడి అయితే మూడు ఎకరాల వరకు భూ కేటాయింపు ఉంటుందంది. 4-స్టార్ హోటల్‌కు 100–150 గదులు, రూ.75లక్షల పెట్టుబడి ఉంటే 4ఎకరాల వరకు, 5 స్టార్/లగ్జరీలో 100–150 గదులు, రూ.కోటి పెట్టుబడికి ఐదు ఎకరాల వరకు భూమి, రిసార్టు(హిల్, బీచ్, జంగిల్) 50–150 గదులకు రూ.50లక్షలకుపైగా పెట్టుబడికి ముందుకొస్తే 5–15 ఎకరాలు భూమిని, ఎంఐసీఈ/కన్వెన్షన్ హోటల్‌కు 80–200 గదులతో (హోటల్ కేటగిరీని బట్టి భూమి ఇస్తారు) పాటు కన్వెన్షన్ హాల్‌లో ప్రతి సీటుకు రూ.లక్ష నుంచి రూ.1.50లక్షలు అదనపు పెట్టుబడికి 4–10 ఎకరాల భూమిని కేటాయించాలని మార్గదర్శకాల్లో పొందుపరిచింది. ఇక అల్ట్రామెగా/మార్క్యూ ప్రాజెక్టు స్థాయిని బట్టి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని పేర్కొంది.

పారాదీప్ పోర్ట్ డిప్యూటీ చైర్మన్‌గా వేణుగోపాల్

విశాఖ సిటీ: విశాఖపట్నం పోర్ట్ అథారిటీ కార్యదర్శి టి.వేణుగోపాల్‌కు పదోన్నతి లభించింది. పారాదీప్ పోర్ట్ అథారిటీ డిప్యూటీ చైర్మన్‌గా నియమిస్తూ కేంద్ర పోర్టులు, నౌక, జల, రవాణా మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. వేణుగోపాల్ 1995లో విశాఖపట్నం పోర్టులో అసిస్టెంట్ పర్సనల్ ఆఫీసర్‌గా ప్రస్థానం ప్రారంభించారు. అనంతరం పోర్టులోని వివిధ విభాగాల్లో అనేక హోదాల్లో పనిచేశారు.

ప్రజాధనంతో తండ్రీకొడుకుల విహారయాత్రలు

- తుపాను బాధిత రైతులను గాలికొదిలి షికార్లు
- రూపాయి కూడా పరిహారం ప్రకటించని దుర్మార్గ ప్రభుత్వమిది
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజం

సాక్షి,అమరావతి: తుపానుతో తీవ్రంగా నష్టపోయి రైతులు అల్లాడుతుంటే సీఎం చంద్రబాబు, ఆయన కొడుకు మంత్రి లోకేశ్ జోడెద్దుల్లా విహారయాత్రలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం చంద్రశేఖర్ మీడియాతో మాట్లాడుతూ.. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో వైఎస్ జగన్ పర్యటనకు అపూర్వ స్పందన లభించిందని, విపత్తుల సమయంలో వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మేలును రైతులు పదే, పదే గుర్తు చేసుకున్నారని వివరించారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు గాడిదలంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై చంద్రశేఖర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన వ్యాఖ్యలు కుసంస్కారానికి నిదర్శనమన్నారు. మరోవైపు వైఎస్ జగన్ దంపతులను విమర్శించే స్థాయి ఆదినారాయణరెడ్డికి లేదని.. నోరు అదుపులో పెట్టుకోకపోతే ఆయనకు తగిన శాస్తి జరగడం ఖాయమని చంద్రశేఖర్ హెచ్చరించారు. ఆయన ఇంకా ఏమన్నారంటే.. '' కృష్ణాజిల్లాలో పర్యటించిన వైఎస్ జగన్‌కు మంగళవారం అపూర్వ ఆదరణ లభించింది. ఈ పర్యటనతో కృష్ణా జిల్లా తమ అడ్డా, బలమైన ఓటు బ్యాంకు, అత్యంత పట్టున్న ప్రాంతమని విర్రవీగిన కూటమి నేతల భ్రమలన్నీ పటాపంచలయ్యాయి. ఓవైపు రాష్ట్రంలో రైతులు కష్టాల్లో ఉంటే సీఎం విదేశాల్లో విహరిస్తున్నారు. వందల సార్లు హైదరాబాద్‌కు స్పెషల్ ఫ్లైట్లలో తిరుగుతున్నారు. ఆయన తనయుడు లోకేశ్ ముంబైలో క్రికెట్ మ్యాచ్ చూసేందుకు సతీమణితో కలిసి వెళ్లారు. మహిళలంటే గౌరవమని చెబుతున్న లోకేశ్ మరి వారికిస్తామన్న మహాశక్తి పథకం ఏమైందో చెప్పాలి. విద్యాశాఖ మంత్రిగా లోకేశ్ ఫెయిలయ్యారు. 40శాతం ఓటింగ్ ఉన్న పార్టీకి సింగిల్ సీటు ఉన్నా ప్రతిపక్ష హోదా ఇవ్వాలి. కానీ దీనికి ప్రభుత్వం సిద్ధంగా లేకపోవడం దారుణం. ప్రతిపక్ష ఎమ్మెల్యేల జీతాల గురించి స్పీకర్ మాట్లాడుతున్నారు. జీతాలు ఇవ్వొద్దనుకుంటే దానిపై సర్కారే నిర్ణయం తీసుకోవాలి. మేమేమన్నా అడ్డుపడుతున్నామా? నకిలీ మద్యం సూత్రధారులు టీడీపీ నేతలే. జోగి రమేష్ అరెస్టు అక్రమం. తుపాను బాధిత రైతులకు ఒక్కరూపాయి కూడా పరిహారం ప్రకటించని దుర్మార్గ ప్రభుత్వమిది.'' అని చంద్రశేఖర్ విమర్శించారు.

చినబాబు గ్యాంగ్‌కు 'స్పాట్' రిజిస్ట్రేషన్

కూటమి నేతలకు స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్టులు కట్టబెడుతున్న డిస్కంలు

- చినబాబు చెబితే చాలు... క్లాస్-1 కాంట్రాక్టర్ కాకపోయినా టెండర్లు
- ఈ విషయం వెలుగులోకి రావడంతో టెండర్లలో కొన్నింటి రద్దు
- హడావుడిగా కొత్త కాంట్రాక్టర్లకు క్లాస్-1 హోదా
- అసలు ఏ గుర్తింపూ లేకపోయినా కాంట్రాక్టు ఇవ్వాలంటూ ఒత్తిళ్లు
- మంత్రి పేషీ నుంచి ఫోన్ చేస్తున్నామంటూ అధికారులకు బెదిరింపులు
- 'సాక్షి' కథనంతో ఉలిక్కిపడి కొత్త ఎత్తులు వేస్తున్న అక్రమార్కులు

సాక్షి, అమరావతి: ఉద్యోగుల బదిలీలు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు, సబ్ స్టేషన్ల నిర్మాణం, లైన్ల ఏర్పాటు, బూడిద, బొగ్గు టెండర్లన్నీ అక్రమాలే. వీటికితోడు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యుత్ సంస్థల్లో ఈ దారుణాల పరంపరలో మరో అధ్యాయం ఇది..! అన్నిటినీ చెరబట్టిన అధికార పార్టీ వారు ఇప్పుడు ''స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్టు''లపై పడ్డారు. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్), ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్)ల్లో పాత కాంట్రాక్టర్ల కాల పరిమితి ముగియడంతో కొత్త టెండర్లు పిలవడం కూటమి నేతలకు వరంగా మారింది. ముఖ్యంగా చినబాబు, మరో మంత్రి కనుసన్నల్లో టెండర్ల ప్రక్రియ మొత్తం నడుస్తున్నదనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయాన్ని 'చినబాబు చెబితే అర్హత ఉండక్కర్లేదు' శీర్షికన ఇటీవల 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. కంగుతిన్న అక్రమార్కులు వెనకడుగు వేశారు. కానీ, ఆశను వదులుకోలేక కొత్త ఎత్తులు వేస్తున్నారు.

'సాక్షి' కథనంలో బట్టబయలు

రాష్ట్రంలోని మూడు డిస్కంల పరిధిలో అన్ని జిల్లాల్లో కలిపి 1.95 కోట్ల విద్యుత్ సర్వీసులున్నాయి. వీటిలో 30 శాతం వరకు పారిశ్రామిక, వాణిజ్య, వ్యవసాయ సర్వీసులు. మిగతావాటికి ప్రతి నెల బిల్లులను స్పాట్ బిల్లింగ్ రీడర్ల ద్వారా ఇస్తున్నారు. విద్యుత్ పంపిణీ సంస్థలు స్పాట్ బిల్లింగ్ కాంట్రాక్టులను ఇస్తుంటాయి. గ్రామీణ, ఏజెన్సీ, పట్టణ కేటగిరీల వారీగా తీసిన బిల్లులకు కమీషన్ నిర్ణయిస్తారు. 2023–25 నాటి రేట్లతోనే తాజాగా టెండర్లు పిలిచారు. ఒక్కో సర్వీసుకు పట్టణాల్లో రూ.6.16, గ్రామాల్లో రూ.6.36 చెల్లించాల్సి ఉంటుంది. రెండేళ్ల పాటు ఇవే ధరలతో కాంట్రాక్టు కొనసాగనుంది. ఈ కాంట్రాక్టులు దక్కించుకోవడం కోసం చినబాబు గ్యాంగ్‌తో పాటు మరో మంత్రి అనుచరులు రంగంలోకి దిగారు.

పాతవారు కాదు... మావాళ్లకే ఇవ్వాలి

ఎన్నో ఏళ్లుగా స్పాట్ బిల్లింగ్ చేస్తున్నవారిని కాదని, తాము సిఫారసు చేసినవారికే టెండర్లు ఇవ్వాలంటూ విద్యుత్‌శాఖ అధికారులపై ప్రభుత్వ ముఖ్యుల నుంచి ఒత్తిళ్లు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం క్లాస్–1 కాంట్రాక్టర్‌కు మాత్రమే టెండర్లలో పాల్గొనాలి. ఈ అర్హత లేనివారూ టెండర్లు దక్కించుకోవడానికి ప్రయత్నించారు. దీన్ని 'సాక్షి' బట్టబయలు చేయడంతో కొన్ని టెండర్లను అధికారులు రద్దు చేశారు. మరికొన్నిటిని గడువు ముగిశాక కూడా తెరవకుండా పెండింగ్‌లోనే ఉంచారు.

కొత్తగా పుట్టుకొచ్చిన క్లాస్ 1 కాంట్రాక్టర్లు

టెండర్లు రద్దు చేసినప్పటికీ... క్లాస్–1 కాంట్రాక్టర్ గుర్తింపు విషయంలో చినబాబు, మరో మంత్రి సూచించిన వారి కోసం అధికారులు కొత్త ఎత్తుగడ వేశారు. టెండర్లు రద్దయిన తరువాత కొందరికి క్లాస్–1 కాంట్రాక్టరు రిజిస్ట్రేషన్ చేశారు. నిజానికి డిస్కం పరిధిలో పనులు చేసిన వారికే ఈ గుర్తింపు పత్రం ఇవ్వాలి. కానీ, ఇతర డిస్కంలలో చేసినవారికి కూడా ఇచ్చేస్తున్నారు. గతంలో ఎక్కడా ఏ పనీ చేయనివారికి చినబాబు, మంత్రి పేషీల నుంచి ఫోన్లు చేసి 'వాళ్లు మనవాళ్లే, ఏ సర్టిఫికెట్ అవసరం లేదు. కాంట్రాక్టు ఇచ్చేయండి. లేకపోతే ట్రాన్స్‌ఫర్ ఖాయం' అంటూ అధికారులను బెదిరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొందరు ఉన్నతాధికారులు ఈ ఒత్తిళ్లు భరించలేక పలు జిల్లాల్లో వారు చెప్పినవారికి కాంట్రాక్టులు కట్టబెట్టారు. మిగతా జిల్లాల్లో ఒకట్రెండు రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

'సాక్షి'ని దూరం పెట్టండి

విద్యుత్ శాఖలో అక్రమాలు, అవినీతిని వెలుగులోకి తెస్తూ నిజాలు నిర్భయంగా రాస్తున్న 'సాక్షి'పై కూటమి ప్రభుత్వం అక్కసు వెళ్లగక్కుతోంది. సాక్షాత్తు ఇంధన శాఖ మంత్రి అధికారికంగా నిర్వహించే విలేకరుల సమావేశాలకు 'సాక్షి'ని పిలవద్దని పేషీ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. అలాగే మంత్రి కార్యక్రమాలను తెలియజేసేందుకు మీడియా సంస్థల ప్రతినిధులతో ఏర్పాటు చేసిన వాట్సప్ గ్రూప్‌ల్లోనూ 'సాక్షి' ప్రతినిధులు ఉండకూడదని మంత్రి హుకుం జారీ చేశారు.

8 కొత్త జిల్లాల ఏర్పాటుకు మంత్రి వర్గ ఉపసంఘం కసరత్తు

సాక్షి, అమరావతి: గతంలో జరిగిన జిల్లాల పునర్వ్యవస్థీకరణను తమ రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా మార్చడానికి కూటమి ప్రభుత్వం చేస్తున్న కసరత్తు వేగవంతమైంది. వెలగపూడి సచివాలయంలో బుధవారం కొత్త జిల్లాల ఏర్పాటుపై మంత్రివర్గ ఉప సంఘం మంత్రి అనగాని సత్యప్రసాద్ అధ్యక్షతన జరిగింది. అల్లూరి జిల్లాలో ప్రత్యేక అభివృద్ధి అథారిటీని ఏర్పాటు చేసే విషయంపై చర్చించారు. ఆ వివరాలను అనగాని సత్యప్రసాద్ మీడియాకు వెల్లడించారు. పరిపాలనా సౌలభ్యం ఆధారంగా కొత్త 8 జిల్లాలతోపాటు పలు కొత్త రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేస్తామన్నారు. కొన్ని రెవెన్యూ డివిజన్లు దాదాపు 125 కి.మీ. దూరంలో ఉన్నాయని, అలాంటి చోట్ల కొత్త డివిజన్ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కొత్త జిల్లాలు, ఇప్పటికే ఉన్న జిల్లాల్లో సరిహద్దుల మార్పులు, కొత్త రెవెన్యూ డివిజన్లపై భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ (సీసీఎల్‌ఏ) నివేదిక రూపొందిస్తారని, ముఖ్యమంత్రికి దానిని అందించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో మంత్రులు అనిత, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

వంశీ బెయిల్ షరతుల సడలింపుపై తీర్పు వాయిదా

విజయవాడ లీగల్: గన్నవరం టీడీపీ కార్యాలయంలో పనిచేసే సత్యవర్ధన్‌ను కిడ్నాప్, బెదిరింపులకు పాల్పడ్డారంటూ నమోదైన కేసులో బెయిల్‌పై ఉన్న గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ బెయిల్ షరతుల ప్రకారం ప్రతినెలా రెండు, నాలుగు శనివారాలలో పటమట పోలీసు స్టేషన్‌లో హాజరవ్వాలనే నిబంధనను సడలించాలని కోరుతూ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై బుధవారం ఏసీబీ కోర్టులో విచారణ జరిగింది. తీర్పును న్యాయమూర్తి భాస్కరరావు ఈనెల 10వ తేదీకి వాయిదా వేశారు.

ఎంపీ మిథున్ రెడ్డి పాస్‌పోర్టు సరెండర్..

మద్యం అక్రమ కేసులో బెయిల్ పొందిన వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి పాస్‌పోర్టును షరతులలో భాగంగా ఆయన తరఫు న్యాయవాది చంద్రగిరి విష్ణువర్ధన్ ఏసీబీ న్యాయస్థానంలో అప్పగించారు. అలాగే, ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి వైద్యం కోసం అనుమతివ్వాలని దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టులో వాదనలు ముగిశాయి. న్యాయమూర్తి తీర్పును ఈనెల 10కి వాయిదా వేశారు. ఇదే కేసులో రిమాండ్‌లో ఉన్న బూనేటి చాణక్య జైలులో మంచం, ప్లాస్టిక్ కుర్చీ సదుపాయాలు కల్పించాలని కోరుతూ దాఖలు చేసిన పిటిషన్‌ను అనుమతించింది.

NECC DAY

స్వర్గీయ డా॥ బి.వి. రావు
(1935-1996)

భారత పౌల్ట్రీ పరిశ్రమ పితామహులు
పద్మశ్రీ డా॥ బి.వి. రావు గారి 90వ జయంతి సందర్భంగా
వారికి వందనాలను అర్పిస్తున్నాము.
తమ దార్శనికత, అత్యంత ప్రతిభావ్యుత్పత్తులతో
భారత పౌల్ట్రీ పరిశ్రమను సాంకేతికత అలంబనగా
నడిచే ఆధునిక, శాస్త్రీయ పరిశ్రమగా
పునర్నిర్మించిన మహోన్నత వ్యక్తి ఆయన.
పౌల్ట్రీ ప్రపంచంలో భారతదేశాన్ని నెం. 1 దేశంగా
అగ్రభాగాన నిలపాలన్న వారి స్వప్నాన్ని సాకారం
చేయటానికి ఈ సందర్భంగా
మేము పునరంకితమవుతున్నాము.

"My Egg, My Price, My Life"

NECC
నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ
(Non-Government Public Charitable Trust)

పని లేకుంటే జీవితం దుర్గంధం వెదజల్లుతుంది.
పని ఉన్నా, అది ఆత్మలేనిది అయితే,
జీవితం ఊపిరి ఆడక మరణిస్తుంది.
– ఆల్బర్ట్ కామూ

సాక్షి
గురువారం, 6 నవంబర్ 2025

ట్రంప్‌కు ‘బ్యాలెట్’ షాక్!

తొమ్మిది నెలల క్రితం అధికారంలోకొచ్చింది మొదలు ఇంటా బయటా విపరీత పోకడలతో, వింత నిర్ణయాలతో బెంబేలెత్తిస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు తొలిసారి ఓటర్లు షాకిచ్చారు. ఆయన సోషలిస్టు, కమ్యూనిస్టు అంటూ ఈసడించుకున్న 34 ఏళ్ల యువకుడు జోహ్రాన్ మమ్దానీ న్యూయార్క్ మేయర్‌గా మంచి మెజారిటీతో ఎన్నికయ్యారు. మరోపక్క నిరుడు అధ్యక్ష ఎన్నికల్లో డెమాక్రాటిక్ పార్టీకి మొహం చాటేసిన వర్జీనియా, న్యూజెర్సీ రాష్ట్రాలు గవర్నర్ ఎన్నికల్లో తిరిగి ఆ పార్టీ వైపు మొగ్గాయి. ఆ రెండు చోట్లా డెమాక్రాట్ల తరఫున పోటీచేసిన మహిళా అభ్యర్థులు మికీ షెరిల్, అబిగైల్ స్పాన్‌బెర్గర్ ఘనవిజయం సాధించారు. క్యాలిఫోర్నియాలో ప్రతినిధుల సభకూ, సెనేట్ సీట్లకూ జిల్లాల హద్దులు నిర్ణయించే పోలింగ్‌లో సైతం డెమాక్రాట్లదే పైచేయి. ఈ లెక్కన వచ్చే ఏడాది ప్రతినిధుల సభకూ, సెనేట్‌లోని కొన్ని స్థానాలకూ జరగబోయే ఎన్నికలపై రిపబ్లికన్లు ఆశ వదులుకోవాల్సి రావొచ్చు.

ట్రంప్ దూకుడుతో చేష్టలుడిగిన డెమాక్రటిక్ పార్టీకి ఓటర్లే ఊపిరి పోశారని ఫలితాల సరళి చెబుతోంది. న్యూయార్క్ ఎన్నికల్లో కనీవినీ ఎరుగని స్థాయిలో 20 లక్షల మందిపైగా ఓటు హక్కు వినియోగించుకోవటమైనా, వారిలో సగంమందికి పైగా మమ్దానీ పక్షాన నిలవటం అయినా అసాధారణం. న్యూయార్క్ వందేళ్ల చరిత్రలో ఆయనది ప్రత్యేకమైన రికార్డు. ముస్లిం కావటం, భారతీయ మూలాలున్న వ్యక్తి అయివుండటం, చిన్న వయసులో కీలక పదవికి చేరుకోవటం రికార్డు. విజేతలు ముగ్గురూ కావడానికి డెమాక్రాట్లే అయినా భిన్న దృక్పథాలున్నవారు. గవర్నర్లుగా ఎన్నికైన షెరిల్, స్పాన్‌బెర్గర్ మధ్యేవాదులు కాగా, మమ్దానీ వామపక్ష భావాలున్నవారు. నమ్ముకున్న మధ్యేవాదాన్ని విడనాడితే తప్ప ఉనికి ఉండబోదన్న ఆందోళనలో డెమాక్రాట్లున్న తరుణంలో మొన్న ఫిబ్రవరిలో మేయర్ అభ్యర్థిత్వం కోసం పార్టీలో జరిగిన పోటీలో మమ్దానీ నిలిచారు. అప్పటికి ఆయనకు నిండా ఒక శాతం ఓట్లు కూడా లేవు. పైగా పోటీపడింది పార్టీలో సంవత్సరాలుగా పాతుకుపోయి, గవర్నర్‌గా ఎంతో అనుభవం గడించిన ఆండ్రూ కూమోతో. కూమోకు ఐశ్వర్యవంతుల దన్నుంది. పైగా రిపబ్లికన్లకూ, డెమాక్రాట్లకూ అనేక అంశాల్లో భిన్నాభిప్రాయాలున్నా యూదుల ఓటు బ్యాంక్‌ను దృష్టిలో ఉంచుకుని ఇజ్రాయెల్‌నే సమర్థిస్తారు. అలాంటి పార్టీలో మేయర్ అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ పాలస్తీనాలో ఇజ్రాయెల్ ఊచకోతను వ్యతిరేకించటం, మానవ హక్కుల హననాన్ని నిరసించటం సామాన్యం కాదు. ఆ పని మమ్దానీ చేయగలిగారు. దీంతోపాటు వలసదారులపై ట్రంప్ కత్తిగట్టడాన్ని బాహాటంగా ఖండించారు. ఇదంతా పార్టీకి చేటు తెస్తుందని స్వపక్షంలోనే అనేకులు లబలబలాడారు. కానీ మమ్దానీ దృఢంగా నిలబడ్డారు. కనీస అవసరాలైన తిండిగింజలు, గూడు, ఆరోగ్యం అందుబాటు ధరల్లో ఉండాలన్న నినాదంతో ముందు కెళ్లారు. పార్టీలో తన రేటింగ్‌ను డబుల్ డిజిట్‌కు తీసుకెళ్లారు. సర్వేల్లో సైతం ముందంజలో ఉన్నారు. దీంతో ట్రంప్ బెదిరింపులకు దిగారు. న్యూయార్క్‌కు ఫెడరల్ నిధులు ఆపేస్తాననీ, నగరం సర్వనాశనమవుతుందనీ హెచ్చరించారు. కానీ జనం బేఖాతరు చేశారు.

వలసలపై యుద్ధం చేస్తున్న ‘మాగా’ ఉద్యమకారులు, రిపబ్లికన్లకు వారిదైన ‘రెడ్ బుక్’ రాజ్యాంగం ఉంది. దాని సాయంతో విశ్వవిద్యాలయాల్లోనూ, రోడ్లపైనా చెలరేగిపోతున్నారు. ఈ ఎన్నికల్లో వారిది చిత్రమైన అవస్థ. ట్రంప్ నేరుగా స్పందించాలా లేదా అన్నది వారు తేల్చుకోలేకపోయారు. సంప్రదాయ ఓట్లు రాలాలంటే ట్రంప్ స్పందించి తీరాలి. తీరా ఓటమి పాలైతే ట్రంప్‌పై రిఫరెండమ్ అవుతుంది. చివరకు ఆయన మమ్దానీపై నిప్పులు చెరిగారు. సొంత పార్టీ అభ్యర్థి సిల్వాను కాదని కూమో వైపు మొగ్గారు. కానీ వ్రతం చెడ్డా ఫలితం దక్కలేదు. అందుకే ఈ ఓటమి పాపం ట్రంప్‌కి చుట్టుకుంది. అధికారం శాశ్వతమని విర్రవీగే దేశ దేశాల పాలకులకూ ఈ ఫలితాలు ఒక హెచ్చరిక. మందబలంతో చెలరేగితే చివరకు అధోగతేనని ఈ ఎన్నికల ఫలితాలు చాటుతున్నాయి. అమెరికాలోని 50 రాష్ట్రాల్లో 30 రాష్ట్రాలు రిపబ్లికన్లకు నీరాజనం పట్టి ఏడాది కాలేదు. ట్రంప్ తన నియంత పోకడలతో దాన్నంతటినీ కాలదన్నుకున్నారు. చేసుకున్నవారికి చేసుకున్నంత!

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తిక మాసం, **తిథి:** బ.పాడ్యమి సా.4.52 వరకు, తదుపరి విదియ, **నక్షత్రం:** భరణి ఉ.8.41 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.7.50 నుండి 9.19 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.53 నుండి 10.38 వరకు తదుపరి ప.2.21 నుండి 3.06 వరకు, **అమృత ఘడియలు:** తె.4.43 నుండి 6.13 వరకు (తెల్లవారితే శుక్రవారం).

సూర్యోదయం : 6.04
సూర్యాస్తమయం: 5.24
రాహుకాలం : ప.1.30 నుండి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుండి 7.30 వరకు

సోషల్ టాక్

ఎవరు కావాలి?

గ్రేడ్‌లు నన్ను దక్షిణ కొరియా మొత్తంలోనే దాదాపు టాపర్‌గా నిలిపాయి. అయితే నేను ర్యాపర్‌గా దేశంలోనే నంబర్ 1 అవుతానని నా నమ్మకం. అందుకని నేను మా అమ్మను... “మొదటి స్థానంలో ఉన్న ర్యాపరా, లేక టాపర్ అయిన ఉద్యోగా... నీకు ఎవరు కావాలి?” అని అడిగాను.

– ఆర్.ఎం. (కిమ్ నామ్–జూన్), బీటీఎస్ ర్యాపర్

ఆగటమే వైఫల్యం

నేను నేర్చుకున్నదే మీకు చెబుతాను. మీరు విఫలమయ్యామని ఆడటం ఆపకండి. మీరు ప్రయత్నించడం ఆపేసినప్పుడే మీరు విఫలమవుతారు. మీ మనసును ప్రశాంతంగా, ఓర్పుగా ఉంచుకుంటే వైఫల్యం ఇంధనంగా మారుతుంది.

– అమోల్ ముజుందార్, భారత మహిళా క్రికెట్ జట్టు కోచ్

పెద్దయ్యాక తెలిసింది!

12 ఏళ్ల వయసులో నేను రెండు వార్తాపత్రికలు చదివేవాడిని. ప్రపంచాన్ని కొంచెం మెరుగైన ప్రదేశంగా మార్చాలని ఎప్పుడూ అనుకుంటూ ఉండేవాడిని. నేను పెద్దయ్యాక, అలా చేయడానికి నిజంగానే మార్గాలు ఉన్నాయని గ్రహించాను.

– రాబ్ జెట్టెన్, నెదర్లాండ్స్‌కు కానున్న ప్రధాని

స్పందన - చర్య

నాయకుడిగా ఉండటానికి అత్యంత ముఖ్యమైన అర్హత... సకాలంలో నిర్ణయాలు తీసుకోగలగటం. అవకాశం దాటిపోయిన తర్వాత నిర్ణయం తీసుకోవడం కంటే, అసంపూర్ణ నిర్ణయం తీసుకోవటమైనా మంచిదే! తక్షణం స్పందించి, వెంటనే చర్య తీసుకోవటం నాయకత్వ లక్షణం.

– తరుణ్ గార్గ్, ‘హ్యుందాయ్’ సీఓఓ

మాట్లాడకండి!

పని చేస్తున్న సంస్థలో మీరున్న పెద్ద హోదా నుంచి మీరు బయటికి వెళ్లవలసి వచ్చినప్పుడు మీ సంస్థకు వ్యతిరేకంగా ఏమీ మాట్లాడకండి. మీ వల్ల సంస్థకు ఎంత ప్రయోజనం చేకూరిందో చెప్పకోకండి. రతన్ టాటా అన్నట్లు... ‘సంస్థ కంటే ఎవరూ గొప్పవారు కాదు’.

– మెహ్లీ మిస్త్రీ, టాటా పూర్వ ట్రస్టీ

మీరు ప్రత్యేకం

ప్రతిదాన్నీ నమ్మేయటం అంటే, దేనినీ నమ్మక పోవటమే! నాతో మీరు అంగీకరించడం కంటే కూడా, నేను అంగీకరించే వాటితో మీకు ఏకీభావం ఉండకూడదనే నేను కోరుకుంటాను. దీనర్థం... అయినదానికీ, కానిదానికీ అంగీకారంగా, లేదా విరుద్ధంగా ఉండొద్దని!

– ఆదిల్ హుస్సేన్, నటుడు

ఆ సమావేశాల్లో తేలిందేమిటి?

విశ్లేషణ

టంకశాల అశోక్

అక్టోబర్ 26 నుంచి నవంబర్ 1 వరకు ఏడు రోజులలో ఆసియాలో కీలకమైన ఆర్థిక సమావేశాలు వరుసగా జరిగాయి. జరిగింది ఆసియాలోని మలేషియా, జపాన్, దక్షిణ కొరియాలలో అయినా, అమెరికా, చైనా, రష్యా సహా ప్రపంచ దేశాలు పాల్గొన్నాయి. ఆ సమావేశాలలో జరిగిన చర్చలు, జరిగిన ఒప్పందాలు మొత్తం ప్రపంచ వాణిజ్య, ఆర్థిక రంగాలపై ప్రభావం చూపనున్నాయి. ముఖ్యంగా స్వేచ్ఛా వాణిజ్యం, పెట్టుబడుల విషయమై భవిష్యత్తుకు సంబంధించిన ఆలోచనా ధోరణులు ఏ విధంగా ఉండనున్నాయో ఆ సమావేశాలలో స్పష్టమైంది. కానీ, అగ్రస్థాయి ఆసియా దేశం అయి ఉండి, ఆర్థిక పరిమాణంలో నాల్గవ స్థానానికి చేరిన ఇండియా ప్రధాని మోదీ మాత్రం ఆ సమావేశాలలో పాల్గొనక అందరినీ ఆశ్చర్యపరిచారు. అందుకు ప్రభుత్వం అధికారికమైన వివరణ కూడా ఏమీ ఇవ్వక ఊహాగానాలకు వదలివేసి మరింత ఆశ్చర్యపరిచింది.

ట్రంప్ వర్సెస్ ఇతర దేశాలు

మొదట మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లో ‘ఆసియాన్’, ఆర్‌సీఈపీ (రీజినల్ కాంప్రహెన్సివ్ ఎకనమిక్ పార్ట్‌నర్‌షిప్), తర్వాత దక్షిణ కొరియా నగరం బూసాన్‌లో ఏపీఈసీ (ఆసియా–పసిఫిక్, ఎకనమిక్ కో–ఆపరేషన్) శిఖరాగ్ర సమావేశాలు జరిగాయి. అమెరికా, చైనా అధ్యక్షులు విడిగా సమావేశమయ్యారు. వీటి మధ్య అమెరికా అధ్యక్షుడు జపాన్ వెళ్లి అక్కడి ప్రధానితో చర్చలు జరిపారు. ‘ఆసియాన్’లో 11 దేశాలకు, ఆర్‌సీఈపీలో 15 దేశాలకు, ఏపీఈసీలో 21 దేశాలకు సభ్యత్వం ఉంది. మొత్తం అన్ని ఖండాలకు చెందిన ఈ దేశాలను కలిపి చూస్తే, ప్రపంచ జనాభాలో, ఆర్థిక శక్తిలో, వాణిజ్యంలో అత్యధిక భాగస్వామ్యం వాటిదే.

చర్చలు, తీర్మానాలు, ఒప్పందాల చివరన రెండు ధోరణులు స్పష్టంగా తేలాయి. ఒకటి – అమెరికా తన ‘అమెరికా ఫస్ట్’ నినాదానికి అనుగుణంగా ఆ యా దేశాలతో విడివిడిగా చర్చించి ద్వైపాక్షిక ఒప్పందాలు మాత్రమే చేసుకోవటం. చైనా మినహా మరెవరిపైా సుంకాలు తగ్గించకపోవటం. ఆ యా సంస్థల సామూహిక చర్చలలో అధ్యక్షుడు ట్రంప్ అసలు పాల్గొనక పోవటం. స్వేచ్ఛా వాణిజ్యం, పెట్టుబడుల పట్ల విముఖత చూపటం. ఇందుకు భిన్నంగా, అమెరికాకు సన్నిహితంగా భావించే వాటితో సహా తక్కిన అన్ని దేశాలు, ఎటువంటి మినహాయింపు లేకుండా, స్వేచ్ఛా వాణిజ్యం, పెట్టుబడులు వర్తమాన ప్రపంచానికి తప్పనిసరి అవసరమని తీర్మానించాయి. వారిలో కొందరు ఒత్తిడి కారణంగానైతేనేమి, సైద్ధాంతిక మైత్రి వల్లనైతేనేమి అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకున్నారు. ప్రధానంగా అరుదైన లోహాలు, ఖనిజాలు, అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తులు, రక్షణ, రవాణా పరికరాలకు సంబంధించి! అదే సమయంలో స్వేచ్ఛా వాణిజ్యాన్ని అనుకూలిస్తూ, ఒత్తిడులను వ్యతిరేకిస్తూ తీర్మానించారు. పరోక్షంగా అమెరికాను ఉద్దేశిస్తూ – ప్రొటెక్షనిజాన్నీ, ప్రపంచం తిరిగి ఆటవిక రాజ్య స్థితికి వెళ్లటాన్నీ విమర్శించారు. అమెరికాకు అత్యంత సన్నిహిత దేశాలలో ఒకటైన కెనడా ప్రధాని మార్క్ కార్నీ అయితే తాము వాణిజ్య పరంగా అమెరికాపై ఆధారపడే సాంప్రదాయిక స్థితి నుంచి దూరంగా జరగదలచుకున్నామనీ, రాగల కాలంలో అమెరికా బయటి దేశాలతో వాణిజ్యాన్ని రెట్టింపు చేయగలమనీ ప్రకటించారు. ఆ వెంటనే చైనా అధ్యక్షునితో సమావేశమై, ‘మరింత సుస్థిరమైన, సమ్మిళితమైన అంతర్జాతీయ వ్యవస్థ నిర్మాణానికి’ చైనాతో కలిసి పనిచేయగలమన్నారు. త్వరలో చైనా సందర్శనకు అంగీకరించారు.

◆ మనం ‘లుక్ ఈస్ట్’, ‘యాక్ట్ ఈస్ట్’ అని చాలా కాలం నుంచి మాట్లాడుతున్నాము గానీ, ‘ఆర్‌సీఈపీ’లో సభ్యత్వమైనా లేదు. సభ్యత్వం లేకున్నా ‘సమగ్ర వ్యూహాత్మక భాగస్వామి’ హోదాలో ‘ఆసియాన్’ కూటమితో ఆర్థిక సంబంధాల అభివృద్ధికి అవకాశమున్నా, నత్తనడక నడుస్తోంది.

ప్రాంతీయ సంబంధాల సరళతరం

వాస్తవానికి ఒకవైపు అమెరికా, మరొకవైపు తక్కిన ప్రపంచపు ఈ విధమైన ధోరణులు కొంత కాలంగా కనిపిస్తున్నవే. అది ట్రంప్‌కు తెలియనిది కాదు. ఆయన తన విధానాలను ఈ ఆసియా సమావేశాల సందర్భంగా మార్చుకోగలరని కూడా ఎవరూ ఆశించి ఉండరు. అయితే రెండు ధోరణులు కూడా ఈ వారం రోజుల సమావేశాల కాలంలో మరింత స్థిర రూపం తీసుకోవటమన్నది గమనించదగ్గది. అంతా మన మంచికే అన్న సామెత వలె, ఈ పరిణామాలు ప్రపంచ దేశాల మధ్య బహుముఖ సంబంధాలు, బహుళ ధ్రువ ప్రపంచ ఆవిష్కరణకు మార్గాన్ని మరింత సుగమం చేయగలవు.

ఇక్కడ రెండు విషయాలు చెప్పుకోవాలి. అవి – సాధారణంగా అమెరికా పలుకుబడి కింద పని చేస్తాయనే పేరున్న ఐక్యరాజ్య సమితి, అంతర్జాతీయ ఆర్థిక సంస్థ (ఐఎంఎఫ్) ఈ సమావేశాలకు ముందు చెప్పిన మాటలు. నిబంధనలకు విరుద్ధంగా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల కోసం ఒత్తిడుల దృష్ట్యా వివిధ దేశాలు తమ ప్రాంతీయ వాణిజ్య సంబంధాలను సరళతరం చేసుకోవాలని ఐరాస వాణిజ్య విభాగం అధికారులు సూచించారు. తర్వాత ఆసియా ప్రాంతీయ ఆర్థిక పరిస్థితులపై ఐఎంఎఫ్ ఒక నివేదికను విడుదల చేస్తూ– ఆ ప్రాంత ఆర్థికాభివృద్ధి ప్రధానంగా వాణిజ్యంపై ఆధారపడి ఉందనీ, అందువల్ల అక్కడి దేశాలు సుంకాలు కాని ఇతర వాణిజ్య ఆంక్షలను తగ్గించుకోవటం, ప్రాంతీయ వాణిజ్యాన్ని సమీకృత పరచుకోవటం, ఆ విధంగా అమెరికా సుంకాల ఒత్తిడి నుంచి తప్పించుకోవటం, ప్రపంచ ఆర్థిక ఒడుదొడుకులను తట్టుకోవటం చేయాలనీ చెప్పింది.

ఇండియా ఏం చేస్తున్నట్టు?

ఇంత ముఖ్యమైన సమావేశాలకు కిందిస్థాయి అధికారులను మాత్రమే పంపిన భారత ప్రభుత్వం దీనంతటి నుంచి గ్రహించవలసింది చాలానే ఉంది. ఉదాహరణకు మనం ‘లుక్ ఈస్ట్’, ‘యాక్ట్ ఈస్ట్’ అని చాలా కాలం నుంచి మాట్లాడుతున్నాము గానీ, ఆర్‌సీఈపీలో సభ్యత్వమైనా లేదు. ఆసియాన్‌లో సభ్యత్వం లేకున్నా ‘సమగ్ర వ్యూహాత్మక భాగస్వామి’ హోదా ఉంది. ‘ఆసియాన్’ కూటమితో వాణిజ్య, ఆర్థిక సంబంధాల గణనీయమైన అభివృద్ధికి అవకాశం ఉన్నప్పటికీ ఆ పని మందకొడిగానే సాగుతున్నది. చైనా 771 బిలియన్ డాలర్లతో అగ్రస్థానంలో ఉండగా, మన వాణిజ్యం విలువ 131 బిలియన్లు మాత్రమే. భౌతికంగా, డిజిటల్ పరంగా సంబంధాలు చాలా పరిమితం. పోతే... ఐరాస, ఐఎంఎఫ్ సూచనలను అన్వయించుకుని చూస్తే – ఇండియా ఉన్న దక్షిణాసియాలో, ‘సార్క్’లో ఆర్థిక సమన్వయం, వాణిజ్య సంబంధాలు పాకిస్తాన్‌తో సమస్య వల్ల అథమ స్థాయిలో ఉన్నాయి. ‘బిమ్‌స్టెక్’ అనే మరొక సంస్థను పాకిస్తాన్‌ను మినహాయిస్తూ ఏర్పాటు చేసినా పరిస్థితి మెరుగుపడటం లేదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సింపుల్‌గా....

కృత్రిమ వర్షాల కథేమిటి?

వాయు కాలుష్యంతో అల్లాడుతున్న దేశ రాజధాని నగరానికి ఉపశమనం కల్పించేందుకు ఇటీవల క్లౌడ్ సీడింగ్‌తో కృత్రిమంగా వర్షాలు కురిపించే ప్రయత్నాలు రెండుసార్లు జరిగాయి. గత అయిదు దశాబ్దాల కాలంలో ఢిల్లీలో ఇలాంటి ప్రయోగాలు చేయడం ఇదే తొలిసారి. ఐఐటీ – కాన్పూర్ భాగస్వామ్యంతో ఢిల్లీ ప్రభుత్వం చేసిన ఈ ప్రయత్నాలు అంతగా ఫలించకపోయినప్పటికీ, అందరి దృష్టినీ ఆకర్షించాయి. అసలింతకీ ఈ కృత్రిమ మేఘమథనం అంటే ఏమిటి? ఎలా చేస్తారు? ఏం చేస్తారు? ప్రపంచవ్యాప్తంగా దీని ఫలితాలేమిటి? ఇలా కృత్రిమంగా వర్షాలు కురిపించడంలో లాభమెంత? నష్టమెంత?

కృత్రిమ మేఘమథన ప్రయత్నాలు ఏడున్నర దశాబ్దాల పైగా జరుగుతూనే ఉన్నాయి. సౌదీ, అమెరికా, చైనా, ఇజ్రాయెల్, ఇండొనేషియా, ఆస్ట్రేలియా సహా 50 దేశాలు ఈ ప్రయోగాలు చేశాయి. అయితే, మిశ్రమ ఫలితాలే వచ్చాయి. మన దేశంలోనూ 1952 నుంచి ప్రయోగాలు జరిగాయి. అప్పట్లో హైడ్రోజెన్ బెలూన్లలో ఉప్పు, సిల్వర్ అయొడైడ్‌లను పంపేవారు. ఢిల్లీలోనూ ఎప్పుడో 1960ల్లోనే ప్రయోగం చేసి, విఫలమయ్యారు. ఆ తర్వాత 1970ల నుంచి విమానాల వినియోగం వచ్చింది. తాజాగా అక్టోబర్ 28న ఢిల్లీలో చేసిన ప్రయత్నాలతో వర్షం రాలేదు కానీ, ప్రమాద స్థాయిలో ఉన్న వాయునాణ్యత కాస్తంత మెరుగైంది.

ఏమిటీ క్లౌడ్ సీడింగ్?

మేఘాలు వర్షం కురిపిస్తాయి. కానీ, అన్ని మేఘాలూ వర్షించవు. అందుకే క్లౌడ్ సీడింగ్. ‘క్లౌడ్ సీడింగ్’ అంటే మేఘాలను మథించి, కృత్రిమ పద్ధతిలో వర్షాలు కురిసేలా చేయడం. సామాన్యుల భాషలో... పనిచేస్తున్న వాహనం పెట్రోల్ ఉన్నా సరే బ్యాటరీ బలహీనమై స్టార్ట్ కానప్పుడు బండిని వెనక నుంచి ముందుకు తోసి ఆ ఊపుతో స్టార్ట్ అయ్యేలా చేసినట్టే, సైన్స్ ఆసరాతో కృత్రిమంగా మేఘాలను ప్రేరేపించి కురిసేలా చేస్తారు. ఓ విమానాన్ని వాడి,

మేఘానికి కొన్ని కణాలను జత చేరుస్తారు. జీరో డిగ్రీ సెల్సియస్ కన్నా తక్కువ ఉష్ణోగ్రత ఉండే చల్లటి మేఘాలలో సిల్వర్ అయొడైడ్ కణాలను జత చేర్చే ప్రక్రియ సాగుతుంది. సదరు ఆ కణాలే ‘సీడ్స్’ (విత్తనాలు)గా పనిచేస్తాయి. వాటి చుట్టూ నీటి ఆవిరి ఘనీభవిస్తుంది. అలా బరువెక్కిన కణాలు నేల రాలే క్రమంలో దోవలో అధిక ఉష్ణోగ్రతకు లోనై, ద్రవీభవించడం వాన చినుకులుగా మారడం జరుగుతుంది. అదే వెచ్చటి మేఘాలలో అయితే సోడియం క్లోరైడ్, లేదా పోటాషియం క్లోరైడ్ లాంటి రసాయన ద్రావణాలను సీడింగ్ ఏజెంట్లుగా వినియోగిస్తారు.

తొలి ప్రయోగాలు... తాజా అధ్యయనాలు...

కృత్రిమ వర్ష ప్రయత్నాలు 1946లోనే జరిగాయి. అవపాతం జరిగే భౌతిక సూత్రాలను లోతుగా అవగాహన చేసుకొనేందుకు అమెరికన్ రసాయనవేత్త, వాతావరణ నిపుణుడు విన్సెంట్ షేఫర్ అప్పట్లోనే ల్యాబ్‌లో ప్రయోగాలు చేశారు. ఆయన డ్రై ఐస్‌తో ప్రయోగాలు చేస్తే, ఆ తర్వాత శాస్త్రవేత్తలు ల్యాబ్‌లో కాక, బయటే అనేక ప్రయోగాలు చేశారు. సిల్వర్ అయొడైడ్ స్ఫటికాలను ఉపయోగించి, మెరుగైన ఫలితాలు సాధించారు. అనేక చోట్ల వర్షాలు కురిపించారు. పుణేకు చెందిన ‘ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ’ మాత్రం 1970ల నుంచి ఈ ప్రయోగాలు చేస్తున్నామంటోంది. దీని వల్ల వర్షపాతం 17 శాతం మేర పెరిగినట్టు చెబుతోంది. అయితే, ప్రపంచ వ్యాప్తంగా క్లౌడ్ సీడింగ్. ఆశించిన ఫలితాలు అందించలేదని అమెరికన్ ప్రభుత్వ వర్గాల 2024 నాటి నివేదిక కూడా చెప్పింది.

లాభమెంత? నష్టమెంత?

మేఘమథనాన్ని ప్రేరేపించడానికి వాడిన సిల్వర్ అయొడైడ్ తాలూకు అవశేషాలు భూమిపై పడి, పర్యావరణానికి హానికరం కావచ్చని పరిశోధకుల తాజా అధ్యయనం మాట. అలాగే, డ్రై ఐస్ అంటే ఘనరూప కార్బన్ డయాక్సైడే గనక అది కూడా భూతాపాన్ని పెంచుతుందంటున్నారు. సీడింగ్‌కు విమానం, పైలట్లు, సాంకేతిక సిబ్బంది సేవలతో పాటు రసాయన మిశ్రమాలకు బాగా ఖర్చవుతుంది గనక అది ఏ మేరకు లాభదాయకమో స్పష్టత లేదు. గత ఏడేళ్ళుగా ఢిల్లీలో మేఘమథన ప్రతిపాదనలు వస్తున్నా, ఈసారే ప్రయోగాలు జరిగాయి. తాజా ప్రయత్నం విఫలమైనా, ప్రయోగాలు కొనసాగిస్తామని ఐఐటి–కాన్పూర్ చెబుతోంది. వాయు కాలుష్య నివారణకు తీసుకోవాల్సిన ప్రాథమిక చర్యలు మానేసి, ఇలా తాత్కాలిక ఉపశమనానికై పాకులాడడమే విచిత్రం. ❑

ప్రభుత్వమే బాధ్యత వహించాలి!

ఇన్ బాక్స్

ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ గుడిలో జరిగిన ఘోరమైన తొక్కిసలాట ప్రమాదంలో 9 మంది అమాయక భక్తులు మరణించడం దిగ్భ్రాంతికరం, దుఃఖకరం. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వ నేతలు ఈ సంఘటనకు పూర్తి బాధ్యత వహించాలి. అలనాడు ఒక ఘోర రైలు ప్రమాదం జరిగితే, నాటి రైల్వే మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి రాజీనామా చేసినట్లే, ఈ సంఘటనలోనూ, దేవాదాయ శాఖ మంత్రో లేదా హోం మంత్రో... ఎవరో ఒకరు నైతిక బాధ్యత వహించి రాజీనామా చేసి ఉండాల్సింది. కానీ అలా జరగలేదు. నాటికాలం నైతిక విలువల త్యాగాల యుగం. నేడున్నది దిగజారిన స్వార్థ రాజకీయాల యుగం.

దైవ దర్శనానికి వచ్చిన భక్తులు వినియోగదారుల వంటివారు. వారిని గౌరవించి, వారిలోనే దేవుని దర్శించి, సేవలందించి, దర్శనం చేయించి, భద్రంగా తిప్పి పంపవలసిన బాధ్యత ఆలయ అధికారులది. గతంలో తిరుమల తిరుపతిలో గానీ, సింహాచలంలో గానీ, నేడు కాశీబుగ్గలో గానీ జరిగినది ఏమిటి? సాధారణ ప్రజల ప్రాణాలకు విలువ లేనట్లు పాలకులు నిర్లక్ష్యంగా, శ్రద్ధాభక్తులు లేకుండా ప్రవర్తించడం స్పష్టంగా కనిపిస్తోంది.

మొంథా తుఫానును మడతపెట్టి పంపామనీ, జీరో క్యాజువాలిటీ (ప్రాణ నష్టం) అనీ, అమెరికా పాలకులు కూడా ఈ పని చేయలేరనీ ముఖ్యమంత్రి గొప్పలకు పోయి 24 గంటలు గడవక మునుపే, అయ్యగారి ఉద్యోగుల అసమర్థత కారణంగా పదిమంది బలయ్యారు. ఇకనైనా ప్రజల ప్రాణ రక్షణ, సంక్షేమాల పట్ల శ్రద్ధ వహించాలి. జగన్ వలే, ప్రజల పట్ల నిజమైన ప్రేమ చూపుతూ, వారి యోగక్షేమాల పట్ల జాగరూకతతో వ్యవహరించి ప్రజామన్ననలను పొందాలి. లేని పక్షంలో ప్రజలు తగిన సమయంలో బుద్ధి చెబుతారు.

– ఈదర గోపీచంద్
సోషల్ యాక్టివిస్ట్, నరసరావుపేట

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

ఏఐ... ఐతే ఏంటి?



దైనందిన జీవితంలో కృత్రిమ మేధ (ఏఐ) వాడకం పట్ల పెద్దగా ఆందోళన చెందనిది భారతీయులే. ప్యూ రిసెర్చ్ సెంటర్ 25 దేశాల్లో చేపట్టిన సర్వేలో ఏఐ వాడకం పట్ల దక్షిణ కొరియా, భారత్‌లలో తక్కువ శాతం మంది ఆందోళన వ్యక్తం చేశారు. (తటస్థులను, జవాబు చెప్పనివారిని లెక్కలో మినహాయించడమైనది)



● ఆందోళన పడుతున్నవారు ● ఉత్సాహం చూపుతున్నవారు (శాతాల్లో)

దేశం	ఆందోళన పడుతున్నవారు	ఉత్సాహం చూపుతున్నవారు
యూఎస్	50	38
ఇటలీ	50	37
ఆస్ట్రేలియా	49	38
కెనడా	45	45
యూకే	39	46
ఫ్రాన్స్	35	49
జర్మనీ	29	53
జపాన్	28	55
భారత్	19	39
దక్షిణ కొరియా	16	61

అష్టమాతృకల జననం

దత్తబోధ

శ్రీ గణపతి సచ్చిదానందస్వామి

కామ క్రోధాదయో నూనం శక్త యస్సర్వ జంతుషు / తథా ముక్తస్యతే దోషాః తద్విజ్ఞస్యతు మాతరః – కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్య, అసూయ, పైశున్యములు అనే ఈ ఎనిమిది సర్వ ప్రాణులలో శక్తులుగా ఉన్నాయి. ఇవి అజ్ఞానికి దోషాలై బాధిస్తాయి. ఇవే జ్ఞానికైతే ‘అష్ట మాతృకలు’గా వెన్నుతట్టి రక్షిస్తాయి.

లోకంలో కామక్రోధాదుల్ని అరిషడ్వర్గంగా భావిస్తాం. కామ, క్రోధాలు రెండూ రజో గుణం నుంచి పుట్టాయి. కనుక సత్వ గుణ ప్రధానమైన జ్ఞానానికి ఇవి శత్రువులే! అలాగే కామక్రోధ లోభాలు నరకానికి ద్వారాలంటారు. అందుకని ఈ మూడింటినీ వదలమని ‘గీత’ చెబుతోంది. అరిషడ్వర్గంలో ఇవి ప్రధానాలు. వీటిని ఆశ్రయించి మిగిలినవి బలపడతాయి. ఇవి క్షీణిస్తే, మిగిలిన వాటికి శక్తి చాలదు. వీటికి తోడు అసూయ, పిశునత్వము విజృంభిస్తాయి.

అష్టమాతృకలు కామ క్రోధాదులు కలిగినవారిని ఎలా బలహీనులను చేస్తాయో చెప్పే కథ ఒకటుంది. పుట్టు గుడ్డి అయిన అంధకుడనే రాక్షసుడు తాను గాయపడితే, తన శరీరం నుంచి పడిన ప్రతి రక్తపు బొట్టు నుంచి ఒక్కొక్క అంధకాసురుడు పుట్టేలా వరం పొందాడు. ఆ వర బలంతో ముల్లోకాలనూ ముప్పుతిప్పలు పెట్టసాగాడు. దేవతలందరూ కైలాసానికి వెళ్ళి శివుని ప్రార్థించారు. అదే సమయంలో అంధకుడు పార్వతిని బలవంతంగా తీసుకు వెళ్ళబోతున్నాడు. అది చూచిన శివునికి అమిత కోపం వచ్చింది. అతడితో యుద్ధం చేస్తుంటే అతడి శరీరం నుంచి కారే రక్తపు బొట్ల నుంచి అంధకాసురులు పుట్టుకువచ్చి హింసను పెంచారు. ఇంతలో విష్ణువు ఒక్క రక్తపు బొట్టు కూడా కిందపడకుండా తన శరీరంపై పడేట్లు చేశాడు. దాంతో అంధకాసురుల పుట్టుక ఆగింది. శివుని పవిత్ర సంకల్పం వల్ల పరాశక్తి అంశలుగా చాముండి, రుద్రాణి, వైష్ణవి, కౌమారి, బ్రాహ్మి, మాహేంద్రి, వారాహి, దండధారిణి అనే పేర్లు గల అష్టమాతృకలు ఆవిర్భవించి అంధకునిలో మూర్తీభవించిన కామ, క్రోధాది దుష్టశక్తులన్నింటినీ చెండాడాయి. ఇప్పుడంధకుడు శక్తి హీనుడైనాడు. వెంటనే శివుడు అంధకాసురుని అంతం చేశాడు.

దేదీప్యమానం.. జ్వాలాతోరణం

శ్రీశైల మహాక్షేత్రంలో బుధవారం కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని జ్వాలాతోరణం నిర్వహించారు. ఆలయం ఎదురుగా గంగాధర మండపం వద్దకు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులను చేయించి అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా విశేష పూజాధికాలు నిర్వహించి జ్వాలాతోరణం చుట్టూ మూడుసార్లు స్వామిఅమ్మవార్ల పల్లకీని తిప్పారు. అనంతరం జ్వాలాతోరణాన్ని వెలిగించారు. అలాగే ఆలయ పుష్కరిణి వద్ద నిర్వహించిన లక్షదీపోత్సవ కార్యక్రమంలో భాగంగా సాయంత్రం శ్రీస్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను పుష్కరిణి వద్దకు ఆశీనులు చేయించి అర్చకులు, వేదపండితులు పూజలు చేశారు. అనంతరం పుష్కరిణి ప్రాంగణమంతా లక్ష దీపాలు వెలిగించారు. శ్రీస్వామి అమ్మవార్లకు, పుష్కరిణికి దశవిధ హారతులిచ్చారు. – శ్రీశైలం టెంపుల్

ఇంద్రకీలాద్రిపై కోటి దీపకాంతులు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని విజయవాడ ఇంద్రకీలాద్రిపై బుధవారం రాత్రి కోటి దీపోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయం ఎదుట రాజగోపురం వద్ద లక్ష ఒత్తుల దీపాన్ని ఆలయ చైర్మన్ రాధాకృష్ణ, ఈవో శీనానాయక్ దంపతుల సమేతంగా వెలిగించి ఉత్సవాన్ని ప్రారంభించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణం, రాజగోపురం, కనకదుర్గనగర్, లక్ష్మీగణపతి ప్రాంగణాలలో దీపాలను వెలిగించారు. తొలుత ఆలయ సిబ్బంది, సేవా సిబ్బంది ఆలయ ప్రాంగణంలోని పలు ప్రాంతాలలో రంగవల్లులతో తీర్చిదిద్దారు. సాయంత్రం ప్రధాన ఆలయంలో కొలువై ఉన్న దుర్గమ్మకు పంచహారతుల సేవ చేశారు. – ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ)

తిరుమలలో వైభవంగా కార్తీక పౌర్ణమి గరుడసేవ

తిరుమలలో బుధవారం రాత్రి కార్తీక పౌర్ణమి గరుడసేవ వైభవంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామివారు గరుడ వాహనంపై ఆశీనులై ఆలయ మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. – తిరుమల

వైభవం.. అమరేశ్వరుని తెప్పోత్సవం

పంచారామక్షేత్రమైన అమరావతి శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరుని తెప్పోత్సవం బుధవారం రాత్రి పవిత్ర కృష్ణానదీలో అంగరంగ వైభవంగా సాగింది. కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉత్సవ మూర్తులను చిన్నరథంపై ఉంచి పురవీధులలో మేళతాళాలతో వైభవంగా ఊరేగించారు. స్థానిక అమరేశ్వరా స్నానఘాట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపైన స్వామివారి ఉత్సవ మూర్తులను ఉంచి వేద పండితులు ప్రత్యేకహారతి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పడవను హంసవాహనంలా, రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించిన ప్రత్యేక వేదికపై స్వామివార్లను ఉంచి కృష్ణానది అలల తరంగాలపై కన్నుల పండువగా స్వామివారి తెప్పోత్సవం నిర్వహించారు. – అమరావతి

కన్నుల పండువగా సత్యదేవుని గిరి ప్రదక్షిణ

కార్తీక పౌర్ణమి సందర్భంగా కాకినాడ జిల్లా అన్నవరంలోని సత్యదేవుని గిరి ప్రదక్షిణ బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 గంటలకు పల్లకీ మీద, మధ్యాహ్నం రెండు గంటలకు ప్రచార రథం మీద సత్యదేవుని గిరి ప్రదక్షిణ కొనసాగింది. రెండు లక్షలకు పైగా భక్తులు ఈ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. దీంతో అన్నవరం జన సంద్రంగా మారింది. 8.5 కిలోమీటర్ల మేర ఈ ప్రదక్షిణ కొనసాగింది. గిరి ప్రదక్షిణకు తరలివచ్చిన భక్తుల కారణంగా అన్నవరం జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు గంటల తరబడి అంతరాయం కలిగింది. గిరి ప్రదక్షిణ అనంతరం భక్తులు సత్యదేవుని దర్శించారు. మంగళవారం రాత్రి నుంచే భక్తులు సత్యదేవుని ఆలయానికి చేరుకోవడం ప్రారంభించారు. బుధవారం సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగింది. రికార్డు స్థాయిలో బుధవారం 9,800 సత్యదేవుని వ్రతాలు నిర్వహించారు. – అన్నవరం

జనగణన పారదర్శకంగా నిర్వహించాలి

రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ జె.నివాస్

భీమునిపట్నం (విశాఖ): జనాభా గణన అనేది అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమమని, దీనిని ఎంతో పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ జె. నివాస్ అన్నారు. భీమిలి మున్సిపల్ పరిధిలోని 2, 3 వార్డుల్లో ఈనెల 10 నుంచి 30 వరకు జనగణనపై ట్రయల్ నమోదు కార్యక్రమం జరగనుంది. ఈ నేపథ్యంలో ఎంపిక చేసిన సచివాలయ సిబ్బందికి ఈ ప్రక్రియను ఏ విధంగా నిర్వహించాలనే దానిపై భీమిలీ ఎంపీడీఓ, జోనల్ కార్యాలయాల్లో బుధవారం అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ.. 2011లో జనగణన కార్యక్రమం జరిగిందని, ఇప్పుడు మళ్లీ వచ్చే ఏప్రిల్ 26 నుంచి ప్రారంభమవుతుందన్నారు. దీనికి సంబంధించి ఇప్పుడు ట్రయల్ కింద ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

భక్తులతో కోటప్ప కొండ కిటకిట

త్రికోటేశ్వరుణ్ణి దర్శించుకున్న వేలాది మంది భక్తులు



నరసరావుపేట రూరల్: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ బుధవారం భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రం నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులు త్రికోటేశ్వరుడిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున నాలుగు గంటలకు స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాన్ని అర్చకస్వాములు వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణంలోని క్యూలైన్‌లు కిక్కిరిశాయి. ఉచిత, ప్రత్యేక, శీఘ్ర, అభిషేక దర్శన క్యూలైన్‌ల ద్వారా భక్తులను దర్శనం కల్పించారు. అభిషేకాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఆలయం వెనుక ఉన్న రావి చెట్టు, మహానందీశ్వరుడు, ఉసిరి చెట్టు వద్ద మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. నాగేంద్రుని పుట్ట, ధ్యానశివుడు విగ్రహాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. సోపాన మార్గంలో భక్తులు మెట్లపూజ చేసుకుంటూ కొండమీదకు చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఈవో డి.చంద్రశేఖరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. నరసరావుపేట నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు నడిపింది. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ఘాట్‌రోడ్డు టోల్ గేట్ వద్దనే వాహనాలను నిలిపివేసి విడతల వారీగా కొండపైకి పంపారు.

వైభవం... గంధోత్సవం

కడప పెద్దదర్గాలో ఉరుసు ఉత్సవాలు ప్రారంభం

కడప సెవెన్‌రోడ్స్: కడప పెద్దదర్గాలో ప్రధాన ఉరుసు ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ సాహెబ్ బుధవారం రాత్రి తన నివాసం నుంచి గంధ కలశాన్ని తీసుకుని వివిధ దర్గాల పీఠాధిపతులు, గురువులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన పండితులు, శిష్య బృందాలతో దర్గా వద్దకు చేరుకున్నారు. అక్కడి హజరత్ సూఫీ సర్ మస్తాని చిల్లాకష్ ఖ్వాజా సయ్యద్‌షా ఆరీఫుల్లా మహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్తివుల్ ఖాద్రీ వారి మజార్ వద్ద ఫాతెహా నిర్వహించి గంధాన్ని సమర్పించారు. అంతకుముందు మలంగ్‌షాను పీఠంపై ఆశీనులు గావించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఖవ్వాలీ కచేరీ భక్తులను ఆకట్టుకుంది. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో దర్గా పరిసరాల్లోని రోడ్లన్నీ రద్దీగా మారాయి.

దుర్గమ్మ సేవలో జస్టిస్ శ్రీనివాసరెడ్డి

ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాసరెడ్డి బుధవారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందచేయగా, ఆలయ ఏఈవో వెంకటరెడ్డి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందచేశారు. అనంతరం జస్టిస్ శ్రీనివాసరెడ్డి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న కోటి దీపోత్సవంలో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. మల్లేశ్వర స్వామిని దర్శించుకుని, అనంతరం సహస్ర దీపార్చన, ఊంజల్ సేవలో పాల్గొన్నారు. – ఇంద్రకీలాద్రి (విజయవాడపశ్చిమ)

'టీటీడీ పరకామణి'పై సీఐడీ విచారణ షురూ

తిరుపతి క్రైం: తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) పరిధిలోని పరకామణి వ్యవహారాలపై విచారణ ప్రారంభమైంది. సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్ ఆదేశాల మేరకు 20 మంది అధికారులతో కూడిన ప్రత్యేక సీఐడీ బృందం బుధవారం తిరుపతికి చేరుకుంది. ఈ వ్యవహారంలో అప్పటి అధికారులు, బోర్డు సభ్యులు, పోలీసు అధికారులు, ఇతర సిబ్బందిని ప్రశ్నించనున్నట్లు అయ్యన్నార్ తెలిపారు. 20 మంది అధికారులను ఐదు ప్రత్యేక బృందాలుగా విభజించి ఈ కేసు దర్యాప్తు చేపట్టనున్నారు. పరకామణి అధికారుల బాధ్యతలు, జీయర్ వ్యవస్థ పాత్ర వంటి కీలక అంశాలపై వీరు దృష్టిసారిస్తారు. ఈ కేసు దర్యాప్తును డిసెంబరు 2లోపు పూర్తిచేసి, సమగ్ర నివేదికను హైకోర్టులో సమర్పించనున్నట్లు సీఐడీ చీఫ్ తెలిపారు. పరకామణికి సంబంధించిన ఏ చిన్న సమాచారం ఉన్నా, 9440700921 నంబరుకు లేదా adgcid@ap.gov.in ఈ–మెయిల్ ఐడీకి అందించాలని రవిశంకర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచండి

వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచండి

- కార్యక్రమం జరిగే శుక్రవారం నాడు సెలవులు సైతం రద్దు
- సచివాలయాల ఉద్యోగులకు ప్రభుత్వం ఆదేశం
- ఆత్మగౌరవాన్ని మంట గలిపే నిర్ణయమంటూ ఉద్యోగ సంఘాల ఆగ్రహం

సాక్షి, అమరావతి: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రతి శుక్రవారం ఇంటింటికీ తిరిగి వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రజల్లో అవగాహన పెంచుతూ కరపత్రాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెల 7వ తేదీ నుంచే ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఉధృతంగా నిర్వహించాలంటూ ప్రభుత్వం స్పష్టం చేసింది. గ్రామ వార్డు సచివాలయ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ బుధవారం అన్ని జిల్లాల కలెక్టర్లకు ఈ మేరకు ఒక సర్క్యులర్ జారీ చేశారు.

సర్క్యులర్‌లో ముఖ్యాంశాలు..

- ప్రతి శుక్రవారం జరిగే కార్యక్రమంలో తప్పనిసరిగా పాల్గొనాలి.
- ఇంటింటికీ వెళ్లినప్పుడు వాట్సాప్ ద్వారా ప్రభుత్వ సేవలు ఎలా పొందాలో ఆయా కుటుంబ సభ్యులకు ప్రత్యక్షంగా తెలియజేయాలి.
- ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను అందజేయాలి.
- ఈ కార్యక్రమం సమర్థవంతంగా అమలు చేసేందుకు ఉద్యోగులు అత్యవసర వైద్య అవసరాలు మినహా శుక్రవారం సెలవు తీసుకోకూడదు.
- గ్రామ సచివాలయాల్లో సంబంధిత పంచాయతీ కార్యదర్శి, వార్డు సచివాలయాల్లో వార్డు అడ్మిన్ సెక్రటరీలు సచివాలయ స్థాయిలో ఈ ప్రచార కార్యక్రమాన్ని సమన్వయం చేసుకోవాలి.
- వారి పరిధిలో కార్యక్రమ నిర్వహణకు సంబంధించిన వివరాలను నిర్ణీత ఫార్మాట్‌లో 8వ తేదీలోపు రాష్ట్ర కార్యాలయానికి పంపాలి.

వేధింపులే...

కూటమి ప్రభుత్వం మరోసారి గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల ఆత్మగౌరవాన్ని మంట గలిపే నిర్ణయం తీసుకుందంటూ ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. వారం వారం ఇంటింటికీ వెళుతూ కరపత్రాలు పంపిణీ చేయాలని ఆదేశించడం వేధించడమేనని అంటున్నాయి. గత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ వ్యవస్థపై పూర్తి వ్యతిరేకతతో ఉద్యోగుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడం, ఈ వ్యవస్థను నిర్వీర్యం చేయడం లక్ష్యంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయని విమర్శిస్తున్నాయి. 'గత ప్రభుత్వం తీసుకొచ్చిన వ్యవస్థ' అన్న కారణంగా ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థకు కనుమరుగు చేసిన ప్రభుత్వం, తాజాగా సచివాలయాల వ్యవస్థను సైతం పొగబెడుతున్నట్లు కనబడుతోందన్నాయి. పెండింగ్ సమస్యల పరిష్కారంతో పాటు ఉద్యోగుల ఆత్మగౌరవానికి భంగం కలగని రీతిలో ప్రభుత్వం అప్పగించే విధులు ఉండాలని కోరుతూ గ్రామ వార్డు సచివాలయాల ఉద్యోగులు సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 5 వరకు వివిధ రూపాల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తాజా సర్క్యులర్ జారీ చేయడం చర్చనీయాంశమైంది. కాగా, ఐదు వివిధ అంశాలకు సంబంధించిన సర్వేలు, సమాచారం కోసం జిల్లా అధికారులు బుధవారం గంటగంటకూ సచివాలయ ఉద్యోగులకు ఫోన్లు చేయడంసైతం ఉద్యోగుల్లో చర్చనీయాంశమైంది. ఇది వేధింపులుకాక, మరేమిటని వారు ప్రశ్నిస్తున్నారు.

'తేమ' ఎక్కువగా ఉన్నా ధాన్యం కొనుగోలు చేస్తాం: మంత్రి నాదెండ్ల

సాక్షి, అమరావతి: ఖరీఫ్ ధాన్యం సేకరణలో తేమ శాతం ఎక్కువగా ఉన్నా కొనుగోలు చేస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. బుధవారం విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఖరీఫ్‌లో 85 లక్షల టన్నుల దిగుబడి అంచనా వేశామని.. 51 లక్షల టన్నుల ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేశామని చెప్పారు. ధాన్యం విక్రయించిన రైతులకు రోజుకు నాలుగు స్లాట్‌లలో చెల్లింపులు చేస్తామన్నారు. రైతు ధాన్యం విక్రయించిన రెండు గంటల్లోనే నగదు జమయ్యేలా చర్యలు చేపట్టామన్నారు. 4,041 రైతు సేవా కేంద్రాలు, 3,803 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.12,200 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. వాట్సాప్ ద్వారా రైతులు ధాన్యం సేకరణకు షెడ్యూల్ చేసుకోవచ్చన్నారు. గత అనుభవాల దృష్ట్యా ఆరు కోట్ల గోనె సంచులు సిద్ధం చేశామన్నారు. కౌలు రైతులకు 50 వేల టార్పాలిన్లను ఉచితంగా అందిస్తున్నామన్నారు. ఎన్యుమరేషన్ చేసిన సర్వే నంబర్ల నుంచి కూడా ధాన్యం కొనుగోలు చేస్తామని చెప్పారు.

ఇరుక్కున్న పవర్‌చానల్ క్రస్ట్‌గేటు

నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ యూనిట్‌లో నిలిచిన విద్యుదుత్పత్తి

ఐదు రోజులకు సుమారు రూ.కోటి ఆర్థిక నష్టం

క్రస్ట్‌గేటును పరిశీలిస్తున్న ఇంజనీర్లు, గజ ఈతగాళ్లు

సత్రశాల(రెంటచింతల): నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో ఒక పవర్ చానల్ క్రస్ట్‌గేటు నదిలో ఇరుక్కుపోవడంతో ఒక యూనిట్లో విద్యుదుత్పత్తి తాత్కాలికంగా నిలిచింది. దీనివల్ల సుమారు రూ.కోటి ఆర్థిక నష్టం జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చిది. ఇక్కడి విద్యుత్ ప్రాజెక్టులో నిత్యం రెండు యూనిట్ల ద్వారా 50 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుంది. అక్టోబర్ 31న ఒక పవర్ చానల్ క్రస్ట్‌గేటు నదిలో ఇరుక్కుపోవడంతో విద్యుత్ ప్రాజెక్టులోని ఒక యూనిట్ ద్వారానే 25 మెగావాట్ల విద్యుత్ ఉత్పాదన చేపడుతున్నారు. దీంతో 25 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగిపోవడంతో రోజుకు సుమారు రూ. 20 లక్షల వరకు ఏపీ జెన్‌కోకు నష్టం వాటిల్లినట్లు అధికారులు చెబుతున్నారు. ఐదు రోజులకు రూ.కోటి ఆర్థిక నష్టం జరగిందని పేర్కొన్నారు. నదిలో అడుగుభాగాన తుప్పుపట్టిన గేటు ఇరుక్కుపోయి ఈ పరిస్థితి దాపురించింది. ఐదు రోజులుగా ఇంజినీర్లు గజ ఈతగాళ్లను నదిలో అడుగుభాగానికి గేటును హైడ్రాతో పైకి తీయడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు. ఈ పనులను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షిస్తున్నారు. సుమారు 30 టన్నుల బరువు, 11 మీటర్ల ఎత్తు కలిగిన క్రస్ట్‌గేటును నదిలోంచి వెలికితీయడానికి అనుభవం కలిగిన సాంకేతిక నిపుణుల సూచనలు తీసుకుంటున్నారు. ముందు గేటును మూసివేసి ఆ గేటు పరిధిలో ఉన్న నీటిని ఇంజిన్ల సహాయంతో తొలిగించారు. నెల్లూరు నుంచి వచ్చిన గజ ఈత గాళ్లు, సిబ్బంది నది అడుగు భాగానికి వెళ్లి తుప్పుపట్టిన గేటు రాడ్లను గ్యాస్‌కట్టర్ల సహాయంతో తొలిగిస్తున్నట్టు ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, ఈఈ నాగరాజు తెలిపారు.

సీఎం చంద్రబాబుది ప్రచార ఆర్భాటమే

- ప్రజలకు ఆయన చేసిందేమీ లేదు
- చంద్రబాబు పాలనపై అన్నివర్గాల ప్రజలు తీవ్ర అసహనంతో ఉన్నారు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీశ్‌కుమార్‌రెడ్డి

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబుది ప్రచార ఆర్భాటమే తప్ప ప్రజలకు చేసిందేమీ లేదని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్వీ సతీశ్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. ఉద్యోగులు, రైతులు సహా అన్నివర్గాల ప్రజలు చంద్రబాబు పాలనపై తీవ్ర అసహనంతో ఉన్నారన్నారు. బుధవారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. మోంథా తుపాను కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతే వారిని ఆదుకోవాల్సిన సీఎం చంద్రబాబు లండన్ చెక్కేశారన్నారు. విదేశీ పెట్టుబడుల పేరుతో నారా లోకేశ్ క్రికెట్ స్టేడియాల చుట్టూ తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. ఇలాంటి వీళ్లు ప్రజా సమస్యలు పరిష్కరించామని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. విజయవాడ, విశాఖలో విలువైన ప్రభుత్వ భూములను లులు మాల్‌కి అప్పజెప్పేశారని, గూగుల్ డేటా సెంటర్ పేరుతో 1.80 లక్షల ఉద్యోగాలిస్తామంటూ తండ్రీకొడుకులిద్దరూ మార్కెటింగ్ చేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. మంత్రి లోకేశ్‌ను ఆహా ఓహో అంటూ ఆకాశానికి ఎత్తడమే పనిగా పెట్టుకున్న ఎల్లో మీడియా 4 గంటల్లో 4 వేల అర్జీలు తీసుకుని సమస్యలు పరిష్కరించారని చెప్పడం లాజిక్‌కి కూడా అందకుండా ఉందని ఎద్దేవా చేశారు. ప్రజా సమస్యలపై ఫోకస్ పెట్టాల్సింది పోయి రాష్ట్రంలోని కొన్ని మీడియా చానళ్లు చంద్రబాబు, లోకేశ్‌ను పొగడటంలో పోటీ పడిపోతున్నాయన్నారు. 4 వేల మంది అర్జీదారుల్ని క్యూలో నిలబెట్టి వారి చేతుల్లో నుంచి పేపర్లు లాక్కునే పనిలో ఉన్నా 4 గంటలు సరిపోదన్నారు. అలాంటిది ప్రజలిచ్చిన వినతులు చదివేదెప్పుడు, వారు చెప్పింది వినేదెప్పుడు, సంబంధిత అధికారులకు వాటి గురించి ఆదేశాలిచ్చేదెప్పుడు, అవి పరిష్కారానికి నోచుకునేదెప్పుడు అని ప్రశ్నించారు. అవన్నీ సాధ్యం కాదని తెలిసీ ఎల్లో మీడియా చానళ్లు లోకేశ్‌ని జాకీలేసి లేపుతున్నాయని ఎద్దేవా చేశారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చిన చంద్రబాబు ఆ హామీని ఇంతవరకు నెరవేర్చకపోగా.. ఉన్న పింఛన్లను పీకేస్తున్నారని అన్నారు. 20 లక్షల కొత్త ఉద్యోగాలిస్తామని, లేదంటే నిరుద్యోగులందరికీ నెలకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500 చొప్పున ఏడాదికి రూ.18 వేల చొప్పున ఇస్తామని ఎందుకు మాట తప్పారని నిలదీశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక విద్యార్థులు పడుతున్న అవస్థలు అన్నీ ఇన్నీ కాదన్నారు.

చంద్రబాబు ప్రాపకం కోసం ఆదినారాయణరెడ్డి తహతహ

జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే సీహెచ్ ఆదినారాయణరెడ్డి చంద్రబాబు ప్రాపకం కోసం తహతహలాడుతున్నారని సతీశ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. వైఎస్ కుటుంబం పేరు చెప్పుకుని రాజకీయాల్లోకి వచ్చిన ఆయన ఆ తర్వాత మంత్రి పదవి కోసం టీడీపీలోకి వెళ్లారని ధ్వజమెత్తారు. మాజీ సీఎం వైఎస్ జగన్ వ్యక్తిత్వాన్ని హననం చేయడం ద్వారా చంద్రబాబుకు దగ్గరై ఫ్లైయాష్ కాంట్రాక్టు దక్కించుకోవాలన్నదే ఆదినారాయణరెడ్డి అసలు అజెండా అని స్పష్టం చేశారు. వైఎస్ జగన్‌ను కడపకు రానివ్వమని చెబుతున్న ఆదినారాయణరెడ్డి జమ్మలమడుగులో ఇప్పుడు ఎన్నికలు నిర్వహిస్తే ఎంపీటీసీ స్థానాన్ని కూడా గెలవలేరని స్పష్టం చేశారు. అవకాశాల కోసం పార్టీలు మారే మనిషి ఇష్టానుసారం మాట్లాడితే ప్రజలు చూస్తూ ఊరుకోరనే విషయాన్ని ఆది గుర్తుంచుకోవాలన్నారు.

సుదర్శన్ పట్నాయక్ గిన్నిస్ రికార్డ్

భువనేశ్వర్: ప్రముఖ సైకత శిల్పి, పద్మశ్రీ అవార్డు గ్రహీత సుదర్శన్ పట్నాయక్ గిన్నిస్ బుక్ రికార్డు సృష్టించారు. కార్తీక పూర్ణిమను పురస్కరించుకుని తీర్చిదిద్దిన వ్యాపార నావ సైకత శిల్పంతో ఆయన ఈ రికార్డు నెలకొల్పారు. ఈ శిల్పం రూప కల్పనలో 12,000 వక్కలు, 500 టెంకాయలు, 1,100 ప్రమిదలతో కటక్ మహానది తీరంలో సుదర్శన్ పట్నాయక్ ఈ శిల్పాన్ని తీర్చిదిద్దారు.

ANDHRA PRADESH GRAMEENA BANK
(Scheduled Bank owned by Government)
HEAD OFFICE : GUNTUR

NOTIFICATION

Applications are invited for the position of **Financial Literacy Counsellors (FLCs)** on contract basis at various Financial Literacy Centres (FLCs) of the Bank across Andhra Pradesh. For complete details regarding eligibility criteria, remuneration, application format, and other terms and conditions, please visit the Bank's website: **https://apgb.bank.in/notifications**

Place : Guntur, AP — General Manager-FI,
Date : 05.11.2025 — Head Office, Guntur

తిరుమల తిరుపతి దేవస్థానములు: తిరుపతి
బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సర్జరీ రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ ఫర్ ది డిజేబుల్డ్ (BIRRD) ట్రస్ట్ హాస్పిటల్

BIRRD ట్రస్ట్ హాస్పిటల్, TTD, తిరుపతికి టెండరు ID నం.860649 (NIT Roc.No.:TTD-104021(31)24/2025-BIRRD-TTD ప్రకారం, ఆపరేషన్ థియేటర్ కొరకు ఐదు సంవత్సరాల వారంటీ కాలంతో మరియు వారంటీ కాలం ముగిసిన తరువాత CAMC ఐదు సంవత్సరాలతో మూడు నంబర్లు ఇమేజ్ ఇంటెన్సిఫయర్ 2D C-Arm ఎక్విప్‌మెంట్స్ సేకరణ కొరకు ఇ-టెండర్లు కోరబడుతున్నవి. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది & సమయం: 06-11-2025న ఉ.10.00గం.కు. బిడ్ దాఖలు ముగింపు తేది మరియు సమయం: 21-11-2025న మ.3.00గం.కు. మరిన్ని వివరాల కొరకు దర్శించండి: http://tender.apeprocurement.gov.in లేదా www.tirumala.org
TTD-40021/10/2025-PRO SEC(Adv.No.277), Dt: 05-11-2025 — ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

న్యూయార్క్ మేయర్‌గా మమ్దాని

తల్లిదండ్రులు, భార్యతో న్యూయార్క్ సిటీ కొత్త మేయర్ జొహ్రాన్ మమ్దాని

చరిత్ర సృష్టించిన భారతీయ అమెరికన్ యువకుడు

తొలి ముస్లిం, పిన్నవయస్కుడైన మేయర్‌గా రికార్డు

- 50 శాతానికి పైగా ఓట్లతో జయకేతనం
- అధ్యక్షుడు ట్రంప్‌కు గట్టి షాక్
- ట్రంప్ మద్దతిచ్చిన ఆండ్రూ కుమోకు పరాభవం

న్యూయార్క్: భారతీయ–అమెరికన్, డెమొక్రటిక్ పార్టీ నేత జొహ్రాన్ మమ్దాని(34) చరిత్ర సృష్టించారు. ప్రపంచ వాణిజ్య రాజధానిగా గుర్తింపు పొందిన న్యూయార్క్ నగర మేయర్‌గా ఘన విజయం సాధించారు. న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన మొట్టమొదటి ముస్లిం మతస్థుడిగా, దక్షిణాసియా మూలాలున్న తొలి వ్యక్తిగా, అత్యంత పిన్నవయసుడిగా రికార్డుకెక్కారు. మంగళవారం రాత్రి ఎన్నికల ఫలితాలు వెలువడ్డాయి. ప్రఖ్యాత బాలీవుడ్ దర్శకురాలు, పంజాబీ హిందూ మీరా నాయర్ కుమారుడైన మమ్దాని న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో మాజీ గవర్నర్, స్వతంత్ర అభ్యర్థి ఆండ్రూ కుమో, రిపబ్లికన్ నామినీ కర్టిస్ స్లివాను సునాయాసంగా ఓడించారు. 50 శాతానికి పైగా ఓట్లతో జయకేతనం ఎగురవేశారు. హోరాహోరీగా సాగిన ఈ ఎన్నికల్లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు గట్టి షాక్ తగిలింది. ట్రంప్ అండతో బరిలోకి దిగిన ఆండ్రూ కుమో ఓటమి పాలయ్యారు. ఆయనకు 41 శాతం ఓట్లే లభించాయి. కర్టిస్ స్లివాకు కేవలం ఏడు శాతం ఓట్లు రావడం గమనార్హం. మమ్దాని అధ్యక్షుడిగా ఎన్నికైతే న్యూయార్క్‌కు కనీస అవసరాలకు సరిపడినంత మాత్రమే నిధులు కేటాయిస్తానని ట్రంప్ ప్రకటించారు. పైగా మమ్దాని కమ్యూనిస్టు అని, ఆయనకు ఓటు వేయొద్దని ప్రజలకు స్వయంగా విజ్ఞప్తి చేశారు అయినప్పటికీ జనం మమ్దానికి పట్టం కట్టారు. దాదాపు 20 లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోగా, మమ్దానికి 10,36,051(50.4 శాతం), కుమోకు 8,54,995 (41.6 శాతం), స్లివాకు 1,46,137 (7 శాతం) ఓట్లు లభించాయి.

111వ ప్రథమ పౌరుడు

జొహ్రాన్ మమ్దాని వచ్చే ఏడాది జనవరిలో న్యూయార్క్ 111వ ప్రథమ పౌరుడిగా బాధ్య తలు చేపట్టబోతున్నారు. న్యూయార్క్ మేయర్ ఎన్నిక ప్రపంచవ్యాప్తంగా అందరి దృష్టిని విశేషంగా ఆకర్షించింది. ముస్లిం యువకుడు నెగ్గడం అమెరికన్ల ఆలోచనాధోరణిలో వస్తున్న మార్పునకు ప్రతీక అని రాజకీయ విశ్లేషకులు పేర్కొన్నారు. అంతేకాకుండా డొనాల్డ్ ట్రంప్ విధానాలపై ప్రజాగ్రహానికి ఉదాహరణ అని అంచనా వేస్తున్నారు. ప్రగతిశీల రాజకీయాలకు ప్రజలు పట్టం కట్టారని చెబుతున్నారు. మరోవైపు వర్జీనియా, న్యూజెర్సీ గవర్నర్ ఎన్నికల్లోనూ డెమొక్రటిక్ అభ్యర్థులే విజయం సాధించడం చర్చనీయాంశంగా మారింది. ట్రంప్‌నకు చెందిన రిపబ్లికన్ అభ్యర్థులకు పరాభవం ఎదురైంది.

మమ్దాని

బ్యాలెట్‌పై నా పేరు లేకపోవడం వల్లే..

వాషింగ్టన్: అమెరికా మేయర్ ఎన్నికతోపాటు పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థుల ఓటమిపై అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. బ్యాలెట్‌పై తన పేరు లేకపోవడంతోపాటు ప్రస్తుతం అమల్లో ఉన్న షట్‌డౌన్ కారణంగా తమ పార్టీకి ఓటమి ఎదురైందని అన్నారు. సర్వేలో ఇదే విషయం బహిర్గతమైందని వెల్లడించారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టుచేశారు. అయితే, ఆ సర్వే సంస్థ పేరు వెల్లడించలేదు. అమెరికాలో షట్‌డౌన్ 36వ రోజుకు చేరింది. జనంలో రోజురోజుకీ అసంతృప్తి పెరుగుతోంది. న్యూయార్క్‌తోపాటు వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల ఫలితాలు తమకు అసంతృప్తి కలిగించాయని ట్రంప్ పేర్కొన్నారు. ఈ ఫలితాల నుంచి రిపబ్లికన్ పార్టీ పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. ఎన్నికల్లో సంస్కరణలు రావాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కొన్ని రాష్ట్రాల్లో రిగ్గింగ్ జరిగిందని ఆరోపించారు. మెయిల్–ఇన్ ఓట్లను పక్కనపెట్టారని, ఇది చాలా తీవ్రమైన అంశమని అన్నారు.

చరిత్రకెక్కిన హష్మీ

న్యూయార్క్: హైదరాబాద్ మూలాలున్న అమెరికా రాజకీయ నేత గజాలా హష్మీ సరికొత్త రికార్డు సృష్టించారు. వర్జీనియా రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్‌గా విజయం సాధించారు. ఈ పదవిని అధిరోహించిన తొలి ముస్లిం మహిళగా, తొలి దక్షిణాసియా అమెరికన్‌గా ఆమె చరిత్రకెక్కారు. 61 ఏళ్ల హష్మీ డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేశారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో 54.2 శాతం ఓట్లు సాధించారు. తన ప్రత్యర్థి, రిపబ్లికన్ అభ్యర్థి జాన్ రీడ్‌పై జయభేరీ మోగించారు. ఆమె ప్రస్తుతం వర్జీనియా స్టేట్ సెనేటర్‌గా పని చేస్తున్నారు.

వర్జీనియా గవర్నర్‌గా అబిగేల్

వర్జీనియా రాష్ట్ర గవర్నర్ ఎన్నికల్లో డెమొక్రటిక్ నేత అబిగేల్ స్పాన్‌బర్గర్(46) విజయం సొంతం చేసుకున్నారు. రిబిప్లకన్ అభ్యర్థి విన్‌సమ్ ఎర్ల్–సియర్స్‌ను ఓడించారు. వర్జీనియా తొలి మహిళా గవర్నర్‌గా, అమెరికాలో తొలి నల్లజాతి మహిళా గవర్నర్‌గా అబిగేల్ సరికొత్త ఘనత సాధించారు.

న్యూజెర్సీ గవర్నర్‌గా మైకీ షెరిల్

అమెరికాలో కీలక రాష్ట్రం న్యూజెర్సీ గవర్నర్‌గా మైకీ షెరిల్(53) ఎన్నికయ్యారు. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిగా ఆమె విజయం సాధించారు. మరోవైపు సిన్సినాటీ మేయర్‌గా భారత సంతతికి చెందిన అఫ్తాబ్ పురేవాల్ విజయం సాధించారు. డెట్రాయిట్ తొలి మహిళా మేయర్‌గా ఘనత సొంతం చేసుకున్నారు. అట్లాంటా మేయర్‌గా డెమొక్రటిక్ నాయకు డు ఆండ్రీ డికెన్స్, పిట్స్‌బర్గ్ మేయర్‌గా డెమొక్రటిక్ నేత కోరే ఓ.కానర్ విజయం సాధించారు.

ట్రంప్.. సౌండ్ పెంచుకోండి

- మీకు చెప్పడానికి నాలుగు మాటలున్నాయి
- ధనవంతులు ప్రజలకు జవాబుదారీగా ఉండాలి
- కష్టపడి పనిచేసేవారికి తగిన హక్కులు ఉండాల్సిందే
- వలసదారులపై సాగిస్తున్న దౌర్జన్యాన్ని అడ్డుకుంటాం
- మేయర్‌గా ఎన్నికైన జొహ్రాన్ మమ్దాని స్పష్టీకరణ

న్యూయార్క్: న్యూయార్క్ మేయర్‌గా ఎన్నికైన జొహ్రాన్ మమ్దాని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలపై నిప్పులు చెరిగారు. వలసదారులపై సాగిస్తున్న దౌర్జన్యాన్ని అడ్డుకుంటానని తేల్చిచెప్పారు. రాజకీయ వారసత్వానికి కాలం చెల్లిందని స్పష్టంచేశారు. తన ఎన్నికను అణచివేత, నిరంకుశత్వంపై విజయంగా, ఒక ఆశారేఖగా అభివర్ణించారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చరిత్రాత్మక ప్రసంగం 'ట్రిస్ట్ విత్ డెస్టినీ'ని మమ్దాని ప్రస్తావించారు. చీకటి నుంచి వెలుగులోకి, పాత యుగం నుంచి కొత్త యుగంలోకి ప్రవేశిస్తున్నామని ఉద్ఘాటించారు. ఎన్నికల ఫలితాల అనంతరం మంగళవారం అర్ధరాత్రి బ్రూక్లిన్ పారామౌంట్‌లో మమ్దాని వేలాదిమంది మద్దతుదారులను ఉద్దేశించి ఆవేశపూరితంగా ప్రసంగించారు. భవిష్యత్తు మన చేతుల్లోని ఉందని అన్నారు. రాజకీయ వారసత్వాన్ని, రాజవంశాన్ని కూల్చేశామని చెప్పారు. మార్పు కోసం, కొత్త తరం రాజకీయాల కోసం న్యూయార్క్ సిటీ గొప్ప తీర్పు ఇచ్చిందని ప్రశంసించారు. నూయార్క్‌ను మన జీవనానికి అనుకూలంగా మార్చుకోవడానికి ఈ తీర్పు వచ్చిందన్నారు. ప్రజలకు నిజాయతీగా సేవ చేసే ప్రభుత్వం కోసం తీర్పు లభించిందన్నారు. అభిమానుల హర్షధ్వానాల మధ్య మమ్దాని ఇంకా ఏం మాట్లాడారంటే...

అవినీతి సంస్కృతిని అంతం చేస్తాం

''ఈరోజు మీ ముందుకు రావడం గర్వంగా ఉంది. జవహర్‌లాల్ నెహ్రూ మాటలు గుర్తుచేసుకోవాల్సిన సందర్భం వచ్చింది. ఒక శకం ముగిసినప్పుడు.. పాత శకం నుంచి కొత్త శకం వైపు అడుగులు వేసినప్పుడు.. సుదీర్ఘకాలం అణచివేతకు గురైన ఒక జాతి ఆత్మ తన గళం వినిపించినప్పుడు.. చరిత్రలో ఇలాంటి క్షణాలు చాలా అరుదుగా వస్తాయి. ఈరోజు పాత శకం నుంచి నూతన శకంలోకి ప్రవేశించాం. అందుకే ఈరోజు మనం మాట్లాడుకుందాం. ఎవరూ అపార్థం చేసుకోకుండా స్పష్టంగా, సంకల్పంతో మాట్లాడుకుందాం. వలసదారులతోనే న్యూయార్క్ మరింత శక్తివంతంగా మారుతుంది. ఇకపై వలసదారుడే నగరానికి సారథ్యం వహించబోతున్నాడు. ఒక గొప్ప మార్పునకు మనం కలిసికట్టుగా నాంది పలుకుదాం. అణచివేతను ఎదుర్కొందాం. అంతులేని అధికారం అండతో వలసదారులపై పగబట్టిన డొనాల్డ్ ట్రంప్‌కు బుద్ధి చెబుదాం. డొనాల్డ్ ట్రంప్.. మీరు నా మాటలు వింటున్నారని నాకు తెలుసు. మీకు చెప్పడానికి నాలుగు మాటలున్నాయి. అందుకే సౌండ్ పెంచుకోండి. ధనవంతులు ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందే. ఎందరో ట్రంప్‌లు ప్రజలను అడ్డం పెట్టుకొని అక్రమంగా పైకి ఎదిగారు. ట్రంప్ లాంటి బిలియనీర్లు పన్నులు ఎగవేశారు. పన్ను చట్టాలను ఉల్లంఘించారు. ఇకపై అవినీతి సంస్కృతిని అంతం చేస్తాం. కార్మిక, ప్రజా సంఘాలకు అండగా ఉంటాం. కార్మికుల రక్షణలు మరింత విస్తరింపజేస్తాం. కష్టపడి పనిచేసేవారికి తగిన హక్కులు ఉండాల్సిందే.

ఏ జాతి వారైనా ప్రియమైనవారే..

రాజకీయ అంధకారం నుంచి న్యూయార్క్‌ను వెలుగులోకి నడిపిస్తాం. మేము ప్రేమించేవారందరికీ మేము తోడుగా ఉంటాం. వారు వలసదారులైనా, ట్రాన్స్‌జెండర్లయినా, ఏ జాతి వారైనా మాకు ప్రియమైనవారే. ఓ నల్లజాతి మహిళను ప్రభుత్వం ఉద్యోగం నుంచి డొనాల్డ్‌ట్రంప్ అన్యాయంగా తొలగించారు. ఆ ఒంటరి మహిళ చాలా కష్టాలు పడుతూ బతుకు పోరాటం చేస్తోంది. అందుకే ప్రజల కష్టాలు మా కష్టాలుగానే భావిస్తాం. న్యూయార్క్‌లో అన్ని జాతులకూ సమానమైన ఆదరణ లభిస్తుంది. ఎవరిపైనా ఎలాంటి వివక్ష ఉండదు. నగరంలో ఇస్లామోఫోబియాకు స్థానం లేదు. ముస్లింలు కూడా ఎన్నికల్లో పోటీ చేయొచ్చు, విజయం సొంతం చేసుకోవచ్చు. నేను ఇప్పుడు యువకుడిని. వృద్ధుడిగా మారినా కూడా ముస్లింగానే ఉంటాను. నేనొక డెమొక్రటిక్ సోషలిస్టును. ముస్లింను అయినందుకు క్షమాపణ చెప్పడం నాకు ఇష్టం లేదు. అందుకు నిరాకరిస్తున్నా. నన్ను గెలిపించినందుకు న్యూయార్క్ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా.

ధూమ్ మచాలే ధూమ్

ఇలాంటి రోజు ఒకటి ఎప్పటికీ రాదని చాలా మంది భావించారు. రాజకీయాలు చాలా క్రూరంగా మారాయని అనుకున్నారు. ఆశను కోల్పోయారు. అలాంటి భయాలకు న్యూయార్క్ నేడు సమాధానం చెప్పింది. ఆశారేఖ సజీవంగానే ఉంది. అసాధ్యం సుసాధ్యం అవుతుందని ప్రజలు విశ్వసించడం వల్లే మనం గెలిచాం. వచ్చే ఏడాది జనవరి 1న మేయర్‌గా బాధ్యతలు స్వీకరిస్తా. నా తల్లిదండ్రులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పుకోవాలి. నన్ను తీర్చిదిద్దింది వారే. నా భార్య రమా దువాజీకి కూడా కృతజ్ఞతలు'' అని మమ్దాని పేర్కొన్నారు. ఆయన ప్రసంగిస్తున్న సమయంలో తల్లిదండ్రులు, భార్య అక్కడే ఉన్నారు. ఈ సందర్భంగా బాలీవుడ్ చిత్రం 'ధూమ్'లోని 'ధూమ్ మచాలే ధూమ్' పాట మార్మోగిపోయింది.

వలసదారుడే ప్రథమ పౌరుడు

న్యూయార్క్: జొహ్రాన్ క్వామె మమ్దాని 1991 అక్టోబర్ 18న ఉగాండా రాజధాని కంపాలాలో జన్మించారు. గుజరాతీ ముస్లిం ప్రొఫెసర్ మహమూద్ మమ్దాని, బాలీవుడ్ దర్శకురాలు మీరా నాయర్ ఆయన తల్లిదండ్రులు. జొహ్రాన్ మమ్దానికి ఐదేళ్ల వయసున్నప్పుడు వారి కుటుంబం ఉగాండా నుంచి దక్షిణాఫ్రికాలోని కేప్‌టౌన్‌కు వలస వెళ్లింది. ఆయన కేప్‌టౌన్‌లో సెయింట్ జార్జెస్ గ్రామర్ స్కూల్‌లో ప్రాథమిక విద్య అభ్యసించారు. ఏడేళ్ల వయసున్నప్పుడు కుటుంబంతో కలిసి అమెరికాకు చేరుకున్నారు. మమ్దాని కుటుంబం న్యూయార్క్‌లో స్థిరపడింది. బ్రాంక్స్ హైస్కూల్ ఆఫ్ సైన్స్ నుంచి ఆయన గ్రాడ్యుయేషన్ పూర్తిచేశారు. 2014లో బౌడిన్ కాలేజీ నుంచి ఆఫ్రికన్ స్టడీస్‌లో బ్యాచిలర్ డిగ్రీ స్వీకరించారు. అనంతరం హౌజింగ్ కౌన్సిలర్‌గా పనిచేశారు. న్యూయార్క్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. డెమొక్రటిక్ పార్టీ ప్రచారకర్తగా సేవలందించారు. 2020లో న్యూయార్క్ స్టేట్ అసెంబ్లీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. 2022, 2024లోనూ గెలిచారు. న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో 2024 అక్టోబర్‌లో పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. డెమొక్రటిక్ పార్టీ ప్రైమరీలో మాజీ గవర్నర్ ఆండ్రూ కుమోపై పైచేయి సాధించారు. మమ్దాని 2025 ఫిబ్రవరిలో సిరియన్ ముస్లిం రమా సవాఫ్ దువాజీని వివాహం చేసుకున్నారు. ఆమె యానిమేటర్‌గా, ఇలస్ట్రేటర్‌గా పని చేస్తున్నారు.

ఈసీపై రాహుల్ హైడ్రోజన్ బాంబు

హరియాణాలో 25 లక్షల నకిలీ ఓట్లున్నాయి

- వీటి సాయంతోనే బీజేపీ గెలిచింది
- బ్రెజిలియన్ మోడల్‌కూ ఓట్లు
- 22 సార్లు ఆమె పేరిట ఓటేశారు
- ఈ మోసాన్ని బిహార్‌లోనూ అమలుచేయబోతున్నారు
- ఈసీ, బీజేపీపై నిప్పులు కురిపించిన కాంగ్రెస్ అగ్రనేత

న్యూఢిల్లీ: కేంద్ర ఎన్నిల సంఘంపై, కేంద్ర ప్రభుత్వంపై సాధారణ విమర్శలు చేసే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బుధవారం భారీ హైడ్రోజన్ బాంబు పడేశారు. ఏకంగా పాతిక లక్షల నకిలీ ఓట్లతో, ఈసీ అండదండలతో హరియాణా ఎన్నికల్లో బీజేపీ దొంగమార్గంలో గెలిచిందని రాహుల్ విమర్శించారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను చోరీచేశారని ఆరోపించారు. హరియణాలో బీజేపీ విజయం సాధించేందుకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ఇద్దరు ఎలక్షన్ కమిషనర్లు బీజేపీతో కలిసి పనిచేశారని తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. వీళ్లంతా ప్రధాని మోదీకి భాగస్వాములని వ్యాఖ్యానించారు. ఈ విమర్శల జడివానకు ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం 'ఇందిరా భవన్' వేదికైంది. బుధవారం మీడియా సమావేశంలో రాహుల్ పలు సంచలనాత్మక ఆరోపణలు చేశారు. బిహార్ తొలి దశ పోలింగ్‌కు కొన్నిగంటల ముందు రాహుల్ ఈ విమర్శల జల్లు కురిపించారు.

సీమా.. స్వీటీ.. సరస్వతి..

''హరియాణాలో కాంగ్రెస్ ఖచ్చితంగా గెలుస్తుందని ఐదు వేర్వేరు ఎగ్జిట్ పోల్స్ ఘంటాపథంగా చెప్పాయి. కాంగ్రెస్ 73 చోట్ల గెలిస్తే బీజేపీకి 17 సీట్లే వస్తాయని చెప్పాయి. కానీ బీజేపీ చేసిన ఈ ఓట్ల చోరీ, నకిలీ ఓట్ల దందాతో కాంగ్రెస్ ఓడిపోయింది. బీజేపీ వ్యక్తులు అటు ఉత్తరప్రదేశ్‌లో ఓటేసి తర్వాత హరియాణాలోనూ ఓటేశారు. పాతిక లక్షల ఓట్లు ఉన్నాయనడానికి ఈ బ్రెజిల్ మోడలే ప్రత్యక్ష ఉదాహరణ. ఈమె ఫొటో, వివరాలతో 22 ఓట్లు ఉన్నాయి. సీమా, స్వీటీ, సరస్వతి.. ఇలా 22 పేర్లతో ఉన్న ఓట్లన్నీ ఈమె ఫొటోతో నమోదై ఉన్నాయి. గత ఏడాది ఎన్నికల్లో 10 బూత్‌లలో ఆ ఓట్లన్నీ పోలయ్యాయి. బీజేపీ కార్యకర్తలు నేతలు అటు ఉత్తరప్రదేశ్‌లో ఇటు హరియాణాలో ఓటర్లుగా నమోదయ్యారు. బీజేపీ నేత దాల్చంద్ యూపీ, హరియాణాల్లో ఓటేశారు. మథురలో బీజేపీ సర్పంచ్ ప్రహ్లాద్ అదే పనిచేశారు. ఇలాంటి వాళ్లు వేలల్లో ఉన్నారు. పాల్వాల్ జిల్లా పరిషత్ వైస్ ఛైర్మన్, బీజేపీ నేత 150వ నంబర్ ఇంట్లో ఉంటున్నారు. ఆయన ఇంట్లో ఏకంగా 66 ఓట్లు ఉన్నాయి. ఇంకొకరైతే తన ఇంట్లో 500 మంది ఓటర్లు ఉన్నారని అన్ని ఓట్లను నమోదుచేశాడు. ఇవన్నీ మేం స్వయంగా క్షేత్రస్థాయిలో తిరిగి తెల్సుకున్నవే. ఇక హరియాణా ఎన్నికల చరిత్రలో తొలిసారిగా బ్యాలెట్ ఓట్లు అనేవి వాస్తవ ఓటర్లతో సరిపోలలేదు. ఇలా ఎప్పుడూ జరగలేదు. కాంగ్రెస్ చరిత్రాత్మక విజయాన్ని వ్యవస్థీకృత నేరం ద్వారా ఓటమిగా మార్చేశారు'' అని రాహుల్ ఆగ్రహం వ్యక్తంచేశారు.

మేం అటు పోరాడుతుంటే ఇటు చంపేశారు

''భారత ప్రజాస్వామ్యాన్ని సర్కార్‌చోరీ విధానంతో నాశనంచేశారు. ఈ వినాశనానికి ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) అనేది సరికొత్త ఆయుధంగా దాపురించింది. బిహార్‌లోనూ ఓటు చోరీని మొదలెట్టారు. మేం విపక్ష పార్టీలతో కలసి ఓ వైపు ఎస్ఐఆర్‌పై పోరాటం చేస్తుంటే మరోవైపు ప్రజాస్వామ్యాన్ని కొన్ని శక్తులు చంపేస్తున్నాయి. ఆనాడు హరియాణా ఓట్ల లెక్కింపునకు రెండ్రోజుల ముందు సీఎం నయాబ్ సైనీ ఓ మాట అన్నారు. ఒక వ్యవస్థను సిద్ధంచేశాం . అందుకే మేం గెలవబోతున్నాం అని అన్నారు. అప్పుడే మాకు అనుమానం వచ్చింది. కర్ణాటకలోని మహాదేవపుర, ఆలంద్ నియోజకవర్గాల్లో జరిగిన మోసమే రాష్ట్రస్థాయిలో, జాతీయస్థాయిలో జరుగుతోందని మాకు అర్థమైంది'' అని రాహుల్ వివరించారు.

మోదీ, ఈసీల సారథ్యంలో వ్యవస్థీకృత ఓటు చోరీ

''ప్రధాని మోదీ, ఎలక్షన్ కమిషన్ సంయుక్తంగా వ్యవస్థీకృత ఓటు చోరీ విధానాన్ని తీసుకొచ్చారు. ఈసారి బిహార్ ఎన్నికల్లోనూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసేందుకు దానిని రంగంలోకి దింపుతున్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఈసీ పార్ట్‌నర్‌షిప్ కొనసాగిస్తోంది. వీళ్లంతా మూకుమ్మడిగా దేశ ప్రజాస్వామ్య పునాదులను పెకలిస్తున్నారు. ఓట్ల చోరీని ఓ పరిశ్రమగా మార్చేశారు. పోలింగ్ జరిగే ప్రతి రాష్ట్రానికి దానిని పట్టుకొస్తున్నారు'' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా వేదిక మీదకు రాహుల్ కొందరు బిహారీ ఓటర్లను ఆహ్వానించారు. తన ఒక్కడి ఓటే తీసేశామని అధికారులు చెప్పారని, తీరాచూస్తే గ్రామంలో మరో 187 ఓటర్ల ఓట్లు కూడా గల్లంతయ్యాయని ఆ బిహారీలు చెప్పారు.

మీడియా సమావేశంలో రాహుల్. వెనుక స్క్రీన్‌పై బ్రెజిల్ మోడల్ ఫొటో

ప్రతి 8 ఓట్లలో ఒకటి నకిలీదే

''ఎన్నికలు జరిగే ప్రతి రాష్ట్రంలో ప్రభుత్వ అధికారాన్ని చేజిక్కించుకునే 'ఆపరేషన్ సర్కార్ చోరీ'కి ఈసీ తెరతీసింది. ఇంటి నంబర్ లేని సందర్భాల్లో, నిరాశ్రయులకు మాత్రమే 'జీరో నంబర్' ఇస్తామనేది శుద్ధ అబద్ధం. మా బృందం స్వయంగా క్షేత్రస్థాయిలో తిరిగి లెక్కలేనన్ని లొసుగులను పట్టుకుంది. ఇంటి నంబర్ జీరో అని ఓటరు జాబితాలో ఉన్న వాళ్లెందరో తమ సొంత ఇళ్లలో ఉంటున్నారు. ఇల్లు లేని వాళ్లకు మాత్రమే జీరో నంబర్ కేటాయించామని ఈసీ చెబుతున్న దాంట్లో నిజం లేదు. హరియాణాలో 25,41,144 నకిలీ ఓట్లు ఉన్నాయి. వీటిలో చాలా ఓట్లు రెండు మూడు చోట్ల ఉన్నాయి. అంటే 5,21,619 డూప్లికేట్ ఓట్లు ఉన్నాయి. అడ్రస్‌లేని 93,174 ఓట్లు ఉన్నాయి. ఒక అడ్రస్‌పై వందల ఓట్లున్నాయి. అలాంటివి రాష్ట్ర ఓట్ల జాబితాలో ఏకంగా 19,26,351 ఓట్లు ఉన్నాయి. నకిలీ ఓటర్ల ఫొటోలతో 1,24,177 ఓట్లు సృష్టించారు. హరియణాలోని ప్రతి ఎనిమిది ఓట్లలో ఒకటి నకిలీదే. పాతికలక్షల ఓట్లు అంటే రాష్ట్రంలోని మొత్తం ఓట్లలో 12 శాతం ఓట్లు నకిలీవే. ఒక్క నియోజకవర్గంలో 22,000 ఓట్ల మెజారిటీ అంటేనే చాలా పెద్ద సంఖ్య. అలాంటిది 25 లక్షల ఓట్లు అంటే ఇక లెక్కేసుకోండి. ఎంతటి కుట్ర జరిగిందో. ఈ కారణంగానే గత ఏడాది హరియాణా ఎన్నికల్లో ఎనిమిది స్థానాల్లో కాంగ్రెస్ 22,779 ఓట్ల తేడాతోఓడిపోయింది. ఈ అంకెల గారడీలు చూస్తే నేనే షాక్ అయ్యా. మీ భవిష్యత్తు ఎలా చోరీకి గురవుతోందో జెన్‌జెడ్ యువత ఇకనైనా తెల్సుకోవాలి'' అని రాహుల్ అన్నారు.

అప్పుడెందుకు చెప్పలేదు?

రాహుల్‌కు ఈసీ సూటిప్రశ్న

న్యూఢిల్లీ: బీజేపీతో అంటకాగి హరియాణాలో కాంగ్రెస్ ఓటమికి ప్రధాన ఎన్నికల కమిషన్ కారణమైందంటూ రాహుల్‌గాంధీ చేసిన విమర్శలపై కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీ) వెనువెంటనే స్పందించింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు(బీఎల్ఏ) ఎందుకు ఆనాడే ఈ అభ్యంతరాలను తెలపలేదని ఈసీ ఎదురు ప్రశ్నించింది. హరియాణాలో ఎన్నికల ముందు జరిగిన ఓట్ల సవరణల ప్రక్రియ వేళ కాంగ్రెస్ ఎందుకు ఎలాంటి అభ్యంతరాలు లేవనెత్తలేదని ఈసీ ప్రశ్నించింది. ''గత ఏడాది అక్టోబర్‌లో హరియాణాలో ఎన్నికలు జరిగాయి. అంతకుముందే ఆయా నియోజకవర్గాల్లో డూప్లికేట్ ఓట్లు ఉంటే తక్షణం రాజకీయ పార్టీలు అభ్యంతరాలు తెలిపేందుకు అవకాశం ఇచ్చాం. మరి అప్పుడు కాంగ్రెస్ పార్టీకి చెందిన బూత్ లెవల్ ఏజెంట్లు ఫిర్యాదు చేయకుండా ఏం చేస్తున్నట్లు? ఓట్లేసేటప్పుడు పోలింగ్ కేంద్రాల్లో కూర్చున్న కాంగ్రెస్ ఏజెంట్లు చూస్తూ ఊరుకున్నారా? ఫలానా ఓటు అప్పటికే పోల్ అయినట్లు మీకు అనుమానం వస్తే ఎందుకు వెంటనే అక్కడి అధికారులకు తెలియజేసి అభ్యంతరం చెప్పలేదు? ఓటరు గుర్తింపుపై అనుమానాలుంటే ఎందుకు అధికారులకు సమాచారం ఇవ్వలేదు?'' అని కేంద్ర ఎన్నికల సంఘం ఉన్నతాధికారి రాహుల్‌పై ప్రశ్నల వర్షం కురిపించారు. ''ఇంటి నంబర్ సున్నా ఎందుకు వేశారని, ఈ ప్రక్రియలో తప్పులు ఉన్నాయంటూ రాయ్, హోడల్ నియోజకవర్గాలకు సంబంధించి కేవలం 22 పిటిషన్లు అందాయి. అవన్నీ ఇంకా పంజాబ్, హరియాణా హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. వాస్తవానికి 23 పిటిషన్లు వస్తే ఒకటి ఉపసంహరించుకున్నారు. తన ఆరోపణలకు సంబంధించి పూర్తి, సమగ్ర ఆధారాలను రాహుల్ బయటపెడితే బాగుంటుంది'' అని అధికారి హితవు పలికారు. '' ప్రతి రాష్ట్రంలో డూప్లికేట్ ఓ ట్లు, మృతిచెందిన ఓటర్ల ఓట్లు, వలస వెళ్లిన వారి ఓట్లను తొలగించేందుకు ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వేను మొదలెట్టాం. ఎస్ఐఆర్‌కు రాహుల్ మద్దతు పలుకుతున్నారా? వ్యతిరేకిస్తున్నారా? కనీసం బిహార్‌లో అయినా ఎస్ఐఆర్ వేళ ఎందుకు కాంగ్రెస్ బూత్‌లెవల్ ఏజెంట్లు అభ్యంతరాలు తెలపలేదు?'' అని అధికారి ప్రశ్నించారు.

రాహుల్ అబద్ధాలాడుతున్నారు: హరియాణా సీఎం

నకిలీ ఓట్లతో హరియాణాలో బీజేపీ గెల్చిందని, అందుకే నాయబ్ సింగ్ సైనీ సర్కార్ కొలువుతీరందని రాహుల్ చేసిన విమర్శలపై సైనీ స్పందించారు. '' రాహుల్ అబద్ధాలు చెప్తున్నారు. ఆయన కుటుంబంలో నాలుగు తరాల వాళ్లు దేశాన్ని పరిపాలించారు. అయినాసరే అబద్ధాలు చెప్పే అలవాటు రాహుల్‌కు పోలేదు. ఇక్కడ ఎలాంటి చర్చనీయాంశం లేకపోయినా కాంగ్రెస్ వాళ్లు జనాలను తప్పుదోవ పట్టిస్తారు'' అని సైనీ వ్యాఖ్యానించారు.

నేడే బిహార్ తొలి దశ పోలింగ్

- సర్వం సిద్ధంచేసిన ఈసీ
- 1,314 అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్న 3.75 కోట్ల మంది ఓటర్లు

పట్నా: బిహార్ శాసనసభ ఎన్నికల్లో భాగంగా తొలి దశలో 121 నియోజకవర్గాల్లో హోరాహోరీగా ప్రచారం జరగ్గా నేడు పోలింగ్ అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య మొదలుకానుంది. అధికార ఎన్డీఏ, విపక్షాల మహాగఠ్‌బంధన్ కూటమి అభ్యర్థులు సహా మొత్తం 1,314 అభ్యర్థుల భవితవ్యాన్ని తేల్చేందుకు తొలి దశలో 3.75 కోట్ల మంది ఓటర్లు సిద్ధమయ్యారు. గురువారం మొత్తంగా 45,241 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరగనుంది. వీటిల్లో 36,733 కేంద్రాలు గ్రామీణప్రాంతాల్లో ఉండటం గమనార్హం. గురువారం ఓటేస్తున్న వారిలో 10.72 లక్షల మంది కొత్త ఓటర్లు ఉన్నారు. విపక్షాల ముఖ్యమంత్రి అభ్యర్థి తేజస్వీ యాదవ్, బీజేపీ నేత, ప్రస్తుత డెప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి పోటీచేస్తున్న నియో జకవర్గాల్లోనూ గురువారం తొలిదశలోనే పోలింగ్ జరగనుంది. రాఘోపూర్‌లో హ్యాట్రిక్ కోసం తేజస్వీ కన్నేయగా, 2010లో రబ్రీ దేవిని ఓడించిన బీజేపీ నేత సతీశ్ కుమార్ ఈసారి తేజస్వీని ఓడించాలని తహతహలా డుతున్నా రు. రాఘోపూర్‌లో ఎలాగైనా తేజస్వీని ఓడించాలని జనసురాజ్ పార్టీ వ్యవస్థాపకుడు, గతంలో ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కంకణం కట్టుకున్నారు. పొరుగు నియోజకవర్గంలో తేజస్వీ సోదరుడు తేజ్ ప్రతాప్ సైతం సొంతంగా జశక్తి జనతాదళ్ పార్టీ పెట్టి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. నితీశ్ కుమార్ ప్రభుత్వంలో మంత్రి అయిన విజయ్ కుమార్ సిన్హా సైతం లఖీసరాయ్‌లో నాలుగోసారి గెలుపుపై గంపెడాశలు పెట్టుకు న్నారు. జనసురాజ్ పార్టీ కార్యకర్త హత్య కేసులో అరెస్టయిన జేడీయూ అభ్యర్థి అనంత్ సింగ్ పోటీచేస్తున్న మొఖానాలోనూ గురువారమే పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఆర్జేడీ తరఫున వీణాదేవి పోటీచేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘట నలు జరక్కుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారులు, పోలీసులు తెలిపారు.

ఎన్నికల సామాగ్రిని తీసుకుంటున్న ఎన్నికల అధికారులు

ఎన్నికల వేళ ఏకమైన వామపక్షాలు

నేపాల్‌లో జట్టుకడుతున్న 10 పార్టీలు

కాఠ్మండు: నేపాల్‌లో మార్చి ఐదో తేదీన సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గెలుపే లక్ష్యంగా 10 లెఫ్ట్ పార్టీలు విలీనం కావాలని నిర్ణయించుకున్నాయి. విలీనం కాబోతున్న పార్టీల్లో సీపీఎన్(మావోయిస్ట్ సెంటర్), సీపీఎన్(యునిఫైడ్ సోషలిస్ట్) సైతం ఉన్నాయి. కాఠ్మండులోని భ్రికుతిమండప్‌లో బుధవారం ఈ మేరకు పది పార్టీలకు చెందిన కీలక నేతలు హాజరయ్యారు. నేపాల్‌లో దశబ్దాల తరబడి పోరాడిన మావోయిస్ట్ సెంటర్ పార్టీ ఇకపై విలీనం తర్వాత తన పేరులోని మావోయిస్ట్ అనే పదాన్ని తొలగించుకోనుంది. దేశంలో అవినీతి, వారసత్వ రాజకీయలు, రాజకీయ అస్థిరతలతో విసిగిపోయిన జెన్ జెడ్ యువత సారథ్యంలో ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమ ధాటికి ప్రభుత్వం కుప్పకూలడం తెల్సిందే. ఇదే ఊపులో జెన్ జెడ్ సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడితే తమ ఉనికి ప్రశ్నార్థకమవుతుందన్న అంచనాలతో 10 లెఫ్ట్ పార్టీలు ఇలా ఒకే రాజకీయ పార్టీగా అవతరిస్తుండటం గమనార్హం. కొత్త పార్టీకి నేపాలీ కమ్యూనిస్ట్ పార్టీ అని పేరు పెట్టనున్నారు. ఎన్నికల చిహ్నంలో ఐదు నక్షత్రాల గుర్తు ఉండనుంది. సీపీఎన్ నేత, మాజీ ప్రధాన మంత్రి పుష్పకమల్ దహాల్ ప్రచండ కొత్త పార్టీకి కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తారు.

రైలు ఢీకొని ఆరుగురు మహిళల మృతి

- పట్టాలు దాటుతుండగా ప్రమాదం
- చునార్ రైల్వే స్టేషన్‌లో విషాదం

మిర్జాపూర్: ఆగిన రైలు నుంచి ప్లాట్‌ఫాం వైపు కాకుండా.. వ్యతిరేక దిశలో దిగి పట్టాలు దాటుతున్న ఆరుగురు మహిళలు.. మరో రైలు ఢీకొనడంతో మృతి చెందారు. ఉత్తరప్రదేశ్‌లోని చునార్ రైల్వే స్టేషన్‌లో బుధవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో జరిగిన ఈ సంఘటన వివరాలివి. ప్రయాణికులు చోపాన్ ఎక్స్‌ప్రెస్ నుండి పట్టాలపైకి దిగినప్పుడు హౌరా నుండి కల్కాజీ వైపు వస్తున్న నేతాజీ ఎక్స్‌ప్రెస్ రైలు వారిని ఢీకొందని ఎన్‌సీఆర్ ప్రయాగ్‌రాజ్ డివిజన్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ అమిత్ సింగ్ తెలిపారు. 'ప్రయాణికులు కార్తీక పౌర్ణమి స్నానం కోసం మిర్జాపూర్ వచ్చారు. ఫుట్‌ఓవర్ బ్రిడ్జ్ అందుబాటులో ఉన్నప్పటికీ, వారు పట్టాలపై నుంచి ప్లాట్‌ఫాం దాటుతున్నప్పుడు ఈ దుర్ఘటన జరిగింది'.. అని రైల్వేశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. మృతులను సవిత (28), సాధన (16), శివ కుమారి (12), అంజు దేవి (20), సుశీల దేవి (60), కళావతి (50)గా ప్రభుత్వ రైల్వే పోలీస్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర సింగ్ తెలిపారు. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. వెంటనే సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సంఘటనపై కేంద్ర మంత్రి, స్థానిక ఎంపీ అనుప్రియ పటేల్ ట్విట్టర్లో సంతాపం తెలిపారు. బిలాస్‌పూర్ (ఛత్తీస్‌గఢ్): ఛత్తీస్‌గఢ్‌లోని బిలాస్‌పూర్ రైల్వే స్టేషన్ సమీపంలో ప్యాసింజర్ రైలు గూడ్స్ రైలును ఢీకొన్న ఘటనలో మృతుల సంఖ్య 11కి పెరిగిందని అధికారులు బుధవారం తెలిపారు. రైలు శిథిలాలలో పలు మృతదేహాలు ఇరుక్కుపోయాయి. దీంతో సహాయక సిబ్బంది ప్యాసింజర్ రైలు బోగీలను కోసి, మృతదేహాలను వెలికి తీశారని ఒక రైల్వే అధికారి తెలిపారు.

సాక్షి
గుంటూరు
గురువారం । 6 । నవంబర్ । 2025

నాదెండ్లలో జ్వాలాతోరణం

నాదెండ్ల: స్థానిక గంగాపార్వతీ సమేత మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో కార్తిక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం, అఖండ దీపారాధన ఘనంగా నిర్వహించారు.

వీరభద్రస్వామి కల్యాణ వేడుకలు

నకరికల్లు: కుంకలగుంటలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కల్యాణ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

భక్తులకు అన్నదానం

మాచర్ల: పట్టణంలోని వివిధ దేవాలయాల్లో బుధవారం కోటి దీపోత్సవంలో భాగంగా పూజలు, అన్నదానం జరిగాయి. శ్రీ వెంకటేశ్వర ఆలయంలో శ్రీనివాసులు పాల్గొన్నారు.

శివసన్నిధికి కార్తిక శోభ

- హరోంహర నామస్మరణతో మార్మోగిన పెదకాకాని శివాలయం
- కార్తిక పౌర్ణమి భక్తులతో కిటకిటలాడిన ప్రాంగణం
- దీపాలు వెలిగించి పూజలు చేసిన భక్తులు
- ఘనంగా కోటి దీపోత్సవం, జ్వాలా తోరణం
- అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు

ఆలయ ప్రాంగణంలో భక్తుల రద్దీ

పెదకాకాని: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న శ్రీభ్రమరాంబ శ్రీ మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తులతో కిటకిటలాడింది. శివాలయంలో బుధవారం తెల్లవారుజామున సుప్రభాతసేవతో పూజ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. కార్తిక పౌర్ణమి కావడంతో వేకువజామున భక్తులు యజ్ఞాల బావి వద్ద స్నానాలు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ఓం నమఃశివాయ అంటూ శివనామస్మరణ చేయడంతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఆయా ప్రాంతాల నుంచి ఆలయానికి చేరుకున్న భక్తులు ప్రాంగణంలో కార్తిక దీపాలు వెలిగించారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. పొంగళ్లు పొంగించి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ డిప్యూటీ కమిషనర్ గోగినేని లీలా కుమార్ పర్యవేక్షణలో భక్తులకు అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. సకాలంలో స్వామివారి దర్శనం జరిగేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు పాలు, మజ్జిగ, తాగునీరు అందించారు. అంతరాలయ దర్శనాలు, అభిషేకాలు, ఏకవారాభిషేక పూజలు, అన్నప్రాశనలు, నామకరణాలు, రాహుకేతు పూజలు అధికసంఖ్యలో జరిగాయి. సాయంత్రం జరిగిన కోటి దీపోత్సవం, జ్వాలాతోరణ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ హరి జవహర్‌లాల్ దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితులు స్వామివారి ఆశీర్వచనం, శేషవస్త్రం అందించారు. స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను డీసీ అందజేశారు. ఒక్కరోజులో స్వామివారికి వివిధ సేవా కార్యక్రమాల ద్వారా రూ.7.50 లక్షలు ఆదాయం లభించినట్లు డీసీ తెలిపారు.

పూజలు అందుకుంటున్న శ్రీభ్రమరాంబ, మల్లేశ్వర స్వామి

కోటి దీపోత్సవం, జ్వాలాతోరణంలో భక్తులు

పొంగలి నైవేద్యాలతో ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

జీజీహెచ్‌లో ఉచితంగా రక్తం అందజేస్తాం

సాక్షి ఎఫెక్ట్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స కోసం వచ్చే పేద రోగులకు ఉచితంగా రక్తం అందజేస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ తెలిపారు. 'జీజీహెచ్‌లో అమ్మకానికి రక్తం' అనే శీర్షిక పేరుతో బుధవారం 'సాక్షి' మెయిన్ ఎడిషన్‌లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనంపై స్పందించిన ఆసుపత్రి సూపరింటెండెంట్... ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు రక్తం ఉచితంగా అందజేస్తామని తెలిపారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో గుండె, కిడ్నీ, కాలేయ మార్పిడి వంటి కెడావర్ ఆపరేషన్లు చేసే సమయంలో ఎవరైనా రక్తం కావాలని అడిగినప్పుడు వారికి ఎంత మేరకు రుసుము తీసుకోవాలనే దానిపై గతంలో కమిటీ నిర్ణయించిన రేట్లను తాము పరిశీలించామన్నారు. ఇప్పటి వరకు అధికారికంగా ఆసుపత్రి రక్తం అమ్మేందుకు ఎలాంటి ఉత్తర్వులు విడుదల చేయలేదని వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

చిలకలూరిపేట టౌన్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందగా, ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. రూరల్ పోలీసులు అందించిన వివరాల ప్రకారం...హైదరాబాద్ లోని ఆదిత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ ఆదిత్య దంపతులు ఓ శుభకార్యానికి హాజరై కారు లో చీరాల వైపు వేగంగా వస్తున్నారు. అదే సమయంలో వింజనంపాడులో దశదిన కార్యక్రమానికి హాజరైన ఐదుగురు (ముగ్గురు మహిళలు, ఇద్దరు పురుషులు) చిలకలూరిపేట వైపు కారులో బయలుదేరారు. సరిగ్గా పసుమర్రు పరిధిలోని హైవే క్రాసింగ్ పాయింట్ వద్ద ఘోరం జరిగింది. వైద్య దంపతులకు స్వల్ప గాయాల వ్వగా, రెండో కారులోని అన్నంభోట్లవారిపాలెం గ్రామానికి చెందిన చెరుకూరి విజయలక్ష్మి(56), ఈవూరిపాలెం గ్రామానికి చెందిన కనపర్తి వరలక్ష్మి(70) మృతి చెందారు. కారు నడుపుతున్న సాదినేని సుధీర్‌బాబు, వజ్జా సాహిత్య, నూతలపాటి సుబ్బారావు ఇంకా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లు పరిశీలన

గుంటూరు రూరల్: ఈ నెల 7వ తేదీన ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియాతో కలిసి జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ బుధవారం పరిశీలించారు. ఆచార్య ఎన్జీ రంగా 125వ జయంతి సందర్భంగా లాంఫాంలోని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరగనున్న కార్యక్రమానికి, పెదకాకానిలోని శంకర్ కంటి ఆసుపత్రి ప్రాంగణంలో నూతన భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి కార్యక్రమాల ఏర్పాట్లు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డులోని శ్రీ కన్వెన్షన్ వద్ద హెలిపాడ్ ప్రాంతాన్ని జిల్లా ఎస్పీ పరిశీలించారు. విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని ఆడిటోరియం హాలును పరిశీలించి, అన్ని ఏర్పాట్లు సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

వక్ఫ్ భూములు పరిశీలించిన సింగపూర్ కంపెనీ ప్రతినిధులు

ప్రత్తిపాడు: ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డు అధికారులు సింగపూర్ కంపెనీ ప్రతినిధులతో కలిసి వక్ఫ్ భూములను పరిశీలించారు. ప్రత్తిపాడు మండలం పాతమల్లాయపాలెం గ్రామంలోని 232 సర్వే నంబరులో ఉన్న వక్ఫ్ బోర్డు భూములను ఏపీ ఎకనామిక డెవలప్‌మెంట్ బోర్డు సీఈవో సాయికాంత్ వర్మ ఆదేశాల మేరకు ఏపీఈడీబి వైస్‌ప్రెసిడెంట్ సీహెచ్. హర్ష, సింగపూర్‌కు చెందిన ఎవర్ సెండై గ్రూప్ ఎండీ (మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ స్టీల్ స్ట్రక్చర్స్) కంపెనీ ఎండీ ఏ.కె.నథన్‌లు బుధవారం స్థానిక తహసీల్దార్ సుజాతతో కలిసి భూములను పరిశీలించారు. మొత్తం విస్తీర్ణం, భూముల స్వభావాన్ని తహసీల్దార్ సుజాత, మండల సర్వేయర్లు బృందానికి వివరించారు.

పాండురంగపేటలో సహస్ర దీపోత్సవం

తెనాలి: కార్తిక పౌర్ణమి సందర్భంగా స్థానిక పాండురంగపేటలోని శ్రీవత్స భజన సమాజం ఆధ్వర్యంలో మారీసుపేటలోని శ్రీబాలాత్రిపుర సుందరి సమేత శ్రీచంద్రమౌళీశ్వరస్వామి దేవాలయంలో బుధవారం సహస్ర దీపోత్సవం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆదేశాల ప్రకారం కార్తికమాసంలో సప్తాహ కార్యక్రమం చేస్తున్నట్టు తెలిపారు. అందులో భాగంగా ఏడోరోజున దీపత్వాన్ని చేస్తున్నట్టు భజన సమాజం బాధ్యులు మాదల సత్య కుమారి తెలియజేశారు.

దూరవిద్య యూజీ, పీజీ ఫలితాలు విడుదల

పెదకాకాని: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం పరిధిలో ఈ ఏడాది జూలై, ఆగస్టు నెలలో జరిగిన యూజీ, పీజీ కోర్సుల పరీక్ష ఫలితాలను దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయలపాటి వెంకటేశ్వర్లు, పరీక్షల విభాగ కో–ఆర్డినేటర్ ఆచార్య డి. రామచంద్రన్ విడుదల చేశారు. బీబీఎం, బీహెచ్‌ఎం, బీబీఏ, సంవత్సరాంత సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలతోపాటు, ఎంఏ ఇంగ్లిష్, ఎంఏ సోషల్ వర్క్, మొదటి, ద్వితీయ, తృతీయ సెమిస్టర్ ఫలితాలు ఏఎన్‌యూలో బుధవారం విడుదల చేశారు. ఎంఏ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ మూడో సెమిస్టర్, ఎంఏ సోషియాలజీ మొదటి నుంచి నాలుగు సెమిస్టర్లు, ఎమ్మెస్సీ ఫిజిక్స్, స్టాటిస్టిక్స్ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. ఈనెల 18లోగా రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు.

42 ఏళ్లుగా నిత్యవిద్యార్థే..!

- స్నూకర్స్, బిలియర్డ్స్ క్రీడలో రాణిస్తున్న శంకర్
- జాతీయ, అంతర్జాతీయ పోటీల్లోనూ సత్తా

సాధన చేస్తున్న శంకర్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): భారీ బోర్డులపై హుందాతోపాటు అత్యంత క్రమశిక్షణతో ఆడే స్నూకర్స్ (22 బాల్స్), బిలియర్డ్స్ (3 బాల్స్) క్రీడలో మన దేశానికి మంచి పేరే ఉంది. దేశం తరపున ఎందరో ప్రపంచ చాంపియన్‌లుగా అవతరించారు. రాష్ట్రం నుంచైతే గుంటూరుకు ఒక ప్రత్యేక స్థానముంది. ఎల్వీఆర్ అండ్స్ సన్స్ క్లబ్ గత 40 ఏళ్లుగా రాష్ట్ర స్థాయిలో నిర్వహించే ఈ క్రీడా పోటీలలో ఉమ్మడి రాష్ట్రాల నుంచి పేరొందిన క్రీడాకారులు పాల్గొంటారు. దాదాపు ఎక్కువ సంఖ్యలో టోర్నమెంట్ గెలుపొందేదీ కూడా క్లబ్ క్రీడాకారులే. ఈ క్రమంలో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన క్రీడాకారుడి పేరు ఎస్.శంకర్‌రావు(56). శంకర్‌గా కూడా అందరూ పిలిచుకునే ఆయనకు కేవలం స్థానికంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో స్నూకర్, బిలియర్డ్స్ ఆడిన అనుభవం ఉంది. ప్రస్తుతం జరిగిన ఎల్వీఆర్ అండ్స్ సన్స్ క్లబ్ స్నూకర్, బిలియర్డ్స్ పోటీల్లోనూ స్నూకర్‌లో రన్నర్‌గా, బిలియర్డ్స్‌లో విజేతగా నిలిచి తన ఆధిపత్యాన్ని నిలబెట్టుకున్నారు. సుమారు 42 సంవత్సరాల నుంచి అలుపెరగని క్రీడా సాధనతో తన విజయపరంపరను కొనసాగిస్తున్నారు. స్థానికంగా వ్యాపారం చేసుకుంటూ నిత్యం సాధన చేయడం ఆయన విజయానికి ప్రధాన కారణం.

సాధించిన విజయాలు ఎన్నో..

శంకర్ తండ్రి వెంకటేశ్వరరావు కూడా ఒకప్పటి స్నూకర్, బిలియర్డ్స్ క్రీడాకారుడే. ఆయన కూడా క్లబ్‌కు చిరస్మరణీయ విజయాలు అందించారు. ఆయనతోపాటు 11 ఏళ్ల వయస్సులో క్లబ్‌కు వచ్చే క్రమంలో శంకర్ సరదాగా ప్రారంభించిన సాధనతో కేవలం రెండేళ్లకే జూనియర్ విభాగంలో రాష్ట్ర టైటిల్ గెలుపొందారు. అదే క్రమంలో ప్రతి ఏడాది రాష్ట్ర పోటీల్లో తన విజయబావుటా ఎగురవేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో 25 నేషనల్స్‌తోపాటు పలు రాష్ట్ర స్థాయి పోటీల్లో విజయాలు సాధించారు. 2016లో ప్రపంచ స్నూకర్, బిలియర్డ్స్ చాంపియన్‌షిప్‌లో భారత్ తరపున 7వ ర్యాంకు ఆటగాడిగా పాల్గొని చక్కని ప్రతిభ చూపారు.

ఆట నాకు ఎన్నో ఇచ్చింది

చాలా మంది క్రీడా సాధన చేయండి అని చెబుతుంటారు. మొదట్లో నాకు దాని అర్థం తెలియలేదు. అందరిలాగే నాకు కొన్ని సమస్యలు చుట్టుముట్టినప్పుడు నేను ధ్యాసను సాధనవైపు మళ్లించాను. ఎన్ని ఇబ్బందులు వచ్చినా స్నూకర్, బిలియర్డ్స్ సాధన ఎప్పుడూ మానలేదు. దాంతో సమస్యల్ని అధిగమించే మనోధైర్యం వచ్చింది. దీంతోపాటు చిన్నప్పటి నుంచి ఎల్వీఆర్ క్లబ్‌కు రుణపడి ఉన్నాను. తొలుత నన్ను చాంపియన్‌గా గుర్తించింది ఈ క్లబ్బే. ఎంతో ప్రోత్సాహన్నిచ్చింది. ఇప్పటికీ ఆడుతున్నానంటే అదే కారణం. సహచర క్రీడాకారులు, స్నేహితులు ముందుకు నడిపిస్తున్నారు. రాష్ట్రానికి, దేశానికి పేరు తేవడానికి మరింత కృషి చేస్తాను.

– ఎస్.శంకర్, జాతీయ క్రీడాకారుడు

బిలియర్డ్స్ పోటీల్లో సత్తా చాటిన క్లబ్ సభ్యులు

శంకర్‌కు ట్రోఫీ అందిస్తున్న మైనేని బ్రహ్మేశ్వరరావు, యాగంటి దుర్గారావులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరులోని ఎలీవ్వార్ అండ్ సన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గత రెండు వారాలుగా జరుగుతున్న ఏపీ స్టేట్ బిలియర్డ్స్' అండ్ స్నూకర్స్ ర్యాంకింగ్ పోటీలు బుధవారంతో ముగిశాయి. బిలియర్డ్స్ ఫైనల్స్‌లో విజేతగా ఎస్. శంకరరావు (శంకర్), రన్నర్‌గా ఎం.శ్రీనివాసరావులు నిలిచారు. ఇద్దరూ క్లబ్ క్రీడాకారులే కావడం గమనార్హం. తృతీయ స్థానంలో రాజమండ్రికి చెందిన గోవింద రాజరెడ్డి నిలిచారు. బహుమతి ప్రదానోత్సవలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మైనేని బ్రహ్మేశ్వరరావు, యాగంటి దుర్గారావు, ఉపాధ్యక్షుడు వణుకూరి శ్రీనివాసరెడ్డిలు ట్రోఫీలను అందజేశారు. పోటీల నిర్వహణ కార్యదర్శి పులివర్తి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 14 రోజులుగా క్లబ్ నిర్వహించిన పోటీలు విజయవంతంగా ముగిశాయన్నారు. విజేతలకు రూ.లక్షల నగదు బహుమతులతోపాటు ట్రోఫీలను అందజేశామన్నారు. ఆధునిక సదుపాయాలతో బిలియర్డ్స్, స్నూకర్ బోర్డులపై పోటీలు ఏర్పాటు చేశామన్నారు. 1988లోనూ అంతర్జాతీయ బిలియర్డ్స్ క్రీడాకారుడు గీత్ సేథీ ప్రపంచ రికార్డును తమ క్లబ్‌లోనే సాధించారన్నారు. కార్యక్రమంలో కోశాధికారి ఏల్చూరు వెంకటేశ్వరరావు, సుశీల్, పాండు రంగారావు, శివాజీ, జి.స్వరాజ్ రావు, యు.అనిల్, ఎంవీ సురేశ్ బాబు పాల్గొన్నారు.

అమరేశ్వరుని సన్నిధి కిటకిట

విశేషాలంకారంలో అమరేశ్వరుడు

కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కార్తికదీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆలయ క్యూలైన్‌లో దర్శనం కోసం వేచి చూస్తున్న భక్తజనం

అమరావతి: పంచారామ క్షేత్రాలలో ప్రథమారామ క్షేత్రమైన అమరారామంలో శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వర ఆలయంలో కార్తిక పౌర్ణమి పర్వదినమైన బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. వేకువజామున పవిత్ర కృష్ణానదిలో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. ఆలయంలోని ఉసిరి చెట్ల వద్ద భక్తులు దీపారాధనలు చేశారు. కార్తిక దామోదరుడిని పూజించారు. పరోక్ష అభిషేకాలను అర్చకస్వాములు నిర్వహించారు. అలాగే భక్తులు స్వామికి అభిషేకాలతో పాటు అమ్మ వారికి కుంకుమార్చనలు చేశారు. మధ్యాహ్నం నుంచి అమరేశ్వరాలయం, అమరేశ్వర స్నానఘాట్‌లలో భక్తుల సందడి నెలకొంది. సాయంత్రం నాలుగు గంటల వరకు స్వామి వారికి అభిషేకాలు నిర్వహించి అనంతరం విశేషాలంకారం చేశారు. భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి రేఖ ఆధ్వర్యంలో సిబ్బంది ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా సౌకర్యాలు కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దేవాలయ పరిసర ప్రాంతాలలో, స్నానఘాట్‌లలో సీఐ ఆచ్చియ్య ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

తెప్పోత్సవంలో హారతి ఇస్తున్న అర్చకులు

అంతిమ యాత్రకూ 'తమ్ముళ్ల'తో తిప్పలు

బురదరోడ్డులో శవపేటికను మోసుకెళుతున్న బంధువులు

సమాధుల తోట రోడ్డు దుస్థితి ఇదీ...

తెనాలి: పట్టణానికి ఆనుకుని ఉన్న చిన్న గ్రామం మల్లెపాడు పంచాయతీ. అక్కడ దళితుల సమాధుల తోటకు వెళ్లే రోడ్డు ధ్వంసమైంది. దీనికి తోడు తుఫాన్‌కు కురిసిన వర్షాలకు బురదమయంగా మారింది. అంతిమ సంస్కారాలకు భౌతికకాయాన్ని తీసుకెళ్లాలంటే బంధువులకు నానా తిప్పలు తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. బురదలో పడుతూ లేస్తూ తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ఇటీవల మరణించిన ఓ మహిళను ఖననం చేసేందుకు ఆ బురద రోడ్డులో శవపేటికను తీసుకెళ్లడానికి ఆ కుటుంబసభ్యులు ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున ఆరుగురు కూలీలను పెట్టుకున్నారు. ఈ దుస్థితికి తెలుగు తమ్ముళ్లే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. శ్మశానం అవతలవైపు పంట పొలాన్ని కొని, మట్టి తవ్వి వారు విక్రయించారని తెలిపారు. యథేచ్ఛగా తిరిగిన మట్టి ట్రాక్టర్లు, అందులోంచి జారిపడిన నల్లమట్టి కారణంగా రోడ్డు ఈ దుస్థితికి దిగజారిందని చెబుతున్నారు. సాక్షాత్తూ మంత్రి నాదెండ్ల మనోహర్ నియోజకవర్గంలోనే పట్టణానికి కూతవేటు దూరంలో నెలకొన్న ఈ సమస్య ఎప్పటికి తీరుతుందోనని ఆవేదన వ్యక్తం చేశారు.

కొలకలూరులో విషాదం

యువతి ఆత్మహత్య.. కాల్వలో దూకి యువకుడు గల్లంతు

తెనాలిరూరల్: రూరల్ మండల గ్రామం కొలకలూరులో విషాదం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన యువతి ఆత్మహత్య చేసుకోగా, యువకుడు కాల్వలో గల్లంతయ్యాడు. సేకరించిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బీఫార్మసీ చదువుతున్న యువతి(20) బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. అదే ప్రాంతానికి చెందిన యువకుడు(20) గ్రామంలోని కొమ్మమూరు కాల్వలో దూకి ఆత్మహత్యాయత్నం చేశాడు. నీటి ఉధృతికి యువకుడు గల్లంతయ్యాడు. యువకుడు బాపట్లలో ఇంజినీరింగ్ చదువుతున్నాడు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, విచారణ చేపట్టారు. కాగా ఇటీవల ఇన్‌స్ట్రాగామ్‌లో ఇరువురి ఫొటోలు చూసిన యువతి కుటుంబీకులు మందలించినట్లు గ్రామస్తులు కొందరు చెబుతున్నారు. ఈ రెండూ వేర్వేరు ఘటనలుగా స్థానికులు అంటున్నారు. యువతి అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేసుకోగా డీఎస్పీ బి.జనార్ధనరావు, రూరల్ సీఐ ఆర్.ఉమేష్, ఎస్ఐ కె.ఆనంద్‌లు గ్రామానికి వెళ్లి మృతురాలి కుటుంబసభ్యులతో మాట్లాడారు. మృతదేహాన్ని గురువారం ఉదయం పోస్ట్‌మార్టమ్‌కు తరలిస్తామని, సహకరించాలని కోరారు. ఘటనపై రూరల్ పోలీసులు రాత్రి పొద్దుపోయాక కేసు నమోదు చేశారు. ఒకే ప్రాంతానికి చెందిన యువతి మృతి చెందడం, యువకుడు గల్లంతు కావడంతో ఇరు కుటుంబాలలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ రెండు ఘటనలకు సంబంధం ఉందని అప్పుడే చెప్పలేమని, యువకుడి ఆచూకీ లభిస్తే పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉందని రూరల్ సీఐ ఆర్.ఉమేష్ తెలిపారు.

కార్తిక పౌర్ణమి సందర్భంగా బుధవారం గుంటూరు పట్టాభిపురం శివాలయంలో కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు

గుంటూరు అరండల్‌పేటలోని శివాలయంలో కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు – సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

మిర్చి యార్డు సమాచారం

(బుధవారం ధరలు)

వచ్చిన బస్తాలు	50,635
అమ్మకాలు	48,543
నిల్వ	11,450

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–15500
నంబరు–5	10,000–14,300
341	10,000–16,100

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500–15,200
నంబరు–5	10,000–14,200
341	10,000–16,300
4884	11,000–13,800

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,400
బాడిగ–355	10,500 – 16,000
దేవనూరు డీలక్స్	10,000 – 15,300
ఆర్మూర్	10,000 – 13,000
తాలుకాయలు	5,500 – 8,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000–15,300
బాడిగ – 355	10,000–16,000
దేవనూరు డీలక్స్	10,500–15,500
తాలు	5,300 – 8,000

–కొరిటెపాడు (గుంటూరు)

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి

డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచేందుకు ప్రతి వైద్య అధికారి సమష్టి కృషి చేయాల్సిన అవసరం ఉందని గుంటూరు డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై డీఎంహెచ్‌ఓ తన చాంబర్‌లో పలువురు వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్న ప్రసవాలను సమీక్షించి వాటిని పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి వైద్య అధికారులు చర్చించారు. ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ రంగారావు మాట్లాడుతూ ప్రత్తిపాడు, కొల్లిపర, పొన్నూరులలో నెలకు 50కి తగ్గకుండా ప్రసవాలు చేయాలని ఆదేశించారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశ్వి రమణ మాట్లాడుతూ గుంటూరు పట్టణంలోని ప్రతి పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యులు ఈడీడీ లిస్ట్ ప్రకారం గర్భిణులను, జీజీహెచ్‌కు కాన్పుకు పంపించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఈ.అన్నపూర్ణ, డాక్టర్ రోహిణి రత్నశ్రీ, డాక్టర్ సౌభాగ్యవాణి, పలు ఆసుపత్రుల సూపరింటెండెంట్‌లు డాక్టర్ ప్రవీణ్ కుమార్, డాక్టర్ ఫిరోజ్ ఖాన్, వైద్యులు డాక్టర్ రెహమత, డాక్టర్ ప్రియాంక, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

సమీక్ష నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ

ఆక్రమిత స్థలంలో విద్యుత్ కనెక్షన్, మీటరు తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

తాడికొండ: 'సాక్షి' వరుస కథనాలతో స్పందించిన అధికారులు తాడికొండ మండలం లాం గ్రామంలో టీడీపీ మైనార్టీ నాయకుడి చెరలో ఉన్న రూ. 20 కోట్ల భూమిలో ఎట్టకేలకు విద్యుత్ కనెక్షన్, మీటరు తొలగించారు. అయితే సదరు భూమి తనకు ఎలా సంక్రమించింది అనే దానిపై వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేసినా.. ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడంతో ఇది పక్కా మోసం అని ఇప్పటికే తేలింది. అయితే ఆ భూమిని తనకు మసీదు కమిటీ లీజుకు ఇచ్చారంటూ తప్పుడు పేపర్లు సృష్టించిన సదరు కూటమి నేతకు లీజు అగ్రిమెంటు చేసిన వ్యక్తులపై ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోపోవడం, వారికి కనీసం నోటీసులు జారీ చేయకపోవడం విశేషం.

- రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ స్థలం అని ఏర్పాటు చేసిన బోర్డు కేవలం ఫొటోకే పరిమితం కాగా ఆ స్థానంలో నిమిషాల వ్యవధిలోనే ఇది మసీదుకు చెందిన స్థలం అంటూ సదరు నేత బోర్డు ఏర్పాటు చేసి ఎంచక్కా అక్రమ నిర్మాణాలు చేశాడు. ఇది కాస్తా రచ్చకెక్కడంతో ఆయన మరో పన్నాగానికి తెరలేపాడు.
- గతంలో అదే సర్వే నెంబరుపై తాను కోర్టులో వేసి 40 ఇళ్లు కూలదోయించిన 40 మందిని పిలిచి మేం రాజీ చేసుకున్నాం, మిమ్మల్ని ఎవరూ ఇబ్బంది పెట్టరు.. మీ ఇళ్లు మీరు కట్టుకోండి అని చెప్పడంతో అమాయకంగా బాధితులు ఆ స్థలంలో మళ్లీ నిర్మాణాలకు తెరలేపారు. సందట్లో సడేమియా అంటూ చిన్నా చితకా నాయకులు సైతం మళ్లీ ఆక్రమణల దందా ప్రారంభించడంతో వివాదం మళ్లీ మొదటికి వచ్చిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంటూరుకు కూతవేటు దూరంలో ఉండటం, ఇక్కడ భూముల ధరలకు భారీగా రెక్కలు రావడంతో తన అక్రమ నిర్మాణాన్ని కాపాడుకునేందుకు ప్రజలను రెచ్చగొట్టి మరోసారి బలిపశువులను చేస్తున్నాడని, సంబంధిత రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు ఇకనైనా స్పందించి ఆక్రమణలు నిలిపేయాలని పలువురు కోరుతున్నారు.

విద్యుత్ కనెక్షన్ తొలగిస్తున్న అధికారులు

నకిలీ సర్టిఫికెట్ సృష్టించిన వ్యక్తిపై కేసు నమోదు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ సృష్టించిన వ్యక్తిపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చాకలిగుంటలో నివాసం ఉండే పొల్లా జైగణేష్ అనే వ్యక్తి తన తల్లి పేరుపై ఉండే ఆస్తులను దొంగచాటుగా విక్రయించాలనే దురుద్దేశంతో నకిలీ ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను తయారు చేయించాడు. ఆస్తులను విక్రయించేందుకు కుటుంబసభ్యులు అంగీకరించకపోవటంతో వారి సంతకాలు ఫోర్జరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. జైగణేష్ తన తల్లి ఆస్తులను విక్రయించేందుకు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేశాడు. దీనిపై అనుమానం వచ్చిన అధికారులు పరిశీలించాలని తహసీల్దార్ కార్యాలయానికి సూచించటంతో, సర్టిఫికెట్ నకిలీదిగా గుర్తించిన ఆర్ఐ షేక్ కరీముల్లా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. నకిలీ సర్టిఫికెట్ తయారీలో మరికొంత మంది ఉన్నట్లు, వారి ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జీఎంసీ గుమస్తాకు షోకాజ్ నోటీసు

సాక్షి ఎఫెక్ట్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థకు చెందిన గాంధీ పార్క్ నుంచి వసూలు అయినా రోజువారి కలెక్షన్ రూ.6,44,875 నగదును ఆర్ఐ సుబ్బారావు తన సొంతానికి వాడుకున్న విషయంపై 'గాంధీ పార్క్ ఆదాయం మింగేసిన ఆర్ఐ' అనే శీర్షికన 'సాక్షి'లో ఈనెల 1వ తేదీన కథనం ప్రచురితమైన కథనానికి స్పందించిన కమిషనర్ పులి శ్రీనివాసులు, సుబ్బారావును సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంలో సంబంధిత సెక్షన్ ఉద్యోగుల పాత్రపై సైతం 'సాక్షి'లో రెవెన్యూ ఉద్యోగుల వింత లీలలు అనే కథనం మంగళవారం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ఏ2- 2 గుమస్తా ఆకుల శ్రీనివాసరావుకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. సుబ్బారావు చేసిన అక్రమాలపై పూర్తి విచారణ చేయాలంటూ ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయంలో కేవలం గుమస్తాకు మాత్రమే షోకాజ్ నోటీస్ ఇచ్చి సెక్షన్ సూపరింటెండెంట్‌కు, ఆర్ఐ సుబ్బారావుకు పై అధికారిగా (ఆర్ఓ) ఉన్న అధికారికి నోటీసు ఇవ్వకపోవడంపై ఉన్నతాధికారులకు కింది స్థాయి సిబ్బంది అంటే ఎంత లోకువనే విషయం స్పష్టమవుతోందని జీఎంసీ కార్యాలయ వర్గాలు గుసగుసలాడుకుంటున్నారు.

సమాజ హితులకు సత్కారం

కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో కార్యక్రమం

వెనిగండ్లలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కౌండిన్య ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ ఈవీ నారాయణ, తదితరులు

పెదకాకాని: దశాబ్దాల కాలంగా సమాజంలో ఆరోగ్య, ఆర్థిక, ఆధ్యాత్మిక రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న సమాజ హితులను కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఘనంగా సత్కరించింది. మండలంలోని వెనిగండ్ల గ్రామ కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ప్రాంగణంలో బుధవారం జరిగిన సభకు కౌండిన్య ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ ఇవి నారాయణ అధ్యక్షత వహించారు.

- ముఖ్య అతిథిగా హాజరైన జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ప్రసంగిస్తూ గత 20 సంవత్సరాలుగా డాక్టర్ ఈవీ నారాయణ నేతృత్వంలో కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా రూ.2.50 కోట్ల స్కాలర్ షిప్‌లను ప్రతిభ గల పేద విద్యార్థులకు అందించడం హర్షణీయమన్నారు. అలాగే పేద ప్రతిభ గల విద్యార్థులకు పోటీ పరీక్షలకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు.
- కౌండిన్య ఐఏఎస్ అకాడమీ వ్యవస్థాపకులు డాక్టర్ ఈవీ నారాయణ ప్రసంగిస్తూ గత 20 సంవత్సరాలుగా కోట్లాది రూపాయలను విరాళంగా అందించి ప్రతిభ గల పేద విద్యార్థులకు తోడ్పాటును అందిస్తున్న దాతలందరికీ కృతజ్ఞతలు తెలిపారు.
- ఈ సందర్భంగా గత రెండు దశాబ్దాలకు పైగా గుంటూరు నగరంలో ఎస్‌హెచ్‌ఓ ద్వారా ఆరోగ్య సేవలను అందిస్తూ ఇటీవల ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుంటూరు నగర అధ్యక్షులుగా ఎంపికైన డాక్టర్ టి.సేవకుమార్, ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొందిన చిలకా చంద్రమౌళి, వడ్లమూడి క్వారీ బాలకోటేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా ఎంపికైన అనంత లక్ష్మీనారాయణ, యుక్త వయసులోనే అభయ హస్త ఫైనాన్షియల్ సర్వీసెస్‌ను ప్రారంభించి ఆర్థిక సలహాలను అందిస్తున్న సింహాద్రి నాగ వెంకట శివప్రసాద్‌లను కౌండిన్య ఐఏఎస్ అకాడమీ సభ్యుల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. టీజేపీఎస్ కళాశాల విశ్రాంత ఆచార్యులు డాక్టర్ వి.సింగారావు, డాక్టర్ పోతురాజు శ్రీనివాసులు, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయరెడ్డి, ట్రస్ట్ సభ్యులు వాకా రాంగోపాల్ గౌడ్, వడ్డెంకుంట సుబ్బారావు, బొబ్బిళ్ళ వెంకటేశ్వరరావు, డి.సత్యనారాయణ, తాతా సాంబశివరావు, వీరంకి రంగారావు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి కుశలవ హ్యుందాయ్ వెన్యూ కారు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): స్థానిక ఆటోనగర్‌లోని కుశలవ హ్యుందాయ్ షోరూంలో బుధవారం హ్యుందాయ్ వెన్యూ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. సంస్థ ఎండీ చుక్కపల్లి సిద్ధార్థ మాట్లాడుతూ సరికొత్త హ్యుందాయ్ వెన్యూ వెర్షన్ ధర రూ.7.89 లక్షల నుంచి ప్రారంభమవుతుందన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా ఏడు లక్షల మంది వినియోగదారులు వెన్యూ కారుని వినియోగిస్తున్నారని పేర్కొన్నారు. ఈ కారు విశాలంగా, నూతన హంగులతో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ధీరజ్ స్వరూప్, జీఎం శ్రీధర్, సేల్స్ హెడ్ ఉస్మాన్, ఇనిస్టిట్యూషనల్ హెడ్ అఖద్ ప్రతాప్‌సింగ్, ఆటోమొబైల్ ఔత్సాహికులు, కస్టమర్లు పాల్గొన్నారు.

హ్యుందాయ్ వెన్యూ కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న నిర్వాహకులు

రేపు సీనియర్ ఫెన్సింగ్ జిల్లా జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): గుంటూరు ఫెన్సింగ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా సీనియర్ ఫెన్సింగ్ టీమ్ ఎంపిక గురువారం స్థానిక బీఆర్ స్టేడియంలో నిర్వహిస్తామని జిల్లా కార్యదర్శి డి.అశోక్ బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం 14 సంవత్సరాలు నిండిన వారు సీనియర్స్ విభాగంలో పాల్గొనవచ్చన్నారు. 18 సంవత్సరాలు నిండినవారు ఫెన్సింగ్ అసోసియేషన్ గుర్తింపు కార్డు ప్రీవియస్ స్టేట్ ఆడిన సర్టిఫికెట్‌తో హాజరు కావాలన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

Sale : Around 275Sq.Yds Vacant SITE very close to new Main Road of AT Agraharam, 14th Lane, Guntur. 8142438370

SERVICES

GOLD FINANCE

- బంగారం బ్యాంకులలో/ ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071
- బంగారం కొనబడును. బ్యాంకులో ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకి తీసుకుంటాం. ✆ 88024 89999
- బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్‌క్యాష్) సంప్ర।। ✆ 8790741166

WANTED

- మంగళగిరి తాడేపల్లి పరిసర ప్రాంతాలలో పని చేయుటకు సెక్యూరిటీ గార్డులు వెంటనే కావలెను. భోజనం సౌకర్యం కలదు. Q:10th, 50సం।। లోపు వారు సంప్ర: 7337420359, 8500025995
- గుంటూరులో గల నర్సింగ్ కాలేజి హాస్టల్ నందు పనిచేయుటకు ఇంటర్, డిగ్రీ చదివిన 35 సంవత్సరాల పైబడిన రెసిడెన్షియల్ హాస్టల్ నందు లేడి వార్డెన్స్ కావలెను. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 81224 61164
- గుంటూరులో బస్టాండ్ ఎదురు మా సంస్థ నందు పనిచేయుటకు లేడీ టెలికాలర్స్ కావలెను. Qual: 10th-డిగ్రీ, టైం: 9 AM - 5-30 PM, Sal: 9000 ✆ 99893 98775
- గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు SR Construction Site Incharges గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 35000/- నుండి 45000/- వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: Civil Diploma మరియు Civil Engineering. వయస్సు: 30 సంవత్సరముల పైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్: 89784 80429
- ప్రముఖ Ltd కంలో సూపై, Asts, స్టోర్ ఇంచార్జి, డ్రైవర్స్ ITI Dip, B.Tech All Ex ఆర్మీ కావలెను, రూం+భో PF+ ESI జీ: 18-32 వేలు. ✆ 91007 91079
- మాచర్ల లోని గోదావరి ఆంధ్ర కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ వారి ఫైనాన్షియల్ ఆర్గనైజేషన్ నందు పని చేయుటకు బ్రాంచ్ మేనేజర్, లోన్ ఆఫీసర్స్ కావలెను. అర్హత: డిగ్రీ/ పి.జి రిటైర్డ్ బ్యాంకింగ్/ NBFC ఎంప్లాయిస్‌కి మరియు మాచర్ల లోకల్ వారికి ప్రాధాన్యత. సంప్ర: Ph: 7893794796, 7207494496, 8121294296, 7337394396

సాక్షి క్లాసిఫైడ్స్
ప్రతి అదనపు లైను రూ.100 మాత్రమే
గుంటూరు
7075167663
7075167541

గమనిక
[illegible]

ఉద్యోగోన్నతులు ఏవీ ?

- గుంటూరు జీజీహెచ్‌లో అధికారుల నిర్లక్ష్యం
- చిన్న ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చేందుకు మీనమేషాలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో పనిచేస్తున్న 'చిన్న' ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చేందుకు అధికారులకు 'పెద్ద' మనస్సు రావడం లేదు. ప్రమోషన్లు ఇస్తామని నోటిఫికేషన్లు ఇస్తున్నారు ఆ తరువాత మిన్నకుండిపోతున్నారు. గత ఏడాది కింది స్థాయి ఉద్యోగులకు ప్రమోషన్లు ఇస్తామని జీజీహెచ్ అధికారులు రెండు నోటిఫికేషన్లు విడుదల చేశారు. ఏడాది గడిచినా ప్రమోషన్లు ఇవ్వకపోవడంతో నోటిఫికేషన్‌ల కాలపరిమితి దాటిపోయింది.

అంతా మా ఇష్టం...

జీజీహెచ్‌లో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును భర్తీ చేసేందుకు ఆసుపత్రి అధికారులు 2025 ఫిబ్రవరి 28న నోటిఫికేషన్ విడుదల చేశారు. నోటిఫికేషన్ ఇచ్చిన రెండు వారాల వ్యవధిలోనే ప్రమోషన్ ద్వారా ల్యాబ్ టెక్నీషియన్ పోస్టును భర్తీ చేశారు. కానీ రికార్డు అసిస్టెంట్ పోస్టును ఆరేళ్లకుపైగా, జూనియర్ అసిస్టెంట్ పోస్టులు సుమారు ఏడేళ్లకు పైగా ఖాళీగా ఉన్నా భర్తీ చేయకపోవడంపై కిందిస్థాయి ఉద్యోగులు పదోన్నతులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఆ పోస్టులను అర్హత ఉన్నా తమకు ఇవ్వడం లేదని కొంత మంది ఉద్యోగులు కోర్టుకు వెళ్లడంతో జీజీహెచ్ అధికారులు పోస్టులు ఖాళీ ఉన్నప్పుడు ఇస్తామని కోర్టుకు వివరణ ఇచ్చారు. తాజాగా ఐదు జూనియర్ అసిస్టెంట్ పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ ఏడాదిగా భర్తీ చేయలేదు. ఆస్పత్రిలో ప్రమోషన్ ద్వారా భర్తీ చేయాల్సిన పోస్టులకు ఏళ్ల తరబడి కాలయాపన చేస్తున్నారు. దీంతో పలువురు ఉద్యోగులు కోర్టుకు వెళ్లి ప్రమోషన్ పోస్టును దక్కించుకుంటున్నారు. జిల్లా కలెక్టర్, ఆస్పత్రి అభివృద్ధి కమిటి చైర్‌పర్సన్ ఎ.తమీమ్ అన్సారియా ఈ విషయంపై దృష్టి సారించి ఆస్పత్రిలో పని చేస్తున్న ఉద్యోగుల ప్రమోషన్‌ల విషయంలో న్యాయం చేయాలని పలువురు అభ్యర్థులు కోరుతున్నారు.

వివరణః

జీజీహెచ్‌లో రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీని ప్రమోషన్‌ల ద్వారా త్వరలోనే నిర్వహిస్తామని ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్ పూసల శ్రీనివాసరావు తెలిపారు.

12న ఉద్యోగులకు క్రీడా పోటీలు

నరసరావుపేట ఈస్ట్: జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 12న సత్తెనపల్లి రోడ్డులోని డీఎస్ఏ స్టేడియంలో ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి బుధవారం తెలిపారు. మొత్తం 19 క్రీడాంశాలలో పోటీలను నిర్వహించి జిల్లా టీమ్‌లను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల ఉద్యోగ క్రీడాకారులు కార్యాలయ గుర్తింపు కార్డు, ఇతర ధ్రువపత్రాలతో 12న స్టేడియానికి హాజరుకావాలని కోరారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 19 నుంచి 22 వరకు విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని నరసింహారెడ్డి తెలిపారు. వివరాలకు 8712622574 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రెజ్లింగ్‌లో ఓవరాల్ చాంపియన్ గుంటూరు

విజయవాడరూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఏపీ అండర్–17 బాలుర గ్రీకో–రోమన్ రెజ్లింగ్ ఈవెంట్‌లో గుంటూరు జిల్లా 25 పాయింట్లు సాధించి, నాలుగు బంగారు పతకాలు, నాలుగు కాంస్య పతకాలను గెలుచుకోవడం ద్వారా ఓవరాల్ చాంపియన్ టైటిల్‌ను కైవసం చేసుకుంది. ఎస్‌పీఎస్ నెల్లూరు జిల్లా 20 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. విశాఖపట్నం 16 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచింది. మూడు రోజుల పాటు జరిగే ఎస్‌జీఎఫ్ అండర్–14, అండర్–17 అంతర్ జిల్లాల బాలుర, బాలికల రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌ను విజయవాడ రూరల్ మండలంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ అశోక్ ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి రెజ్లర్లు, కోచ్‌లు జట్టు మేనేజర్లు సహా దాదాపు 750 పాల్గొంటున్నారు. బుధవారం అండర్–17 గ్రీకో రోమన్ బాలుర విభాగం ముగిసింది. ఆంధ్రప్రదేశ్ రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.భూషణంతో కలిసి ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్పెక్టర్ డాక్టర్ ఎస్‌కె మహబూబ్ బాషా, గుంటూరు జిల్లా జట్టుకు ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేశారు. పది వేర్వేరు వెయిట్ విభాగాల్లో అండర్–14, అండర్–17 బాలుర, బాలికల విభాగాల్లో మ్యాచ్‌లు సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. టోర్నమెంట్ గురువారం ముగుస్తుంది.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

మాచవరం: విద్యుదాఘాతంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని వేమవరంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కూచిక సాగర్ (25) చేపల వేటకు కృష్ణా నదిలోకి వెళ్లాడు. సమీపంలోని పులిచింతల బ్యాక్ వాటర్‌లో పుట్టి సాయంతో చేపలు పట్టేందుకు గాలం వేయగా సమీపంలో ఉన్న విద్యుత్ వైర్లకు తగిలింది. కరెంటు షాక్‌కు గురై సాగర్ మృతి చెందాడు. సమీపంలో ఉన్న జాలర్లు గుర్తించి మృతదేహాన్ని ఒడ్డుకు చేర్చారు. మృతుని తండ్రి ఏసయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు

రికవరీ సెక్షన్, జె.కె.సి. కాలేజ్ రోడ్డు, 5వ లైను, విజయపురి, గుంటూరు-6. ఫోన్: 9492758257, 8019308696

స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం అమ్మకం ప్రకటన

[illegible]

ఇ-వేలం తేది: 27-11-2025, ము।। 12.00 గం.ల నుండి ము।। 01.00 గం.ల వరకు

(అమ్మకం ముగిసేవరకు ప్రతి 5 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలయన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 27-11-2025, ఉ. 11.00 గం.ల లోపుగా పొందుపరచి జమచేయాలి.

కెనరా బ్యాంక్, బృందావన్ గార్డెన్స్ బ్రాంచ్ (13276), ఫోన్: 9440905117

1. [illegible]
రిజర్వు ధర: రూ. 46,60,000/- ధరావత్తు సొమ్ము: రూ. 4,66,000/-

కెనరా బ్యాంక్, అరండల్ పేట బ్రాంచ్ (13712), ఫోన్: 8332973976

2. [illegible]
రిజర్వు ధర: రూ. 24,70,000/- ధరావత్తు సొమ్ము: రూ. 2,47,000/-

కెనరా బ్యాంక్, తెనాలి-2 బ్రాంచ్, ఫోన్: 94409 05143

3. [illegible]
రిజర్వు ధర: రూ. 35,60,000/- ధరావత్తు సొమ్ము: రూ. 3,56,000/-

కెనరా బ్యాంక్, మాచర్ల బ్రాంచ్ (3507), ఫోన్: 83310 15719

4. [illegible]
రిజర్వు ధర: రూ. 13,50,000/- ధరావత్తు సొమ్ము: రూ. 1,35,000/-
[illegible]
రిజర్వు ధర: రూ. 13,50,000/- ధరావత్తు సొమ్ము: రూ. 1,35,000/-

[illegible] www.canarabank.com [illegible] http://baanknet.com [illegible] support.baanknet.com

తేది: 05-11-2025, ప్రదేశం: గుంటూరు సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

క్లుప్తంగా

ఎయిమ్స్ గార్డెనింగ్ కార్మికుల ఆందోళన

మంగళగిరి టౌన్: ఎయిమ్స్‌లో తొలగించిన గార్డెనింగ్ కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని మంగళగిరి ఎయిమ్స్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు ఎస్.ఎస్. చెంగయ్య డిమాండ్ చేశారు. యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న రెండవ రోజు నిరసనలో భాగంగా బుధవారం మంగళగిరి పట్టణంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చెంగయ్య మాట్లాడుతూ ఎయిమ్స్‌లో పనిచేస్తున్న ప్రతి కార్మికుడికీ ఉచితంగా వైద్యం అందించాలని, అందుకు సంబంధించిన హెల్త్ కార్డులు యాజమాన్యం అందించాలని కోరారు. జీతాలు ఆలస్యం కాకుండా ప్రతినెల 5వ తేదీ లోపు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులను విధుల్లోకి తీసుకునే వరకు ఆందోళన, నిరసనలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి బాలాజీ, బుచ్చిబాబు, పలువురు సీఐటీయూ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన

మంగళగిరి టౌన్ : మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని మెప్మా రిసోర్స్ పర్సన్స్‌కు బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సహాస్, వాష్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ సాలిడ్ వేస్ట్ విభజన, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన పెంపొందించే వివరించారని తెలిపారు. అనంతరం పర్యావరణ పరిరక్షణ చర్యలు, ప్రజల్లో అవగాహన సృష్టి వంటి అంశాలపై రిసోర్స్ పర్సన్స్‌కు శిక్షణ అందించారు. శుభ్రత, హైజిన్, నీటి వినియోగంలో మెరుగుదలకు దోహదపడే విధానాలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు, సీబీ కో– ఆర్డినేటర్ విజయ్, ఐఈసీ కోఆర్డినేటర్ శంకర్, ట్రైనర్స్ డి.వి.రావు, రామబ్రహ్మం , మెప్మా ఆర్పీలు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో పతకాలు సాధించిన చిన్నారులు

తాడేపల్లి రూరల్ : పట్టణ పరిధిలోని డోలాస్‌నగర్ చిన్నారులు స్కేటింగ్‌లో పతకాలు సాధించారు. విశాఖపట్నం శివాజీ పార్క్‌లో ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ అండ్ విశాఖపట్నం జిల్లా రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 37వ డిస్ట్రిక్ట్ స్కేటింగ్ చాంపియన్‌షిప్ కమ్ సెలక్షన్స్ జరిగాయి. ఇందులో మెరుగుపాల హాశిష్, లిఖిత్‌లు మూడు పతకాలు సాధించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ రిఫరీ పవన్‌కుమార్ చేతుల మీదుగా పతకాలు అందుకున్నారు. జిల్లా ఫ్లైయింగ్ బర్డ్స్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ చైర్మన్ థామస్, అధ్యక్షులు శ్రీకాంత్, ట్రెజరర్ హరిబాబు, వైస్ ప్రెసిడెంట్ నీలిమ చిన్నారులను అభినందించారు.

రైతులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణ

దుగ్గిరాల: మండలంలోని చిలువూరులో బుధవారం రైతులకు పొలంబడి నిర్వహించారు. రైతులకు యాజమాన్య పద్ధతులపై ఇన్‌చార్జి ఏడీ ఆర్.విజయ బాబు శిక్షణ ఇచ్చారు. తెగుళ్ల నివారణకు ఉపయోగపడే పురుగు మందుల గుర్తులు, వాటి చిహ్నాలు, మానవ శరీరంపై ప్రభావం, తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన వివరించారు. ముందుగా రైతులకు పొలంబడి కిట్లను అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిలువూరు మాణిక్యమ్మ, సీతారామయ్య, రైతులు శివశేఖర్, జగదీష్, ప్రసాద్, ప్రభాకర్, రాంబాబు, విస్తరణ అధికారులు ప్రజ్ఞాన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కనకపుట్లమ్మ తల్లి దీక్షలు ప్రారంభం

దుగ్గిరాల: మండలంలోని పెదకొండూరులో గల కనకపుట్ల అమ్మ తల్లి దీక్షలు బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి. కార్తిక పౌర్ణమి సందర్భంగా తొలి రోజు మహిళలు, చిన్నారులు, 150 మందికి పైగా అమ్మవారి సన్నిధిలో గురుస్వామి పర్యవేక్షణలో మాలధారణ చేశారు. 40 రోజుల పాటు మండల దీక్ష అనంతరం ఇరుముడి ధరించి, అమ్మవారికి సమర్పిస్తారని అర్చకులు తెలిపారు.

తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా
- రేపూడి సురక్షిత పథకం పరిశీలన

మంచినీటి పథకం ట్యాంకును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, అధికారులు.

ఫిరంగిపురం: ప్రజలకు తాగునీటి సరఫరాలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. మండలంలోని రేపూడిలో సమగ్ర తాగునీటి పథకాన్ని బుధవారం ఆమె తనిఖీ చేశారు. క్లోరినేషన్ ప్రక్రియ, ఫిల్టర్ బెడ్లు, పంపింగ్ మోటార్ల పనితీరు, నీటి శాంపిల్స్ పరీక్ష ఫలితాలు నమోదు రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఓవర్ హెడ్ ట్యాంకు శుభ్రం చేయించడంలో నిర్లక్ష్యం వహించిన ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం శుభ్రంచేసి తాగునీరు సరఫరా చేయాలని, నిరంతరం పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని, తడి,పొడి వ్యర్థాలు వేరుచేసే విధానాన్ని పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్ల పని వేళలు, వారికి అందిస్తున్న రక్షిత పరికరాలు తెలుసుకున్నారు.

స్వయం సంఘాల దుకాణాల పరిశీలన

మండలంలోని అమీనాబాద్‌లో స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలతో ఏర్పాటు చేసిన దుకాణాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా పరిశీలించారు. గ్రామంలోని కొండవీటి బజారులో దుకాణాల మహిళలతో మాట్లాడారు. మహిళ సాధికారత లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. స్వయం ఉపాధి కోసం పలు పథకాల ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందని, వాటిని వినియోగించుకొని మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. అనంతరం మునగ సాగు చేస్తున్న స్వయం సహాయక సంఘాల మహిళ రైతులకు విత్తనాలు అందజేశారు.

పత్తి పంట పరిశీలన

తుపానుకు దెబ్బతిన్న పత్తి పంటను ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టం వివరాలు తెలుసుకున్నారు. అమీనాబాద్ నుంచి కొండవీటి ఘాట్ రోడ్డు వరకు నిర్మిస్తున్న ఆర్ అండ్ బీ రహదారిని పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణను పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. పొలాల మధ్య రహదారి ఏర్పాటు చేయాలని, పింఛన్లు, రేషన్ కార్డులు , ఇంటి స్థలాలు ఇవ్వాలంటూ పలువురు అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి సాయి కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కల్యాణ చక్రవర్తి, ఆర్డీవో శ్రీనివాసులు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీడీవో శివసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మద్దతు ధరకే పత్తి కొనుగోలు

జిల్లాలో సీసీఐ ద్వారా మద్దతు ధరకే రైతుల నుండి పత్తి కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. మండల కేంద్రంలో సీసీఐ కేంద్రాల్లో మద్దతు ధరకే పత్తి కొనుగోలుపై మేడికొండూరు, ఫిరంగిపురం మండలాల రైతులకు , వ్యవసాయ సహాయకులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 25వేల హెక్టార్లలో 70,800 మంది రైతులు పత్తి సాగుచేస్తున్నారని చెప్పారు. ఒక్క ఫిరంగిపురంలోనే ఐదువేల హెక్టార్లలో సాగు అవుతుందని తెలిపారు. కాటన్ కార్పొరేషన్ ఇండియా ద్వారా మద్దతు ధరకు పత్తి కొనుగోలుకు నాలుగు కేంద్రాల్లో12 జిన్నింగ్ మిల్లులను మ్యాపింగ్ చేశామని తెలిపారు. గతంలో మాదిరిగా సీఎం యాప్‌లో వివరాలు నమోదుతో పాటు, సీసీఐ వారి కపాస్ కిసాన్ యాప్‌లో రైతులు పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకు వెళ్లే స్లాట్ తేదీ బుక్ చేసుకోవాలని సూచించారు. అనివార్యకారణాలతో రద్దు అయినా ఎన్నిసార్లు అయినా బుక్ చేసుకోవచ్చని చెప్పారు. కానీ స్లాట్ బుక్ చేసుకొని రద్దు చేసుకోకుండా సమయానికి కొనుగోలు కేంద్రానికి వెళ్లకుండా ఉంటే మరొక్కసారి మాత్రమే బుకింగ్‌కు అవకాశమని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించడంలో నిర్లక్ష్యం వహించే వ్యవసాయ సహాయకులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక టోల్ ఫ్రీనెంబర్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పారు. పూర్తిస్థాయిలో జిల్లాలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి అయితా నాగేశ్వరరావు, జిల్లా మార్కెటింగ్ శాఖ ఏడీ సత్యనారాయణ చౌదరి, ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ ప్రసాదరావు, ఏవో వాసంతి, సీసీఐ అధికారులు , వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా అయ్యప్ప పడిపూజ

శివలింగం వద్ద పూజలు నిర్వహిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

భజనలో పాల్గొన్న మహిళలు

నాగ సాధువులతో మహా రుద్రాభిషేకం, మహా భస్మాభిషేకం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని పెనుమాకలో సొసైటీ మాజీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు మేకా శివారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి పడిపూజా మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా నాగ సాధువులు అయ్యప్పస్వామి పడిపూజ జరిగే ప్రాంతంలో మట్టితో శివలింగం తయారు చేశారు. మహా రుద్రాభిషేకం, మహా భస్మాభిషేకం , అన్నాభిషేకాలను అంగరంగ వైభవంగా 45 నిమిషాల పాటు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు పెనుమాక ప్రజలతో పాటు పరిసర ప్రాంత అయ్యప్ప భక్తులు, మహిళలు భారీగా వచ్చారు. శివలింగానికి పూజల అనంతరం నాగ సాధువుల దగ్గర ఆశీర్వాదం, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గురుస్వామి చిరంజీవి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి పడిపూజ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సుమారు రెండు ఎకరాల్లో ఏర్పాటు చేసిన మహోత్సవానికి వచ్చిన వేలాది మంది భక్తులకు పూజా సామగ్రిని అందించారు. అనంతరం భారీ అన్నదానాన్ని నిర్వహించారు.

కనుల పండువగా ఏర్పాటు చేసిన అయ్యప్పస్వామి మండపం

శివలింగానికి అన్నాభిషేకం చేస్తున్న నాగ సాధువులు

వేమారెడ్డి ప్రత్యేక పూజలు

వైఎస్సార్‌సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయ కర్త దొంతిరెడ్డి వేమారెడ్డి నియోజకవర్గంలోని పార్టీ నాయకులతో పూజా మండపం వద్దకు చేరుకున్నారు. శివలింగానికి చేసిన పలు అభిషేకాలను తిలకించి, నాగ సాధువుల వద్ద ప్రత్యేక ఆశీర్వాదం పొందారు. అనంతరం అయ్యప్పస్వామి భజనలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. భారీ అన్నసంతర్పణను మేకా శివారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కోటి సంతకాలతో కూటమి కళ్లు తెరిపిద్దాం

యర్రబాలెంలో సంతకాల సేకరణ చేయిస్తున్న దొంతిరెడ్డి వేమారెడ్డి

నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి టౌన్: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేసి కూటమి ప్రభుత్వ కళ్లు తెరిపిద్దామని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని యర్రబాలెంలో బుధవారం రాత్రి ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు కోట్ల రూపాయలు దోచుకునేందుకే ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ కుట్రకు తెరలేపారని విమర్శించారు. పేదలకు ఉచితంగా నాణ్యమైన వైద్యాన్ని, వైద్యవిద్యను అందించాలని మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టారని వివరించారు. నేడు వాటిని ప్రైవేటీకరణ ద్వారా సీఎం చంద్రబాబు పేదలకు వైద్యాన్ని, వైద్య విద్యను దూరం చేస్తున్నారని మండిపడ్డారు. ఊరూరా సంతకాల సేకరణకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మంగళగిరి మండల అధ్యక్షులు నాలి వెంకట కృష్ణ, గ్రామ అధ్యక్షులు బడే మియా, ఉపాధ్యక్షులు సయ్యద్ అబ్దుల్, కార్యదర్శి బాషా, నాయకులు షఫీ, శంకర్, గని, వశీం, వజీర్ అహ్మద్, రబ్బాని, నాగుల్ మీరా, ఇస్మాయిల్, కాలేషా, బాజీ, ఖాదర్, ఏసోబు, సద్దాం, నాగయ్య, ఇందిర, అనిత, ప్రియానందం, నాగేశ్వరరావు, పోల్‌రాజు, అమీర్‌బాషా, గౌస్, జాని, శ్రీరాములు పాల్గొన్నారు.

మంగళగిరి పట్టణంలో.....

పట్టణ పరిధిలోని 28వ వార్డు శిబిరంలో అధ్యక్షులు కొరగంటి ఆదాం ఆధ్వర్యంలో బుధవారం కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రైవేటీకరణ వల్ల జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు కమిటీ సభ్యులు ప్రశాంత్, రాజేష్, దివ్య పాల్గొన్నారు.

చినకాకానిలో....

గ్రామ అధ్యక్షుడు కాంతారావు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణను చేపట్టారు. కార్యక్రమంలో యువజన విభాగ రాష్ట్ర నాయకులు నూతక్కి జోష్, నాయకులు రామకృష్ణారెడ్డి, రామనాగు, చిన్న, గోపి, వెంకటేశ్వరరావు, రమేష్, కాటంరాజు, గోపీకృష్ణ, నరేంద్ర, రామమోహనరావు, చిన్నోడు, ప్రసాద్, సాంబశివరావు, నాగేశ్వరరావు, శ్యామ్, తంగేశ్వరరావు, తంబి, సునీల్, షిర్డీసాయి, అంకమరావు, జలసూత్రం నాగరాజు, మాధవి పాల్గొన్నారు.

మంత్రి లోకేష్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

తాడేపల్లి రూరల్ : ఎన్నికలకు ముందు నారా లోకేష్ కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమాండ్ చేశారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు నిర్వహిస్తున్న దీక్షలను యూనియన్ నాయకులు సుభాని, గురవయ్య, నాగేశ్వరరావు, అంకయ్యలతో కలసి బుధవారం ఆయన సందర్శించారు. కార్మికులకు మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఈ ప్రాంతంలో పర్యటించిన నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే కార్మికుల సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. సిమెంట్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆయన కోరారు. కార్మికులు 337 రోజులుగా దీక్షలు చేస్తున్నా పట్టించుకోకపోవడం దారుణమని ఖండించారు. దీక్షల్లో కార్మికులు నాగరాజు, బుట్టి, ఏసోబు, శారమ్మ, సువర్ణకుమారి, రమణమ్మ పాల్గొన్నారు.

తుపాను బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ



మంగళగిరి టౌన్: మండల పరిధిలోని ఆత్మకూరులో గల హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో తుపాను బాధిత కుటుంబాలకు రూ. 5 లక్షల విలువైన నిత్యావసర వస్తువుల కిట్లను అందజేసింది. ఎన్‌టీఆర్ జిల్లా తోట్లవల్లూరు మండలం రొయ్యూరు గ్రామ, పరిసర లంక గ్రామాల్లోని పలు కుటుంబాలకు బుధవారం పంపిణీ చేసింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు వంశీధర దాస మాట్లాడుతూ సహాయ కార్యక్రమానికి మద్దతు ఇచ్చిన దాతలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కిట్లలో ఇద్దరు వ్యక్తులకు 15 రోజులు సరిపడా సరుకులు ఉన్నాయని చెప్పారు. విపత్తుల సమయంలో ఆదుకోవడానికి హరేకృష్ణ మూమెంట్ ముందు ఉంటుందని తెలిపారు.కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యక్షులు విలాస దాస్, పీఆర్వో రఘునందన దాస్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సంతకాల సేకరణకు స్పందన

వార్డులో సంతకాలు సేకరిస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్ : పట్టణ పరిధిలోని 2వ వార్డులో వైఎస్సార్ సీపీ నాయకుల ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు అధ్యక్షుడు చాగంటి బాపిరెడ్డి ఆధ్వర్యంలో సీఎస్ఆర్ రోడ్డు, సీసాల కంపెనీ ప్రాంతాల్లో సంతకాలు సేకరించారు. ప్రజల నుంచి భారీగా స్పందన వచ్చింది. కార్యక్రమంలో నాయకులు జక్కిరెడ్డి వెంకట కృష్ణారెడ్డి, జక్కిరెడ్డి లింగారెడ్డి, అమ్మిరెడ్డి యోగిరెడ్డి, దాడిపత్రి కోటిరెడ్డి, వేముల శివయ్య, పేరం హరినాథరెడ్డి, జక్కిరెడ్డి శ్రీనివాసరెడ్డి, గద్దె వెంకటేష్, గోవిందరెడ్డి, జె. నాగలక్ష్మి, దాట్ల వెంకటేశ్వరరెడ్డి, సాలూరు కోటేశ్వరరావు, మున్నంగి చెంచిరెడ్డి, జక్కిరెడ్డి కోటిరెడ్డి, వేముల నాగేశ్వరరావు, మారెళ్ల రమణారెడ్డి, రెడ్డిబత్తుల వీరారెడ్డి, కొండపురెడ్డి కోటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

భవ్యశ్రీని అభినందిస్తున్న ప్రముఖులు

మంగళగిరి టౌన్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని దుగ్గిరాల ఎంఈవో కె. శ్రీనివాసరావు పేర్కొన్నారు. మంగళగిరి మండల పరిధిలోని పెదవడ్లపూడి విజేత హైస్కూలులో ఇటీవల స్విమ్మింగ్ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థిని భట్టు భవ్యశ్రీ అభినందన సభ బుధవారం ఏర్పాటు చేశారు. పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఆమె ఇటీవల జరిగిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అంతర్ జిల్లాల స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం భవ్యశ్రీని శాలువాతో సత్కరించి అభినందించారు. పలువురు మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, పాఠశాల డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఇందిరాదేవి, స్విమ్మింగ్ కోచ్ నాగేశ్వరరావు, క్రీడాకారిణి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక పౌర్ణమి పూజలు

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల శివాలయాల్లో బుధవారం కార్తిక పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు చేశారు. వేమవరంలోని కోటి ఒక్క లింగాల క్షేత్రానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మహా కాళేశ్వరుడిని దర్శించుకొని ముఖ మండపం వద్ద కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయం, కాళహస్తీశ్వర ఆలయాల్లో భక్తులు కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేశారు. సొలస బస్టాండు సెంటర్‌లోని సాయినాథ ఆలయంలో స్వామికి అర్చకులు నరసింహమూర్తి విశేషపూజలు నిర్వహించారు. జ్వాలాతోరణాన్ని ఏర్పాటు చేసి ఉత్సవ మూర్తులతో మేళతాళాల మధ్య ప్రదక్షిణలు చేశారు.

దుగ్గిరాలలో..

స్థానిక శ్రీ గంగా పార్వతీ సమేత నాగేంద్ర స్వామి ఆలయానికి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆలయంలో ఏర్పాటు జ్వాలా తోరణాన్ని తిలకించారు. అర్చకులు యుగంధర్ శర్మ జ్వాలా తోరణం ప్రత్యేకతను వివరించారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

దుగ్గిరాల: మండలంలోని కరకట్ట లోపలి వైపు రీచ్ నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ యస్.వెంకట రవి తెలిపారు. బుధవారం సాయంత్రం వచ్చిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో కలిసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. తదుపరి చర్యల నిమిత్తం దుగ్గిరాల మండల తహసీల్దారుకు అప్పగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

డ్రగ్స్ వినియోగం.. ఆరోగ్యానికి హానికరం

తాడికొండ: ధూమపానం, మాదక ద్రవ్యాల వినియోగం ఆరోగ్యానికి హానికరమని తాడికొండ ఎస్ఐ జీత్యా నాయక్ అన్నారు. బీఎస్ఎస్‌బీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం తాడికొండలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యపానం, సిగరెట్, గంజాయి వంటి మాదక ద్రవ్యాల వినియోగం చట్టరీత్యా నేరమని, యువత వాటికి దూరంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎన్ఎస్ఎస్ విభాగాధికారి ఎం. సుధాకర్, కార్యదర్శి రమణయ్య, ఎన్ఎస్ఎస్ అధికారి వేణుబాబు, సురేష్ పాల్గొన్నారు.

పేదలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలి

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని యాక్సెస్ రోడ్డులో ఇళ్లు కోల్పోయే పేదలకు రెండు సెంట్ల ఇంటి స్థలంతో పాటు నిర్మాణానికి రూ. 5 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఇళ్లు కోల్పోయే బాధితులతో బుధవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు టిడ్కో ఇళ్లు ఇస్తామని టీడీపీ నాయకులు చెబుతున్నారని, అవి తమకు అవసరం లేదని బాధితులు తమ దృష్టికి తీసుకువచ్చారని చెప్పారు. నిబంధనల ప్రకారం ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

విద్యార్థులపై నిర్లక్ష్యం తగదు

మంగళగిరి టౌన్: అధిక ఫీజులు వసూలు చేసే ప్రముఖ విద్యాసంస్థల్లో విద్యార్థులపై నిర్లక్ష్యం తగదని సీపీఐ రాష్ట్ర నాయకులు ముప్పాళ నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళగిరి మండలం నీరుకొండలోని ఎస్ఆర్ఎం హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్ ఘటన రాష్ట్రంలో కలకలం రేపిందన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, పలువురు పరిస్థితి విషమించగా వారిని ఆసుపత్రికి తరలించారని పేర్కొన్నారు. సమస్యలు బయటకు రాకుండా ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యం దాచి పెట్టేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఫిరంగిపురం: సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా గురువారం ఫిరంగిపురంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ దుర్గాప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు సరఫరా నిలిపివేస్తామని ఆయన తెలిపారు.

తాడేపల్లి రూరల్‌లో..

అత్యవసర మరమ్మతుల దృష్ట్యా మండల పరిధిలో గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉండవల్లి కరకట్ట, కొండవీటి వాగు నుంచి మంతెన ఆశ్రమం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ సురేష్‌బాబు తెలిపారు.

మంగళగిరి టౌన్‌లో..

విద్యుత్ లైన్ల మరమ్మతుల దృష్ట్యా గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నవులూరు గ్రామ పరిధిలోని గోలివారి తోట, పశువుల హాస్పిటల్ రోడ్డు, ఆర్టీఓ కార్యాలయం రోడ్డు, బాపనయ్యనగర్, ఈఎస్ఆర్ గార్డెన్, టిడ్కో గృహ సముదాయాల్లో సరఫరా నిలిపి వేయనున్నట్లు డీఈ జి.సురేష్‌బాబు తెలిపారు.

ట్రంప్ సుంకాలతో భారత్‌కు తీవ్ర నష్టం

మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు

మంగళగిరి టౌన్ : ట్రంప్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భారత్‌పై మోపిన సుంకాలను వ్యతిరేకించాలని మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మంగళగిరి మండల పరిధిలోని కాజలో సీపీఎం నాయకులు సింహాద్రి మహేశ్వరరెడ్డి 15వ వర్ధంతి సభ బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మణరావు మాట్లాడుతూ ట్రంప్ సుంకాలు భారతదేశానికి తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని తెలిపారు. వ్యవసాయ రంగం, టెక్స్‌టైల్, రొయ్యల పరిశ్రమలు తీవ్రంగా నష్టపోతున్నాయని, లక్షలాది మంది ఉపాధిని కోల్పోతున్నారని పేర్కొన్నారు. కామ్రేడ్ సింహాద్రి మహేశ్వరరెడ్డి స్ఫూర్తితో స్థానిక సమస్యలపై పార్టీ నేతలు పోరాడాలని పిలుపునిచ్చారు.

జీఎస్టీతో సంక్షోభంలో చేనేత రంగం

మంగళగిరి టౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేనేతపై జీఎస్టీ వేయడంతో ఆ రంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడిందని ఆంధ్రప్రదేశ్ చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ అన్నారు. మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరులో బుధవారం గ్రామ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. బాలకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయం తరువాత చేనేత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెందిన పరిశ్రమని తెలిపారు. కార్పొరేట్ విధానాల వల్ల నేడు సంక్షోభంలో చిక్కుకోవడంతో చేనేత కార్మికులు ఆకలి చావులు, ఆత్మహత్యలకు బలి అవుతున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం ఇచ్చిన నేతన్న నేస్తం పథకాన్ని కూటమి ప్రభుత్వం అమలు జరపలేదని, బడ్జెట్‌లో సైతం చేనేతకు కేటాయింపులు కూడా లేవని తెలిపారు. చేనేతలకు రూ. 25 వేలు ఇస్తామని చంద్రబాబు నాయుడు ప్రకటించారని, దాన్ని వెంటనే అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

క్లుప్తంగా...

జాతీయ రహదారిపై వైన్‌షాపు వద్దు

- మద్యం దుకాణం ప్రారంభాన్ని అడ్డుకున్న మహిళలు
- అనుమతి ఎలా ఇస్తారంటూ ప్రభుత్వంపై ఆగ్రహం

మద్యం షాపు వద్దంటూ రాస్తారోకో చేస్తున్న మహిళలు

పుత్తూరు: మద్యం కారణంగా ఇటీవల తీవ్ర ప్రమాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తిరుపతి జిల్లా పుత్తూరులో ప్రారంభిస్తున్న మద్యం దుకాణాన్ని స్థానికులు బుధవారం అడ్డుకున్నారు. తిరుపతి–చెన్నై జాతీయ రహదారిపై మద్యం దుకాణం వద్దు అంటూ ప్లకార్డులు చేతపట్టి రాస్తారోకో చేశారు. మహిళలు మాట్లాడుతూ.. ఊరి బయట ఉన్న మద్యం షాపును పట్టణ నడిబొడ్డున ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వం ఎలా అనుమతిస్తుందంటూ నిలదీశారు. మద్యం షాపు ఏర్పాటు విషయం తెలిసిన తర్వాత స్థానిక ఎక్సైజ్ శాఖ, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో వినతి పత్రాలు ఇచ్చామని, అయినా షాపు ప్రారంభానికి ప్రభుత్వం ఎలా అనుమతిస్తుందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లో షాపు ఏర్పాటు చేయడం కుదరదంటూ తేల్చి చెప్పారు. దీంతో చేసేది లేక మద్యం షాపు ప్రారంభాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. మళ్లీ ప్రారంభోత్సవం అంటూ వస్తే తాము రోడ్డెక్కి ఆందోళన చేస్తామని మహిళలు ఘాటుగా హెచ్చరించారు.

పత్తి కొనుగోలుకు 30 సీసీఐ కొనుగోలు కేంద్రాలు

- 8 శాతం తేమ ఉన్న పత్తి క్వింటాకు రూ.8,110
- సీసీఐ జనరల్ మేనేజర్ రాజేంద్ర షా

కొరిటెపాడు (గుంటూరు): ప్రస్తుత పత్తి సీజన్ 2025–26 కోసం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) రాష్ట్రంలో 30 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు సీసీఐ జనరల్ మేనేజర్ రాజేంద్ర షా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే కర్నూలు, నంద్యాల, ప్రకాశం తదితర జిల్లాల్లో పలు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు పేర్కొన్నారు. నాణ్యతా ప్రమాణాల ప్రకారం తేమ 8 శాతం మించకపోతే రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.8,110 ఇస్తామని తెలిపారు. 8 శాతం నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తికి తక్కువ ధర చెల్లిస్తామని, పత్తి రైతులు నాణ్యతతో పాటు ఆరబెట్టిన పత్తిని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని కోరారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

వెంకట్రాముడు(ఫైల్)

కృష్ణగిరి: పంటలు సరిగా పండక, ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో ఓ రైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కర్నూలు జిల్లా కృష్ణగిరి మండలంలోని ఎరుకులచెరువు గ్రామంలో చోటు చేసుకుంది. మృతుని కుమారుడు కురువ వీరాంజనేయులు ఫిర్యాదు మేరకు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన వివరాలివీ.. గ్రామానికి చెందిన కురువ వెంకట్రాముడు (46) తనకున్న మూడు ఎకరాల్లో వ్యవసాయం చేస్తున్నాడు. భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు కుమారులు సంతానం. ఈ ఏడాది పత్తి పంట సాగు చేయగా రూ.6లక్షల వరకు అప్పు చేశాడు. అయితే అధిక వర్షాలతో పంట సరిగా చేతికందక, వచ్చిన దిగుబడులకు ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో తీవ్ర మనస్తాపానికి లోనై ఈనెల 3వ తేదీ మధ్యాహ్నం ఇంట్లో పేడరంగు నీళ్లలో కలుపుకుని ఆత్మహత్యకు యత్నించాడు. వాంతులు చేసుకుంటూ, అపస్మారక స్థితికి చేరుకోవడంతో గమనించిన కుమారుడు కర్నూలు జీజీహెచ్‌కు తరలించగా.. కోలుకోలేక 4వ తేదీ మంగళవారం రాత్రి మరణించాడు.

ఎస్ఆర్ఎం యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

సీపీఐ నేత ముప్పాళ్ల నాగేశ్వరరావు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): వేలాది మంది విద్యార్థులు ఉన్న హాస్టల్‌లో ఆహార ప్రమాణాలు పాటించని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు ముప్పాళ్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వేలాది మంది ఉండే ఎస్ఆర్ఎం యూనివర్సిటీ హాస్టల్‌లో ఫుడ్ పాయిజనింగ్ వల్ల వందలాది మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలిసిందన్నారు. వారిలో కొందరిని హాస్టల్‌లోనే ఉంచి చికిత్స అందించారని.. 300 మందిని ఆస్పత్రులకు తరలించారని చెప్పారు. నలుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు తెలిసిందన్నారు. అత్యధిక ఫీజులు వసూలు చేసే విద్యాసంస్థలో ఇలాంటి ఘటన జరగడం దారుణమన్నారు. గుంటూరు కలెక్టర్ వెంటనే ప్రత్యేక బృందాన్ని పంపించి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు భయంతో బయటకు వచ్చి మాట్లాడలేని పరిస్థితి ఉందని.. ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని కోరారు.

నాటికళ ఇలా..

వైఎస్ జగన్ హయాంలో కాంతులీనుతూ సందర్శకుల్ని ఆకర్షించిన అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం

అంబేడ్కర్‌పైనా కూటమి కక్ష!

సామాజిక న్యాయ మహాశిల్పంపైనా చంద్రబాబు సర్కారు కుయుక్తులు

విజయవాడ నగరం నడిబొడ్డున మహోన్నత ఆశయంతో నిర్మించిన వైఎస్ జగన్

- ప్రాంగణంలోకి తప్ప మహాశిల్పం లోపలికి అనుమతించని బాబు సర్కారు
- పారిశుద్ధ్య నిర్వహణ సైతం గాలికి.. ప్రాంగణం అంతా చెత్తా చెదారం
- నాడు అందమైన వాటర్ ఫౌంటైన్లు.. నేడు నాచు పట్టి దుర్వాసన
- ఇక్కడ పనిచేసే 23 మందికి 9 నెలలు జీతాలు నిలిపివేత
- ధర్నాకు దిగడంతో రెండు రోజుల క్రితం 6 నెలల జీతాలు జమ
- ఆందోళన చేశారనే అక్కసుతో సిబ్బందిని తొలగించే ప్రయత్నాలు

సాక్షి, అమరావతి: భావితరాలకు సైతం స్ఫూర్తిదాయకంగా నిలిచేలా విజయవాడ నగరం నడిబొడ్డున వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్మించిన బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పంపై కూటమి ప్రభుత్వం కక్ష కొనసాగుతూనే ఉంది. దాదాపు 20 ఎకరాల్లో సుమారు రూ.297.71 కోట్లతో మహోన్నత ఆశయంతో నిర్మించిన అద్భుత ప్రాంగణం అసలు లక్ష్యాన్ని నీరుగార్చే ప్రయత్నం చేస్తోంది. వైఎస్ జగన్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్న అక్కసుతో చంద్రబాబు ప్రభుత్వం రాగానే సామాజిక న్యాయ మహాశిల్పంపై వక్రదృష్టి సారించింది. అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే స్వరాజ్ మైదానంలోని అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం పేరు (స్టీల్ అక్షరాలు)ను తొలగించారు. ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవడంతో దానిలో వైఎస్ జగన్ పేరు తొలగించి అంబేడ్కర్ పేరును మాత్రం మళ్లీ ఏర్పాటు చేశారు. అంతటితో ఆగకుండా ఆ ప్రాంగణంలో గత ప్రభుత్వం చేపట్టిన చిల్డ్రన్స్ ప్లే ఏరియా, ఆడిటోరియం, లైబ్రరీ తదితర నిర్మాణాలను సైతం నిలిపివేసింది. డ్వాక్రా బజార్ పేరుతో స్టాల్స్ ఏర్పాటు చేయించింది. దీనిపై ప్రజాగ్రహం వ్యక్తమవడంతో నెల తర్వాత ఆ స్టాల్స్‌ను తొలగించింది.

ప్రైవేటు పరానికి యత్నం

భారత రాజ్యాంగ నిర్మాత చరిత్ర, ఆయన ఘనతను నిలువెత్తున నిలబెట్టిన సామాజిక న్యాయ మహాశిల్పాన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మరింత అద్భుతంగా తీర్చిదిద్దాల్సింది పోయి పీపీపీ పద్ధతిలో ప్రైవేట్ పరం చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం కుట్ర పన్నింది. దీనిపై వైఎస్సార్‌సీపీ, వామపక్షాలు, దళిత, గిరిజన సంఘాలు ఈ ఏడాది జనవరిలో ఆందోళనకు దిగాయి. దీంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది.

చెత్తాచెదారాల మయం

ప్రైవేటీకరణ ప్రయత్నం బెడిసికొట్టడంతో సర్కారు మరో కుయుక్తి పన్నింది. ఆ ప్రాంగణాన్ని ఎవరూ సందర్శించకుండా చేయడానికి పారిశుద్ధ్య నిర్వహణను గాలికొదిలేసింది. ఒకప్పుడు పచ్చటి పచ్చిక బయళ్లు, పిల్లల ఆటస్థలాలు, ఉవ్వెత్తున ఎగసే అందమైన ఫౌంటైన్లు, రంగురంగుల విద్యుద్దీపాలతో, నిత్యం వేలాది సందర్శకులతో కళకళలాడిన ఈ ప్రాంగణం ఇప్పుడు చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ప్రాంగణంలోని వాటర్ ఫౌంటైన్లలో నీరు మార్చకపోవడంతో అవి నాచు, చెత్తతో నిండిపోయాయి.

సిబ్బందికి 9 నెలలు వేతనాలు నిలిపివేత

ఇక్కడ పనిచేస్తున్న 23 మంది సిబ్బందికి 9 నెలల క్రితం ప్రభుత్వం జీతాలు నిలిపివేసింది. అక్టోబరు 3 నుంచి వారు ధర్నాలు చేపట్టడంతో తొలుత ఒక నెల జీతం మాత్రమే ఇచ్చింది. మళ్లీ ఆందోళనకు దిగడంతో కొద్ది రోజుల క్రితం 6 నెలల జీతాలు చెల్లించింది. ఆందోళన చేశారనే అక్కసుతో ఇప్పుడు వారిలో కొందరిని తొలగించే ప్రయత్నం చేస్తోంది.

ఇది మరో దారుణం

అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం దేశంలోనే ఓ స్ఫూర్తిదాయక ప్రదేశం. ఇక్కడ కేవలం అంబేడ్కర్ నిలువెత్తు శిల్పమే కాదు.. అంబేడ్కర్ చరిత్రను ఆవిష్కరించారు. మహాశిల్పం పెడస్టల్ (పీఠం)లోని 3అంతస్తుల్లో అంబేడ్కర్ చరిత్రను తెలిపే డిజిటల్ చిత్రాలు, లైబ్రరీతోపాటు ఆడిటోరియం కూడా ఉన్నాయి. కూటమి ప్రభుత్వం దీనిని నీరుగార్చేలా ఎవరినీ లైబ్రరీ, ఆడిటోరియం లోపలికి అనుమతించడంలేదు. సందర్శకులను నిరుత్సాహపరిచేలా ప్రభుత్వం పథకం ప్రకారమే ఇలా చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు ఇలా వెలవెల

సామాజిక న్యాయ మహా శిల్పం ప్రాంగణంలో చెత్తాచెదారం, నాచుతో నిండి ఉన్న ఫౌంటైన్

స్మృతివనంలోని ఫౌంటైన్లలో తిష్టవేసిన మురుగు

రైతులు అల్లాడుతుంటే చంద్రబాబు విదేశీ పర్యటనలా?

- రైతుల సమస్యల పరిష్కారంపై చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదు
- క్రికెట్ మ్యాచ్‌లు చూస్తూ లోకేశ్ వినోదం
- షూటింగ్ మాదిరిగా పవన్ మొక్కుబడి పరామర్శ
- మాజీ మంత్రి చెల్లుబోయిన వేణు

సాక్షి, అమరావతి: మోంథా తుపాను మిగిల్చిన నష్టాలతో రైతులు అల్లాడుతుంటే చంద్రబాబు విదేశీ పర్యటనలు చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ అన్నారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. మోంథా తుపానుతో రైతులు తీవ్రంగా నష్టపోయి కన్నీళ్లు పెట్టుకుంటుంటే.. చంద్రబాబు విదేశీ పర్యటనకు, నారా లోకేశ్ క్రికెట్ మ్యాచ్‌లు చూడటానికి దేశ విదేశాల్లో తిరుగుతూ ఎంజాయ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురం నియోజకవర్గంలో ప్రజలు తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయారని.. ఆయన కూడా తూతూమంత్రంగా వచ్చిపోయారే తప్ప బాధితులకు న్యాయం చేసే ఆలోచన చేయలేదని ధ్వజమెత్తారు. బాధ్యత వహించాల్సిన వ్యవస్థలు బాధ్యతా రాహిత్యంగా పనిచేస్తే ప్రజలు తమ కష్టాలు తీరక మౌనంగా రోదిస్తారని.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక పరిపాలన ఇదే తీరున ఉందని చెప్పారు. ఇలాంటి సమస్యల నుంచి డైవర్షన్ కోసం ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని జగన్‌పైన, వైఎస్సార్‌సీపీపైన బురద జల్లడం టీడీపీకి పరిపాటిగా మారిందని ధ్వజమెత్తారు.

ఇప్పటికీ రైతు వ్యతిరేకిగానే చంద్రబాబు

నాలుగోసారి ముఖ్యమంత్రి అయినా వ్యవసాయం దండగ అనే ఆలోచనలోనే చంద్రబాబు ఉన్నారని చెల్లుబోయిన వేణు పేర్కొన్నారు. ఇప్పుడు మరోసారి రైతు వ్యతిరేకి అని నిరూపించుకుంటున్నారన్నారు. పోలవరం పూర్తి చేయకుండా రైతుల జీవితాలతో ఆడుకుంటున్నారని, మూడు పంటలు పండే భూమిని రాజధాని ప్రాంతం కోసం ఎంపిక చేసిన విధానం చూసినా ఆయన రైతు వ్యతిరేకి అని చెప్పక తప్పదన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో నాటి సీఎం వైఎస్ జగన్ రైతులకు అడుగడుగునా అండగా నిలిచారని గుర్తు చేశారు. ఆర్బీకేల ద్వారా విత్తనం నుంచి విక్రయం వరకు రైతుల చేయిపట్టి నడిపించారన్నారు. రైతు భరోసా ద్వారా ఏడాదికి రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం ఇచ్చి ఆదుకున్నారని, ఐదేళ్లలో పంట నష్టం పరిహారంగా రూ.7,802 కోట్లు అందజేసి రైతు పక్షపాతిగా నిలిచారని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉచిత పంటల బీమా పథకాన్ని పూర్తిగా ఎత్తేసిందని, ఈ–క్రాపింగ్ తూతూమంత్రంగా చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ వారికి ఉన్న భూమి కన్నా, ఎక్కువ పంట వేసినట్టు చూపుతున్నారని, ఇతరులకైతే పూర్తిగా ఆపేసి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది అత్యంత హేయమన్నారు.

డైవర్షన్ రాజకీయాలతో సరి

ఆలయాల్లో ప్రమాదాలు జరిగినప్పుడు కారకులపై చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం అందులోనూ రాజకీయాలు చేసి మరణించిన వారి కుటుంబాలకు తీరని క్షోభను కలిగిస్తోందని చెల్లుబోయిన ధ్వజమెత్తారు. కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట విషయంలోను, రైతులకు కలిగిన నష్టాల విషయంలోను సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. రాష్ట్రంలోని పరిణామాలను చూస్తే చంద్రబాబుకు డైవర్షన్ తప్ప పాలనలో డైరక్షన్ చేతకావడం లేదనే విషయం స్పష్టంగా అర్థమవుతోందన్నారు.

12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఏసీబీ తనిఖీలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలపై ఏసీబీ అధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. జగదాంబ సెంటర్, పెద్దగంట్యాడ, మధురవాడ(విశాఖపట్నం జిల్లా), భోగాపురం(విజయనగరం జిల్లా), ఇబ్రహీంపట్నం(ఎన్టీఆర్ జిల్లా), నరసరావుపేట(పల్నాడు), ఒంగోలు(ప్రకాశం), స్టోన్ హౌస్ పేట(నెల్లూరు), రేణిగుంట(తిరుపతి జిల్లా), రాజంపేట(అన్నమయ్య), చిలమత్తూరు(అనంతపురం), ఆళ్లగడ్డ(కర్నూలు) సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోదాలు నిర్వహించారు. పలు కార్యాలయాల్లో రూ.10వేల నుంచి రూ.75వేల వరకు లెక్కల్లో చూపని నగదును గుర్తించారు. నగదుతోపాటు పలు రికార్డులను ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

ఒంగోలులో సోదా చేస్తున్న ఏసీబీ అధికారులు

బుధవారం అర్ధరాత్రి వరకు తనిఖీలు కొనసాగాయి. కాగా, పారదర్శకత కోసమే సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల్లో ఏసీబీ తనిఖీలు జరిగాయని, ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఇవి చేసినట్లు మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియాకు తెలిపారు.

యూరియా కోసం రైతులకు తప్పని పాట్లు

నాగలాపురం: తిరుపతి జిల్లా నాగలాపురం మండల వ్యవసాయ కేంద్రం వద్ద బుధవారం యూరియా కోసం రైతులు బారులు తీరారు. టోకెన్లు (కార్డులు) పంపిణీ చేస్తున్నారని తెలుసుకుని బుధవారం రైతులు భారీగా తరలి వచ్చారు. ఉదయం నుంచి నాగలాపురంలోని మండల వ్యవసాయ కేంద్రం వద్ద పడిగాపులు కాశారు. ఉదయం 11.30 గంటలు దాటినా టోకెన్లు ఇచ్చే సిబ్బంది ఎవరూ రాలేదు. దీంతో చాలా మంది రైతులు వెనుదిరిగారు. అనంతరం వచ్చిన వ్యవసాయ శాఖ అధికారి అక్కడ ఉన్న కొందరికి మాత్రమే టోకెన్లు అందజేశారు. మిగిలిన రైతులు ఇదేం ప్రభుత్వం..

నాగలాపురం మండల వ్యవసాయ కేంద్రం వద్ద యూరియా కోసం పడిగాపులు కాస్తున్న రైతులు

రైతులను ఇక్కట్ల పాలు చేస్తున్న ప్రభుత్వం.. అని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెనుదిరిగారు.

టీసీఎస్‌కు నామమాత్రపు ధరకే భూములివ్వడంపై

హైకోర్టులో పిల్

ప్రభుత్వ ఉత్తర్వుల అమలును నిలిపేయాలని కోరిన వడ్డే శోభనాద్రీశ్వరరావు

సాక్షి, అమరావతి: విశాఖపట్నం ఐటీ హిల్స్‌లో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)కి 21 ఎకరాల భూమిని అమ్మకపు ఒప్పందం ద్వారా నామమాత్రపు ధరకే కేటాయిస్తూ జారీచేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ రైతు ఉద్యమనేత వడ్డే శోభనాద్రీశ్వరరావు హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల అమలును నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని పిటిషన్‌లో కోరారు. ఈ వ్యాజ్యంపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్ ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎ.సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. టీసీఎస్‌కు భూ కేటాయింపులపై ఇప్పటికే దాఖలైన పిల్ విచారణ సందర్భంగా ప్రభుత్వం తాము లీజు పద్ధతిలోనే భూమిని కేటాయిస్తున్నామే తప్ప, అమ్మకం ద్వారా ఇవ్వడం లేదని స్పష్టంగా చెప్పిందని గుర్తుచేశారు. ఈ విషయాన్ని హైకోర్టు తన ఉత్తర్వుల్లో రికార్డ్ చేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. కోర్టులో చెప్పిన దానికి భిన్నంగా ప్రభుత్వం ఇప్పుడు అమ్మకపు ఒప్పందం ద్వారా టీసీఎస్‌కు భూ కేటాయింపులు చేస్తోందన్నారు. విలువైన భూమిని ఇలా వాణిజ్య అవసరాలకు ఇచ్చేయడం దారుణమని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. కౌంటర్ దాఖలు చేయాలంటూ విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది.

పోలీసు అధికారులకు ప్రభుత్వం

జీతభత్యాలు ఇవ్వడం లేదు

- పోస్టింగ్‌లు ఇవ్వకుండా వీఆర్‌లో ఉంచింది
- హైకోర్టులో తిరుపతి ఎంపీ గురుమూర్తి పిల్
- సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లాలన్న హైకోర్టు

సాక్షి, అమరావతి: రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా రాష్ట్రంలో పలువురు పోలీసు అధికారులను వేకెన్సీ రిజర్వ్ (వీఆర్)లో ఉంచి ఎలాంటి జీతాలు చెల్లించకపోవడాన్ని ప్రశ్నిస్తూ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. దీనిపై బుధవారం ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చల్లా గుణరంజన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. గురుమూర్తి తరఫు న్యాయవాది వి.మహేశ్వరరెడ్డి వాదనలు వినిపిస్తూ... ''విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరిస్తారనే పేరున్న పోలీసు అధికారులను చాలాకాలంగా ప్రభుత్వం వీఆర్‌లో ఉంచింది. ప్రభుత్వం సహేతుక కారణాలు లేకుండానే ఇలా చేసింది. ఇది చట్ట విరుద్ధం. 199 మంది అధికారులకు జీతభత్యాలు అందడం లేదు. వారి కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నాయి. పోలీసు సంస్కరణల విషయమై ప్రకాశ్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు చాలా స్పష్టమైన ఆదేశాలు, మార్గదర్శకాలు జారీ చేసింది. వాటిని ప్రతి రాష్ట్రం పాటించాల్సి ఉంది'' అని తెలిపారు. ధర్మాసనం స్పందిస్తూ, ప్రకాశ్‌సింగ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదంటే ఈ విషయాన్ని సుప్రీంకోర్టు దృష్టికే తీసుకెళ్లాలని పిటిషనర్‌కు స్పష్టం చేసింది. జీతాలు అందక ఇబ్బందులు పడుతుంటే సంబంధిత పోలీసు అధికారులే కోర్టుకు వస్తారని, వారి తరఫున వ్యాజ్యాన్ని దాఖలు చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. ఈ మొత్తం వ్యవహారంపై సుప్రీంకోర్టును ఆశ్రయించడమే మేలని పిటిషనర్‌కు సూచించింది.

● ట్రెండ్



మన దేశంలోని యువతలో 'పాప్‌కార్న్ బ్రెయిన్ సిండ్రోమ్' పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు మానసిక నిపుణులు. అధిక స్క్రీన్ టైమ్, డిజిటల్ ఓవర్ లోడ్ ద్వారా ఏకాగ్రత కోల్పోవడమే పాప్‌కార్న్ బ్రెయిన్ సిండ్రోమ్. వాషింగ్టన్ విశ్వవిద్యాలయ పరిశోధకుడు డేవిడ్ లేవి కాయిన్ చేసిన పదం ఇది. పాప్‌కార్న్ గింజలు ఒకచోటు నుంచి మరోచోటుకి జంప్ చేసినట్లే ఏకాగ్రత కుదరని వారి ఆలోచనలు కూడా స్థిరంగా ఉండవు అనే కారణంతో 'పాప్‌కార్న్ బ్రెయిన్' అని పేరు పెట్టారు.

స్త్రీ గర్భం దాల్చాక శిశు జననం వరకూ ఎన్నో ఆనంద ఘడియలు, అన్నే ఆందోళనలు. తల్లి ఆరోగ్యమూ, బిడ్డ ఆరోగ్యమూ కాపాడుకోవాలి. తల్లితో లోపలి బిడ్డ బంధం బలపడాలి. ఇవన్నీ సంగీతం వల్ల సాధ్యమవుతాయంటోంది చెన్నైకి చెందిన మ్యూజిక్ టీచర్ దివ్యలక్ష్మి. గర్భం దాల్చిన తల్లులకు శాస్త్రీయ సంగీతం నేర్పేందుకు దివ్య తయారు చేసిన ఆరు నెలల కోర్సుకు కాబోయే తల్లులు సరిగమలతో బదులిస్తున్నారు. వివరాలు...

సరిగమల్లో నవ మాసాలు

కుమార్తె ఆరోహితో దివ్యలక్ష్మి

దివ్యలక్ష్మి కమలాకన్నన్‌కు ఈ ఐడియా తన కూతురిని చూశాక వచ్చింది.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో బీటెక్ చదివి ఆ తర్వాత బాల్యం నుంచి నేర్చుకుంటున్న కర్నాటక సంగీతంలోనే తన జీవితాన్ని నిమగ్నం చేయాలని నిశ్చయించుకున్న దివ్య లక్ష్మి మెడ్రాస్ యూనివర్సిటీ నుంచి సంగీతంలో పట్టా తీసుకుంది. ఆ తర్వాత సౌత్ చెన్నైలో ఆమె ఎన్నో సంగీత ప్రదర్శనలు ఇవ్వడమే కాక అక్కడి కిల్ పార్క్ గార్డెన్‌లో 'ఆరోహణ' పేరుతో సంగీత పాఠశాల నెలకొల్పింది. కర్నాటక, హిందూస్తాని, ఇన్‌స్ట్రుమెంటల్ సంగీతాలలో ఇక్కడ శిక్షణ ఇస్తూ గుర్తింపు పొందిన దివ్యలక్ష్మి లాక్‌డౌన్ రావడంతో డీలా పడింది. ఇన్‌స్టిట్యూట్ మూసేసింది. ఆ సమయానికి ఆమె గర్భంతో ఉంది. ఇంట్లో తనే సంగీత సాధన చేస్తూ వెళ్లింది.

కుమార్తె ఆరోహి పుట్టాక ఆ పాప ఒకటిన్నర సంవత్సరాల వయసుకే విపరీతంగా జ్ఞాపక శక్తి ప్రదర్శించడం దివ్యలక్ష్మికి ఆశ్చర్యం కలిగించింది. మూడున్నరేళ్లు వచ్చేసరికి ఆరోహి వయొలిన్ చేత పట్టుకుని సరిగమలు పలికించడం ఇంకా సంతోషపెట్టింది. ఆరోహి తన కడుపులో ఉన్నప్పుడు తాను సాధన చేసిన శాస్త్రీయ సంగీతం పాప తెలివితేటల ఎదుగుదలకు ఉపయోగపడిందని దివ్యలక్ష్మికి అనిపించింది. గర్భవతులకు శాస్త్రీయ సంగీతం నేర్పిస్తే, వారు డెలివరీ అయ్యేంత వరకు శాస్త్రీయ సంగీతం వింటూ ఉంటే పుట్టబోయే బిడ్డకు అన్ని విధాలా ఉపయోగమని అర్థం చేసుకుంది. ఈ విషయాన్ని మరింతగా నిర్ధారించుకోవాలని నిశ్చయించుకుంది.

నాదమే వైద్యం

'సంగీతంలో నాదం ఉంటుంది. ఆ నాదం గర్భిణీ స్త్రీ శరీరంలోని నీటిలో అనునాదం పుట్టిస్తుంది. ఆమె ఆరోగ్యాన్ని సమతుల్యం చేయడమే కాకుండా పిండస్థ శిశువు ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. అంతే కాదు... ఇలా సంగీత పాఠాల కోసం వచ్చే గర్భిణుల మధ్య ఒక స్నేహం ఏర్పడి ఒకరికొకరు అన్నట్టుగా ఉండటంతో ఆందోళనలు పూర్తిగా పోతాయి' అంటోంది దివ్యలక్ష్మి.

మ్యూజిక్ థెరపీ

కొన్ని అధ్యయనాల ప్రకారం మ్యూజిక్ థెరపీ కడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్యానికి, గుండె స్పందనలకు బాగా పని చేస్తుందని నిర్ధారితమైంది. సంగీతం గర్భిణుల్లో ఉండే యాంగ్జయిటీ, లో–బీపీ వంటి సమస్యలను దూరం చేయగలదని స్వీయ పరిశీలన ద్వారా అర్థం చేసుకున్న దివ్యలక్ష్మి తమ కాలనీలో ఉన్న నలుగురైదుగురు గర్భవతులకు ప్రయోగాత్మకంగా శాస్త్రీయ సంగీతం నేర్పించసాగింది. వారికి ఆ పాఠాలు ఆహ్లాదం కలిగించడమే కాదు ప్రసవాలు కూడా కాంప్లికేషన్స్ ఎదురవకుండా జరిగాయి. దాంతో ఆరునెలల కోర్సు తయారు చేసిన దివ్య లక్ష్మి మళ్లీ సంగీత పాఠశాల తెరిచి ఇప్పుడు గర్భిణులకు సంగీత పాఠాలు చెబుతోంది.

ఆమె దగ్గర నేర్చుకోలేకపోయినా, ఉన్నచోట నేర్చుకోలేకపోయినా, గర్భిణులు తరచూ ఆహ్లాదపరిచే సంగీతం వినడం, మంచి పాటలు హమ్ చేసుకుంటూ ప్రశాంతంగా గడపడం వల్ల మాత్రం కచ్చితంగా మేలు జరుగుతుంది.

● త్రినేత్రం

రీటా బెనర్జీ

అడవి - ఆమె

చిన్నప్పుడు 'అనగనగా ఒక అడవి ఉంది' లాంటి కథలు మాత్రమే కాదు... అడవులు పర్యావరణానికి ఎంత ప్రాణప్రదమో చెప్పే కథలెన్నో విన్నది రీటా.
కట్ చేస్తే... రీటా బెనర్జీ ఇప్పుడు ప్రపంచంలోనే ప్రసిద్ధి చెందిన వైల్డ్‌లైఫ్ ఫిల్మ్‌మేకర్.
'అదిగో...అడవి మాట్లాడుతోంది వినండి' అంటాయి ఆమె చిత్రాలు.
గ్రీన్ ఆస్కార్ (పాండా అవార్డ్)లాంటి ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన అవార్డ్‌లు అందుకుంది.

రీటా బెనర్జీకి అడవి చిరకాల నేస్తం. వైల్డ్‌లైఫ్ ఫిల్మ్‌మేకర్‌గా మూడు దశాబ్దాల ప్రయాణంలో అడవితో ఆమెకు ఎంతో అనుబంధం ఉంది. అడవి లోతుపాతులు తెలిసిన సూక్ష్మగ్రాహి.

ది టర్టిల్ డైరీస్, ది వైల్డ్ మీట్ ట్రయల్, ది అమూర్ ఫాల్కన్ స్టోరీ, ఏ షాల్ టు డై ఫర్...మొదలైన చిత్రాలలో అడవి సూక్ష్మ రూపం నుంచి విశ్వరూపం వరకు చూపించింది.

ఎ షాల్ టు డై ఫర్

టిబెటన్ జింకకు ముప్పు పొంచి ఉంది. ఈ జింక ఉన్నిని కోసి షాతుష్ శాలువాలు నేస్తారు. వీటికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. షాతుష్ శాలువాల వ్యాపారం నిషేధించినప్పటికీ చాటుమాటుగా జరుగుతూనే ఉంది. వైల్డ్‌లైఫ్ ఇండియా, ఇంటర్నేషనల్ ఫండ్ ఫర్ యానిమల్ వెల్ఫేర్ కశ్మీర్‌లోయలో

నిర్వహించిన సర్వేలో షాతుష్ శాలువాల తయారీలో 14,293 మంది వరకు పాల్గొంటున్నారని తేలింది. జమ్మూ కశ్మీర్ వన్యప్రాణుల సంరక్షణ చట్టంలోని లొసుగులు ఉపయోగించుకొని అక్రమంగా షాతుష్ శాలువాలు నేస్తున్నారు. ఈ అక్రమాలు ఎందుకు కొనసాగుతున్నాయి అనేదాని గురించి 'ఎ షాల్ టు డై ఫర్' చిత్రాన్ని తీసింది రీటా బెనర్జీ.

పర్యావరణం, వన్యప్రాణుల చిత్రాలకు సంబంధించిన అంతర్జాతీయ చలనచిత్రోత్సవం సీఎంఎస్‌లో ఈ చిత్రం ఉత్తమ సినిమాటోగ్రఫీ విభాగంలో టెక్నికల్ ఎక్స్‌లెన్స్ అవార్డ్ గెలుచుకుంది.

శక్తిమంతమై దృశ్యభాష

పంచ్ డైలాగ్‌లకు కాదు 'పవర్ ఆఫ్ విజువల్ వొకాబులరీ'కి అధిక ప్రాధాన్యత ఇస్తుంది రీటా.

ఆమె తల్లిదండ్రులు ఇద్దరూ ప్రొఫెసర్‌లు. ప్రకృతి ప్రేమికులు. చిన్న వయసు నుంచి పర్యావరణ హిత విషయాలను పిల్లలకు చెబుతుండేవారు. ప్రమాదంలో ఉన్న పాములను రక్షించేవాడు తండ్రి. వారి ఇంటి వెలుపల ఉన్న గుల్మోహర్ చెట్టుకు పక్షిగూళ్లు ప్రత్యేక ఆకర్షణగా ఉండేవి. కాలేజీ రోజుల్లో రీటాకు పాత ఆగ్ఫా అనలాగ్ కెమెరాను బహుమతిగా ఇచ్చాడు తండ్రి. ఆ కెమెరా తనకు కొత్తదారిని చూపించింది. ఫిల్మ్‌మేకింగ్‌లోకి రావడానికి ఆ పాత కెమెరా తొలి మెట్టు అయింది. డిగ్రీ పూర్తయిన తరువాత 'రివర్ బ్యాంక్ స్టూడియోస్'లో చేరింది. ప్రముఖ పర్యావరణవేత్త మైక్ పాండే నడుపుతున్న స్టూడియో అది.

కెమెరా లెన్స్‌లో నుంచి ప్రతిసారీ రీటాకు కొత్త ప్రపంచం కనిపించేది.

వెలగాలి ఆశాదీపాలు

ఏమాత్రం ఇక ఆశ లేదు అని మనం ఆగిపోతే నిజంగానే ఏమీ జరగదు. ఆశాదీపాలు వెలిగితేనే ఆ వెలుగులో సమస్యలకు పరిష్కారాలు చూపే కొత్త దారులు కనిపిస్తాయి. ఒక లక్ష్యం అంటూ ఏర్పాటు చేసుకొని పనిచేస్తుంటే ఎక్కడో ఒకచోట తప్పకుండా ఫలితం దక్కుతుంది. అపనమ్మకాలతో కాకుండా ఏదీ చేసినా గట్టి విశ్వాసంతో చేయాలి. సమస్యల లాగే వాటి పరిష్కారాలు కూడా ఎల్లప్పుడూ ఉంటాయి. అయితే ఆ పరిష్కారాల వైపు మనం దృష్టి పెడుతున్నామా లేదా అనేది అసలు సమస్య. ఉదాహరణకు... తీరప్రాంతాలలో నివసించే ప్రజల మాట మనం నిజంగా వింటున్నామా? వారితో కలిసి పనిచేస్తున్నామా? ఆ అనుభవాల నేపథ్యంలో సరియైన నిర్ణయాలు తీసుకుంటున్నామా లేదా అనేది ఆలోచించాలి.
– రీటా బెనర్జీ

గ్రీన్‌హబ్ నెట్‌వర్క్

అస్సాంలోని తేజ్‌పూర్‌లో 'గ్రీన్‌హబ్ నెట్‌వర్క్' ప్రారంభించిన రీటా, ఈశాన్య భారతంలోని మారుమూల గ్రామాల యువత పర్యావరణ అంశాలను డాక్యుమెంట్ చేసేలా తీర్చిదిద్దింది.

'అడవి నుంచి ఎన్నో విషయాలను నేర్చుకోవడానికి ఫిల్మ్‌మేకింగ్ ఉపకరిస్తుంది. చెట్టు నుంచి పుట్ట వరకు ప్రతిదీ అడవికి తమవంతుగా సహాయపడుతుంది. అవి అడవితో పాటు వృద్ధి చెందుతాయి. ఈ సమష్టి వృద్ధి అందమైనది. ఎన్నో విషయాలు నేర్చుకోదగినది' అంటుంది రీటా.

అరుణాచల్‌ప్రదేశ్‌లోని నైషీ తెగ ప్రజలకు జంతువులతో అనుబంధం ఉన్నప్పటికీ, మాంసం కోసం వాటిని వేటాడుతారు. వాటి ఈకలు, ఎముకలను అమ్ముకుంటారు. ఇలాంటి విషయాలెన్నో 'ది వైల్డ్ మీట్ ట్రయల్' చిత్రం ద్వారా చూపించింది రీటా. ఈ చిత్రం పాండా అవార్డ్ గెలుచుకుంది. 'వేట అనేది పరిశ్రమ స్థాయికి చేరి రాష్ట్రాల సరిహద్దులను దాటింది. వన్య ప్రాణులకు వేట ఎలా ముప్పుగా మారిందో మా చిత్రం ద్వారా చూపాం' అంటుంది రీటా.

నేషనల్ జాగ్రఫిక్ అశోకా అవార్డ్, సీఎంఎస్ పృథ్వీరత్న అవార్డ్, ఆర్‌బీఎస్ ఎర్త్ హీరోలాంటి ఎన్నో ప్రతిష్ఠాత్మకమైన అవార్డులతో పాటు మూడు గ్రీన్ ఆస్కార్ అవార్డ్‌లు అందుకుంది రీటా బెనర్జీ.

● వెలుగు నీడలు

గెలుపు మంత్రం ఇదే...

యూపీఎస్సీ ప్రయాణంలో ఎన్నో ప్రతికూలతలు, ఎదురుదెబ్బలు ఎదురైనా వెనక్కి తగ్గకుండా నిశ్శబ్ద పోరాటంతో ఐఏఎస్ సాధించింది పారి బిష్ణోయ్. ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో తాను ఎదుర్కొన్న ఒత్తిడి, తన ప్రయాణంలో అత్యంత కష్టమైన దశ గురించి వివరించింది.

యూపీఎస్సీలో మొదటి ప్రయత్నంలో విఫలం అయినప్పుడు రాజస్థాన్‌లోని తన స్వస్థలానికి వెళ్లింది పారి. ప్రపంచం నుండి తనను తాను దూరం చేసుకొని ఒంటరి ప్రపంచంలోకి వెళ్లిపోయింది. తట్టుకోలేని ఒత్తిడిలో బాగా తినేది. దీంతో 30 కిలోలకు పైగా బరువు పెరిగింది! మానసిక భారంతో పాటు

శారీరక భారం కూడా తనను భయపెట్టింది. దీంతో క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇచ్చింది. పొద్దుటే లేచి వ్యాయామాలు చేసి బరువు తగ్గింది. మనసు తేలిక పడింది. తేలిక పడిన మనసు తిరిగి లక్ష్యం వైపు దృష్టి సారించింది.

'ఈసారి ఎలాగైనా సాధించాల్సిందే' అని తనలోని ఆత్మవిశ్వాసాన్ని పెంచుకుంది. పరీక్ష ప్రిపరేషన్‌కు సంబంధించిన వ్యూహాన్ని మెరుగుపరుచుకుంది. దృఢనిశ్చయంతో అనుకున్నది సాధించింది.

పారి బిష్ణోయ్ షేర్ చేసిన వీడియో ఇప్పటికే పది లక్షల లైక్‌లను దాటింది.

● సమ్‌థింగ్ స్పెషల్

బాల స్టార్టప్... బ్రహ్మాండం!

ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్‌కు ఏజ్‌తో పనేమిటి!

బెంగళూరుకు చెందిన ఇద్దరు బాలికలు, ఒక బాలుడు 'ఎకోవాలా' అనే స్టార్టప్‌ను ప్రారంభించి జిగురు, కత్తెర ఉపయోగించకుండా పర్యావరణహితమైన కాగితపు సంచులను తయారు చేస్తున్నారు.

నెలకు రూ.10 రూపాయల సబ్‌స్క్రిప్షన్‌తో కస్టమర్‌లకు ప్రతి ఆదివారం 'ఎకోవాలా' నుంచి రెండు చేతిసంచులు అందుతాయి.

'చిన్న వయసులో మంచి ఆలోచన చేశారు అని చాలామంది ప్రశంసిస్తున్నారు. సబ్‌స్క్రిప్షన్ ఉన్నవారు అదనపు బ్యాగ్‌లు అడగవచ్చు. వీటి గురించి తెలియని వారికి ఫ్రీ శాంపిల్ బ్యాగులు ఇస్తాం. ఇప్పటికంటే

సబ్‌స్క్రిప్షన్‌ల సంఖ్య మరింతగా పెరిగే అవకాశం ఉంది' అంటుంది ఫౌండర్‌లలో ఒక బాలిక.

'ఇవి మేము తయారు చేసిన బ్యాగ్‌లు' అంటూ ఉత్సాహంగా ఫొటోలకు పోజ్ ఇచ్చారు' ఎకోవాలా యజమానులు. వీరి స్ఫూర్తిదాయకమైన ఫొటోను 'ఎక్స్'లో షేర్ చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త హర్ష్ గోయెంకా 'ఎకోవాలా' స్టార్టప్ గురించి ప్రశంస పూర్వక కామెంట్ రాశారు. ఎంతో మంది నెటిజనులు 'ఎకోవాలా' ఫౌండర్స్‌ను ప్రశంసించారు.

'ఇది కేవలం స్టార్టప్ కాదు. నెలకు రూ.10కి మన ఇంటికి చేరువయ్యే పర్యావరణ బాధ్యతలలో ఒక పాఠం' అని ఒకరు రాశారు.

'ఈరోజుల్లో చాలామంది పిల్లలు ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు అతుక్కుపోయి బుర్రకు పనిచెప్పడం లేదు. అలాంటి వారికి ఎకోవాలా ఫౌండర్స్ ఆదర్శంగా నిలుస్తారు' అని మరో యూజర్ స్పందించారు.

● మన(సు)లో మాట

మందు పెట్టడం, కక్కించడం... రెండూ అపోహలే!

మా పెళ్లయి ఆరు సంవత్సరాలయింది. ఇద్దరు పిల్లలు. మాది అన్యోన్య దాంపత్యమే. అయితే. ఇటీవలే ఆయనకు ఒకావిడతో పరిచయం అయింది. అప్పటినుంచి నన్నూ, పిల్లలనీ పట్టించుకోవడం లేదు. ఇష్టం వచ్చినప్పుడు ఇంటికి రావడం, వెళ్లడం.... అదేమని అడిగితే, నా ఇష్టం అని సమాధానం చెబుతారు. నామీద ఎంతో ఇష్టంతో నన్ను ప్రేమించి పెళ్లి చేసుకుని చాలా సంతోషంగా నాతో ఉన్నాయన ఈ మధ్య నాకు క్రమేపీ దూరమై మరో మహిళకు దగ్గరవుతున్నారు. మా బంధువులు ఇది తెలుసుకుని ఆయనకు ఆమె మందుపెట్టి తనవైపు తిప్పుకున్నదని, అందుకే ఆమె వ్యామోహంలో పడిపోయి ఉంటాడని చెబితే రెండుసార్లు మందు కూడా కక్కించాం. అయినా ఆయనలో ఎలాంటి మార్పూ రాలేదు. మళ్లీ ఇంకోసారి మందు కక్కించమంటున్నారు. అసలు నిజంగా ఒక వ్యక్తిని మందుపెట్టి ఇలా లోబరచుకోవడం జరుగుతుందా? మేము ఎన్నిసార్లు కక్కించాలి?

– స్వరాజ్యలక్ష్మి, తణుకు

మందుపెట్టడం, మందు కక్కించడం రెండూ ఫార్సే! అనాదిగా మనలో నాటుకుపోయిన మూఢనమ్మకాలకు ఇది నిదర్శనం తప్ప వీటిలో ఏమాత్రం నిజం లేదు. విషప్రయోగం చేసి, ఒక వ్యక్తిని హత్య చేయవచ్చేమోగాని, ఒక వ్యక్తిని లొంగదీసుకోవడానికి మనసు మార్చి మరొకరివైపు మళ్లించడానికి మందులంటూ ఏమీ లేవు. ఉండవు. మనకున్న కొన్ని నమ్మకాల వల్ల మందు పెట్టడం, మంత్రం వేయడం, చేతబడి చేయించడం లాంటివి ఉన్నాయని మన పూర్వీకులు మనకు నూరిపోశారు. ఈ మూఢనమ్మకాలను ఆధారం చేసుకుని మందు పెట్టే వారు కొందరు, ఆ పెట్టిన మందును కక్కించే స్పెషలిస్టులు కొందరూ తయారయ్యారు. ఎప్పుడో కొన్ని రోజుల కిందట పెట్టిన మందులు మాకులూ ఇన్నాళ్లు కడుపులో ఉండే అవకాశమే లేదు. అది జీర్ణమైనా అవాలి లేదా విరేచనం ద్వారా రెండు రోజుల్లో బయటపడాలే తప్ప అన్నేసి రోజులు అలాగే లోపల అంటిపెట్టుకునిపోయే అవకాశమే లేదు. శాస్త్రీయమైన ఇలాంటి నిజాలు తెలియక చాలామంది అవన్నీ నిజమని మీలాగా అపోహపడుతుంటారు. ఇప్పటికయినా మీరు ఆ పెట్టని మందును కక్కించే ప్రయత్నాలు విరమించి, మీ ఆయన ఎందుకలా మూడోవ్యక్తి వైపు ఆకర్షితులవుతున్నారో ఆలోచించండి. మీలో నచ్చనిది, ఆవిడలో నచ్చినది ఏదైనా ఉందేమో మీకు మీరుగా ఆలోచించండి లేదా ఓర్పుగా నేర్పుగా ఆయన నుంచి తెలుసుకుని నిదానంగా ఆయనను మళ్లీ మీవైపు తిప్పుకునే ప్రయత్నం చేయండి. కొన్నిసార్లు మీలో ఎలాంటి నెగటివ్స్ లేకపోయినా, కొందరు మగవారు మనస్తత్వరీత్యా ఇలా ఇతరుల వైపు ఆకర్షితులవుతారు. అదే నిజమైతే, మీరు ఇద్దరూ కలిసి మానసిక నిపుణులను సంప్రదిస్తే, వారు మరింత లోతుగా పరిశీలించి ఇరువురికీ కౌన్సెలింగ్ చేసి మీ సమస్యకు పరిష్కారాన్ని చూపిస్తారు. ఆల్ ది బెస్ట్!

డా. ఇండ్ల విశాల్ రెడ్డి,
సీనియర్ సైకియాట్రిస్ట్,
విజయవాడ. మీ సమస్యలు, సందేహాలు పంపవలసిన మెయిల్ ఐడీ:
sakshifamily3@gmail.com

● బ్యూటిప్స్

రోజూ రాత్రి పడుకునే ముందు పెదవులకు కొద్దిగా ఆలివ్ ఆయిల్, నెయ్యి, కొబ్బరి నూనె, మీగడలలో ఏదో ఒకటి రాయాలి. అలా చేస్తే చలికాలం పెదవుల మీద చర్మం పొడిబారి రాలిపోవడం, పెదవులు చిట్లడమనే సమస్యలు ఉండవు.

ఆరు టీ స్పూన్ల వైట్ పెట్రోలియమ్ జెల్లీలో రెండు టీ స్పూన్ల గ్లిజరిన్, రెండు టీ స్పూన్ల నిమ్మరసం కలిపి పేస్ట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని రాత్రి పడుకోబోయే ముందు చర్మం మీద అప్లై చేయాలి. ఈ విధంగా చేస్తే పొడిబారిన చర్మం మృదువవుతుంది.

బాడీషేమింగ్ చేస్తే తక్షణ శిక్ష తప్పదు!

మామూలుగానైతే భార్య మొబైల్ నంబరును సేవ్ చేసుకోడానికి 'జానూ', 'సోనా' అనో లేదా 'బంగారం' అనో... ఇలా రకరకాల ముద్దు పేర్లు పెట్టుకుంటుంటారు. మరికొందరు శిరీషకు 'సిరి' అనీ, దీపికకు 'దీపూ' అంటూ షార్ట్‌కట్‌లో షార్ట్ పేర్లూ పెట్టుకోవడం మనకు తెలిసిన విషయమే.

కాపురంలో కొద్దికాలం గడిచాక ఆమెలో నచ్చని అంశాలేవైనా కనిపించినా సదరు ముద్దుపేర్లకు బదులుగా తన కోపాన్నీ, కసినీ సైలెంటుగా వెళ్లడించుకునేలా 'దెయ్యం' అనో, 'రాక్షసి' అంటూ వయొలెంటు పేర్లు పెట్టుకోవాలనుకున్నా అలా చేయకపోవడమే మంచిదంటూ టర్కీలో జరిగిన ఓ ఉదంతం తెలుపుతోంది.

టర్కీలో ఓ ప్రబుద్ధుడికి భార్య మీద కోపం వచ్చింది. ఆమె కాస్తంత లావుగా ఉండటంతో ఆమె పేరును 'టాంబిక్' అంటూ సేవ్ చేసుకున్నాడు ఆ మహానుభావుడు. అంతే... ఆ అంశం మీద అతడికి జరిమానా విధిస్తూ... అతడి వల్ల తన భార్యకు కలిగిన మనోవేదనకు గాను పరిహారం, విడాకులూ మంజూరయ్యాయి.

ఇంతకీ 'టాంబిక్' అంటే టర్కీలో స్థూలకాయాన్ని (ఛబ్బీ) తెలిపే పదం. ఇది కేవలం స్థూలకాయాన్ని సూచించే పదం మాత్రమే కాదు... ఏ 'బండ'దనో, 'మొద్దు'దనో, 'లడ్డు'

దనో... ఇలా కాస్తంత దురర్థమో, నిందార్థమో ఇచ్చేలాంటి వాడుక మాట కావడంతో... అలా సేవ్ చేసుకున్న ఆ భర్తకు కోర్టులో మొట్టికాయలు తప్పలేదు. పైగా ఓ అమ్మాయి స్థూలకాయాన్ని ఎగతాళి చేసేలా ఆమె పేరును అభ్యంతరకరమైన పదాలతో సేవ్ చేసుకున్నందుకు ఆ భర్తకు భారీ జరిమానా విధించింది అక్కడి కోర్టు.

అంతేకాదు.. పరోక్ష దూషణే అయినా... ఫోన్‌లో అలాంటి అభ్యంతరకరమైన మాటతో భార్యపేరు సేవ్ చేసుకున్నందున ఆమెకు కలిగిన మనోవేదనను పరిగణనలోకి తీసుకుని వెంటనే విడాకులు సైతం మంజూరు చేసింది టర్కీ కోర్టు.

● అదర్ సైడ్

మ్యూజికల్ బిలియనీర్స్

'మడిసన్నాక కాస్త కళా పోసన ఉండాలి' అన్నారు రావుగోపాల్‌రావు. ఈ డైలాగ్ విన్నారో లేదోగానీ ఎంత బిజీగా ఉన్నా సరే, ప్రముఖ స్టాక్ బ్రోకరేజ్ ప్లాట్‌ఫామ్ జెరోదా కో–ఫౌండర్స్ నిఖిల్ కామత్, నితిన్ కామత్ సంగీతానికి ఎప్పుడూ దూరం కాలేదు. వీలైనప్పుడల్లా తమ టాలెంట్‌ను ప్రదర్శిస్తూనే ఉన్నారు.

తాజా విషయానికి వస్తే...

తమ ఇంట్లో కరావోకే సెషన్‌ను ఆస్వాదిస్తూ, ప్లేబ్యాక్ సింగర్ షాన్‌తో కలిసి పాడుతూ కనిపించిన వీడియో సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. వ్యాపార వ్యవహారాల్లో బిజీ బిజీగా ఉండే కామత్ సోదరులకు ఇలాంటి కచేరీలు ఎంతో రిలీఫ్ ఇస్తాయి.

కిశోర్ కుమార్ 'ప్యార్ దీవానా హోతా హై' 'యే షామ్ మస్తానీ' పాటలను శ్రావ్యంగా పాడారు కామత్ సోదరులు. వారి తల్లి రేవతి కామత్ ఈ వీడియోను ఫేస్‌బుక్‌లో షేర్ చేశారు.

రేవతి చిన్నప్పటి నుంచి కళలతో కలిసి పెరిగారు. సాంస్కృతిక పట్టణం అని పిలువబడే శృంగేరిలో జన్మించిన రేవతి కామత్ మాస్ట్రో వెంకటగిరియప్ప దగ్గర వైణిక విద్యలో శిక్షణ పొందారు. వ్యాపారవేత్తలుగా తన కుమారులు విజయం సాధించినప్పుడు రేవతి ఎంత సంతోషించారో తెలియదుగానీ, వారు పాడుతుంటే మాత్రం ఆమె సంతోషానికి అవధి లేదు!

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) నవంబర్ 5న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,21,410	1,11,230	1,50,000
విజయవాడ	1,23,450	1,11,350	1,50,000
విశాఖపట్నం	1,21,480	1,11,350	1,63,000
రాజమండ్రి	1,23,450	1,14,690	1,50,000
ప్రొద్దుటూరు	1,20,400	1,10,770	1,50,000
చెన్నై	1,21,960	1,11,800	1,63,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

అమ్మకానికి ఆర్‌సీబీ... త్వరలోనే కొత్త యాజమాన్యం చేతుల్లోకి!

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు 18 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత ఈ సీజన్‌లో విజేతగా నిలిచింది. ఇన్నేళ్లలో ఈ జట్టులో కోహ్లి తప్ప అందరు మారారు. ఎంతో మంది కొత్త ఆటగాళ్లు వచ్చారు. ఇప్పుడేమో కొత్త యాజమాన్యం రాబోతోంది. ఎందుకంటే ఈ చాంపియన్ ఫ్రాంచైజీని తాజాగా అమ్మకానికి పెట్టారు. అన్నట్లు ఆర్‌సీబీ అంటే ఒక జట్టే కాదు... భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) నిర్వహిస్తున్న ఐపీఎల్, మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టోర్నీల్లో ఆర్‌సీబీ జట్లు పోటీపడుతున్నాయి. గతేడాది మహిళల ఆర్‌సీబీ జట్టు కూడా డబ్ల్యూపీఎల్ విజేతగా నిలిచింది. కొన్ని రోజులుగా అమ్మకంపై ఊహాగానాలు వినిపిస్తున్నాయి. తాజాగా ఈ విషయాన్ని ఫ్రాంచైజీ యాజమాన్యం డియాజియో కంపెనీ అధికారికంగా వెల్లడించింది. ఈ మేరకు బాంబే స్టాక్ ఎక్స్చేంజ్‌కు సైతం సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. తమ ఫ్రాంచైజీలో పెట్టుబడిదారుల కోసం అన్వేషిస్తున్నట్లు చెప్పింది. కొత్త యజమానులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి... అంటే వచ్చే మార్చి 31 తేదీకల్లా విక్రయ ప్రక్రియ పూర్తిచేయనుంది.

విశ్వ విజేతలతో ప్రధాని మోదీ భేటీ

న్యూఢిల్లీ: ఐసీసీ మహిళల వన్డే ప్రపంచకప్ సాధించిన భారత జట్టు బుధవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిసింది. విజయవంతమైన ఈ ప్రపంచకప్ ప్రయాణంలో ఎదురైన సవాళ్లను అధిగమించి తొలిసారి విశ్వ విజేతగా నిలిచిన హర్మన్‌ప్రీత్ కౌర్ నేతృత్వంలో జట్టును మోదీ అభినందించారు. ఈ సందర్భంగా ప్రధాని కేవలం ఓ ఫొటో, రెండు ముక్కల ప్రశంసకే పరిమితం కాకుండా ప్లేయర్లందరితో కలిసి కూర్చుని సరదాగా ముచ్చటించారు. 2017లో ఫైనల్లో ఓడినపుడు ఉత్త చేతులతో మోదీని కలిసిన తాము ఇప్పుడు ప్రపంచకప్ ట్రోఫీతో కలవడం చాలా సంతోషాన్నిచ్చిందని కెప్టెన్ హర్మన్‌ప్రీత్ చెప్పుకొచ్చింది. మోదీ అప్పుడు చెప్పిన మాటలు ఈ సారి కప్ గెలిచేందుకు ఎంతగానో దోహదపడ్డాయని వైస్ కెప్టెన్ స్మృతి మంధాన చెప్పింది. 'ప్లేయర్ ఆఫ్ ద టోర్నీ'గా నిలిచిన దీప్తి శర్మ మాట్లాడుతూ మరోసారి ప్రధానిని కలిసే అవకాశం కోసం ఎంతగానో ఎదురు చూశామని తాజా కప్‌తో కలుసుకోవడం మరింత తృప్తినిచ్చిందని పేర్కొంది. దీప్తి ఇన్‌స్ట్రాగామ్ బయోలో ఉన్న 'జై శ్రీరామ్', ఆమె భుజంపై ఉన్న హనుమాన్ టాటూ విశేషాలను మోదీ అడిగితెలుసుకున్నారు. తన మానసిక, శారీరక బలానికి హనుమాన్ టాటూ ఉత్ప్రేరకమని ఈ సందర్భంగా దీప్తి చెప్పింది. అమన్‌జోత్ క్యాచ్, క్రాంతి గౌడ్ బౌలింగ్ ప్రదర్శనను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా 'ఫిట్ ఇండియా' కార్యక్రమంలో విశ్వవిజేతలు భాగం కావాలని మోదీ క్రికెటర్లను ఉద్దేశించి అన్నారు. శారీరక ఫిట్‌నెస్ ఆవశ్యకతను తెలియజేసే కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. వీలైనపుడు విద్యార్థులను స్ఫూర్తిదాయక ప్రసంగాలతో ఉత్సాహపరచాలని మోదీ సూచించారు.

పైచేయి కోసం...

భారత్, ఆసీస్‌ల మధ్య నాలుగో టి20 నేడు

- ఆధిక్యమే లక్ష్యంగా ఇరుజట్లు బరిలోకి
- గెలిచిన ఉత్సాహంతో టీమిండియా
- పట్టుబిగించేందుకు సిద్ధమైన మార్ష్ బృందం
- మధ్యాహ్నం 1.45 గంటల నుంచి స్టార్‌స్పోర్ట్స్ నెట్‌వర్క్, జియో హాట్‌స్టార్‌లలో ప్రత్యక్ష ప్రసారం

తిలక్‌వర్మ

సూర్యకుమార్, బుమ్రా

గోల్డ్‌కోస్ట్: సిరీస్‌లో కీలకమైన పైచేయి కోసం భారత్, ఆస్ట్రేలియా జట్లు సమరానికి సై అంటున్నాయి. తొలి మ్యాచ్ వర్షంతో రద్దవడం... తదుపరి రెండు మ్యాచ్‌ల్లో చెరోటి గెలవడంతో ఇరు జట్లు ప్రస్తుతం 1–1తో సమవుజ్జీగా నిలిచాయి. ఈ నేపథ్యంలో గురువారం ఇక్కడ జరిగే నాలుగో టి20లో గెలిచిన జట్టు ఇక సిరీస్‌లో ఓడిపోదు. 2–1తో ఆధిక్యంలోకి వెళ్లిన జట్టు ఆఖరిపోరులో ఓడినా సిరీస్ సమమవుతుందే కానీ చేజారనే చేజారదు. దీంతో భారత్, ఆస్ట్రేలియా జట్లు ఇక్కడే గెలిసి సిరీస్ పట్టు పట్టాలనే లక్ష్యంతో ఉన్నాయి. ఇదే జరిగితే మాత్రం టి20లో మెరుపుల హోరు ఖాయం! ఎందుకంటే పిచ్ కూడా బ్యాటింగ్‌కు స్వర్గధామం. అంతర్జాతీయ మ్యాచ్‌లు అరకొరగా జరిగినా... బిగ్‌బాష్ లీగ్‌లలో భారీస్కోర్లకు లోటే లేదు. దీంతో బౌలర్లకే కఠిన సవాళ్లు ఎదురవక తప్పదు.

గిల్ బాకీ పడ్డాడు

ఓపెనర్ శుబ్‌మన్ గిల్ ఈ టి20 సిరీస్‌లోనే కాదు... అంతకుముందు జరిగిన వన్డే సిరీస్‌లోనూ పెద్దగా ప్రభావమే చూపలేదు. పరుగుల పరంగా రెండు సిరీస్‌లకు బాకీ పడ్డాడు. బహుశా బ్యాటింగ్‌కు అచ్చొచ్చే ఈ మ్యాచ్‌లో ఆ బాకీ ఏదో తీర్చుకుంటే భారత్‌కు శుభారంభం లభిస్తుంది. టి20 స్పెషలిస్టు ఓపెనర్, ధనాధన్ హిట్టర్ అభిషేక్ వర్మ పవర్ ప్లేలో కావల్సినదానికంటే పెద్ద సంఖ్యలోనే పరుగులు కూడబెడతాడు. కెప్టెన్ సూర్యకుమార్, తిలక్ వర్మలు సైతం భారీ షాట్లకు తెగబడితే, బౌలింగ్ ఆల్‌రౌండర్లు అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్‌లు అడపాదడపా దంచేస్తే మాత్రం 200 పైచిలుకు స్కోరు టీమిండియాకు ఏమంత కష్టమే కాదు. అప్పుడు బుమ్రా, అర్ష్‌దీప్, వరుణ్, అక్షర్, సుందర్‌లతో కూడిన బౌలింగ్ దళం తమ పనిని చింత లేకుండా చక్కబెట్టే అవకాశం ఉంటుంది.

కీలక ఆటగాళ్లు దూరం

రెండో టి20తోనే హాజల్‌వుడ్, మూడో మ్యాచ్‌తో హెడ్, అబాట్‌లు జట్టు వీడారు. త్వరలోనే జరిగే ప్రతిష్టాత్మక యాషెస్ కోసం తుదిసన్నాహాల్లో ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడేందుకు కీలకమైన ఆటగాళ్లను విడుదల చేశారు. అయితే ఇది ఆసీస్ లాంటి అగ్రశ్రేణి జట్టుకు ప్రతికూలత కాదు... భారత్‌కు గొప్ప అనుకూలతగా భావించరాదు. ఎందుకంటే ఇది కంగారూ జట్టు. మేటి ఆటగాళ్లెంతో మంది ఉన్నారు. తొలి మూడు మ్యాచ్‌లు ఆడని విధ్వంసకర ఆల్‌రౌండర్ మ్యాక్స్‌వెల్ ఈ మ్యాచ్ ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడు. స్టొయినిస్, టిమ్ డేవిడ్, ఇన్‌గ్లిస్‌లాంటి హిట్టర్లూ ఉన్నారు. కాబట్టి ఒకరిద్దరు లేనంత మాత్రం ఆసీస్ బలహీనమనుకుంటే తప్పులో కాలేసినట్లే కెప్టెన్ మిచెల్ మార్ష్, టిమ్ డేవిడ్, స్టొయినిస్‌లు ఈ సిరీస్‌లో చక్కని ఫామ్‌లో ఉన్నారు. అనుభవజ్ఞులైన పేస్ బలగం లేకపోవడం కాస్త ఇబ్బందికరమైనప్పటికీ బార్ట్‌లెట్, ఎలిస్‌లు ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించగలరు. ఈ నేపథ్యంలో సొంత ప్రేక్షకుల మద్దతుతో ఆతిథ్య జట్టు దంచేయడం ఖాయం! తద్వారా ఇరుజట్ల బ్యాటింగ్ మెరుపులతో స్కోరు హోరెత్తడం కూడా ఖాయమే!

పిచ్–వాతావరణం

ఈ కరారా వేదిక బిగ్‌బాష్ లీగ్‌కు ఫేమస్. మెరుపుల టి20లో భారీస్కోర్లకు చిరునామా దీంతో బ్యాటర్లకు పండగే. ఇక అంతర్జాతీయ మ్యాచ్‌ల విషయానికొస్తే ఇక్కడ కేవలం రెండే మ్యాచ్‌లు జరిగాయి. వర్ష సూచన లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: సూర్యకుమార్ (కెప్టెన్), అభిషేక్, శుబ్‌మన్, తిలక్‌వర్మ, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, జితేశ్, శివమ్ దూబే, అర్ష్‌దీప్, వరుణ్, బుమ్రా.
ఆస్ట్రేలియా: మార్ష్ (కెప్టెన్), షార్ట్, ఇన్‌గ్లిస్, టిమ్ డేవిడ్, మిచ్ ఓవెన్, స్టొయినిస్, మ్యాక్స్‌వెల్, బార్ట్‌లెట్, డ్వార్షుయిస్, ఎలిస్, కునెమన్.

పంత్, ఆకాశ్ పునరాగమనం

- షమీకి తప్పని నిరాశ
- సఫారీతో టెస్టులకు టీమిండియా ఎంపిక

పంత్

న్యూఢిల్లీ: స్టార్ వికెట్ కీపర్–బ్యాటర్ రిషభ్ పంత్ మళ్లీ భారత టెస్టు జట్టులోకి పునరాగమనం చేశాడు. ఇంగ్లండ్ పర్యటనలో ఆకట్టుకున్న పేసర్ ఆకాశ్‌దీప్‌కూ సెలక్టర్ల నుంచి పిలుపు వచ్చింది. ఇంగ్లండ్‌లో నాలుగో టెస్టు సందర్భంగా పంత్ కాలికి గాయమైంది. దీంతో విండీస్‌తో సిరీస్‌కు సైతం దూరమయ్యాడు. ప్రస్తుతం భారత్ 'ఎ' జట్టు కెప్టెన్ పంత్ దక్షిణాఫ్రికా 'ఎ'తో జరిగిన మ్యాచ్‌లో రాణించాడు. అయితే వెటరన్ సీమర్ మహ్మద్ షమీని సెలక్టర్లు పట్టించుకోలేదు. టీమిండియా బెర్తుకోసం రంజీల్లో శ్రమిస్తున్న అతని పేరును సెలక్టర్లు పరిశీలించకపోవడం చూస్తుంటే ఇక 35 ఏళ్ల షమీ కెరీర్ ముగిసినట్లేననే ఊహాగానాలకు ఊపిరి పోసినట్లయ్యింది. సఫారీతో ఈ నెల 14 నుంచి కోల్‌కతాలో తొలిటెస్టు, 22 నుంచి గువాహటి రెండో టెస్టులో జరుగుతుంది.

భారత టెస్టు జట్టు: గిల్ (కెప్టెన్), జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, పడిక్కల్, పంత్, జురెల్, జడేజా, సుందర్, బుమ్రా, అక్షర్, నితీశ్ రెడ్డి, సిరాజ్, కుల్దీప్, ఆకాశ్‌దీప్.

మూడో రౌండ్లో అర్జున్, గుకేశ్

పనాజీ: ప్రపంచకప్ చెస్ టోర్నీలో తెలంగాణ గ్రాండ్ మాస్టర్, భారత నంబర్ వన్ ఇరిగేశి అర్జున్... ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ మూడో రౌండ్లోకి ప్రవేశించారు. రెండో రౌండ్లో అర్జున్ 2–0తో పెట్రోవ్ మార్టిన్ (బల్గేరియా)పై... గుకేశ్ 1.5–0.5తో నోగెర్బెక్ కాజిబెక్ (కజకిస్తాన్)పై గెలుపొందారు. ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్లు పెంటేల హరికృష్ణ, కార్తీక్ వెంకటరామన్ కూడా మూడో రౌండ్లోకి అడుగు పెట్టారు. రెండో రౌండ్లో హరికృష్ణ 1.5–0.5తో నెస్తెరోవ్ (రష్యా)పై, కార్తీక్ వెంకటరామన్ 1.5–0.5తో అరవింద్ చిదంబరం (భారత్)పై విజయం సాధించారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

తలైవర్ 173 షురూ

రజనీకాంత్, కమల్‌హాసన్

రజనీకాంత్–కమల్‌హాసన్ మళ్లీ కలిసి నటించనున్నారనే వార్తలు కొంత కాలంగా ప్రచారంలో ఉన్న సంగతి తెలిసిందే. ఈ కాంబినేషన్ సెట్ అయింది. అయితే ఇద్దరూ సిల్వర్ స్క్రీన్‌ని షేర్ చేసుకోవడం లేదు. రజనీకాంత్ హీరోగా తన నిర్మాణ సంస్థ రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్‌పై కమల్‌హాసన్ ఓ సినిమా నిర్మించనున్నారు. రజనీ నటించనున్న 173వ చిత్రం ఇది. ఈ చిత్రానికి సుందర్. సి దర్శకత్వం వహించనున్నారు. ''ఐదు దశాబ్దాల స్నేహం, ఒకరంటే మరొకరికి గౌరవం, అసమానమైన వారసత్వం కలిగిన రజనీకాంత్, కమల్‌హాసన్‌ల గొప్ప కలయికలో రానున్న చిత్రం ఇది. 44 ఏళ్ల రాజ్‌కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ అద్భుత ప్రయాణం, రజనీకాంత్ అద్భుత స్క్రీన్ ప్రెజెన్స్, కథను చెప్పడంలో అత్యంత ప్రతిభ గల సుందర్ .సి, కమల్‌హాసన్–ఆర్. మహేంద్రన్‌ల కాంబినేషన్‌లో 'తలైవర్ 173' ఓ గొప్ప సినిమాటిక్ అనుభూతిని ఇచ్చేలా ఉంటుంది. 'అరుణాచలం' తర్వాత 28 ఏళ్లకు రజనీ–సుందర్‌ల కాంబో మళ్లీ కుదిరింది. రెడ్ జెయింట్ మూవీస్ ద్వారా ఈ చిత్రం 2027 సంక్రాంతికి రిలీజ్ కానుంది'' అని ఈ చిత్రం టీమ్ ఓ ప్రెస్‌నోట్‌ని షేర్ చేసింది.

ప్రతి యువకుడి కథ

శ్రీవిష్ణు

శ్రీవిష్ణు హీరోగా కొత్త సినిమా షురూ అయింది. సన్నీ సంజయ్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మించనున్నారు. 'ప్రతి యువకుడి కథ' అనే ట్యాగ్‌లైన్‌తో ఈ సినిమా అనౌన్స్‌మెంట్ పోస్టర్‌ని ఆవిష్కరించారు. ''దైనందిన జీవితాన్ని నిర్వచించే సంఘర్షణలు, ఆశలు, భావోద్వేగాలు వంటివి అన్వేషించే కథతో సన్నీ సంజయ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. ఇప్పటివరకూ గొప్ప పాత్రలతో అలరించిన శ్రీవిష్ణు ఈ చిత్రంలో అద్భుత పాత్ర చేయనున్నారు'' అని యూనిట్ పేర్కొంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో రూపొందనున్న ఈ చిత్రం షూటింగ్ త్వరలో ఆరంభం కానుంది.

చిరంజీవ చిత్రం విజయం సాధించాలి

- అనిల్ రావిపూడి

''గౌతమ్ ఎస్ఎస్‌సీ' సినిమాకి నేను అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేశాను. ఆ చిత్రంలో అభి మంచి పాత్ర చేశాడు. అదిరే అభిగా 'జబర్దస్త్'తో తెలుగు ప్రేక్షకుల ఆదరణ సొంతం చేసుకున్నాడు. ఇప్పుడు దర్శకుడిగానూ 'చిరంజీవ' చిత్రంతో మంచి విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నాను. రాజ్ తరుణ్‌కు ఈ సినిమా మంచి కమ్ బ్యాక్ కావాలి. 'చిరంజీవ' చిత్రం ఘన విజయం సాధించాలి'' అని డైరెక్టర్ అనిల్ రావిపూడి తెలిపారు. రాజ్ తరుణ్, కుషిత కల్లపు జోడీగా నటించిన చిత్రం 'చిరంజీవ'. అభినయ కృష్ణ దర్శకత్వం వహించారు. రాహుల్ అవుదొడ్డి, సుహాసినీ రాహుల్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7 నుంచి 'ఆహా' ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ సినిమా ప్రీమియర్ షోకి, ప్రెస్ మీట్‌కి అనిల్ రావిపూడి అతిథిగా హాజరయ్యారు. రాజ్ తరుణ్ మాట్లాడుతూ– ''ఈ చిత్రం కోసం అభి మా అందరి కంటే ఎన్నో రెట్లు ఎక్కువ కష్టపడ్డాడు'' అని తెలిపారు. ''చిరంజీవ' అందర్నీ నవ్విస్తుంది'' అన్నారు రాహుల్ అవుదొడ్డి. అభినయ కృష్ణ మాట్లాడుతూ– ''పది పన్నెండేళ్ల నుంచి దర్శకుడిగా ప్రయత్నాలు చేస్తున్నాను. ఆహా నుంచి శ్రావణిగారికి 'చిరంజీవ' కథ నచ్చడంతో ఈ సినిమా తీశారు'' అన్నారు. ఆహా సీఈఓ రవికాంత్, ఆహా కంటెంట్ హెడ్ శ్రావణి పాల్గొన్నారు.

అభి, రాజ్ తరుణ్, అనిల్ రావిపూడి, రవికాంత్, శ్రావణి

పతాక సన్నివేశాలు మార్చాం

- విష్ణు విశాల్

శ్రద్ధా శ్రీనాథ్, విష్ణు విశాల్, మానసా చౌదరి

''ఆర్యన్' సినిమా క్లైమాక్స్‌పై తమిళ్‌లో భిన్నాభిప్రాయాలు వచ్చాయి. అందుకే తెలుగులో పతాక సన్నివేశాలు మార్చి రిలీజ్ చేస్తున్నాం. తమిళంలో అద్భుతమైన విజయాన్ని సాధించిన మా సినిమా తెలుగు ప్రేక్షకులకూ నచ్చుతుందని ఆశిస్తున్నాను'' అని విష్ణు విశాల్ తెలిపారు. ఆయన హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'ఆర్యన్'. మానసా చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్, సెల్వ రాఘవన్ కీలక పాత్రలు పోషించారు. ప్రవీణ్ కె. దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాని శ్రేష్ఠ్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ నెల 7న తెలుగులో విడుదల చేస్తున్నారు. ''తెలుగు ఆడియన్స్ 'ఆర్యన్' లాంటి కొత్త ఆలోచనలతో రూపొందిన చిత్రాలను ఆదరిస్తారు'' అని ఈ చిత్రం ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో ప్రవీణ్ .కె పేర్కొన్నారు. ''ఈ సినిమాలో మంచి పాత్రలు చేశాం'' అని మానస, శ్రద్ధా శ్రీనాథ్ చెప్పారు.

మంచి సినిమా నిర్మించానని సంతృప్తిగా ఉంది

- అల్లు అరవింద్

రాహుల్ రవీంద్రన్, అల్లు అరవింద్

''నిర్మాతగా ఎన్నో సినిమాలు చేశాను, చేస్తున్నాను. సినిమాల ద్వారా కోట్ల రూపాయలు సంపాదించాను. అయితే 'ది గర్ల్ ఫ్రెండ్' మూవీ ద్వారా నేను సంపాదించాలనుకున్నది డబ్బు కాదు... సంతృప్తి. ఒక నిర్మాతగా 'ది గర్ల్ ఫ్రెండ్' లాంటి సినిమా నిర్మించానని సంతృప్తిగా ఉంది'' అని అల్లు అరవింద్ తెలిపారు. రష్మికా మందన్నా, దీక్షిత్ శెట్టి జంటగా రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహించిన చిత్రం 'ది గర్ల్ ఫ్రెండ్'. అల్లు అరవింద్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 7న తెలుగుతో పాటు హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో రిలీజ్ అవుతోంది. ఈ మూవీ ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌లో అల్లు అరవింద్ మాట్లాడుతూ– ''రాహుల్‌లాంటి సున్నితమైన మనసు, కమిటెడ్ పర్సన్ మాత్రమే 'ది గర్ల్ ఫ్రెండ్' లాంటి సినిమా రూపొందించగలరు. మన అక్క, చెల్లి, పిన్నిల మనసుల్లో ఏముంటుంది? ఎలాంటి ఆశలు ఉంటాయి? అనుకుని ఈ మూవీ చూడాలి. రష్మిక ఈ సినిమాలో జీవించేసింది. దీక్షిత్ నటన నచ్చి, మరో సినిమా కోసం అడ్వాన్స్ ఇచ్చాను'' అని చెప్పారు. ''ఈ సినిమాలో రష్మిక నటన ఈ దశాబ్దంలో ఒక మహిళా నటి తెలుగులో చేసిన బెస్ట్ పర్ఫార్మెన్స్‌గా నిలుస్తుంది'' అని రాహుల్ రవీంద్రన్ చెప్పారు. ఈ సమావేశంలో దీక్షిత్, ధీరజ్, విద్య కొప్పినీడి తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల లైఫ్

సాయి చరణ్, మోనాలిసా

ఉత్తరప్రదేశ్‌లోని కుంభమేళాలో పూసలు అమ్ముతూ, తన కనులతో సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారిన మోనాలిసా 'లైఫ్' సినిమాతో తెలుగులో కథానాయికగా పరిచయమవుతున్నారు. శ్రీను కోటపాటి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సాయి చరణ్ హీరోగా నటిస్తున్నారు. వెంగమాంబ క్రియేషన్స్‌పై అంజన్న నిర్మిస్తున్న 'లైఫ్' ప్రారంభోత్సవం హైదరాబాద్‌లో జరిగింది. తెలంగాణ శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పూజతో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత డీఎస్ రావ్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నటులు సురేష్ క్లాప్ కొట్టగా, శివన్నారాయణ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా అంజన్న మాట్లాడుతూ– ''సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల జీవితాల్లో చోటు చేసుకుంటున్న ఘటనల ఆధారంగా 'లైఫ్' రూపొందుతోంది'' అని తెలిపారు. ''ఈ చిత్రకథలో నేటి తరానికి చక్కటి సందేశం ఉంది'' అని శ్రీను కోటపాటి చెప్పారు. ''యూత్‌కు బాగా కనెక్ట్ అయ్యే కథాంశంతో మా సినిమా రూపొందుతోంది'' అన్నారు సాయి చరణ్. ''నేను తెలుగు సినిమా చేస్తుండడం చెప్పలేని ఆనందంగా ఉంది. త్వరలో తెలుగు నేర్చుకుంటాను'' అని మోనాలిసా పేర్కొన్నారు.



''దెయ్యం వేట, ఫ్యామిలీ ఎమోషన్, భక్తి, శివుడు గురించి కథలు... ఇలా చాలా లేయర్స్ ఉన్న చిత్రం 'జటాధర'. అరుణాచల ప్రస్తావన కూడా ఉంది. మన పురాణాల్లో ఉన్న కొన్ని కథలకి సొల్యూషన్‌గా ఈ మూవీ చేశాం. ఈ సినిమా చేయడానికి ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ నన్ను చాలా ఎగ్జయిట్ చేసింది. యాక్షన్, ఫ్యామిలీ, మైథాలజీ... ఇలా అన్ని భావోద్వేగాలు కుదిరిన సినిమా 'జటా ధర'' అని సుధీర్ బాబు తెలిపారు. వెంకట్ కల్యాణ్, అభిషేక్ జైస్వాల్ దర్శకత్వంలో సుధీర్‌బాబు హీరోగా నటించిన చిత్రం 'జటాధర'. సోనాక్షీ సిన్హా, శిల్పా శిరోద్కర్ తదితరులు కీలక పాత్రధారులు. జీ స్టూడియోస్, ప్రేరణ అరోరా సమర్పణలో ఉమేశ్ కుమార్ బన్సల్, శివన్ నారంగ్, అరుణ అగర్వాల్, ప్రేరణ, శిల్పా సింఘాల్, నిఖిల్ నంద నిర్మించిన ఈ చిత్రం తెలుగు, హిందీ భాషల్లో ఈ నెల 7న రిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో సుధీర్‌బాబు పంచుకున్న విశేషాలు...

శివ తాండవం కోసం పది రోజులు ప్రాక్టీస్ చేశాను

- సుధీర్‌బాబు

- చిన్నప్పుడు మనం జానపద, చందమామ కథలు విని ఉంటాం. గతంలో బ్యాంకులు లేని సమయంలో ధనాన్ని భూమిలో పాతి, ఒక బంధనం వేసేవారని, దానికి ఒక పిశాచి కాపలాగా ఉండేదని ఓ కథ ప్రచారంలో ఉండేది. అలాంటి కథని ప్రజెంట్ టైమ్‌లోకి తీసుకొచ్చి మా 'జటాధర'లో చాలా ఆసక్తిగా చూపించాం. ఈ చిత్రకథ విన్నప్పుడు బిగ్ స్క్రీన్ మీద చూడదగ్గ కథలా అనిపించింది. ఈ సినిమాలో దెయ్యాల వేటగాడిలా కనిపిస్తాను. అయితే తనకి మాత్రం దెయ్యాలున్నాయంటే నమ్మకం ఉండదు. దేవునిపై నమ్మకం ఉంటుంది. సైన్స్‌ని నమ్ముతాడు. అలా ఎందుకు? అనేది సినిమాలో చాలా ఆసక్తికరంగా ఉంటుంది. ఏ, బీ, సీ సెంటర్ అనే తేడా లేకుండా అందరికీ నచ్చే సినిమా ఇది. ధన పిశాచి పాత్రలో సోనాక్షీ సిన్హా నటన అందర్నీ ఆకట్టుకుంటుంది. శిల్పా శిరోద్కర్‌గారు శోభ అనే బలమైన పాత్రలో అద్భుతంగా నటించారు.
- రాజీవ్ అద్భుతమైన సంగీతం, నేపథ్య సంగీతం ఇచ్చారు. ఈ మూవీలో శివతాండవం ఎపిసోడ్ ఉంటుంది. నేనెప్పుడూ క్లాసికల్ డ్యాన్స్ చేయలేదు. ఆ సీక్వెన్స్ కోసం దాదాపు పది రోజులు ప్రాక్టీస్ చేసి, చేశాను. చిత్ర పరిశ్రమలో బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవాళ్లకి అవకాశాలు సులభం అని... కొత్తవాళ్లకి, ఇండస్ట్రీ నేపథ్యం లేనివారికి కష్టం అనే కామెంట్స్ వినిపిస్తుంటాయి. నిజానికి బయటవాళ్లకే కాదు.. నాకు కూడా కష్టమే.
- మా సినిమాలో శివుడు కనిపించే ఒక ఎపిసోడ్ ఉంది. అక్కడ సూపర్‌స్టార్ కృష్ణ గారిని చూపించాలనుకున్నాం. కానీ వీఎఫ్ఎక్స్‌కి ఎక్కువ సమయం కుదరలేదు. ఈ మూవీలో కృష్ణగారు కానీ, మహేశ్ బాబుగారు కానీ కనిపించరు. ఇక నా తర్వాతి చిత్రం రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ఉంటుంది. కాన్సెప్ట్ పరంగా అది ఒక 'బాహుబలి' లాంటి సినిమా. అలాగే బ్యాడ్మింటన్ స్టార్ పుల్లెల గోపీచంద్ బయోపిక్ కూడా చేయాల్సి ఉంది.

బ్రహ్మచారి భర్త కావాలనుకుంటే...

సప్తగిరి, కసిరెడ్డి, రాజ్ కుమార్

'బ్రహ్మచారి భర్త కావాలని నిర్ణయించుకున్న తర్వాత జీవితం యుద్ధభూమిగా మారుతుంది' అనే క్యాప్షన్‌తో 'పురుష' ఫస్ట్ లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు మేకర్స్. ప్రముఖ దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఈ పోస్టర్‌ని ఆవిష్కరించారు. బత్తుల సరస్వతి సమర్పణలో తన తనయుడు పవన్ కల్యాణ్‌ను హీరోగా పరిచయం చేస్తూ బత్తుల కోటేశ్వరరావు ఈ చిత్రాన్ని నిర్మించారు. వీరు వులవల దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సప్తగిరి, కసిరెడ్డి రాజ్ కుమార్ లీడ్ రోల్స్‌లో నటించారు. వైష్ణవి కొక్కుర, విశిక, హాసినీ సుధీర్ కథానాయికలుగా నటించారు. ''త్వరలో మా సినిమా విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్
గురువారం
6-11-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు (మంగళవారం ముగింపు)	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
519	166
83,459	25,578

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	23,559	△	210
డోజోన్స్	47,314	△	229
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,981	△	66
డాక్స్	24,042	△	93
షాంఘై	3,969	△	9
నికాయ్	50,212	▽	1,285

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.09	89.11
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.87	117.81
€	యూరో	ఎస్‌బీఐ	100.65	103.42
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.11	58.54
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	57.11	58.54
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.62	69.34
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.76	24.26
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.25	24.51
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.57	13.39

సన్ ఫార్మా లాభం అప్

క్యూ2లో రూ. 3,118 కోట్లు

న్యూఢిల్లీ: దేశీ ప్రైవేట్ రంగ దిగ్గజం సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం స్వల్ప(3 శాతం) వృద్ధితో రూ. 3,118 కోట్లను తాకింది. భారత్‌సహా వర్ధమాన మార్కెట్లలో వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 3,040 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 13,264 కోట్ల నుంచి రూ. 14,405 కోట్లకు బలపడింది. దేశీయంగా ఫార్ములేషన్ల అమ్మకాలు 11 శాతం వృద్ధితో రూ. 4,736 కోట్లను తాకాయి. ఆదాయంలో ఇది 33 శాతంకాగా.. యూఎస్ ఫార్ములేషన్ల విక్రయాలు 4 శాతం నీరసించి 49.6 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి. వర్ధమాన మార్కెట్లలో ఫార్ములేషన్ల అమ్మకాలు 11 శాతం పుంజుకుని 32.5 కోట్ల డాలర్లకు చేరాయి. మిగిలిన ప్రపంచ దేశాల నుంచి 18 శాతం అధికంగా 23.4 కోట్ల డాలర్ల అమ్మకాలు సాధించింది. గ్లోబల్ ఇన్నోవేటివ్ ఔషధ విక్రయాలు 16 శాతం ఎగసి 33.3 కోట్ల డాలర్లను తాకాయి. అయితే ఏపీఐ అమ్మకాలు 20 శాతం క్షీణించి 430 కోట్ల డాలర్లకు పరిమితమయ్యాయి.

జీసీసీ లీడర్.. హైదరాబాద్!

- బెంగళూరుతో కలిపి 70 శాతం వాటా
- క్వెస్ కార్ప్ నివేదిక

ముంబై: గ్లోబల్ కేపబిలిటీ సెంటర్స్ (జీసీసీ)కి సంబంధించి నాయకత్వ స్థాయి ఉద్యోగాలు ఎక్కువగా హైదరాబాద్, బెంగళూరుల్లో ఉంటున్నాయి. ఈ తరహా కొలువుల్లో సుమారు 70 శాతం వాటా (ప్రతి 10 ఉద్యోగాల్లో 7) ఈ రెండు నగరాలదే ఉంటోంది. క్వెస్ కార్ప్ రూపొందించిన 'ఇండియా జీసీసీ–ఐటీ టాలెంట్ ట్రెండ్స్ 2025' నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం వార్షికంగా హైదరాబాద్‌లో లీడర్‌షిప్ హోదాల్లో ఓపెనింగ్స్ 42 శాతం పెరిగాయి. పోటీ తీవ్రంగా ఉండటంతో వేతనాలు కూడా సాధారణం కంటే 6–8 శాతం ఎక్కువగా ఇవ్వాల్సి ఉంటోంది. బెంగళూరులో మార్కెట్ సగటుకన్నా 8–10 శాతం అధికంగా వేతనాలు ఉంటున్నాయి. నివేదికలోని మరిన్ని కీలకాంశాలు..

- ఫైనాన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్ విభాగాల్లో చెన్నైలో అత్యధిక కొలువులు ఉంటున్నాయి. రిటెన్షన్ స్థాయి (ఉద్యోగులను అట్టే పెట్టుకోవడం), ప్రథమ శ్రేణి నగరాలన్నింటితో పోలిస్తే అత్యధికంగా 94%గా ఉంది. అనలిటిక్స్, క్వాలిటీ అష్యూరెన్స్ విభాగాల్లో పుణె క్రమంగా పైకొస్తోంది. కోచి, కోయంబత్తూర్, అహ్మదాబాద్, ఇండోర్‌లాంటి చిన్న నగరాలూ క్రమంగా వృద్ధి చెందుతున్నాయి.
- కొత్త టెక్నాలజీల్లో నిపుణుల కొరత తీవ్రంగా ఉంటోంది. జనరేటివ్ ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్ విభాగాల్లో 50% అంతరం నెలకొంది. ఇక ఫిన్‌ఆప్స్ (ఫైనాన్షియల్ ఆపరేషన్స్), జీరో ట్రస్ట్ సెక్యూరిటీ, కుబెర్‌నెటిస్, టెరాఫామ్‌లాంటి వాటిల్లో 38–45 శాతం మేర నిపుణుల కొరత ఉంది.
- కీలక హోదాలను భర్తీ చేయడానికి కంపెనీలకు సగటున 3–4 నెలలు (90–120 రోజులు) పడుతోంది. అయితే, ఆఫర్లు అందుకున్నప్పటికీ 68–72 శాతం మంది మాత్రమే ఉద్యోగాల్లో చేరుతున్నారు. ఇలా నిపుణుల కొరత నెలకొనడం వల్ల ప్రాజెక్టుల పురోగతి నెమ్మదిస్తోంది. ముఖ్యంగా బెంగళూరు, హైదరాబాద్‌లో ఇలాంటి పరిస్థితి ఎక్కువగా ఉంది.
- కొత్త కొలువుల్లో దాదాపు సగం వాటా ఏఐ, డేటా, ప్లాట్‌ఫాం, క్లౌడ్, సైబర్‌సెక్యూరిటీలాంటి విభాగాలదే ఉంటోంది. కంపెనీలు కేవలం ఉద్యోగుల సంఖ్యను పెంచుకోవడంపై కాకుండా సాధించే ఫలితాలను బట్టి ఇన్వెస్ట్ చేస్తున్నాయి.

స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ ఆదాయం రూ. 188 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ ఆదాయం రూ. 188 కోట్లుగా, లాభం రూ. 20 కోట్లుగా నమోదైంది. అర్ధ సంవత్సరానికి గాను ఆదాయం సుమారు 17 శాతం పెరిగి రూ. 366 కోట్లకు, లాభం దాదాపు 15 శాతం వృద్ధి చెంది రూ. 42 కోట్లకు చేరింది. సంస్థ పేరును స్టాండర్డ్ ఇంజనీరింగ్ టెక్నాలజీగా మార్చాలనే ప్రతిపాదనకు కంపెనీ బోర్డు ఆమోదముద్ర వేసింది. ఫార్మా, కెమికల్స్ తదితర రంగాలకు అవసరమైన హై ప్రెసిషన్ ఇంజనీరింగ్, టెక్నాలజీ సొల్యూషన్స్ అందించే దిగ్గజంగా ఎదిగే క్రమంలో తమ ప్రస్థానాన్ని ప్రతిబింబించేదిగా ఇది ఉంటుందని కంపెనీ ఎండీ నాగేశ్వరరావు కందుల తెలిపారు. బయోటెక్నాలజీ, హై–ప్యూరిటీ సిస్టమ్స్‌లో స్థానాన్ని పటిష్టం చేసుకునేందుకు సైజెనిక్స్ ఇండియా కొనుగోలు, డిజైన్ నుంచి వేలిడేషన్ వరకు వివిధ ప్రక్రియల అనుసంధానానికి ప్రతిపాదిత సీ2సీ ఇంజనీరింగ్ కొనుగోలు సహాయపడతాయని చెప్పారు.

గ్రాసిమ్ లాభం హైజంప్

క్యూ2లో రూ. 1,498 కోట్లు

న్యూఢిల్లీ: ఆదిత్య బిర్లా గ్రూప్ డైవర్సిఫైడ్ దిగ్గజం గ్రాసిమ్ ఇండస్ట్రీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ఆకర్షణీయ ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం 52 శాతం జంప్‌చేసి రూ. 1,498 కోట్లను అధిగమించింది. సిమెంట్, కెమికల్ బిజినెస్‌లో వృద్ధి ఇందుకు సహకరించింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 989 కోట్లు ఆర్జించింది. కార్యకలాపాల ఆదాయం 17 శాతం పుంజుకుని రూ. 39,900 కోట్లను తాకగా.. గత క్యూ2లో రూ. 34,223 కోట్ల ఆదాయం అందుకుంది. మొత్తం టర్నోవర్ 16% ఎగసి రూ. 40,245 కోట్లకు చేరింది. బిల్డింగ్ మెటీరియల్స్, కెమికల్స్ విభాగాలు ఇందుకు దోహదపడ్డాయి. అయితే మొత్తం వ్యయాలు 15 శాతం పెరిగి రూ. 37,796 కోట్లకు చేరాయి.

బ్లూ స్టార్ లాభం ప్లస్

క్యూ2లో రూ. 99 కోట్లు

న్యూఢిల్లీ: ఏసీలు, కమర్షియల్ రిఫ్రిజిరేషన్ సిస్టమ్‌ల తయారీ దిగ్గజం బ్లూ స్టార్ లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం (2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జూలై–సెప్టెంబర్(క్యూ2)లో నికర లాభం స్వల్ప (3%) వృద్ధితో రూ. 99 కోట్లను తాకింది. రుతుపవనాలు దీర్ఘకాలం కొనసాగడం, అమ్మకపు చానల్స్‌లో సవాళ్లు, జీఎస్‌టీ రేట్ల సవరణలు ప్రతికూల ప్రభావం చూపినట్లు కంపెనీ పేర్కొంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 96 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 9% ఎగసి రూ. 2,422 కోట్లను అధిగమించింది. గత క్యూ2లో రూ. 2,216 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే మొత్తం వ్యయాలు సైతం 6% పెరిగి రూ. 2,299 కోట్లకు చేరాయి. ఇతర ఆదాయంతో కలసి మొత్తం టర్నోవర్ 6% పుంజుకుని రూ. 2,432 కోట్లను దాటింది.

ఆర్‌బీఎల్ బ్యాంక్ ఓపెన్ ఆఫర్ @ రూ. 280

- పబ్లిక్ నుంచి 26 శాతం వాటా కొనుగోలు
- ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్ రెడీ
- డిసెంబర్ 12 నుంచి షురూ

న్యూఢిల్లీ: సాధారణ వాటాదారుల(పబ్లిక్) నుంచి ఎమిరేట్స్ ఎన్‌బీడీ బ్యాంక్ 26 శాతం వాటా కొనుగోలు చేయనున్నట్లు ప్రైవేట్ రంగ సంస్థ ఆర్‌బీఎల్ బ్యాంక్ తాజాగా పేర్కొంది. ఇందుకు ఓపెన్ ఆఫర్ డిసెంబర్ 12న ప్రారంభమై 26న ముగియనున్నట్లు వెల్లడించింది. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మార్గదర్శకాల ప్రకారం షేరుకి రూ. 280 ధరలో 26 శాతం వాటాకు సమానమైన 41,55,86,443 షేర్ల కొనుగోలుకి ఎమిరేట్స్ ఎన్‌బీడీ ఆఫర్ చేపట్టనున్నట్లు తెలియజేసింది. గత నెలలో ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో 60 శాతం వాటా సొంతం చేసుకునే ప్రణాళికల్లో ఉన్నట్లు యూఏఈ బ్యాంకింగ్ దిగ్గజం ఎమిరేట్స్ ఎన్‌బీడీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందుకు రూ. 26,853 కోట్లు వెచ్చించనుంది. విలువరీత్యా ఇది దేశీ ఫైనాన్షియల్ రంగంలో అతిపెద్ద డీల్‌కాగా.. అత్యంత భారీ విదేశీ ప్రత్యక్ష పెట్టుబడిగానూ నిలవనుంది. ఇటీవల జపనీస్ దిగ్గజం ఎస్ఎంబీసీ మరో దేశీ ప్రైవేట్ రంగ సంస్థ యస్ బ్యాంక్‌లో 24.9 శాతం వాటా కొనుగోలు చేసిన నేపథ్యంలో ఎమిరేట్స్ డీల్‌కు ప్రాధాన్యత ఏర్పడింది. యస్ బ్యాంక్ వాటాకు ఎస్ఎంబీసీ రూ. 16,333 కోట్లు ఇన్వెస్ట్ చేసిన విషయం విదితమే.

గ్రోక్‌తో పేటీఎం జట్టు

న్యూఢిల్లీ: అమెరికన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కంపెనీ గ్రోక్‌తో దేశీ ఫిన్‌టెక్ దిగ్గజం పేటీఎం మాతృ సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ ఒప్పందం కుదుర్చుకుంది. తమ ప్లాట్‌ఫాంపై లావాదేవీల ప్రాసెసింగ్, రిస్క్ అసెస్‌మెంట్, మోసాలను గుర్తించడంలాంటి అంశాల్లో పనితీరును మెరుగుపర్చుకునేందుకు గ్రోక్‌క్లౌడ్ సాంకేతికతను ఉపయోగించుకునేందుకు ఇది ఉపయోగపడనుంది. దేశీయంగా అత్యంత అధునాతనమైన, ఏఐ ఆధారిత పేమెంట్, ఆర్థిక సేవల ప్లాట్‌ఫాంగా ఎదిగేందుకు ఈ ఒప్పందం తోడ్పడుతుందని పేటీఎం చీఫ్ బిజినెస్ ఆఫీసర్ నరేంద్ర సింగ్ యాదవ్ తెలిపారు.

ఈ నెల 26 నుంచి పౌల్ట్రీ ఎక్స్‌పో

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్ 17వ ఎడిషన్ నవంబర్ 26 నుంచి 28 వరకు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ఎక్స్‌పోలో పౌల్ట్రీ పరిశ్రమ ఉత్పత్తులు, యంత్ర పరికరాలు, ఆవిష్కరణలు మొదలైనవి ప్రదర్శించనున్నారు. అలాగే, పౌల్ట్రీ రంగంలో కొత్త విధానాలు, సాంకేతికత, పరిశోధనలు, కెరియర్ అవకాశాలు తదితర అంశాలపై చర్చాగోష్టులు ఉంటాయని ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎంఏ) ప్రెసిడెంట్ ఉదయ్ సింగ్ బయాస్ బుధవారమిక్కడ విలేకరుల సమావేశంలో తెలిపారు. దక్షిణాసియాలోనే అతి పెద్దదైన ఈ పౌల్ట్రీ ఎక్స్‌పోలో దేశ విదేశాలకు చెందిన 500 మంది పైగా ఎగ్జిబిటర్లు, 1,500 మంది ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 50 వరకు దేశాల నుంచి 45,000 మందికి పైగా సందర్శకులు వస్తారనే అంచనాలు ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం భారతదేశం గుడ్ల ఉత్పత్తిలో రెండవ స్థానంలో, బ్రాయిలర్ మాంస ఉత్పత్తిలో నాలుగో స్థానంలో ఉందని చెప్పారు. మాంసం ఉత్పత్తిలో ప్రతి సంవత్సరం 8 నుంచి 10% వృద్ధి చెందుతోందని తెలిపారు.

పౌల్ట్రీ పరిశ్రమ వేల్యూచెయిన్ ప్రస్తుతం సుమారు రూ. 4 లక్షల కోట్లుగా ఉండగా, వికసిత్ భారత్ లక్ష్యాన్ని సాధించే నాటికి ఇరవై రెట్లు పైగా పెరిగే అవకాశం ఉందని ప్రధాన అతిథిగా పాల్గొన్న శ్రీనివాస ఫామ్స్ ఎండీ సురేష్ చిట్టూరి తెలిపారు.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం : పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం : తెలుగు–ఎస్ఏ/ఎస్‌జీటీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం : ఇండియన్ ఎకానమీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం : కంప్యూటర్ అవేర్‌నెస్

ఏపీ టెట్.. విజయానికిదే రూట్

టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్.. సంక్షిప్తంగా టెట్. డీఈడీ, బీఈడీ కోర్సు పూర్తి చేసుకుని.. ఉపాధ్యాయ వృత్తిలో స్థిరపడాలనుకునే అభ్యర్థులకు చక్కటి అవకాశం! ఇందులో.. ఉత్తీర్ణత సాధిస్తేనే ప్రభుత్వ ఉపాధ్యాయ నియామకాలకు నిర్వహించే.. డీఎస్సీకి దరఖాస్తు చేసుకునే అవకాశం లభిస్తుంది. అందుకే బీఈడీ, డీఈడీ ఉత్తీర్ణులు టెట్ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తుంటారు. టెట్‌లో మంచి స్కోర్ సాధించేందుకు కృషి చేస్తుంటారు. తాజాగా ఏపీలో టెట్-2025 నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నేపథ్యంలో.. టెట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు అర్హత, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు తదితర వివరాలు..

» ఏపీ టెట్ అక్టోబర్-2025 నోటిఫికేషన్ విడుదల
» మెథడాలజీ, పెడగాజీలపై పట్టుతో సక్సెస్

నాలుగు పేపర్లు

ఏపీ టెట్‌ను నాలుగు పేపర్లుగా నిర్వహిస్తారు. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు ఉపాధ్యాయులుగా బోధించాలనుకునే వారు పేపర్–1ఎ, ఒకటి నుంచి అయిదో తరగతి వరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ అభ్యర్థులు పేపర్–1బి, ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులు పేపర్–2ఎ, ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్స్‌గా బోధించాలనుకునే వారు పేపర్–2బికు హాజరవ్వాలి.

పేపర్ వారీగా అర్హతలు

పేపర్–1ఎ: ఇంటర్మీడియెట్/తత్సమాన కోర్సులో కనీసం 50శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు రెండేళ్ల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (లేదా) ఎన్‌సీటీఈ -2002 నిబంధనల ప్రకారం–కనీసం 45 శాతం మార్కులతో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో ఉత్తీర్ణత ఉండాలి (లేదా) నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో ఉత్తీర్ణత తదితర తత్సమాన అర్హతలుండాలి.

పేపర్–1బి: ప్రత్యేక అవసరాలు కలిగిన(దివ్యాంగ) విద్యార్థులకు ఉద్దేశించిన పాఠశాలల్లో ఒకటి నుంచి అయిదో తరగతి వరకు బోధించడానికి ఉద్దేశించిన పేపర్ ఇది. దీనికోసం ఇంటర్మీడియెట్‌తో పాటు రెండేళ్ల స్పెషల్ ఎడ్యుకేషన్ డీఈడీ ఉత్తీర్ణత లేదా తత్సమాన కోర్సుల ఉత్తీర్ణత ఉండాలి.

పేపర్–2ఎ: ఆరు నుంచి ఎనిమిదో తరగతి ఆయా విద్యార్థులకు మ్యాథమెటిక్స్, సైన్స్, సోషల్, లాంగ్వేజ్ టీచర్స్‌గా బోధించాలనుకునే వారికి నిర్వహించే పేపర్–2ఎకు బ్యాచిలర్ డిగ్రీ లేదా పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణతతోపాటు బీఈడీ ఉత్తీర్ణత/తత్సమాన అర్హతలు ఉండాలి.

పేపర్–2బి: ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు(దివ్యాంగ)కు ఉద్దేశించిన పాఠశాలల్లో ఆరు నుంచి ఎనిమిదో తరగతి వరకు బోధించాలనుకునే వారికి నిర్వహించే పేపర్ ఇది. దీనికి బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్/బీఈడీతోపాటు ఏడాది లేదా రెండేళ్ల వ్యవధి గల డీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్/బీఈడీతో పాటు పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రొఫెషనల్ డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్/పీజీ డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్(మెంటల్ రిటార్డేషన్) /పీజీ డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్(మల్టిపుల్ డిజేబిలిటీ– ఫిజికల్ అండ్ న్యూరాలజికల్)/పీజీ డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్(లోకోమోటర్ ఇంపెయిర్‌మెంట్ అండ్ సెరెబ్రల్ పాల్సీ)/విజువల్ ఇంపెయిర్‌మెంట్‌లో సెకండరీ లెవల్ టీచర్ ట్రైనింగ్ కోర్స్/ సీనియర్ డిప్లొమా ఇన్ టీచింగ్ ద డెఫ్ / విజువల్ ఇంపెయిర్‌మెంట్‌లో బీఏ–బీఈడీ/ ఆర్‌సీఐ గుర్తింపు పొందిన ఇతర కోర్సులు. వీటిలో ఏదో ఒక కోర్సులో ఉత్తీర్ణత సాధించాలి.

అన్ని పేపర్లకు సంబంధించి అర్హత ప్రమాణాల్లో రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు కనీస మార్కుల్లో అయిదు శాతం మినహాయింపు కల్పిస్తారు.

సదరు కోర్సుల చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా టెట్ పేపర్లకు హాజరు కావచ్చు. కానీ తదుపరి దశలో ఉపాధ్యాయ నియామక పరీక్ష (డీఎస్సీ) నిర్వహించే నాటికి డీఈడీ లేదా బీఈడీలలో ఉత్తీర్ణత సాధిస్తేనే డీఎస్సీకి అర్హత లభిస్తుంది.

టెట్- పేపర్లు.. పరీక్ష ఇలా

- టెట్ పేపర్–1ఎ, 1బి, పేపర్–2ఎ, 2బిలను 150 మార్కులకు నిర్వహిస్తారు.
- అన్ని పేపర్లు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటాయి. ప్రతి పేపర్‌కు 2:30 గంటల సమయం అందుబాటులో ఉంటుంది.
- పేపర్–1ఎ, 1బిలో ఐదు విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. అవి.. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు–30 మార్కులకు,లాంగ్వేజ్1 30 ప్రశ్నలు–30 మార్కులకు, లాంగ్వేజ్ 2(ఇంగ్లిష్) 30 ప్రశ్నలు–30 మార్కులకు, గణితం 30 ప్రశ్నలు–30 మార్కులకు,ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్ 30 ప్రశ్నలు–30 మార్కులకు ఉంటాయి. లాంగ్వేజ్–1 సబ్జెక్ట్ కింద తెలుగు, ఉర్దూ, హిందీ, బెంగాలీ, కన్నడ, మరాఠీ, తమిళం, గుజరాతీ లాంగ్వేజ్‌లను ఎంచుకోవచ్చు.
- పేపర్–2ఎలో నాలుగు విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. ఇందులో చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు– 30 మార్కులకు, లాంగ్వేజ్1 30 ప్రశ్నలు–30 మార్కులకు, లాంగ్వేజ్ 2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు– 30 మార్కులకు, సంబంధిత సబ్జెక్ట్ 60 ప్రశ్నలు–60 మార్కులకు అడుగుతారు. ఇలా మొత్తం 150 ప్రశ్నలు–150 మార్కులకు పరీక్ష జరుగుతుంది. నాలుగో విభాగంగా నిర్వహించే సంబంధిత సబ్జెక్ట్ విషయంలో.. మ్యాథమెటిక్స్ అండ్ సైన్స్ టీచర్స్ అభ్యర్థులు మ్యాథ్స్ అండ్ సైన్స్ విభాగాన్ని, సోషల్ టీచర్లు సోషల్ స్టడీస్ విభాగాన్ని ఎంచుకుని పరీక్ష రాయాలి. అదే విధంగా సబ్జెక్ట్ పేపర్‌కు సంబంధించి కంటెంట్ నుంచి 24 ప్రశ్నలు, పెడగాజి నుంచి ఆరు ప్రశ్నలు చొప్పున ప్రతి సబ్జెక్ట్ విభాగం నుంచి అడుగుతారు. సైన్స్ సబ్జెక్ట్ విషయంలో ఫిజికల్ సైన్స్ నుంచి 12, బయలాజికల్ సైన్స్ నుంచి 12 ప్రశ్నలు చొప్పున కంటెంట్ సంబంధిత ప్రశ్నలు ఉంటాయి. మిగతా ఆరు ప్రశ్నలు సైన్స్ పెడగాజి నుంచి అడుగుతారు. సోషల్ విభాగంలో 48 కంటెంట్ ప్రశ్నలు,12 పెడగాజి ప్రశ్నలు అడుగుతారు. ఈ సబ్జెక్ట్ విభాగం విషయంలో రెండు అర్హతలు ఉన్న వారు తమకు ఆసక్తి ఉన్న విభాగంలో పరీక్ష రాసే అవకాశం అందుబాటులో ఉంది. లాంగ్వేజ్ సబ్జెక్ట్ మెథడాలజీకి సంబంధించి 48 కంటెంట్ సంబంధిత ప్రశ్నలు, 12 పెడగాజి సంబంధిత ప్రశ్నలు అడుగుతారు.
- పేపర్–2బిలో నాలుగు విభాగాల నుంచి 150 ప్రశ్నలు–150 మార్కులకు పరీక్ష ఉంటుంది. ఇందులో.. చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి 30 ప్రశ్నలు–30 మార్కులకు, లాంగ్వేజ్1పై 30 ప్రశ్నలు– 30 మార్కులకు, లాంగ్వేజ్ 2 (ఇంగ్లిష్) 30 ప్రశ్నలు–30 మార్కులకు, డిజేబిలిటీ స్పెషలైజేషన్ సబ్జెక్ట్ అండ్ పెడగాజి 60 ప్రశ్నలు -60 మార్కులకు ఉంటాయి. పేపర్–2బిలో నాలుగో విభాగంలో అభ్యర్థులు తాము స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సులో చదివిన సబ్జెక్టును ఎంచుకోవాల్సి ఉంటుంది. అలా ఎంచుకున్న సబ్జెక్ట్ నుంచి 48 కంటెంట్ ప్రశ్నలు, 12 పెడగాజి సంబంధిత ప్రశ్నలు అడుగుతారు.

కనీస అర్హత మార్కులు

ఏపీ టెట్‌లోని అన్ని పేపర్లలోనూ అభ్యర్థులు తప్పనిసరిగా కనీస ఉత్తీర్ణత మార్కులు పొందాలి. జనరల్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 60 శాతం మార్కులతో, బీసీ కేటగిరీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగుల కేటగిరీలకు చెందిన అభ్యర్థులు 40 శాతం మార్కులతో టెట్‌లో తాము హాజరైన పేపర్లో ఉత్తీర్ణత సాధించాలి.

పరీక్షలో రాణించేలా ప్రిపరేషన్

చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజి

ఈ విభాగంలో శిశువు మనస్తత్వ సంబంధిత అంశాలపై దృష్టి పెట్టాలి. వికాస దశలు, వికాస అంశాలైన శారీరక, మానసిక, సాంఘిక, ఉద్వేగ వికాసాలు మొదలైన అంశాలను క్షుణ్నంగా చదవాలి. శిశువు ప్రవర్తనలో మార్పునకు సంబంధించిన అభ్యాసం, అభ్యసన బదలాయింపు అంశాలను చదవాలి. పెడగాజికి సంబంధించి సహిత విద్య, శిశువు విద్యా ప్రణాళిక,బోధన పద్ధతులు, మూల్యాంకనం–నాయకత్వం–గైడెన్స్–కౌన్సెలింగ్ గురించి అధ్యయనం చేయాలి. ఎడ్యుకేషన్‌కు సంబంధించిన చట్టాలపై పూర్తి అవగాహన పొందాలి. పెడగాజిలోని భావనలు, సిద్ధాంతాలు, నిబంధనలను విశ్లేషిస్తూ అధ్యయనం చేస్తేనే ఏ కోణంలో ప్రశ్న అడిగినా సమాధానం ఇచ్చే సన్నద్ధత లభిస్తుంది.

లాంగ్వేజ్-1, 2

లాంగ్వేజ్ విభాగాలకు సంబంధించి లాంగ్వేజ్–1లో అభ్యర్థులు తాము ఎంచుకున్న భాషలో.. అదే విధంగా లాంగ్వేజ్–2గా పేర్కొన్న ఇంగ్లిష్‌లో భాషా విభాగాలకు సంబంధించిన సాధారణ వ్యాకరణ అంశాలు,బోధన పద్ధతులపై ప్రశ్నలు ఉంటాయి. స్కూల్ స్థాయిలో తెలుగు సబ్జెక్ట్ పుస్తకాలతో పాటు తెలుగు బోధన పద్ధతులను చదవాలి. ఇంగ్లిష్‌లో పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఆర్టికల్స్, డైరెక్ట్ అండ్ ఇన్ డైరెక్ట్ స్పీచ్, డిగ్రీస్ ఆఫ్ కంపేరిజన్, వొకాబ్యులరీ.. ఇలా అన్ని అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.

మ్యాథమెటిక్స్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ స్టడీస్

పేపర్–1లో ఉండే ఈ సబ్జెక్టుల్లో ప్రాథమిక అంశాలపై ఒకటి నుంచి నుంచి అయిదో తరగతి స్థాయి వరకు ప్రశ్నలు అడుగుతారు. ఆయా సబ్జెక్టుల్లో ఒక్కో సబ్జెక్టులో ఉన్న 30 ప్రశ్నల్లో.. 24 ప్రశ్నలు కంటెంట్‌పై ఉంటే.. 6 ప్రశ్నలు పెడగాజి నుంచి అడుగుతారు. ఇక పేపర్–2లో మ్యాథమెటిక్స్, సైన్స్‌పై ప్రశ్నలు ఉంటాయి. ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు ఉండే కాన్సెప్టులపైనే ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నల క్లిష్టత మాత్రం ఇంటర్ స్థాయిలో ఉంటుంది. ఎన్విరాన్‌మెంటల్ పేపర్‌లో సైన్స్ నుంచి ప్రశ్నలు తప్పనిసరిగా ఉంటున్నాయి.

సైన్స్

ఈ విభాగంలో మార్కుల కోసం మూడు నుంచి ఎనిమిదో తరగతి వరకు పుస్తకాలు ఔపోసన పట్టాలి. పేపర్–2 కోసం ప్రత్యేకంగా ఆరు నుంచి పదో తరగతి వరకు పుస్తకాలు చదవాలి. అదే విధంగా ఆయా అంశాల బేసిక్స్, అప్లికేషన్స్ వంటి వాటిపై ప్రత్యేక అధ్యయనం చేయాలి.

సోషల్ స్టడీస్

హైస్కూల్ స్థాయి పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా ఒక అంశానికి సంబంధించి అన్ని కోణాల్లోనూ అధ్యయనం చేయాలి. ఉదాహరణకు సివిక్స్‌లోని రాజ్యాంగాన్ని పరిగణనలోకి తీసుకుంటే కేవలం రాజ్యాంగంలోని ఆర్టికల్స్, సవరణలకు పరిమితం కాకుండా.. రాజ్యాంగ రూపకల్పనకు దారితీసిన పరిస్థితులు మొదలు తాజా సవరణలు వాటికి సంబంధించిన ఆర్టికల్స్‌ను సమన్వయం చేసుకుంటూ చదవాలి.

మెథడాలజీ

ఇందులో ప్రధానంగా బోధనా పద్ధతులు, టీచర్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం), బోధన ఉద్దేశాలు, విలువలు, లక్ష్యాలను చదవాలి. పేపర్–1, పేపర్–2లో అడిగే అంశాలు ఒక్కటే అయినా.. వాటి క్లిష్టత స్థాయిలో తేడా ఉంటుంది. దీన్ని గుర్తించి ప్రిపరేషన్ కొనసాగించాలి.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: 2025, నవంబర్ 23
- హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం: 2025, డిసెంబర్ 3 నుంచి
- టెట్ పరీక్ష తేదీలు: డిసెంబర్ 10 నుంచి
- ఫలితాల వెల్లడి: 2026, జనవరి 19
- వెబ్‌సైట్: http://cse.ap.gov.in

విద్య, ఉద్యోగ సమాచారం

ఎన్ఎఫ్‌సీ, హైదరాబాద్‌లో 405 అప్రెంటిస్‌లు

హైదరాబాద్‌లోని న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్(ఎన్ఎఫ్‌సీ).. వివిధ విభాగాల్లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 405.
» **ట్రేడుల వారీగా ఖాళీలు:** ఫిట్టర్–126, టర్నర్–35,ఎలక్ట్రీషియన్–53,మెషినిస్ట్–17,అటెండెంట్ ఆపరేటర్ లేదా కెమికల్ ప్లాంట్ ఆపరేటర్–23, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్స్–19, ఎలక్ట్రానిక్స్ మెకానిక్స్–24, ల్యాబొరేటరీ అసిస్టెంట్(కెమికల్ ప్లాంట్)–1,మోటార్ మెకానిక్స్(వెహికల్) –4, డ్రాఫ్ట్స్‌మెన్(మెకానికల్)–3, సీవోపీఏ–59, డీజిల్ మెకానిక్–4, కార్పెంటర్–5, ప్లంబర్–5, వెల్డర్–26, స్టెనోగ్రాఫర్(ఇంగ్లిష్)–1.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రూ.9,600 నుంచి 10,560.
» **ఎంపిక విధానం:** మెరిట్ ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.11.2025
» **వెబ్‌సైట్:** https://www.nfc.gov.in

ఆర్ఆర్‌సీ-దక్షిణ మధ్య రైల్వేలో 61 స్పోర్ట్స్ కోటా పోస్టులు

రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)–దక్షిణ మధ్య రైల్వే స్పోర్ట్స్ కోటా పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 61
» **పోస్టుల వివరాలు:** లెవల్–3/2(ఎస్‌సీఆర్, హెడ్ క్వార్టర్స్, సికింద్రాబాద్ కోటా)–21, లెవల్ –1 (హెడ్ క్వార్టర్స్ కోటా)–10, సికింద్రాబాద్ డివిజన్–5, హైదరాబాద్ డివిజన్–5, విజయవాడ డివిజన్–5, గుంటూరు డివిజన్–5, గుంతకల్ డివిజన్–5, నాందేడ్ డివిజన్–5.
» **క్రీడలు:** అథ్లెటిక్స్, షటిల్ బ్యాడ్మింటన్, బాక్సింగ్, క్రికెట్, సైక్లింగ్, జిమ్నాస్టిక్స్, ఖోఖో, పవర్ లిఫ్టింగ్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, హాకీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి/ఐటీఐ, ఇంటర్మీడియట్ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు అభ్యర్థులు దేశం/రాష్ట్రం/పాఠశాల/యూనివర్సిటీ తరపున గుర్తింపు పొందిన క్రీడా పోటీల్లో పాల్గొని ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** స్పోర్ట్స్ ట్రయల్స్, సర్టిఫికేట్ల పరిశీలన ఆధారంగా (సికింద్రాబాద్(తెలంగాణ) లేదా ఎస్‌సీఆర్ నిర్ణయించే ఇతర కేంద్రాల్లో నిర్వహిస్తారు).
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 25.10.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.11.2025
» **వెబ్‌సైట్:** https://scr.indianrailways.gov.in

క్లుప్తంగా...

ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు

ప్రకాశం జిల్లా బి.చెర్లోపల్లిలో అత్యధికంగా 6.5 సెంటీమీటర్ల వర్షం

సాక్షి, అమరావతి: నైరుతి బంగాళాఖాతం నుంచి ఉత్తర కేరళ వరకు తమిళనాడు మీదుగా కొనసాగుతున్న ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం ప్రకాశం జిల్లా బి.చెర్లోపల్లిలో అత్యధికంగా 6.5 సెంటీ మీటర్లు, శ్రీసత్యసాయి జిల్లా గండ్లపెంటలో 4.5, నెల్లూరు జిల్లా రాపూర్‌లో 4, విజయవాడ తూర్పులో 3.9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. పలు జిల్లాల్లో రానున్న 24 గంటల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. గురువారం కృష్ణా, ప్రకాశం, నెల్లూరు, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. మిగతా జిల్లాల్లో కూడా అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ ద్రోణి మరో రెండు రోజులపాటు కొనసాగుతుందని తెలిపారు. ద్రోణి బలహీనపడిన తర్వాత వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని చెప్పారు.

తిరుపతి జిల్లాలో ఆయిల్ నిక్షేపాల కోసం అన్వేషణ

వాకాడు: శాటిలైట్ సమాచారం ఆధారంగా భూగర్భంలో పెట్రోలు, డీజిల్, గ్యాస్ నిక్షేపాలు ఉన్నాయని తెలుసుకుని తిరుపతి జిల్లా వాకాడు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం మిషన్ అన్వేషణ ప్రతినిధులు అన్వేషించారు. వాకాడు, గొల్లపాళెంలో దాదాపు 26 చోట్ల 80 అడుగుల లోతున డ్రిల్లింగ్ వేసి మట్టి నమూనాల సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ పీఆర్వో సుధీర్ మీడియాతో మాట్లాడారు. భూగర్భ నిక్షేపాల కోసం ఓఎన్‌జీసీ మట్టి నమూనాల సర్వే విజయవాడ నుంచి తిరుపతి జిల్లా సూళ్ళూరుపేట వరకు నిర్వహించినట్టు తెలిపారు. 80 అడుగుల లోతులో ఉన్న మట్టిని తీసి ఢిల్లీ ఓఎన్‌జీసీ పరీక్ష కేంద్రానికి పంపుతామన్నారు. ప్రాథమిక నిర్ధారణ అనంతరం రెండో సర్వే చేపడతామని చెప్పారు. ఆయిల్ నిక్షేపాలు ఉన్నాయని తేలితే వాటిని వెలికి తీసి ఈ ప్రాంత వాసుల అవసరాలకు ఉపయోగిస్తామని చెప్పారు. రెండు రోజులుగా భూగర్భంలో బ్లాస్ట్ ద్వారా వాకాడు పరిసరాల్లో అన్వేషణ సాగుతోంది.

హైకోర్టుకు గ్రూప్–1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాలు

సాక్షి, అమరావతి: డిజిటల్, మ్యాన్యువల్ విధానంలో మూల్యాంకనం చేసిన గ్రూప్–1 ప్రధాన పరీక్ష జవాబు పత్రాలను ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) బుధవారం సీల్డ్ బాక్సుల్లో హైకోర్టుకు సమర్పించింది. మ్యాన్యువల్ జవాబు పత్రాలను సీల్డ్ కవర్లలోను, డిజిటల్ మూల్యాంకనం జవాబు పత్రాలను హార్డ్‌డిస్క్‌లోను అందజేసింది. వాటిని హైకోర్టు రిజిస్ట్రార్ (జ్యుడిషియల్)కి అందచేయాలని ధర్మాసనం ఏపీపీఎస్సీ అధికారులను ఆదేశించింది. వాటిని పరిశీలించి రక్షణ ఏర్పాట్ల మధ్య భద్రపరచాలని రిజిస్ట్రార్‌కి నిర్దేశించింది. తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ అవధానం హరిహరనాథశర్మ ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

ఉద్యాన సహాయకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రపై కక్ష సాధింపు

సాక్షి, అమరావతి : ప్రపంచం మెచ్చిన రైతుభరోసా కేంద్రాల (ఆర్బీకేల).. (ప్రస్తుత రైతు సేవాకేంద్రాలు – ఆర్ఎస్‌కేలు) వ్యవస్థను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా టీడీపీ కూటమి ప్రభుత్వం కుట్రలకు తెగబడుతోంది. రైతులకు గ్రామస్థాయిలో సేవలందిస్తున్న ఆర్ఎస్‌కేల సిబ్బంది లక్ష్యంగా వేధింపులకు పాల్పడుతోంది. ఈ వేధింపులకు పరాకాష్టగా ఉద్యాన సహాయకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.సురేంద్రను ఉద్యోగం నుంచి తొలగించింది. వైఎస్సార్ కడప జిల్లా ఖాజీపేట మండలం రావులపల్లె రైతు సేవా కేంద్రంలో గ్రామ ఉద్యాన సహాయకుడు (వీహెచ్ఏ)గా పనిచేస్తున్న సురేంద్ర తమకు రావాల్సిన బిల్లుల కోసం పోరాడుతున్నారు. ఈ నేపథ్యంలో ఏవో కారణాలు చూపి ప్రభుత్వం అతడికి మూడు నెలలుగా వేతనం నిలిపేసింది. ఇప్పుడు ఏకంగా సురేంద్రను సర్వీసు నుంచి తొలగిస్తూ మంగళవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ వేధింపులతో 18 నెలల్లో ఐదుగురు ఉద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో ముగ్గురు గత ఆగస్టు నెలలోనే ఉసురు తీసుకున్నారు. వీరిని వివిధ సర్వేల పేరిట వ్యవసాయేతర పనులకు వినియోగిస్తూ ప్రభుత్వం ఒత్తిడికి గురిచేస్తోంది. ఈ–క్రాప్ నమోదు చేయలేదని, ఎరువులు విక్రయించడం లేదని, యూరియా సరఫరాలో అలసత్వం ప్రదర్శిస్తున్నారని, రైతుల నుంచి సేకరించిన సబ్సిడీ సొమ్ము గడువులోగా చెల్లించడం లేదని.. ఇలా ఏదో ఒక సాకుతో వేధిస్తోంది. ఈ ఒత్తిడి నేపథ్యంలో ఇటీవల మరో నలుగురు ఉద్యోగులు రోడ్డు ప్రమాదాలకు గురై మృత్యువాతపడ్డారు. వివిధ కారణాలతో సర్కారు ఐదుగురిని సస్పెండ్ చేసింది. విధుల నుంచి తొలగించినంత మాత్రాన వెనక్కితగ్గే ప్రసక్తే లేదని, పక్కదారి పట్టిన నిధులు ఆర్ఎస్‌కే సిబ్బందికి జమయ్యే వరకు నా పోరాటం ఆగదని సురేంద్ర స్పష్టం చేశారు.

నకిలీ మద్యం కేసు దర్యాప్తు... ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

- సీఎస్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీకి జారీ చేసిన న్యాయస్థానం
- సీబీఐకి ఇవ్వాలన్న జోగి రమేష్ పిటిషన్‌పై స్పందించిన కోర్టు
- పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం
- తదుపరి విచారణ ఈ నెల 12కు వాయిదా

- నకిలీ మద్యం కేసులో రాజకీయ కోణంలో దర్యాప్తు
- అద్దేపల్లి జనార్దనరావు వీడియో వెనుక కుట్ర ఉంది
- అందువల్లే సీబీఐ దర్యాప్తును కోరుతున్నాం...
- ఈ మేరకు నిందితుడు పిటిషన్ దాఖలు చేయొచ్చు
- దీన్ని సుప్రీంకోర్టు కూడా చాలా స్పష్టంగా చెప్పింది
- హైకోర్టుకు నివేదించిన సీనియర్ న్యాయవాది పొన్నవోలు

సాక్షి, అమరావతి: నకిలీ మద్యం కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని కోరుతూ మాజీ మంత్రి జోగి రమేష్ దాఖలు చేసిన పిటిషన్‌పై రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం శాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీకి నోటీసులిస్తూ... న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జోగి అరెస్ట్ తర్వాత జరిగిన పరిణామాలతో అదనపు అఫిడవిట్ దాఖలు చేసేందుకు వెసులుబాటునిస్తూ విచారణను ఈ నెల 12కు వాయిదా వేశారు. దీనికిముందు జోగి రమేష్ తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు. కేసును రాజకీయ కక్ష సాధింపులు, రాజకీయ కోణంలోనే దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. ''నకిలీ మద్యం కేసులో ప్రభుత్వ దర్యాప్తు నిష్పాక్షికంగా జరగడం లేదు. అందుకే సీబీఐకి ఇవ్వాలని కోరుతున్నాం. మొదటి నిందితుడిగా ఉన్న అద్దేపల్లి జనార్దనరావు అరెస్ట్ కాకముందు ఎన్నడూ జోగి రమేష్ గురించి మాట్లాడలేదు. పోలీస్ కస్టడీలోకి వెళ్లాక... నకిలీ మద్యం మొత్తానికి జోగి ప్రధాన సూత్రధారి అని చెబుతున్నట్లు ఓ వీడియోను రికార్డ్ చేసి విడుదల చేశారు. ఇది బలవంతంగా తీసినట్లు కనిపిస్తోంది.

దర్యాప్తు పక్షపాతంతో ఉంటే సీబీఐ విచారణ కోరవచ్చు

ఏజీ వాదనను పొన్నవోలు తోసిపుచ్చారు. ఏకపక్షంగా, పక్షపాతంతో, విశ్వసనీయత లేకుండా కేసును దర్యాప్తు చేస్తుంటే నిందితుడు సీబీఐకి అప్పగించాలని హైకోర్టు లేదా సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేయొచ్చని సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పిందని తెలిపారు. నిష్పాక్షిక దర్యాప్తు పౌరుడి ప్రాథమిక హక్కు అని, దీనికి భంగం కలుగుతుంటే తప్పనిసరిగా సీబీఐకి ఇవ్వాలని కోరవచ్చన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి... ప్రభుత్వానికి నోటీసులు జారీ చేశారు.

దీనివెనుక జోగి రమేష్‌ను ఇరికించే పెద్ద కుట్ర ఉంది. జనార్దనరావు వాంగ్మూలాన్ని ఆధారంగా చేసుకుని ఈ వ్యాజ్యం దాఖలు చేసిన తరువాత పిటిషనర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు'' అని పేర్కొన్నారు. మొత్తం వ్యవహారంలో స్థానిక పోలీసులు, సిట్ అధికారులు పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వం తరపున అడ్వొకేట్ జనరల్ (ఏజీ) దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ పిటిషనర్ ఇప్పటికే అరెస్టయ్యారని, , ఈ వ్యాజ్యానికి విచారణార్హత లేదని తెలిపారు. నిందితుడికి దర్యాప్తు సంస్థను ఎంచుకునే అవకాశం లేదని, ఇదే విషయాన్ని న్యాయస్థానాలు స్పష్టంగా చెప్పాయన్నారు.

10 నుంచి సమ్మేటివ్–1 పరీక్షలు

షెడ్యూల్ విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ

సాక్షి, అమరావతి: సమ్మేటివ్ అసెస్‌మెంట్–1 పరీక్షల నిర్వహణకు షెడ్యూల్ విడుదలైంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని యాజమాన్య పాఠశాలల్లోను ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించాలంటూ రాష్ట్ర విద్యాశాఖ టైమ్ టేబుల్‌ను విడుదల చేసింది. 8, 9, 10 తరగతులకు ఉదయం 9.15 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 6, 7 తరగతులకు మధ్యాహ్నం 1.15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. అలాగే, 1 నుంచి 5 తరగతులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలకు ఉంటాయి.

బీజాపూర్‌లో ఎదురుకాల్పులు

ముగ్గురు మావోయిస్టుల మృతి

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ జిల్లా తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధి అన్నారం–మరిమల్ల అడవుల్లో మావోయిస్టులు సంచరిస్తున్నారనే నిఘా వర్గాల సమాచారంతో పోలీసు బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ సందర్భంగా తారసపడిన మావోయిస్టులు.. బలగాలపైకి కాల్పులు జరపడంతో పోలీసులు కూడా ఎదురుకాల్పులకు దిగారు. దీంతో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలి నుంచి మావోయిస్టుల ఆయుధాలు, కిట్ బ్యాగులు, విప్లవ సాహిత్యం, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు.

పలిమెల అటవీప్రాంతంలో సుడిగాలుల బీభత్సం

పలిమెల: జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల రేంజ్ పరిధిలోని లెంకలగడ్డ–పంకెన సెక్షన్ సరిహద్దు అటవీప్రాంతంలో సుడిగాలులు బీభత్సం సృష్టించాయి. సుమారు 100 మీటర్ల వెడల్పుతో కిలోమీటర్ మేర నష్టం వాటిల్లింది. బుధవారం ఇది వెలుగులోకి వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం 3 నుంచి 4 గంటల మధ్యలో ఈ ప్రాంతంలో భారీ సుడిగాలులతో వర్షం కురిసింది. దీంతో పెద్ద ఎత్తున చెట్లు నేలమట్టం కాగా 20 ఎకరాల్లో పత్తి, 15 ఎకరాల్లో మిర్చి పంట నష్టపోయినట్లు స్థానికులు తెలిపారు.

విపత్తులు, వైపరీత్యాల్లో సర్కారు హ్యాండ్సప్

- తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయిన రైతులు
- రూపాయి కూడా పరిహారం ప్రకటించని చంద్రబాబు
- ఇప్పటివరకు చేసిన రూ.2.27 లక్షల కోట్ల అప్పు ఏమైంది?
- ప్రభుత్వ వైఫల్యంవల్లే కాశీబుగ్గ దుర్ఘటన
- 'మండలి' విపక్ష నేత బొత్స సత్యనారాయణ

సాక్షి, విశాఖపట్నం : రాష్ట్ర ప్రజలు రైతులపట్ల టీడీపీ కూటమి ప్రభుత్వం బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తోందని.. విపత్తులు, వైపరీత్యాల్లో ప్రభుత్వం చేతులెత్తేస్తోందని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాల సమయంలో డైవర్షన్ పాలిటిక్స్ చేయడం చంద్రబాబుకు అలవాటేనని ఆరోపించారు. తుపాను ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోతే ఇప్పటివరకు వారికి ఒక్క రూపాయి పరిహారం కూడా ప్రకటించలేదని విరుచుకుపడ్డారు. విశాఖలో బుధవారం బొత్స మీడియాతో మాట్లాడుతూ ఏమన్నారంటే..

రైతుల పరిస్థితి అగమ్యగోచరం..

చంద్రబాబు సర్కారు ఇప్పటివరకు చేసిన రూ.2.27 లక్షల కోట్ల అప్పు ఏమవుతోంది? ప్రభుత్వం వచ్చిన ఈ 18 నెలల్లో అధిక వర్షాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏ జిల్లాకు ఎంత నిధులిచ్చారు.. రైతులకు ఏ మేరకు మేలు చేశారో ప్రభుత్వం ప్రకటించాలి. అన్నం పెట్టే రైతన్న చేయి పెట్టేవాడిగా ఉండాలే తప్ప.. చేయి పట్టేవాడిగా ఉండకూడదన్న లక్ష్యంతో వైఎస్ జగన్ ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలబడితే.. కూటమి ప్రభుత్వం వచ్చాక రైతు సంక్షేమాన్ని పూర్తిగా పక్కన పెట్టింది. రాష్ట్రంలో తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిని రైతుల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైతే పంట నష్టపోయిన రైతులకు ఎంత సాయం చేస్తారన్న ప్రకటనను ప్రభుత్వం ఇప్పటివరకు చేయలేదు. రైతు శ్రేయస్సు గురించి ఆలోచించే మనస్సు ఈ ప్రభుత్వానికి లేదు. దీనిపై మాట్లాడితే మా మీద బురద జల్లుతున్నారు. ఎల్లో మీడియాను చూస్తుంటే నవ్వాలో ఏడ్వాలో అర్థంకావడంలేదు.

బాబు ఎప్పుడు సీఎం అయినా ఇంతే..

కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాట అత్యంత దురదృష్టకరం. ఇదేమని అడిగితే సీఎం, మంత్రులు బాధ్యతారాహిత్యంగా అది ప్రైవేట్ ఆలయం అంటున్నారు. తిరుపతి, సింహాచలంలో ఇదే రకమైన ఘటనలు జరిగాయి. వాటి నుంచి ఏం నేర్చుకున్నారు? రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం ఏమిటంటే, చంద్రబాబు ఎప్పుడు ముఖ్యమంత్రి అయినా ఇలాంటి ఘటనలే జరుగుతాయి.

సర్కారు ఉన్నది మాపై కక్ష సాధించడానికా!?

ఇక రాష్ట్రంలో ఏం జరిగినా వైఎస్సార్‌సీపీ నేతలను ఎలా ఇరికించాలా అని ప్రభుత్వం పనిచేస్తోంది. ఈ ప్రభుత్వం, పోలీసులు ఉన్నది వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపు చర్యలకా? తప్పుచేసిన వారిని శిక్షించడానికా? భోగాపురం విమానాశ్రయానికి చంద్రబాబు 2014–19 మధ్య ఏ పనీ చేయలేకపోతే, మేం వచ్చాక ల్యాండ్ పూలింగ్ చేసి శంకుస్థాపన చేశాం. ఆ రోజే మొదటి విమానం రాక కోసం టార్గెట్ పెట్టుకున్నాం. ఇప్పుడు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఊ అంటే భోగాపురం వెళ్తున్నాడు. నిజానికి.. ఎయిర్‌పోర్టు నిర్మాణానికి, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకు ఏ సంబంధంలేదు. మీకు చేతనైతే ఎయిర్‌పోర్టుకు అప్రోచ్ రోడ్లు తేవాలి. మొన్న అసెంబ్లీలో జరిగింది చూశాక అసెంబ్లీకి వెళ్లడానికి ఎవరు ఆసక్తి చూపిస్తారు? బాలకృష్ణ మద్యం సేవించి వచ్చి ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే ప్రభుత్వం వివరణ కూడా ఇవ్వలేదు.

ఆకలితో అలమటి

తుపాను గండం దాటినా కష్టాల సుడిగుండంలోనే మత్స్యకారులు

'సముద్రపు అలలపై బతుకు నావ ఎదురీత. ఆటుపోట్లు దాటుకుంటూ అలుపెరగని సుదీర్ఘ సాహస యాత్ర. కుటుంబ పోషణ కోసం ప్రాణాలొడ్డి మత్స్యకారుల చేపల వేట. వలకు పరిగె చిక్కితేనే బువ్వ దక్కేది. దినదినగండం నూరేళ్ల ఆయుష్షు.. ఇదీ మత్స్యకారుల జీవన చిత్రం'

– ఉప్పాడ నుంచి సాక్షి ప్రతినిధి యిర్రింకి ఉమామహేశ్వరరావు

తుపాను తర్వాత వేట లేకపోవడంతో ఉప్పాడలో ఖాళీగా చెట్టు కింద కూర్చున్న మత్స్యకారులు

తుపాను గండం దాటినా కష్టాల సుడిగుండంలోనే కొట్టుమిట్టాడుతున్న మత్స్యకారుల జీవనం ఒడ్డున పడ్డ చేపలా తయారైంది. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి హయాంలో ఉన్న భరోసా తమకు ఇప్పుడు లభించడంలేదని మత్స్యకారులు పేర్కొంటున్నారు. తుపాను ప్రభావంతో రూ.83.21 లక్షల విలువైన 486 బోట్లు, వలలు దెబ్బతిన్నట్టు అధికారిక అంచనా. వాస్తవానికి సముద్రంలోని చేపల వేటనే నమ్ముకుని బతికే 8.50 లక్షల మంది జీవనాన్ని తుపాను అతలాకుతలం చేసింది. ఈ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకు చేపల వేట నిషేధం కొనసాగింది. ఆ తర్వాత అరకొరగా వేట కొనసాగినా.. ఇటీవల వర్షాలు, తుపాన్‌ల దెబ్బకు పూర్తిగా ఆగిపోయింది. తుపాన్ గండం దాటిపోవడంతో రెండు రోజులుగా సముద్రంలోకి వేటకు వెళ్తున్న మత్స్యకారులకు పరిగె కూడా పడటం లేదని వాపోతున్నారు. 'అప్పులు తీరే మార్గంలేదు. కుటుంబం గడిచే పరిస్థితి లేదు. ఎట్లా బతికేది.' అంటూ మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు.

ఉప్పాడ ప్రాంతంలో ఉపాధి కోల్పోయిన ఏడు వేల కుటుంబాలు

ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలోని ఉప్పాడలో సుమారు ఏడు వేల మత్స్యకార కుటుంబాలు ఉపాధి కోల్పోయి తీవ్ర ఆవేదనలో మునిగిపోయాయి. ఉప్పాడ గ్రామంలోని మత్స్యకార ఇళ్లు సముద్ర కోతకు గురై కూలిపోతున్నా, ప్రభుత్వం ఆదుకునే చర్యలు చేపట్టడంలేదు. తమ ఉపాధిని, ఊరిని కాపాడాలని సెప్టెంబర్ 23, 24 తేదీల్లో ఉప్పాడ మత్స్యకారులు ఆందోళనకు దిగి పవన్‌కు అక్టోబర్ 10వ తేదీ వరకు డెడ్‌లైన్ పెట్టారు. దీంతో ఆ ప్రాంతానికి వెళ్లిన పవన్ 'వంద రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తానని' హామీ ఇచ్చారు. తాజా తుపాను వల్ల మరింత కష్టాల్లో చిక్కుకున్న తమను పవన్ కనీసం పలకరించి భరోసా ఇవ్వకపోవడంపై మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పెరుగుతున్న అప్పులు.. తరుగుతున్న ఆదాయం

'జగన్ మాకు ఇంటి స్థలం ఇచ్చారు. సాయం అందించారు' అని పిఠాపురం నియోజకవర్గంలోని సుబ్బంపేటకు చెందిన సూరాడ చిన కోదండం గుర్తుచేసుకుంటూ, ఇప్పుడు అంతటి భరోసా ప్రభుత్వం నుంచి లభించడంలేదని పేర్కొన్నాడు. 'తీసుకున్న డ్వాక్రా రుణానికి నెలకు రూ.6 వేలు, ప్రైవేట్ అప్పుల వాళ్లకు రూ.5 వేలు, ఇల్లు గడవడానికి మరో రూ.10 వేలు కలిపి కనీసం రూ.20 వేలకుపైగా అవసరమవుతోంది. ఆదాయం లేదు. దిక్కు తోచడం లేదు'' అని కోదండం పేర్కొన్నారు.

వృత్తి రక్షణకు సహకరించాలి

ఉప్పాడతోపాటు సమీప గ్రామాలకు చెందిన దాదాపు 900 బోట్లపై చేపల వేటతో ఏడు వేలకుపైగా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. ప్రభుత్వం చేపల వేటపై రెండు నెలలు నిషేధం విధించింది. ఇప్పుడు వరుసగా వర్షాలు, తుపాన్‌లతో ఉపాధి కోల్పోయాం. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడంతోపాటు మా వృత్తి రక్షణకు సహకరించాలి.

– ఎస్.సింహాద్రి, ఉప్పాడ

ఆక్వా రంగానికి 'జగన్' ఆక్సిజన్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని మత్స్యకారులకు భరోసా ఇవ్వడంతోపాటు ఆక్వా రంగానికి ఆక్సిజన్ అందించారు. మత్స్యకార భరోసా పెంచారు. బోట్లకు డీజిల్ సబ్సిడీ పెంచారు. నవరత్నాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి అండగా నిలిచారు. కరోనా కష్టకాలంలోను మత్స్యకారులను ఆదుకున్నారు. రాష్ట్రంలో ఆక్వా రంగానికి విద్యుత్ సబ్సిడీ, ధరలు దక్కేలా చేయడం, మార్కెటింగ్ వంటి విషయాల్లో చేపలు, రొయ్యల రైతులకు జగన్ అండగా నిలిచారు.

– వడ్డి రఘురామ్, మాజీ వైస్ చైర్మన్, ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ

చేప చిక్కకపోతే పస్తులే..



చేపలు చిక్కకపోతే పస్తులు ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఇంతకంటే మాకు వేరే వృత్తి తెలియదు. ప్రభుత్వం నిత్యావసర సరుకులతోపాటు ఆర్థిక సాయం కూడా చేయాలి. మమ్మల్ని ఆదుకోవడంతోపాటు మా బతుకుదెరువును కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– పుట్టా అప్పలరావు, ఉప్పాడ

అందరికీ సాయం అందించాలి



మొంథా తుపాను ధాటికి రాష్ట్రంలో మత్స్యకారులందరూ ఉపాధి కోల్పోయారు. వేట లేక పస్తులు ఉంటున్నారు. కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అందరికీ నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందించాలి. చేపలు అమ్ముకుని జీవించే మహిళలకు కూడా సాయం అందించాలి. – అర్జిల్లి దాసు, జాతీయ మత్స్యకార సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి

గంగ పుత్రులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ అండ..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లపాటు రాష్ట్రంలోని గంగపుత్రులకు కొండంత అండగా నిలిచి భరోసా కల్పించారు. మత్స్యకార భరోసా (వేట నిషేధ భృతి)తోపాటు ఆయిల్ సబ్సిడీ పెంపు, నవరత్నాలు ద్వారా అనేక సంక్షేమ పథకాలు (డీబీటీ), (నాన్–డీబీటీ)తో వారు ఆర్థికంగాను, సామాజికంగాను, రాజకీయంగాను నిలదొక్కుకునేలా చేశారు. జగన్ కృషితో రాష్ట్రంలో వేటకు వెళ్లే బోట్ల సంఖ్యే కాకుండా.. వేటపై ఆధారపడి జీవనోపాధి పొందే వారి సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. కొన్ని కీలక అంశాలు పరిశీలిస్తే..

- ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మత్స్యకార భరోసా (వేట నిషేధ భృతి)ని రూ.4 వేల నుంచి రూ.10 వేలకు పెంచడంతోపాటు నిషేధ సమయం ప్రారంభంలోనే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు.
- మత్స్యకార భరోసాకు గత టీడీపీ పాలనలో రూ.104.62కోట్లు ఇస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ. 538.01 కోట్లు ఇచ్చింది.
- గత టీడీపీ ప్రభుత్వం డీజిల్‌పై లీటర్‌కు రూ. 6.03 చొప్పున సబ్సిడీ ఇవ్వగా, దాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.9కి పెంచింది.
- మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లకే కాదు.. తెప్పలు ఇతర సంప్రదాయ నావలపై వేట సాగించే వారికి సైతం ఈ సాయాన్ని అందించారు.
- వేటకు వెళ్లే ముందు ఆయిల్ నింపేటప్పుడే సబ్సిడీని మినహాయించుకుని చెల్లించే వెసులుబాటును కల్పించారు.
- గత టీడీపీ పాలనలో ఏటా సగటున 60 వేల మంది లబ్ధి పొందితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 1.16 లక్షల మంది లబ్ధి పొందారు.
- గతంలో 1,100 బోట్లకు మించి ఆయిల్ సబ్సిడీని వర్తింప చేసిన దాఖలాలు లేవు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో తెప్పలు, నావలతో సహా ఆయిల్ సబ్సిడీని సద్వినియోగం చేసుకున్న బోట్ల సంఖ్య ఏకంగా 23,209కి చేరింది.
- ఆయిల్ సబ్సిడీగా గత టీడీపీ ప్రభుత్వం ఐదేళ్లలో రూ.59.42కోట్లు ఇస్తే.. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.148.04కోట్లు ఇచ్చారు.
- 50 ఏళ్లు పైబడిన మత్స్యకారులకు ఇస్తోన్న పింఛన్ గత టీడీపీ హయాం (2014-15)లో 42,729 మందికి వర్తింపచేయగా వైఎస్సార్‌సీపీ హయాంలో 2023-24లో 69,741 మందికి ఇచ్చారు. గత టీడీపీ హయాంలో పింఛన్ కోసం రూ.51.57 కోట్లు ఖర్చు చేయగా, వైఎస్సార్‌సీపీ రూ.759.47 కోట్లు ఖర్చు చేసింది.
- చేపల వేట సమయంలో ప్రమాదవశాత్తు మృతి చెందిన మత్స్యకారుల కుటుంబాలకు గత టీడీపీ హయాంలో తొలి ఏడాది రూ.2 లక్షల చొప్పున పరిహారం ఇవ్వగా, ఆ తర్వాత దాన్ని రూ.5 లక్షలకు పెంచారు. ఇలా బాబు హయాంలో 300 మంది వేటకు వెళ్లి మృతి చెందితే కేవలం రూ.11.43 కోట్ల పరిహారం మాత్రమే ఇచ్చారు. ఈ పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన వైఎస్ జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో 175 మందికి ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున రూ.16.87 కోట్ల పరిహారాన్ని అందజేసింది.
- జీఎస్‌పీసీ పైపులైన్ నిర్మాణం వల్ల డాక్టర్ కోనసీమ అంబేడ్కర్ జిల్లాలో జీవనోపాధి కోల్పోయిన 16,554 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.78.22కోట్లు, ఓఎన్జీసీ పైపులైన్ తవ్వకాల వల్ల జీవనోపాధి కోల్పోయిన 23,458 మంది కుటుంబాలకు ఐదు విడతల్లో రూ.647.44 కోట్లు సాయాన్ని జగన్ ప్రభుత్వం అందించింది.
- వివిధ పథకాల ద్వారా ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం రూ.4,913 కోట్ల లబ్ధిని నేరుగా మత్స్యకారులకు అందించింది.

జీవన ఆటుబోట్లు

- **555** రాష్ట్రంలోని మత్స్యకార గ్రామాలు
- **2.50 లక్షలు:** సముద్రంలో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులు
- **8.50 లక్షలు:** సముద్రంలో చేపలవేటపై ఆధారపడి జీవించేవారు
- **రూ.20 లక్షలు:** బోటు కనీస విలువ
- **రూ.5 లక్షలు:** బోటులోని వల విలువ
- **రూ.1.50 లక్షలు:** బోటుపై ఒక్కసారి వేటకు వెళితే అందులోకి బోటుకు డీజిల్, బియ్యం, సరుకుల వ్యయం
- **రూ.20 లక్షలు:** బోటులో వెళ్లే ఎనిమిది మంది కి ముందస్తు పెట్టుబడి కింద యజమాని ఇచ్చేది

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

కార్తీక వెలుగులు...

భక్తులతో కిక్కిరిసిన విజయవాడ దుర్గాఘాట్

నెల్లూరులోని శివలింగానికి పూజలు చేస్తున్న చిన్నారి

బాపట్ల జిల్లా కొత్తపట్నం తీరం వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

రాష్ట్రంలో కార్తీకపౌర్ణమిని భక్తులు బుధవారం ఘనంగా నిర్వహించారు. అన్ని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, దీపారాధనలు జరిగాయి. ముఖ్యంగా ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి, అరటి డొప్పలలో దీపాలు వెలిగించి నదిలో వదిలారు. దానధర్మాలు చేసి నదీ స్నానాలు ఆచరించారు.

క్లుప్తంగా...

ఎక్సైజ్ అధికారుల అక్రమార్జనపై కఠిన చర్యలు

ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా

సాక్షి, అమరావతి: విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే అధికారులు, ఉద్యోగులపై కఠిన చర్యలు చేపడతామని ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా హెచ్చరించారు. మంగళగిరిలోని ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో బుధవారం ఆ శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు అక్రమార్జనకు పాల్పడుతున్నారని కథనాలు వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమార్జనకు పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ములకలచెరువు వంటి ఉదంతాలు పునరావృతం కాకూడదన్నారు. మెమోలకు సాధారణ వివరణ కాకుండా, స్పష్టమైన వివరణ ఇవ్వాల స్పష్టం చేశారు. ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ మద్యం దుకాణాల పర్మిట్ రూమ్‌ల లైసెన్సు ఫీజు బకాయిలను వెంటనే వసూలు చేయాలన్నారు.

విజ్ఞాన్ చాన్స్‌లర్‌గా డాక్టర్ పావులూరి బాధ్యతల స్వీకరణ

డాక్టర్ సుబ్బారావు, పక్కన చైర్మన్ లావు రత్తయ్య, సీఈవో మేఘన తదితరులు

చేబ్రోలు: గుంటూరు జిల్లా వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ చాన్స్‌లర్‌గా ప్రముఖ శాస్త్రవేత్త, అంతరిక్షరంగంలో విశిష్ట సేవలందించిన డాక్టర్ పావులూరి సుబ్బారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ సీఎండీగా ఉన్న ఆయన ఆంధ్రప్రదేశ్ స్పేస్ అకాడమీ అధ్యక్షుడిగా, ఇంకా పలు కీలక హోదాల్లో ఉన్నారు. కార్యక్రమంలో వర్సిటీ చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, మాజీ డీజీపీ డాక్టర్ మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు. విజ్ఞాన్ వర్సిటీ 2026–27 సంవత్సరానికి సంబంధించి బీటెక్, బీఫార్మసీ, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీఏ ఎల్‌ఎల్‌బీ (ఆనర్స్), బీబీఏ ఎల్‌ఎల్‌బీ (ఆనర్స్), బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్, ఫార్మ్–డీ కోర్సుల్లో ప్రవేశాల కోసం వీశాట్ నోటిఫికేషన్‌ను బుధవారం వైస్ చాన్స్‌లర్ నాగభూషణ్ విడుదల చేశారు.

సైన్స్ టూర్‌కు ఏపీ విద్యార్థులు

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి చెందిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు బుధవారం ఢిల్లీ సైన్స్ ఎక్స్‌పోజర్ టూర్‌కు వెళ్లారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ, సమగ్ర శిక్ష రాష్ట్ర విభాగం ఆధ్వర్యంలో జిల్లా సైన్స్ పోటీల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన 52 మంది విద్యార్థులను ఇందుకోసం ఎంపిక చేశారు. గురువారం నుంచి ఈనెల 8 వరకు ఈ యాత్ర జరుగుతుంది. విద్యార్థుల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ అవగాహన కోసం న్యూఢిల్లీలోని నేషనల్ సైన్స్ మ్యూజియం, నెహ్రూ ప్లానిటోరియం, రష్యా సైన్స్ అండ్ కల్చరల్ సెంటర్‌ను సందర్శించనున్నట్టు అధికారులు తెలిపారు.

పీఎంజేవీకే పనులకు రూ.203.69 కోట్లు విడుదల

సాక్షి, అమరావతి : ప్రధాన మంత్రి జన్ వికాస కార్యక్రమం (పీఎంజేవీకే) ద్వారా రాష్ట్రంలో మైనారిటీల సంక్షేమం, అభివృద్ధి పనుల కోసం ప్రభుత్వం రూ.203.69 కోట్లు విడుదల చేసిందని న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు.

తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పవన్ కళ్యాణ్ పర్యటన

సాక్షి, అమరావతి: ఈ నెల 8, 9 తేదీల్లో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో పర్యటించనున్నారు. 8వ తేదీ తిరుపతి జిల్లా పరిధిలోని ఎర్రచందనం డిపోను సందర్శిస్తారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో ఎర్రచందనం అక్రమ రవాణా, స్మగ్లింగ్ నిరోధంపై టాస్క్ ఫోర్స్, అటవీ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. 9వ తేదీ పలమనేరులోని కుంకీ ఏనుగుల క్యాంపును సందర్శిస్తారు. ఈ మేరకు పవన్ కళ్యాణ్ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

హామీలు ఘనం.. ఆచరణ శూన్యం

- నేతన్న దినోత్సవం సాక్షిగా మూడు హామీలు
- చేనేతలకు 200, పవర్‌లూమ్స్‌కు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్
- జీఎస్టీని ప్రభుత్వమే భరిస్తుందని, నేతన్న భరోసా సాయం అందిస్తామని ప్రకటన
- ఏ ఒక్కటీ అమలు చేయకుండా తాత్సారం చేస్తున్న కూటమి సర్కార్

నేతన్న దినోత్సవం సాక్షిగా కూటమి ప్రభుత్వం చేనేత కార్మికులకు మూడు ప్రధాన హామీలు ఇచ్చింది. మూడు నెలలు పూర్తవుతున్నా ఇంత వరకు ఏ ఒక్కటి కూడా అమలు చేయకపోవడం పట్ల చేనేత కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వానిది ఆర్భాటం మాత్రం ఘనం.. ఆచరణ శూన్యమంటూ విమర్శిస్తున్నారు.

చేనేత మగ్గం

ధర్మవరం: శ్రీ సత్యసాయి జిల్లాలో చేనేత కేంద్రాలైన ధర్మవరం, గోరంట్ల, పుట్టపర్తి, ఉరవకొండ, సోమందేపల్లి, హిందూపురం ప్రాంతాల్లో దాదాపు 40 వేల చేనేత మగ్గాలు ఉన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా చేనేత రంగంపై ఆధారపడి 1.20లక్షల మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారు. అయితే కొంత కాలంగా ముడిపట్టు ధరలు (రేషం, వార్పు, జరీ) రెట్టింపు స్థాయిలో పెరిగాయి. దీనికి తోడు విద్యుత్ చార్జీలు, అదనపు చార్జీల పేరుతో ప్రభుత్వం ఇష్టారాజ్యంగా పెంచేసింది. వీటన్నింటికి తోడు జీఎస్టీ పన్నుపోటు కూడా చేనేతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. వెరసి రోజంతా కష్టపడి పని చేసినప్పటికీ కార్మికులకు రోజుకూలి కూడా రాని పరిస్థితి ఏర్పడింది.

హామీలు అంతేనా..?

ఈ ఏడాది ఆగస్టు 9వ తేదీన కూటమి ప్రభుత్వం చేనేత దినోత్సవం నిర్వహించింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు మూడు ప్రధాన హామీలు అమలు చేస్తామని ప్రకటించారు. ఇందులో ప్రధానమైనది చేనేత మగ్గాల కార్మికులకు 200 యూనిట్ల దాకా, మరమగ్గాలకు 500 యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు జీఓ 44 విడుదల చేసినా ఇంత వరకు కార్యరూపం దాల్చలేదు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న 100 యూనిట్ల ఉచిత విద్యుత్ మాత్రమే చేనేతలకు అందుతోంది. దీంతో వంద యూనిట్లు దాటిన చేనేత కార్మికులు అదనపు బిల్లులు చెల్లించే పరిస్థితి ఏర్పడింది. సాధారణంగా చేనేత కార్మికులు గాలి, వెలుతురు ఉంటేనే పనిచేసే పరిస్థితి ఉంటుంది. ఈ క్రమంలో విద్యుత్ వాడకం అధికంగా ఉంటుంది. కానీ చంద్రబాబు హామీ అమలు కాకపోవడంతో దిక్కుతోచని స్థితిలో చేనేతలు పడ్డారు.

జాడలేని నేతన్న భరోసా.. జీఎస్టీ ఉపశమనం

'నేతన్న భరోసా' కింద చేనేత కార్మికులకు ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.25 వేలు సత్వరం అందిస్తామని చెప్పారు. ఆ హామీ కూడా ఇంత వరకు అమలు కాలేదు. కనీసం ప్రభుత్వం తరపున ప్రతిపాదనలు కూడా తీసుకోకపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వం వచ్చిన యేడాదిన్నర కాలంలో గతంలో ఉన్న ముడిపట్టు ధరలకు.. ప్రస్తుతం ఉన్న ధరలకు తేడా ఉంది. ఏడాదిన్నర క్రితం ముడిపట్టు వార్పు (నిలువుపోగు) రూ.4 వేలు, రేషం కిలో రూ.3,500 ఉండగా.. ప్రస్తుతం వార్పు కిలో రూ.6 వేలు, రేషం కిలో రూ.5,800కు పెరిగాయి. ఇందుకు అనుగుణంగా పట్టుచీరల ధరలు పెరగకపోవడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో 'నేతన్న నేస్తం' పథకం కింద ఏడాదికి రూ.24 వేలు ఒక్కో చేనేత కుటుంబానికి అందింది. ఈ డబ్బుతో మగ్గాన్ని ఆధునీకరించుకుని మెరుగైన సంపాదనను కార్మికులు పొందేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు.

- చేనేత కార్మికులకు జీఎస్టీ భారం పడకుండా ప్రభుత్వమే భరిస్తుందని, అదీ చేనేత దినోత్సవం నుంచే అమలు చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఆర్భాటపు ప్రకటనలు గుప్పించి చేనేతలకు ఆశ కల్పించడం, ఆపై అమలు చేయకపోవడం దారుణమని చేనేతలు ఖేదవేదన వ్యక్తం చేస్తున్నారు.

మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడు

ఇబ్బందులు పడుతున్నాం

పెరిగిన ముడిపట్టు ధరలు, చేనేత ఉత్పత్తులకు మద్దతు ధర లేకపోవడం వల్ల రోజుకూలి కూడా రావడం లేదు. ప్రభుత్వం చేనేత దినోత్సవం రోజున 200 యూనిట్లు చేనేతలకు అందిస్తామని చెప్పినా ఇంత వరకు అమలు కాలేదు. ఉచిత విద్యుత్ అందిస్తే ఎంతో కొంత ప్రయోజనం ఉంటుంది. లేదంటే చేనేతల మనుగడే కష్టతరమవుతుంది.

– శంకరపు రాజా, చేనేత కార్మికుడు, శాంతినగర్, ధర్మవరం

నాడు ఠంచన్‌గా సాయమందేది

చేనేత కార్మికులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వహయాంలో ఠంచన్‌గా వంద యూనిట్ల ఉచిత విద్యుత్, నేతన్న నేస్త పథకం కింద ఏడాదికి రూ.24 వేల సాయం అందేది. ప్రస్తుతం ఒక్క హామీ కూడా కూటమి ప్రభుత్వం అమలు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. ఈ పరిస్థితిని ఇలానే కొనసాగితే చేనేత మగ్గాలు మూతేసి ఇతర పనులకు వెళ్లకతప్పదు.

–గుండా ఈశ్వరయ్య, మాస్టర్ వీవర్, గాంధీనగర్, ధర్మవరం

హామీల అమలుకు ఉద్యమిస్తాం

సీఎం చంద్రబాబు నాయుడు చేనేత దినోత్సవం సాక్షిగా చేనేత మగ్గాల కార్మికులకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాల వారికి 500 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చారు. జీఓ అమలు చేసి మిన్నకుండిపోయారు. ఇక నేతన్న భరోసా సాయం అందిస్తామని, జీఎస్టీని ప్రభుత్వమే భరిస్తుందని ఇచ్చిన హామీలు కూడా అమలుకు నోచుకోలేదు. రాష్ట్రంలో చేనేత కార్మికులకు అప్పుల బాధలు, ఆత్మహత్యలే మిగిలాయి. జిల్లాకు ఒక చేనేత మంత్రి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రులు ఉన్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. ప్రభుత్వం హామీలు అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తాం.

– వెంకటనారాయణ, ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ధర్మవరం

త్వరలో ఉచిత విద్యుత్

ప్రభుత్వం చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్‌లూమ్ మగ్గాలకు 500 యూనిట్ల చొప్పున ఉచితంగా విద్యుత్ అందించేందుకు జీఓ 44 విడుదల చేసింది. ఇప్పటికే చేనేత కార్మికుల వివరాలను ప్రభుత్వానికి పంపించాం. విద్యుత్ శాఖ వారు యూనిట్ల వారీగా ఎస్టిమేట్ సిద్ధం చేశారు. త్వరలోనే ఉచిత విద్యుత్ అమలు చేస్తాం.

– రామకష్ణ, హ్యాండ్లూమ్ ఏడీ

దేవాలయ భూములపై కూటమి కన్ను!

సింహాచలం దేవస్థానానికి చెందిన భూములు

మధురవాడలో **107** ఎకరాలు | అడవివరంలో **150** ఎకరాలు

ప్రేమ సమాజానికి గతంలో దాతలు ఇచ్చిన భూములు

రుషికొండలో **47.33** ఎకరాలు

- విలువైన సింహాచలం భూములు ప్రైవేటు కంపెనీల పరం
- నగర శివారు భూములను దేవస్థానానికి ఇచ్చేందుకు ప్రయత్నాలు
- ప్రేమ సమాజం భూములనూ కాజేసేందుకు యత్నాలు
- టూరిజం ప్రాజెక్టుల పేరిట కొట్టేసేందుకు కుట్ర
- ఏసీఏకు 10 ఎకరాలు ఇవ్వాలంటూ కూటమి నేతల కుయుక్తులు

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం :

ఇప్పటివరకు ప్రైవేటు, ప్రభుత్వ భూములపై కన్నేసి కాజేస్తున్న కూటమి ప్రభుత్వం, నేతలు.. ఇప్పుడు దేవస్థానం భూములపై పడ్డారు. సింహాచలంతోపాటు ప్రేమ సమాజానికి చెందిన విలువైన భూములను ప్రాజెక్టుల పేరిట చేజిక్కించుకునే ప్రయత్నాలు ప్రారంభించినట్టు తెలుస్తోంది. సింహాచలం దేవస్థానానికి మధురవాడ, అడవివరంలో ఉన్న విలువైన భూములను తీసుకుని.. నగరానికి వెలుపల కాలుష్య ప్రభావిత భూములను దేవస్థానానికి అప్పగించేందుకు పావులు కదుపుతున్నట్టు సమాచారం. ఇందులో భాగంగా సింహాచలం దేవస్థానానికి చెందిన భూముల విలువను తక్కువగా లెక్కగట్టి.. అందుకు బదులుగా నగరానికి దూరంగా ఇచ్చే భూముల విలువను మాత్రం అధికంగా లెక్కకట్టారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇలా చేస్తారంట...?

వాస్తవానికి సింహాచలం దేవస్థానానికి మధురవాడలో 107 ఎకరాలు, అడవివరంలో 150 ఎకరాల భూమి ఉంది. ఇందులో మధురవాడలోని 107 ఎకరాల భూమిని గూగుల్ సంస్థకు, అడవివరంలోని 150 ఎకరాల భూమిని ఒక ప్రైవేటు హోటల్‌కు అప్పగించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఇందుకు బదులుగా ఎక్కడో దూరంగా గాజువాక వద్ద ఉన్న భూములను ప్రత్యామ్నాయంగా ఇచ్చేందుకు ఇప్పటికే రెవెన్యూ వ్యవహారాలు ప్రారంభమయ్యాయి.

- మరోవైపు సేవా సంస్థ అయిన ప్రేమ సమాజానికి చెందిన భూములను కూడా వివిధ టూరిజం ప్రాజెక్టుల పేరిట చేజిక్కించుకునేందుకు కూటమి ఎమ్మెల్యేలు ప్రయత్నాలు షురూ చేశారు. అలాగే ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ)కు 10 ఎకరాలు కావాలంటూ కూటమి నేతలు లేఖలతో అమరావతిలో కలియతిరుగుతున్నట్టు తెలుస్తోంది. మొత్తంగా దేవస్థానం భూములను లీజుకు ఇవ్వొచ్చంటూ తాజాగా ప్రభుత్వం జారీచేసిన ఆదేశాల నేపథ్యంలో కూటమి నేతలు తమ ప్రయత్నాలను షురూ చేశారు.

ప్రేమ సమాజం భూములపై ఎప్పటి నుంచో గురి..!

ప్రేమ సమాజానికి దాతలు ఇచ్చిన 47.33 ఎకరాల భూమి రుషికొండలో ఉంది. ఇందులో 33 ఎకరాలకుపైగా గతంలోనే టీడీపీ నేతలు లీజుకు తీసుకున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రేమ సమాజం భూములను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడాన్ని వ్యతిరేకించింది. ఇందుకు అనుగుణంగా సదరు ప్రైవేటు వ్యక్తికి అప్పగించిన భూముల లీజును రద్దు చేయడంతోపాటు ప్రేమ సమాజం భూములను సంస్థకే అప్పగించింది. నగరాల్లో ఉండే దేవస్థానాలకు చెందిన భూములను దీర్ఘకాలిక లీజుకు ఇచ్చేందుకు కమిటీని నియమిస్తూ ప్రభుత్వం అక్టోబరు 31న ఆదేశాలు జారీచేసింది. ఇందుకు అనుగుణంగా మరోసారి విలువైన ప్రేమ సమాజం భూములను రిసార్టు, టూరిజం పేరుతో చేజిక్కించుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాకుండా ఏసీఏకు 10 ఎకరాలు కావాలంటూ కూటమికే చెందిన మరో ఎమ్మెల్యే ఒక వినతిపత్రాన్ని కూడా ప్రభుత్వానికి సమర్పించినట్టు సమాచారం. మొత్తంగా రుషికొండలోని విలువైన భూములను చేజిక్కించుకునేందుకు పలు ప్రతిపాదనలతో కూటమి నేతలు కుయుక్తులు పన్నుతున్నట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

టూరిజం, గూగుల్ పేరుతో..!

ఒకవైపు ప్రేమ సమాజం భూములను కూటమి నేతలు ప్రైవేటు వ్యక్తుల పేరుతో, టూరిజం ప్రాజెక్టుల పేరుతో చేజిక్కించుకునేందుకు యత్నిస్తుండగా.. సింహాచలానికి చెందిన అడవివరంలోని భూములను టూరిజం ప్రాజెక్టు పేరుతో ఓ హోటల్‌కు అప్పగించేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తుండటం గమనార్హం. సింహాచలం దేవస్థానానికి చెందిన అడవివరంలోని 150 ఎకరాల భూమిని ఒక ప్రైవేటు హోటల్‌కు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. దీనికి ప్రతిగా దూరంగా ఉన్న భూములను దేవస్థానానికి అప్పగించేందుకు ఫైల్స్ సిద్ధమవుతున్నాయి. మధురవాడలో విలువైన 107 ఎకరాల భూమిని గూగుల్ సంస్థకు అప్పగించేందుకు రంగం సిద్ధమవుతోంది. ఒకవైపు డేటా సెంటర్ పేరుతో తర్లువాడలోని పేద దళిత భూములను కాజేసేందుకు ప్రయత్నిస్తున్న ప్రభుత్వం.. వీటికి తోడు దేవస్థానం భూములను కూడా అప్పగించేందుకు సిద్ధమవుతుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

27న సింగపూర్‌కు ఉత్తమ ఉపాధ్యాయులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన 78 మంది ఉపాధ్యాయులు ఆధునిక విద్యావిధానాలపై అధ్యయనం చేసేందుకుగాను ఈనెల 27 నుంచి డిసెంబర్ 2వ తేదీ వరకు సింగపూర్‌లో పర్యటించేందుకు ఏర్పాట్లు చేయాలని విద్యాశాఖ మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం ఉండవల్లిలో విద్యాశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు అధ్యయనం చేసిన అనంతరం రాష్ట్రంలో విద్యాప్రమాణాల మెరుగుకు ఏం చేయాలో నివేదిక ఇవ్వాలని సూచించారు. ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్టూడెంట్ అసెంబ్లీ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 5న మెగా పేరెంట్ టీచర్ మీట్ (పీటీఎం) నిర్వహించాలని సూచించారు. రాష్ట్రంలో 406 జాబ్‌మేళాల ద్వారా 78 వేలమంది యువతకు ఉద్యోగాలు కల్పించినట్లు మంత్రి లోకేశ్ చెప్పారు. స్కిల్ డెవలప్‌మెంట్ శాఖపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

కప్ప కాదు.. మిడత



కంకిపాడు: గెంతేందుకు సిద్ధంగా ఉన్న కప్పలా ఉంది కదూ ఈ చిత్రం చేస్తే.. అచ్చం కప్ప ఆకృతిలో కనిపిస్తున్న ఈ జీవి మిడత. త్రికోణాకృతిలో ఉన్న ఈ మిడత కృష్ణాజిల్లా కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామంలోని ఈడా రోహిత్ నివాసంలో గురువారం కనిపించింది.

● అరుణాచల క్షేత్రం పర్వతమే... పరమేశ్వరుడు!

కంచిలో పృథివీ లింగం, జంబుకేశ్వరంలో జలలింగం, అరుణాచలంలో అగ్నిలింగం, చిదంబరంలో ఆకాశలింగం, శ్రీకాళహస్తిలో వాయులింగం... ఈ అయిదు లింగాలను పంచ భూత మహాలింగాలు అని అంటారు. ఈ అయిదు క్షేత్రాలను ఒకేసారి దర్శించుకోవటం మంచిదని చాలా మంది అలా దర్శించుకుంటూ ఉంటారు. ఎందుకంటే ఇందులో నాలుగు తమిళనాడులో, ఒకటి ఆంధ్రప్రదేశ్ లో ఉన్నాయి. దాదాపు 200 కిలోమీటర్ల పరిధిలోనే ఈ ఆలయాలు ఉండటం గమనించదగిన విషయం. వరుసక్రమంలోనే కాకుండా దూరం రీత్యా కూడా అరుణాచలం మధ్యలో నిలుస్తుంది.

పంచభూత మహాలింగాల్లో మూడవది అరుణాచలం క్షేత్రం. దీనినే తమిళనాడులో తిరువణ్ణామలై క్షేత్రంగా కూడా పిలుస్తారు. స్వామి వారు అరుణాచలేశ్వరుడు కాగా అమ్మవారు అపిత కుచలాంబా దేవి. సుబ్రహ్మణ్యుడికి పాలివ్వడం కూడా మాని వచ్చిన దానివి కాబట్టి నిన్ను 'అపీతకుచాంబ' అని పిలుస్తున్నాను అని స్వామివారే చెప్పారట.

అద్భుత శిల్పకళతో అలరారే ఈ ఆలయాన్ని సాక్షాత్తూ దేవశిల్పి విశ్వకర్మ నిర్మించాడని పురాణాలు చెబుతున్నాయి. చోళరాజులు పల్లవులు, విజయనగర సార్వభౌములు ఇక్కడ ఆలయాలను ఎంతగానో అభివృద్ధి పరిచారు. ఇరవై అయిదు ఎకరాల్లో నిర్మిత మైన ఈ క్షేత్రం ఎంతో పురాతనమైనది. నాలుగు దిక్కుల్లో ఎత్తయిన గోపురాలు ఉన్నాయి. తూర్పు గోపురం పదకొండు అంతస్తుల్లో అలరారుతుంది. ఆరు ప్రాకారాలతో, ఎన్నో ఉపాలయాలతో, విశాలమైన ప్రాంగణంతో ఉండే ఈ ఆలయానికి నిత్యం దేశమంతటి నుంచి భక్తులు వస్తూ ఉంటారు.

ఇక్కడి వెయ్యి స్తంభాల మండపానికి సమీపంలో శివ గంగ తీర్థం ఉంది. అక్కడే రమణ మహర్షి తన ఐహిక బంధాల నుంచి విముక్తి పొందారు. అరుణాచలం క్షేత్రం అంటే రమణ మహర్షిని తప్పకుండా గుర్తు చేసుకోవాలి. ఆయన్ని సుబ్రహ్మణ్యస్వామి మరో అవతారంగా భక్తులు చెబుతారు. ఇక్కడ దేవాలయానికి ఎంతటి ప్రాధాన్యత ఉన్నదో అరుణగిరి (పర్వతం) కు కూడా అంతే ప్రాధాన్యం ఉన్నది. 'అ-రుణాచలం' అనే పదానికి ఐహిక బంధాలను తొలగించే పర్వతం అని అర్థం. సాక్షాత్తూ పరమేశ్వర స్వరూపమైన ఈ గిరి చుట్టూ ప్రదక్షిణ చేస్తే జీవితం పరిపూర్ణమవుతుందని నమ్మకం. ఈ క్షేత్రంలో వెలిసిన శివుడు అగ్ని లింగమని, అందుకే ఆలయంలో వేడిగా వుంటుందని అంటారు.

ఆలయ విశేషాలు

తిరువణ్ణామలైలోని అణ్ణామలయ్యార్ (శివుడు) ఆలయం 24 ఎకరాల స్థలంలో విస్తరించి వుంది. నాలుగు వైపులా నాలుగు ఉన్నత గోపురాలతో అలరారే ఈ ఆలయం వాస్తు, శిల్ప, నిర్మాణ శాస్త్రాలపరంగా అపురూపమైనది. ఆలయంలో మొత్తం 6 ప్రాకారాలు, 9 గోపురాలు వున్నాయి. ఆలయ ప్రాంగణంలో అనేక మండపాలు, వసారాలు, ఉపాలయాలు కన్నుల పండుగగా దర్శనమిస్తాయి.

ఈ గోపురాలలో తూర్పువైపున వున్నదానిని రాజ గోపురమంటారు. ఇదే ప్రధాన ద్వారం. నేలమట్టంమీద 135 అడుగుల వెడల్పు, 98 అడుగుల పొడవు కలిగి, దీర్ఘచతుర ప్రాకారంలో వున్న ఈ గోపురానికి 11 అంతస్తులున్నాయి. ఇక్కడ తంజావూరు బృహదీశ్వరాలయాని కన్నా ఎత్తయిన గోపురం నిర్మించాలని, దానికన్నా ఒక అడుగు ఎత్తుగా, అంటే 217 అడుగుల ఎత్తయిన గోపురాన్ని నిర్మించారు. బయటి ప్రాకారానికి వున్న మిగతా మూడు గోపురాలను అమ్మణి అమ్మాళ్ గోపురం, తిరుమంజరం గోపురం, పేయి గోపురం అంటారు. ఇవి 171, 157, 144 అడుగుల ఎత్తులో వున్నాయి. 70 అడుగుల ఎత్తులో వున్న మిగిలిన గోపురాలు లోపల ప్రాకారాలకు వున్నాయి.

ఎలా వెళ్ళాలంటే..?

కాట్పాడి, చెన్నై మొదలగు తమిళనాడులోని అనేక ప్రదేశాలనుంచేగాక చిత్తూరు, తిరుపతి నుంచికూడా బస్సులున్నాయి. చెన్నై నుంచి 185 కి.మి. దూరంలో ఉంది. చెన్నై నుంచి బస్సు, ట్రైన్ సౌకర్యం ఉంది. చెన్నైలోని కోయంబేడు (సి.యమ్.బి.టి.) బస్సు స్టాండ్ నుంచి అరుణాచలం చేరటానికి 4–5 గంటల సమయం పడుతుంది.

గిరి ప్రదక్షిణ

ఇక్కడ గిరి ప్రదక్షిణ విశేషం. అరుణాచలం అర్ధనారీశ్వర రూపమని, దానికి ప్రదక్షిణ చేస్తే శివ పార్వతులకు ప్రదక్షిణ చేసినట్లేనని భక్తుల విశ్వాసం. 14 కి.మీ.ల దూరం ఉండే ఈ ప్రదక్షిణ మార్గమంతా విశాలమైన తారు రోడ్డు, ఇరు ప్రక్కలా ఎత్తయిన వృక్షాలతో సుందరంగా ఉంటుంది. దోవలో అష్టదిక్పాలకుల పేర్లతో ఎనిమిది శివాలయాలు, దుర్గాదేవి, ఆంజనేయ స్వామి, ఆది అణ్ణామలై వగైరా అనేక ఆలయాలేగాక, సుప్రసిద్ధ రమణ మహర్షి, శేషాద్రి మహర్షి వంటివార్ల ఆశ్రమాలు కూడా దర్శనీయాలు. భక్తులు ఎంత భక్తి శ్రద్ధలతో ఈ గిరి ప్రదక్షిణ చేస్తారంటే పాద రక్షలు వేసుకోరు. రోడ్డుకి ఎడమవైపే నడుస్తారు. ఇప్పటికీ అనేకమంది సిద్ధపురుషులూ, యోగి పుంగవులూ అదృశ్యరూపంలో గిరి ప్రదక్షిణ చేస్తుంటారని, రోడ్డుకి కుడివైపు వెళ్తే వారికడ్డవుతామని వారి నమ్మకం. ఎన్నో అద్భుతమైన విశేషాలుగల ఈ ఆలయాన్ని దర్శించినవారందరూ తమని తాము అదృష్టవంతులుగా భావిస్తారు. ఇంత అద్భుతమైన ఈ ఆలయం విల్లుపురం – కాట్పాడి రైలు మార్గంలో, చెన్నైకి సుమారు 180 కి.మీ.ల దూరంలో వుంది.



● బౌద్ధవాణి

దుఃఖ కారకాలు!

పూర్వం విదేహ రాజ్యంలోని మిథిలా నగరాన్ని నిమి అనే రాజు పాలిస్తూ ఉండేవాడు. ఆయనకు రాజ్యకాంక్ష ఎక్కువ. నిరంతరం యుద్ధాల్లో మునిగి తేలేవాడు. ప్రశాంతత ఎరగడు. నిద్రకూడా కరువే. నింతరం భయమే! ఎవరు ఎప్పుడు దాడి చేస్తారో, ప్రమాదం ఏ మూల నుండి పొంచుకు వస్తుందో అనే భయం వెన్నంటే ఉండేది. ఆయనకు రాజ్యం పెరిగినకొద్దీ రక్షణ భయం పెరిగిపోయింది. ఒకరోజున సేనల్ని వెంట తీసుకుని పొరుగు రాజ్యంపై యుద్ధానికి బయలు దేరాడు. దారిలో ఒక జంతు కళేబరం పడి ఉంది. అక్కడ కుక్కలు కాట్లాడుకుంటున్నాయి. గద్దలు చేరి పొడుచుకు తింటున్నాయి. ఆహారం తమకే చెందాలని ప్రతిదీ మరోదానితో తన్నులాటకు దిగుతోంది. గుర్రం వేగాన్ని ఆపి రాజు నెమ్మదిగా పోతున్నాడు. అంతలో మంచి జబ్బముక్కను చీల్చి, గోళ్లతో పట్టుకుని ఒక గ్రద్ద ఆకాశంలోకి లేచింది. దానివెంట కొన్ని గ్రద్దలు పడ్డాయి. మిగిలిన గద్దలు దాన్ని పొడిచాయి. తన్నాయి. నానా హింసలూ పెట్టాయి. బాధ భరించలేక ఆ మాంసం ముక్కని వదిలి పెట్టింది గ్రద్ద. ఆ వదిలిన ముక్కను మరో గ్రద్ద తన్నుకుపోయింది. ఇక గ్రద్దలన్నీ దాని వెంట పడ్డాయి. పొడిచాయి. తన్నాయి. చివరికి అదీ వదిలి పెట్టింది. ఆ ముక్కని మరో గ్రద్ద పట్టుకుంది. అదీ తన్నులు తింది. రాజు వెళ్తూ ఈ తతంగం అంతా చూశాడు. ''ఆ మాంసం ముక్క ఏ గ్రద్ద దగ్గర ఉందో, దానికి తన్నులు తినక తప్పలేదు. మరెవరికీ పంచకుండా అదొక్కటే తినాలనే దాని దురాశే అది తన్నులు తినడానికి కారణం. ఏ గ్రద్ద అయితే ఆ మాంసాన్ని వదులుకుందో దానికి దుఃఖోపశమనం కలిగింది. ప్రస్తుత నా పరిస్థితి ఇలాగే ఉంది. మాంసం ముక్కని పట్టుకుని, దురాశతో దూరంగా పోతున్న గ్రద్ద పరిస్థితీ, నా స్థితీ ఒక్కటే. అందుకే దుఃఖంతో మునిగి పోయాను. మనస్సుకి శాంతిలేకుండా పోయింది. మాంసం ముక్కని వదిలించుకున్న ప్రతి గ్రద్దా దుఃఖాన్ని వదిలించుకుంది''అని ఆలోచించి, సేనాపతిని పిలిచి– ''సేనాపతీ! సైన్యాన్ని వెనక్కి మరలించు'' అని ఆజ్ఞలిచ్చాడు. అలా నిమి యుద్ధాలు మాని, కొంతకాలం ప్రజారంజకంగా పాలించాడు. ప్రజలకూ, ఆయనకూ యుద్ధభీతి పోయింది. మరికొన్నాళ్లకు రాజ్యాన్ని మంత్రిమండలికి అప్పజెప్పి రాజ్యత్యాగం చేసి మౌనిగా మారాడు. పరమ ధార్మికుని జీవితం గడిపాడు. హింస, దురాశ, దురాక్రమణలూ ఇవన్నీ దుఃఖ కారకాలే అని బుద్ధుడు చెప్పిన చక్కని సందేశాత్మక కథ ఇది.

- డా. బొర్రా గోవర్ధన్

● సువార్త

ఇశ్రాయేలు రాజ్యం ఉత్తర, దక్షిణ రాజ్యాలుగా విడిపోయిన తరువాత దావీదు రాజు వంశావళిలోని ఆమోసు రాజును దేశప్రజలు ఆయన మీద కుట్రచేసి అంతమొందించిన తర్వాత ఆయన కుమారుడైన హోషియాను ఎనిమిదేండ్ర ప్రాయములో యెరూషలేమునకు రాజుగా నియమింపబడ్డాడు. అతడు ముప్పై ఒక్క సంత్సరాలు పాలించాడు. యెహోవా మందిరమందు కనిపించిన ధర్మశాస్త్ర గ్రంథాన్ని శాస్త్రియగు (లేఖకుడు) షాఫానురాజు చేతికి అప్పగించాడు, అప్పుడు రాజుకు ధర్మశాస్త్ర గ్రంథాన్ని చదివి వినిపించగా రాజు తన వస్త్రములను చింపుకొని, ఇశ్రాయేలు యూదా వారిలో శేషించియున్న వారికి ఈ గ్రంథమందు వ్రాయబడిన వాటిననుసరించక పోయిన యెడల ప్రజలపై యెహోవాకు కోపము రగులవచ్చునని ఆజ్ఞాపించాడు.

హోషియా మత సంస్కరణలు

క్రీ.శ. 1517లో జర్మనీలోని ఫ్రాన్సికన్ మఠంలోనున్న అనేక వేల సన్యాసుల మధ్యవున్న ఒక సన్యాసి డాక్టర్. మార్టిన్ చాథర్ పీఠాధిపతి అయిన పోప్ మత సంస్కరణలోవున్న పాప క్షమాపణ పత్రాలను విక్రయించిన వారు పరలోకరాజ్యమనే స్వర్గము/వైకుంఠమనే ముక్తి మార్గము ప్రసాదింపబడున్న పత్రాల విక్రయముల పట్ల రెండోది పాప పరిహారార్థ పత్రాలు విక్రయించిన వారిని ఒకచోట (సబ్ స్టేషన్)లో వుంచి వారిని పవిత్రపరచబడిన వారు నేరుగా పరలోకరాజ్య ప్రవేశము జరుగనున్న సంస్కరణ ఈ యువ సన్యాసికి ఒక కెరటంలా హృదయాన్ని కలత వేసింది. కొన్ని వందల సంవత్సరాల నుండి అమలవుతున్న ఈ సంస్కరణలను సహించలేకపోయాడు, వ్యతిరేకించాడు. అందుచేత మార్టిన్ చాథర్ 95 మత సూత్రాలను మత సంస్కరణల పేరట వ్రాయించి, వెటిస్బర్గ్ కోటలోని చర్చి తలుపులకు అంటించాడు. ఆ రోజులలో పరిశుద్ధ గ్రంథం యాజకుని హస్తాలలోనే వుండేది, ప్రజలకు ఇచ్చేవారు కాదు. వ్యక్తిగత ప్రార్థనలు కూడా ప్రజలకు యాజకుని ద్వారా చేయబడేవి. ఇతడు బైబిల్ని సంపాదించుకొని లాటిన్ భాషలో వున్న గ్రంథాన్ని జర్మనీలోని ముద్రణా యంత్రాల ద్వారా ముద్రించే ఏర్పాటు చేశాడు. నేడు అనేక భాషలలో వున్న బైబిల్ అందించిన సంస్కర్త ప్రాముఖ్యంగా మార్టిన్ చాథర్ 95 మత సంస్కరణలలో ప్రముఖ్యమైన ఐదు సూత్రాలను 'పంచ విధి ధర్మాలు' అంటారు. అందులో ఒకటి దైవగ్రంథం మాత్రమొక్కటేనని, రెండు విశ్వాసమే ఒక్కటేనని, మూడు కృపమాత్రము ఒక్కటేనని, నాలుగు క్రీస్తు మాత్రమేనని, ఐదు దేవుని మహిమ మాత్రమేనని అన్నవి ప్రాముఖ్యం. అయితే కొంతకాలమైన తర్వాత కొంతమంది ఆ సంస్కరణలలో పాటు... ఒకటి సంఘము మాత్రమే, రెండు ఆత్మవరము మాత్రమే, మూడు ఆధ్యాత్మిక మాత్రమేనన్న ఈ మూడును జతపరచగా మొత్తము 8 సంస్కరణలు. ఈ సంస్కరణలను ప్రొటెస్టెంట్ సంఘాల వారి చేత కూడా అంగీకరించబడ్డాయి. మత సంస్కరణలు ఒక వర్గానికే కాక అన్ని మత సంఘాలకు సంబధించినవి.

పాత నిబంధన గ్రంథము నిత్యనూతన నిబంధన గ్రంథం, ప్రభువైన యెహోవా ఇశ్రాయేలీయులకు ఆజ్ఞాపించినదేమనగా 'నీ దేవుడైన యెహోవాను పూర్ణహృదయంతోను, పూర్ణాత్మతోను, పూర్ణశక్తితోను ఆరాధించవలెను' అని. అవి నీ/మీ హృదయంలో భద్రపరచుకొని వాటిని సూచనగా చేతికి కట్టుకొనవలెనని, అవి కన్నుల నడుమ బాసికము వలె వుండవలయునని స్పష్టీకరించుచున్నది (ద్వితియోప 6:4–9).

కావున కృత్రిమాలంకారములైన హెయిర్ డై, ఐలాష్, లిపిస్టిక్‌ను అలంకరించుకొనుచున్న విధంగా ఇశ్రాయేలీయుల మత గ్రంథాన్ని అనుసరించుచున్న క్రైస్తవులపై ఆజ్ఞల మేరకు బాసికంగా తిలకమును గుర్తులుండులాగున కన్నుల నడుమ సంస్కరించుకొందురు గాక.

- కోట బిపిన్ పాల్ చంద్ర

● ఇస్లాం వెలుగు

దేవుడు ఎలా ఉంటాడో తెలుసా?

ఒకసారి బాగ్దాదు నగరంలో గొప్ప ధార్మిక సభ జరుగుతోంది. వేలాది మంది ప్రజలు ఆ సభలో పాల్గొన్నారు. అనేకమంది పండితులు ప్రజలను ఉద్దేశించి ప్రవచనం చేస్తున్నారు. అంతలో ఒక వ్యక్తి సభలోకి ప్రవేశించి, పండితులకు ఒక సవాలు విసిరాడు. 'మీరు చెబుతున్న ప్రకారం, ఈ సృష్టి మొత్తానికి ఒక కర్త ఉన్నాడు. అయన అల్లాహ్, అంటే సృష్టికర్త. మరి ఆయనే సమస్తాన్ని సృష్టించినప్పుడు 'ఆయన్ని' ఎవరు సృష్టించారు? ఆయనకు ముందు ఎవరున్నారు?'అని ప్రశ్నించాడు.

సభలో ఒక్కసారిగా నిశ్శబ్దం ఆవరించింది. పండితులు అతని ప్రశ్నకు సమాధానం చెప్పారు. కాని అతను సంతృప్తి చెందలేదు. పండితులు తల పట్టుకున్నారు. అతనికి అర్థమయ్యేలా సంతృప్తికరమైన సమాధానం ఎలా చెప్పాలో వారికి అర్థం కాలేదు. ఆ వ్యక్తి గర్వంగా సభికుల వైపు చూశాడు.

అంతలో సభికుల్లోంచి ఓ పదకొండేళ్ళ బాలుడు సమాధానం చెబుతానని ముందుకొచ్చాడు. ఆ వ్యక్తి బాలుణ్ణి చూసి,'నువ్వు సమాధానం చెబుతావా?' అంటూ వెటకారంగా నవ్వాడు.

ఆ బాలుడు ఏమాత్రం తొణక్కుండా, 'అవును నేనే.. మీప్రశ్న మరోసారి వినిపించండి' అన్నాడు.

'అన్నిటికీ అల్లాయే అంటున్నారు గదా.. మరి అల్లాహ్‌కు ముందు ఎవరున్నారు? ' అని ప్రశ్నించాడు.

అప్పుడా బాలుడు, 'మీకు ఒకటి, రెండు ఒంట్లు వచ్చుగదా..? ఒకటి నుండి పది వరకు లెక్కించండి'. అన్నాడు.

'ప్రశ్నకు సమాధానం చెప్పకుండా ఇదేమి పిచ్చి ప్రశ్న' అంటూనే ఒకటి నుండి పది వరకు లెక్కించాడు.

'పది తరువాత..?' అన్నాడా బాలుడు.

'పదకొండు..పన్నెండు..'ఇలా ఎంతవరకైనా వెళ్ళవచ్చు.' అన్నాడా వ్యక్తి. 'అవును కదా..! అలాగే పది నుండి వెనక్కి లెక్కించండి. 'అన్నాడా బాలుడు. 'పది..తొమ్మిది..ఎనిమిది..ఇలా .. ఒకటి వరకు వచ్చి ఆగి పొయ్యాడు.

'తరువాత..? లెక్కించండి..' అన్నాడు బాలుడు.

'తరువాత ఇంకేముంటుంది. ఏమీలేదు.. సున్నా.. శూన్యం.' అన్నాడా వ్యక్తి. '..కదా..? అల్లాహ్‌కు ముందు కూడా ఏమీ లేదు.. అంతా శూన్యం. అన్నిటికీ కర్త ఆయనే..'అన్నాడు బాలుడు.

సభలో కరతాళ ధ్వనులు మిన్నంటాయి. ప్రశ్నించిన వ్యక్తి ముఖం వాడిపోయింది.

- ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

● కథాశిల్పం

ఏకపాదమూర్తి

శివుడిని విగ్రహరూపంలో కంటే లింగ రూపంలో దర్శించడమే ఎక్కువ. ఆయన నిష్కళుడని, ఆయనకు రూపం లేదని అందరూ అంటూ ఉంటారు. నిజానికి హిందూ దేవతలలో పరమేశ్వరుడికి ఉన్నన్ని లీలారూపాలు మరే దేవుడికీ లేవంటే అతిశయోక్తి కాదు. అటువంటి పరమేశ్వరుడి సాకార రూపాలలో అరుదైన రూపం ఒకటుంది. అదే ఏకపాద మూర్తి. ఈ స్వామికి పేరులో ఉన్నట్లే ఒకే పాదం ఉంటుంది. ఆయన నుండి బ్రహ్మ, విష్ణువులు ఆవిర్భవిస్తున్నట్లు ఉంటుంది. ఈ రూపం వెనుక అనేక ఆశ్చర్యకరమైన విశేషాలు దాగి ఉన్నాయి. పరమేశ్వరుడు ఏకాదశరుద్రులుగా ఆవిర్భవించాడని వేదాలు చెబుతున్నాయి. వాటిలో మొట్టమొదటి రుద్రుడు ఈ ఏకపాదుడే. సృష్టికి పూర్వం శివుడు ఏకపాదుడై సంచరించాడనీ అథర్వవేదం తెలిపింది. యజుర్వేదం ఈ స్వామిని తూర్పున ఉదయించిన అగ్ని అవతారమని కీర్తించింది. శైవాగమాలు ఈ స్వామి దర్శనం వలన సత్వరమే శుభం కలుగుతుందని, అంతేగాక ఒకే మూర్తిలో త్రిమూర్తులుండటం వలన ముమ్మూర్తుల అనుగ్రహం పొందవచ్చునీ చెప్పాయి. కొన్ని విగ్రహాలలో మూడు పాదాలు కనిపిస్తాయి. అపుడు ఈ స్వామిని త్రిపాద త్రిమూర్తి అంటారు. చెన్నైలోని తిరువొట్టియూర్ వద్ద ఆదిపురీశ్వరాలయంలో కోష్ఠదేవతగా ఈ స్వామి పూజలందుకుంటున్నాడు. కుడిచేతితో అభయముద్ర చూపుతూ, ఎడమచేతిని నడుము వద్ద ఉంచుకుని, వెనుక చేతులలో పరశువు, హరిణమూ ధరించి నడుము వద్ద బ్రహ్మ విష్ణువులు కుడిఎడమభాగాల్లో ఆవిర్భవిస్తూ అంజలి బద్ధులై దర్శనమిస్తారు. ఈ రూపమే కొంచెం భిన్నంగా శ్రీశైలం ఆలయ దక్షిణ ప్రాకారంపై దర్శనమిస్తుంది. దక్షిణభారతంలోనే కాక ఒరిస్సా రాష్ట్రంలోని అనేక ఆలయాలలో ఈ స్వామి విశేష రూపాలు కనిపిస్తాయి. అక్కడ ఈ స్వామిని భైరవావతారంగా కొలుస్తారు. అరుదైన ఈ స్వామి రూపాన్ని దర్శించి భక్తులు తన్మయత్వంతో నిండిపోతారు.

-కె.వి. సత్యబ్రహ్మాచార్య

● నిర్మల వాణి

రుద్రగ్రంథి



నిర్జీవమైన వాటిని మీరు మీ ఎడమపార్శ్వంలో పోగుచేసుకుంటారు. ఎడమ పార్శ్వంలో ఇవన్నీ పోగుచేసుకుని కుడిపార్శ్వపు శక్తితో పని చేస్తారు. మీరు ఈ రజోగుణం, తమోగుణం అనే రెండు ముడుల (గ్రంథుల) మధ్య ఊగుతూ ఉంటారు. ఈ రెండు ముడులూ మీలో ఉండటంవలన మీ చిత్తం వాటి దగ్గరే ఉంటుంది కానీ ఆత్మపై ఉండటం లేదు.

మూడవది రుద్ర గ్రంథి

ఇక మూడవది సత్వ గుణం. సుషుమ్నా నాడీ లక్షణం. దాని ద్వారానే మనము భగవంతుణ్ణి తెలుసుకుంటాము. దానివలననే ఏది మంచిది కాదో మనము గ్రహించగలం. రజో, తమో గుణాలను వదిలివేసి సత్వగుణాన్ని అనుసరించాలి. అదే మధ్య మార్గం. అక్కడే భగవంతుని సాధన సాధ్యమని గ్రహించాలి. ఈ ముడి విడిపోయే వరకు వివేకం కలగదు. ఆ పరిస్థితిలో మనిషి 'ఈ విషయం మానవమాత్రులతో సాధ్యం కాదు. కేవలం భగవంతుడివలన మాత్రమే సాధ్యమవుతుంది' అనే సూక్ష్మ విషయం తెలుసుకుంటాడు. ఆ విధంగా సమర్పణా భావం మొదలౌతుంది. ఆ భగవంతుడే ఈ పని చేయవలసి ఉంది. మన వల్ల కాదు అని తెలుసుకుంటాడు. మనం అనవలసింది ఒక్కటే. 'ఓ భగవంతుడా! దయచేసి ఈ కార్యాన్ని చేయండి' అని. మీరు కేవలం ఆయన తలుపు తట్టాలి. అంతే!

ఎందుచేత మనం ఈ మూడు చిక్కుముడులతో ఎల్లవేళలా సతమతమవుతున్నామంటే... ఈ సత్యాన్వేషణలో మధ్య మార్గం చాలా విశేషమైనది. మీ అన్వేషణలో మీరు తెలుసుకోవలసినది మీరు అన్వేషించేది ఆత్మను అనే విషయం. మీ చిత్తం ఎప్పుడూ మీ ఆత్మ పైనే ఉండాలని కోరుకోవాలి. అంతేగానీ పనికిమాలిన విషయాలపై కాదు.

మీ అన్వేషణ కేవలం మీ ఆత్మకోసమే కారాదు. మీరు ఆత్మతో ఒకటిగా ఏకమవడం కోసం అయి ఉండాలి. అదీ సత్యాన్వేషణ అంటే. మీరు నిజాయితీగా ఉంటేనే ఆ మధ్య మార్గం బాగా పనిచేస్తుంది. ఆ విధంగా సత్యాన్ని అంగీకరించాలి. మధ్యమార్గంలో ఉండాలంటే మీరు నిజాయితీపరులై, ధర్మబద్ధులై ఉండాలి.

మూలాధారంలోని కుండలినీ శక్తి జాగృతి అయి సూక్ష్మ శరీరంలోని చక్రాల గుండా ప్రయాణిస్తూ బ్రహ్మ రంధ్రాన్ని ఛేదించుకుని సహస్రారం వద్ద బాహ్య పరంగా ఉన్న సర్వ వ్యాపక భగవంతుని శక్తితో ఏకీకృతమైనప్పుడు ఆ స్థితిని ఆత్మ సాక్షాత్కారం అంటారు. అలా సహజ యోగ ధ్యాన సాధనలో కుండలినీ జాగృతి అయినప్పుడు ఈ మూడు గ్రంథులూ వికసించి తద్వారా వాటిలో ఉన్న సమస్యలు తొలగిపోతాయి.

- డాక్టర్ పి. రాకేష్

(పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి ప్రవచనాల ఆధారంగా)

మిస్ ఎర్త్-2025 కార్యక్రమంలో భాగంగా ఫొటోలకు పోజిస్తున్న మిస్ ఎర్త్ ఫైర్, మిస్ ఎర్త్ ఎయిర్, మిస్ ఎర్త్, మిస్ ఎర్త్ వాటర్ విజేతలు. ఫిలిప్పీన్స్‌లోని మనీలా తీసిందీ ఫొటో

ఢిల్లీలోని వాసుదేవ ఘట్‌లో దేవదీపావళి జరుపుకుంటున్న మహిళలు

బుధవారం గిజాలోని గ్రాండ్ ఈజిప్షియన్ మ్యూజియంలో ఫారో చక్రవర్తి ప్రతిమ ఎదుట సెల్ఫీ దిగుతున్న ముగ్గురు అక్కాచెల్లెళ్లు

లవ్-కుశ్ కోటకు బీటలు!

బిహార్ దంగల్

'కుశ' ఓటు బ్యాంకుపైనే బీజేపీ ప్రధానంగా దృష్టి

ఇదే ఓటు బ్యాంకుపై ఆర్ఎల్ఎం, తేజస్వీ యాదవ్‌ల కన్ను

ఈ రెండు కులాలను ఏకీకరించడంతో నితీశ్‌కు తప్పని కష్టాలు

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల కురుక్షేత్రంలో కుల సమీకరణాలే తిరిగి ప్రధాన అస్త్రాలుగా మారుతున్నాయి. అజెండాలు, హామీల కంటే సామాజిక సమీకరణాల చుట్టూనే రాజకీయాలు తిరుగుతున్నాయి. ఈ సామాజిక సమీకరణాలను దృష్టిలో పెట్టుకుని అధికార, విపక్ష కూటములు వ్యూహ ప్రతివ్యూహాలు పన్నుతున్నాయి. గత రెండు దశాబ్దాలుగా ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌కు రాజకీయ బ్రహ్మాస్త్రంగా, అజేయశక్తిగా నిలిచిన 'లవ్-కుశ్' సమీకరణం ఇప్పుడు నెమ్మదిగా నీరుగారిపోతోందని రాజకీయ పండితులు చెబుతున్నారు. ఒకప్పుడు నితీశ్ ఏకఛత్రాధిపత్యంలో ఉన్న ఈ బలమైన ఓటు బ్యాంకు నేడు బీజేపీ, ఆర్జేడీ, ఇతర పక్షాల ఎత్తుగడలతో ముక్కలవుతోంది. ఈ వర్గాల ఓట్ల చీలికే ఈ ఎన్నికల్లో గెలుపోటములను నిర్ణయించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

అసలు ఏమిటీ 'లవ్-కుశ్'?

'లవ్-కుశ్' అనేది బిహార్‌లోని రెండు ప్రధాన ఓబీసీ కులాల రాజకీయ కూటమికి పెట్టిన పేరు. 'లవ్' కుర్మి కులానికి ప్రతీక. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ ఈ కులానికి చెందిన నేత. 'కుశ' అనేది కుష్వాహా కులానికి గుర్తు. వీరిని కోయిరీ అని స్థానికంగా పిలుస్తారు. పురాణాల ప్రకారం శ్రీరాముడి కుమారులు లవకుశులు. తాము వీరి వంశీయులమని ఈ లవ్, కుష్వాహా కులాలు బలంగా విశ్వసిస్తున్నాయి. ఈ పౌరాణిక బంధాన్నే 1990లలో నేతలు తమ రాజకీయ సమీకరణంగా విజయవంతంగా మలిచారు. 2023 కుల గణన నివేదిక ప్రకారం బిహార్ జనాభాలో కుర్మి కులస్తులు 2.87 శాతంకాగా కుష్వాహా వర్గీయులు 4.21 శాతం దాకా ఉన్నారు. మొత్తం కలిపితే వీరి జనాభా 7.08 శాతం. సంక్లిష్టమైన బిహార్ రాజకీయంలో ఈ 7 శాతం ఓటు బ్యాంక్ కూడా ఏ కూటమికైనా గెలుపు, ఓటములను నిర్దేశించగల 'స్వింగ్' శక్తిగా ఎదిగింది.

లాలూ 'ముస్లిం-యాదవ్' ఫార్ములాకి విరుగుడు

1990లో లాలూ ప్రసాద్ యాదవ్ ముఖ్యమంత్రి అయ్యాక ఆయన ముస్లిం-యాదవ్ సమీకరణాన్ని పటిష్టం చేసుకున్నారు. రాష్ట్ర జనాభాలో 14.26 శాతమున్న యాదవులు, 17.7 శాతమున్న ముస్లిం వర్గాలను కలిపితే అది దాదాపు 32 శాతం బలమైన ఓటు బ్యాంకుగా మారింది. లాలూ పాలనలో యాదవులకే అగ్రతాంబూలం దక్కుతోందని, ఇతర వెనుకబడిన కులాలైన కుర్మి, కుష్వాహాలు రాజకీయంగా అణచివేతకు గురవుతున్నారనే అసంతృప్తి ఒక్కసారిగా ఎక్కువైంది. ఈ పరిణామాలను పసిగట్టి ఆనాడు జార్జ్ ఫెర్నాండెజ్‌తో కలిసి సమతా పార్టీలో ఉన్న నితీశ్ కుమార్ వెనువెంటనే లాలూకు వ్యతిరేకంగా యాదవేతర ఓబీసీలను ఏకం చేయడం మొదలెట్టారు. ఇందులో భాగంగానే 1994లో పట్నాలోని గాంధీ మైదాన్‌లో నితీశ్ కుమార్ భారీ 'కుర్మి చేతనా ర్యాలీ' నిర్వహించారు. ఇది లాలూ ఆధిపత్యానికి వ్యతిరేకంగా కుర్మిల రాజకీయ చైతన్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ ర్యాలీతో కుర్మి (లవ్), కుష్వాహా (కుశ్) కులాల ఐక్యతకు గట్టి పునాది పడింది.

నితీశ్ 'అజేయ' ప్రస్థానానికి బీటలు

నితీశ్ కుమార్ దాదాపు రెండు దశా బ్దాలుగా బిహార్ రాజకీయాల్లో అత్యంత శక్తివంతమైన నేతగా కొనసాగడానికి ఈ 7 శాతం 'లవ్-కుశ్' ఓటు బ్యాంక్ సైతం ఒక ప్రధాన కారణం. ఈ 'లవ్-కుశ్' పునాది పైనే నితీశ్ కుమార్ 36 శాతమున్న అతి వెనుకబడిన తరగతు (ఈబీసీ)లను, మహాదళితులను ఏకం చేసి ఒక బలమైన సామాజిక కూటమిని నిర్మించారు. బీజేపీ వంటి మిత్రపక్షాల మద్దతు దీనికి అదనపు బలంగా మారింది. నితీశ్ కుమార్ ఎన్డీఏ కూటమిలో ఉన్నా, మహాగఠ్‌బంధన్‌లో ఉన్నా ఆయనతో ఈ రెండు కూటములు బేరసారాలు జరపడానికి ఈ 'లవ్-కుశ్'' ఓట్లే కారణం. ఈ ఓట్లు తన వ్యక్తిగత చరి ష్మాకే బదిలీ అవుతాయి తప్ప కూటమిలోని బీజేపీ వంటి ఏ ఇతర పార్టీకీ బదిలీకావని ఆయన పలుమార్లు నిరూపించగలిగారు. గత దశాబ్ద కాలంగా ఈ పటిష్టమైన ఓటు బ్యాంకును చీల్చడానికి అనేక ప్రయత్నాలు జరిగాయి. ఇప్పుడు కూడా జరుగుతున్నా యి. 'లవ్' ఓటు బ్యాంకులో ఎక్కువ భాగం అంటే దాదాపు 2.87 శాతం మంది ఓటర్లు ఇప్పటికీ నితీశ్ వైపే ఉన్నారు. కానీ సంఖ్యాపరంగా పెద్దదైన కుష్వాహా(4.21 శాతం) ఓటు బ్యాంకు కోసం ఇప్పుడు నలుగురు ప్రధాన నేతలు పోటీ పడుతు న్నారు. 'లవ్-కుశ్' ఓట్లపై నితీశ్ ఆధారప డటాన్ని తగ్గించడానికి బీజేపీ సొంతంగా పావులు కదిపింది. కుష్వాహా సామాజిక వర్గానికి చెందిన సమ్రాట్ చౌదరిని బిహార్ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, డెప్యూటీ సీఎంగా నియమించింది. ఇది 'కుశ్' ఓటు బ్యాంకును నితీశ్ నుంచి వేరు చేసి, నేరుగా బీజేపీ వైపు తిప్పుకోవాలనే స్పష్టమైన రాజకీయ వ్యూహంగా మారింది. ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ కూడా తన తండ్రి 'ముస్లిం-యాదవ్' సమీకరణం దాటి అన్ని వర్గాలను కలుపుకొని పోవాలని నిర్ణయించుకున్నారు. 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జే డీ అనేక మంది కుష్వాహా, కుర్మి అభ్య ర్థులకు టికెట్లు ఇచ్చింది. నితీశ్‌పై అసంతృప్తిగా ఉన్న 'లవ్-కుశ్' ఓట్లను ఆకర్షించి, తన 'ముస్లిం -యాదవ్ 'కూటమికి జోడించుకోవాలని తేజస్వీ పెద్ద ప్రణాళిక వేశారు. ఆర్ఎల్ఎం నేత ఉపేంద్ర కుష్వాహా సైతం నితీశ్‌కు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు దశాబ్దాలుగా ప్రయత్నిస్తున్నారు. నితీశ్‌తో విభేదించి రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ (ఆర్ఎల్ఎస్పీ) స్థాపించడం, 2014లో ఎన్డీఏలో చేరి కేంద్ర మంత్రి కావడం, తిరిగి 2021లో పార్టీని జేడీ(యూ)లో విలీనం చేయడం, మళ్లీ 2023లో రాష్ట్రీయ లోక్ మోర్చా (ఆర్ఎల్ఎం) స్థాపించి ఎన్డీఏలో చేరడం.. ఇలా ఆయన ప్రస్థానం కొనసాగుతూనే ఉంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కారాకాట్ నుంచి ఓడిపోవడం, 2025 అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీఏ నామమాత్రపు సీట్లు కేటాయించడంతో ఆయన బలం తగ్గింది. కానీ ఆయనకు ఇప్పటికీ 'కుశ్' ఓట్లను కొంతమేర చీల్చగల శక్తియుక్తులు ఉన్నాయని రాజకీయ పండితులు చెబుతున్నారు. ఈ పరిణామాలు నితీశ్ బలాలను ఏ మేరకు దెబ్బకొడతాయో 14న ఎన్నికల ఫలితాలతో తేలిపోనుంది.

మొదటి భార్య ఓకే అంటేనే రిజిస్ట్రేషన్

ముస్లిం వ్యక్తి రెండో పెళ్లి కేసులో కేరళ హైకోర్టు

తిరువనంతపురం: మొదటి భార్య వాదనలు వినకుండా ముస్లిం వ్యక్తి రెండో వివాహం నమోదు చేయకూడదని కేరళ హైకోర్టు ఆదేశించింది. ఆమె అభ్యంతరం చెబితే రిజిస్ట్రార్ వెంటనే రిజిస్ట్రేషన్‌ను నిలిపివేసి ఆ విషయాన్ని కోర్టుకు సూచించాలని పేర్కొంది. మొదటి వివాహం చెల్లుబాటులో ఉండగా ముస్లిం పురుషుడు రెండో వివాహాన్ని నమోదు చేసుకోవాలనుకుంటే మొదటి భార్యకు వాదనలు వినిపించే అవకాశం ఇవ్వాలని హైకోర్టు సూచించింది. తమ వివాహాన్ని రిజిస్టర్ చేసుకునేందుకు ఆదేశాలు కోరుతూ ముహమ్మద్ షరీఫ్, అతని రెండో భార్య దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం పై విధంగా స్పందించింది. ఈ కేసులో మొదటి భార్యను చేర్చనందున పిటిషన్‌ను తోసిపుచ్చింది. ముస్లిం పర్సనల్ లా కొన్ని సందర్భాల్లో రెండో వివాహాన్ని అనుమతిస్తున్నప్పటికీ మొదటి భార్య తన భర్త రెండో వివాహ రిజిస్ట్రేషన్‌కు ప్రేక్షకురాలిగా ఉండకూడదని కోర్టు అభిప్రాయపడింది. మొదటి భార్య అభ్యంతరం వ్యక్తంచేస్తే ఆ వివాహాన్ని రిజిస్ట్రేషన్ చేయకుండా ఉండాలని హైకోర్టు స్పష్టం చేసింది. అభ్యంతరాలను వినకుండా, వివాదాలను సివిల్ కోర్టులకు సూచించకుండా వివాహ రిజిస్ట్రేషన్ అధికారులకు అధికారం ఉండదని కోర్టు పేర్కొంది.

వ్యోమగాముల తిరుగు ప్రయాణం వాయిదా

అంతరిక్ష నౌక శిథిలాల బారిన పడే అవకాశం ఉందన్న చైనా

బీజింగ్: సొంత అంతరిక్ష కేంద్రంలో ఉన్న ముగ్గురు చైనా వ్యోమగాముల తిరిగి భూమిని చేరుకునే ప్రయాణం ఆఖరి నిమిషంలో వాయిదా పడింది. తమ వ్యోమనౌక అంతరిక్ష శిథిలాల బారిన పడే అవకాశం ఉందన్న అంచనాలతో స్పేస్‌షిప్ తిరుగుప్రయాణాన్ని అర్ధంతరంగా వాయిదావేస్తున్నట్లు చైనా మ్యాన్డ్ స్పేస్ ఏజెన్సీ(సీఎంఎస్ఏ) బుధవారం ప్రకటించింది. చైనా వ్యోమగాములు చెన్ డాంగ్, చెన జోంగ్రుయ్, వాంగ్ జి బుధవారం షెంజౌ-20 అంతరిక్ష నౌకలో భూమి మీదకు తిరిగి రావాల్సి ఉంది. ఈ మేరకు వారు బాధ్యతలను అక్కడి సిబ్బందికి అప్పగించారు. కానీ ప్రయాణం చివరి నిమిషంలో ఆగింది. వ్యోమగాముల సురక్షిత ప్రయాణం తమకు అత్యంత కీలకమని సీఎంఎస్ఏ పేర్కొంది. ముగ్గురు వ్యోమగాములు ఏప్రిల్‌లో మంగోలియా అటానమస్ రీజియన్‌లోని రాకెట్ ప్రయోగ కేంద్రం వ్యోమనౌకలో సొంత అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన విషయం విదితమే.

హిందూ భక్తులను అనుమతించని పాక్

సిక్కుల బృందంలో ఏడుగురికి నిరాకరణ

చండీగఢ్: 'మీరు హిందువులు కాబట్టి సిక్కులతో కలిసి వెళ్లలేరు'.. అంటూ భారత్‌కు చెందిన హిందూ భక్తుల బృందాన్ని పాకిస్తాన్ అడ్డుకుంది. దీంతో గురునానక్ దేవ్ జయంతి ఉత్సవాలలో పాల్గొనేందుకు పాక్ వెళ్లిన ఏడుగురు హిందూ భక్తులు.. కుటుంబ సభ్యులతో సహా వెనక్కి తిరిగి వచ్చారు. దాదాపు 1,900 మంది సిక్కు భక్తులున్న ఒక బృందం, గురు నానక్ దేవ్ 'ప్రకాశ్ పర్బ్' వేడుకల్లో పాల్గొనేందుకు మంగళవారం అటారీ-వాఘా సరిహద్దు మీదుగా పాకిస్తాన్‌లోకి ప్రవేశించింది. 'ఏడుగురు సభ్యుల బస్సు టికెట్ల కోసం 95,000 పాకిస్తానీ కరెన్సీ ఖర్చు చేశాం'..అని బృంద సభ్యుడైన అమర్ చంద్ తెలిపారు. ఆ తర్వాత ఐదుగురు పాకిస్తాన్ అధికారులు వచ్చి 'మీరు హిందువులు కాబట్టి.. సిక్కుల జాతాతో వెళ్లలేరని మాతో చెప్పారు'.. అని పేర్కొన్నారు. అనంతరం తమను వెనక్కి పంపేశారని తెలిపారు. బస్సు టికెట్ల కోసం ఖర్చు చేసిన డబ్బును కూడా వెనక్కి ఇవ్వలేదని వివరించారు. గతంలో పాకిస్తాన్ జాతీయుడైన చంద్, 1999లో భారత్‌కు వచ్చి 2010లో భారత పౌరసత్వం పొందారు. ముందుగా, పొరుగు దేశంతో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా గురు నానక్ దేవ్ 'ప్రకాశ్ పర్బ్'కు సిక్కు భక్తులను పాకిస్తాన్‌కు పంపడానికి కేంద్రం నిరాకరించింది. అనంతరం సిక్కుల 'జాతా'ను పాకిస్తాన్‌లోని గురుద్వారాల సందర్శనకు అనుమతించింది.

10 కిలోల కణితి తొలగింపు

న్యూఢిల్లీ: గురుగ్రామ్‌లోని ఆర్టెమిస్ ఆసుపత్రిలో వైద్యుల బృందం జమ్మూకశ్మీర్‌కు చెందిన 39 ఏళ్ల మహిళ పొత్తికడుపులోని దాదాపు 10 కిలోల భారీ కణితిని విజయవంతంగా తొలగించింది. కణితి వల్ల ఆ మహిళ పదిహేనేళ్లుగా తీవ్రమైన రక్తహీనత, నొప్పితో బాధపడుతోంది. కదలడానికి కూడా చాలా కష్టంగా ఉండేది. ఆర్టెమిస్ ఆసుపత్రి మత్తు విభాగాధిపతి డాక్టర్ రాజేష్ మిశ్రా నేతృత్వంలో వైద్యుల బృందం సెప్టెంబర్ 25న ఈ సంక్లిష్ట శస్త్రచికిత్సను నిర్వహించింది. ప్రస్తుతం ఆమె కోలుకుంటోందని ఆర్టెమిస్ ఆసుపత్రి గైనకాలజీ అంకాలజీ చైర్‌పర్సన్ డాక్టర్ రూపిందర్ సెఖోన్ తెలిపారు.

మమ్దానికి అభినందనల వెల్లువ

ముంబై: న్యూయార్క్ మేయర్‌గా నెగ్గిన మమ్దానికి దేశ విదేశాల నుంచి అభినందనలు వెల్లువెత్తాయి. బాలీవుడ్ ప్రముఖులు షబానా అజ్మీ, జోయా అఖ్తర్, హన్సల్ మెహతా తదితరులు అభినందనలు తెలిపారు. మమ్దాని తల్లి మీరా నాయర్ దర్శకత్వం వహించిన చిత్రాల్లో షబానా అజ్మీ నటించిన సంగతి తెలిసిందే. మమ్దానికి అభినందిస్తూ సోనమ్ కపూర్, అలీ ఫజల్, తిలోత్తమ షోమీ తదితరులు సోషల్ మీడియాలో పోస్టుచేశారు. 'ద సూటబుల్ బాయ్ మమ్దాని' అని బాలీవుడ్ నటి నందితా దాస్ ప్రశంసించారు. అలాగే ఆస్కార్ అవార్డు గ్రహీత లుపితా న్యాంగో, పెడ్రో పాస్కల్, మార్క్ రుఫాలో తదితరులు కూడా అభినందనలు తెలియజేశారు. మరోవైపు మమ్దాని విజయం పట్ల సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ హర్షం వ్యక్తంచేశారు. ఈ విజయం తమకు గర్వకారణమని ఉద్ఘాటించారు. ప్రగతిశీల, ప్రజాస్వామిక శక్తులకు జనామోదం లభిస్తోందని పేర్కొన్నారు. సీపీఎం రాజ్యసభ సభ్యుడు జాన్ బ్రిట్టాస్, సీపీఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య సైతం మమ్దానిని అభినందించారు. సీపీఐ కూడా అభినందన సందేశం పోస్టు చేసింది.

రాణి ఎలిజబెత్ దుస్తుల ప్రదర్శన

వచ్చే ఏడాది బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో ఏర్పాటు

లండన్: దివంగత రాణి ఎలిజబెత్-2 ధరించిన దుస్తుల భారీ ప్రదర్శనను వచ్చే ఏడాది బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో నిర్వహించనున్నారు. ఎలిజబెత్-2 శత జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం జరగనుంది. రాణి వివాహం, పట్టాభిషేకం సందర్భంగా ధరించిన అద్భుతమైన గౌన్లతో సహా అనేక దుస్తులను ఈ సందర్భంగా ప్రదర్శించనున్నట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఈ ప్రదర్శనలో సుమారు 200 వరకు వస్తువులుంటాయి. వీటిలో దాదాపు సగం ఇంతకు ముందు ఎప్పుడూ బహిరంగంగా ప్రదర్శించనివి కావడం విశేషం. బ్రిటన్‌కు సుదీర్ఘకాలం పాలించిన రాణి ఎలిజబెత్ దుస్తుల నిధిని 20వ శతాబ్దపు బ్రిటిష్ ఫ్యాషన్ అత్యంత ముఖ్యమైన సేకరణలలో ఒకటిగా పరిగణిస్తారు. ఆమె 2026 ఏప్రిల్ 21న తన 100వ పుట్టినరోజును జరుపుకోవలసి ఉంది. కానీ 2022 సెప్టెంబరులో 96 ఏళ్ల వయసులో రాణి కన్నుమూశారు. ఈ ప్రదర్శన సందర్భంగా.. 1934లో 8 ఏళ్ల యువరాణి ఎలిజబెత్ ధరించిన టల్లే బ్రైడ్స్‌మెయిడ్ దుస్తులు, రాణి డిజైనర్ నార్మన్ హార్ట్‌నెల్ రూపొందించిన అద్భుతమైన కౌచర్ దుస్తులు కూడా ఉంటాయి. వీటిలో 1957లో వాషింగ్టన్‌లో అప్పటి అమెరికా అధ్యక్షుడు డ్వైట్ డి. ఐసెన్‌హోవర్ కోసం ఇచ్చిన స్టేట్ విందుకు రాణి ధరించిన ఆపిల్-గ్రీన్ గౌను, 1960లో తన సోదరి యువరాణి మార్గరెట్ వివాహానికి ఎలిజబెత్ ధరించిన లేత నీలం గౌను, రాణి వివాహ, పట్టాభిషేక దుస్తులు కూడా ఉన్నాయి. 'క్వీన్ ఎలిజబెత్ -2: హెర్ లైఫ్ ఇన్ స్టైల్'పేరిట ఈ ప్రదర్శనను 2026 ఏప్రిల్ 10 నుండి అక్టోబర్ 18 వరకు బకింగ్‌హామ్ ప్యాలెస్‌లో నిర్వహించనున్నారు. టిక్కెట్లు మంగళవారం నుండి అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి.

150 ప్రాంతాల్లో వందేమాతరం ఉత్సవం

న్యూఢిల్లీ: జాతీయగేయం వందేమాతరానికి బంకించంద్ర ఛటోపాధ్యాయ స్వరపరిచి నవంబర్ ఏడో తేదీతో 150 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఆ తేదీన దేశంలో 150 ప్రఖ్యాత ప్రాంతాల్లో గేయాన్ని ఆలపించి, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు బీజేపీ ప్రకటించింది. వివరాలను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ వెల్లడించారు. '' నవంబర్ ఏడో తేదీ నుంచి రాజ్యాంగ దినోత్సవం అయిన నవంబర్ 26వ తేదీ దాకా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తాం. 7వ తేదీన 150 ప్రాంతాల్లో వందేమాతర గేయం పాడతాం. స్వదేశీ ఉత్పత్తులను మాత్రమే వినియోగిస్తామని అందరం ప్రతిజ్ఞచేద్దాం. ఈ 20 రోజులపాటు కవిత్వం, వ్యాసరచన, చిత్రలేఖనం ఇలా పలు కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఢిల్లీలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జరిగే కార్యక్రమంలో ప్రధాని మోదీ పాల్గొని గేయాన్ని ఆలపిస్తారు'' అని బీజేపీ జాతీయ కార్యదర్శి ఓం ప్రకాశ్ ధన్‌ఖడ్ తెలిపారు.

మహాదేవ్ బెట్టింగ్ యాప్ నిందితుడిని పట్టుకోండి

ఈడీకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ: అదృశ్యమైన మహాదేవ్ బెట్టింగ్ యాప్ సహ వ్యవస్థాపకుడిని గుర్తించి, అదుపులోకి తీసుకోవాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ని సుప్రీంకోర్టు ఆదేశించింది. దుబాయ్ నుండి పారిపోయిన ఆ నిందితుడు, కోర్టులు, దర్యాప్తు సంస్థలతో ఆటలాడుకునే అవకాశం కల్పించవద్దని న్యాయస్థానం స్పష్టం చేసింది. జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ సతీశ్ చంద్ర శర్మలతో కూడిన ధర్మాసనం, నిందితుడు రవి ఉప్పల్ దర్యాప్తు సంస్థల నిఘా నుంచి తప్పించుకోవడంపై తీవ్రంగా స్పందించింది. భారత్ దర్యాప్తు సంస్థల నిఘా నుంచి తప్పించుకున్న ఉప్పల్, దుబాయ్‌లో ఉండేవాడు. అనంతరం అక్కడి నుండి గుర్తు తెలియని ప్రాంతానికి పారిపోయినట్లు సమాచారం. దీంతో యుఏఈ అధికారులు అతడి అప్పగింత ప్రక్రియను మూసివేయడానికి చర్యలు ప్రారంభించాల్సి వచ్చింది. 'అతన్ని ఎలా పట్టుకోవాలో ముందు తెలుసుకోండి'.. అని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. రాయ్‌పూర్ ట్రయల్ కోర్టులో పెండింగ్‌లో ఉన్న మనీలాండరింగ్ కేసు విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ ఛత్తీస్‌గఢ్ హైకోర్టు మార్చి 22న ఇచ్చిన ఉత్తర్వును సవాలు చేస్తూ.. ఉప్పల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానం విచారణ జరిపింది. ఉప్పల్ తరపు న్యాయవాది సమయం కోరడంతో, ధర్మాసనం తదుపరి విచారణను నవంబర్ 14కి వాయిదా వేసింది. దర్యాప్తు సంస్థల కథనం ప్రకారం, ఉప్పల్ తన భాగస్వామి సౌరభ్ చంద్రకర్‌తో కలిసి 2018లో మహాదేవ్ బెట్టింగ్ యాప్‌ను ఏర్పాటు చేశాడు. ఇది ఆన్‌లైన్ గేమ్‌లపై చట్టవిరుద్ధంగా పందాలకు అనేక యాప్‌లను అనుమతించింది. ఈ స్కాం విలువ రూ.6,000 కోట్లు అని దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి.

రాహుల్ విద్వేషాలు సృష్టించాలనుకుంటున్నారు

- దురుద్దేశంతో రక్షణ బలగాల్లో 'రిజర్వేషన్' మాటెత్తుతున్నారు
- రాజ్‌నాథ్ సింగ్ ఆగ్రహం

జముయి/గయ: సాయుధ బలగాల్లో రిజర్వేషన్లు అమలుచేయాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ దేశంలో గందరగోళ, విద్వేష వాతావరణం సృష్టించేందుకు దుస్సాహసం చేస్తున్నారని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. బిహార్‌లోని జముయి జిల్లాలో బుధవారం జరిగిన ఎన్నికల ప్రచార ర్యాలీలో రాజ్‌నాథ్ మాట్లాడారు. ''రాహుల్‌జీకి ఏమైంది? రక్షణ బలగాల్లో రిజర్వేషన్ల అంశాన్ని లేవనెత్తి అస్తవ్యస్థ పరిస్థితి దాపురించేలా చేయాలనుకుంటున్నారు. దేశాన్ని అత్యంత సురక్షితంగా, భద్రంగా ఉంచే రక్షణ బలగాలు ఈ రిజర్వేషన్లకు అతీతం. సైన్యానికి మతంతో సంబంధం లేదు. సైన్యానికి ఒక్కటే మతం ఉంది. సైనికులు ఒక్కటే ధర్మాన్ని పాటిస్తారు. అదే సైన్య ధర్మం. ఆపరేషన్ సిందూర్ వేళ మతం చూసి ముష్కరులను మన సైన్యం మట్టుబెట్టలేదు. ఉగ్రవాదులు కాబట్టే అంతంచేశారు. వాస్తవానికి ఆనాడు హతమైన ఉగ్రవాదుల సంఖ్య ఎప్పుడూ చెప్పలేదు. అది మూడంకెల సంఖ్య కంటే పెద్దది. బీజేపీ సైతం రిజర్వేషన్లకు మద్దతు పలుకుతుంది. అది కూడా కేవలం పేదలు, సమాజంలోని అర్హులైన వర్గాలకే. దేశాన్ని పరిపాలించడమంటే పిల్లలాట కాదు అని రాహుల్‌జీ గ్రహించాలి. బిహార్‌లో కాంగ్రెస్ ఓడిపోతుందని తెలిసే రాహుల్ గాంధీ ఈసీ వంటి రాజ్యాంగబద్ధ సంస్థలపై విమర్శల బురద చల్లుతున్నారు. ఎన్నికల్లో గెలవలేమని తెలిసే రాహుల్ రెండ్రోజుల క్రితం చేపలు పట్టేందుకు చెరువులో దూకారు'' అని రాజ్‌నాథ్ ఎద్దేవా చేశారు. ఆర్జేడీ పార్టీపైనా విమర్శలు చేశారు. ''మేం అభివృద్ధి అంశాలపై మాట్లాడుతుంటే వీళ్లేమో నాటు తుపాకుల గురించి మాట్లాడుతున్నారు. అధికారంలో ఉన్నకాలంలో అవినీతిలో కూరుకుపోయినా ఆర్జేడీ వాళ్లకు సిగ్గురాలేదు. మళ్లీ మీ మద్దతు కావాలంటే ఓటర్ల ఇంటింటికీ ప్రచారం చేస్తున్నారు. మా నేత నితీశ్ కుమార్‌పై ఒక్క అవినీతి కేసు కూడా లేదు. సరిహద్దు ప్రాంతాల్లో మెరుగైన రోడ్లు ఉండాలని కాంగ్రెస్ ఏనాడూ భావించలేదు. బిహార్‌లో బీజేపీ కుల, మత, ప్రాంతీయ రాజకీయాలు ఎప్పుడూ చేయలేదు. అభివృద్ధి చెందిన బిహార్‌ను అవతరింపజేసేందుకు మా కూటమి మాత్రమే కృషిచేస్తుంది'' అని రాజ్‌నాథ్ అన్నారు.

సినిమా టికెట్ ధరలు మరీ అంతెక్కువా?

- వాటర్ బాటిల్ వంద రూపాయలా?
- కాఫీ ఏడు వందలా?
- ధరలు ఇంతింత ఉంటే భవిష్యత్‌లో మల్టీప్లెక్స్‌లకు ఎవరూ రారు
- అధిక ధరలపై సుప్రీంకోర్టు సీరియస్

న్యూఢిల్లీ: సినిమా చూసేటప్పుడు అందులోని సీన్స్ చూసి అబ్బో అనాల్సిన ప్రేక్షకులు కౌంటర్ వద్దే టికెట్ ధర చూసి అబ్బో అంటున్న వైనంపై సర్వోన్నత న్యాయస్థానం సైతం విస్మయం వ్యక్తంచేసింది. సినిమా టికెట్ మాత్రమే కాదు విరామ సమయాల్లో విక్రయించే వాటర్ బాటిల్, కాఫీల ధరలు మండిపోతుండంపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తంచేసింది. సహేతుకమైన ధరలు ఉంటేనే ప్రేక్షకులు మల్టీప్లెక్స్‌ల దాకా వస్తారని, లేదంటే హాల్స్ ఖాళీగా మారిపోతాయని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం హెచ్చరించింది. ''మల్టీప్లెక్స్‌లలో సినిమా చూడాలనే ధోరణి తగ్గుతున్న తరుణమిది. ఈ సమయంలో సినిమా టికెట్లు, విరామ సమయాల్లో తినుబండారాల, పానీయాలను అందుబాటు ధరల్లో ఉంచి జనం హాళ్లకు వచ్చేలా చూసుకోండి. లేదంటే హాళ్లు ఖాళీగా మారడం ఖాయం. సినిమా టికెట్ ధర రూ.200 దాటకుండా చూసుకోండంటూ కర్ణాటక హైకోర్టు డివిజన్ బెంచ్ ఇచ్చిన తీర్పుతో మేం కూడా ఏకీభవిస్తున్నాం'' అని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. సినిమా టికెట్ ధర రూ.200 మించకూడదని కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాల్‌చేస్తూ మల్టీప్లెక్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా గతంలో రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించడం తెల్సిందే. అయితే ఏకసభ్య ధర్మాసనం మల్టీప్లెక్స్ సంఘానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చింది. తర్వాత ఈ కేసు హైకోర్టు డివిజన్ బెంచ్ చెంతకు రాగా రూ.200 పరిమితి నిబంధన అమలుపై తాత్కాలిక స్టే విధించింది. కానీ మల్టీప్లెక్స్‌లకు కఠిన నిబంధనలను వర్తింపజేసింది. విక్రయించే ప్రతి టికెట్ వివరాలు నమోదుచేయాలని, ఆడిటింగ్ తప్పనిసని అని సూచించింది. దీనిపై మల్టీప్లెక్స్ సంఘం చివరకు సుప్రీంకోర్టును ఆశ్రయించింది.

లాయర్, జడ్జి మధ్య వాదోపవాదనలు

ఈ కేసులో మల్టీప్లెక్స్ తరఫు న్యాయవాది ముకుల్ రోహత్గీ, జస్టిస్ విక్రమ్‌నాథ్ మధ్య వాదోపవాదనలు జరిగాయి. ''వాటర్ బాటిల్‌కు రూ.100 ఏంటి? కాఫీకి రూ.700 వసూలుచేస్తారా?'' అని జడ్జి అన్నారు. దీనిపై లాయర్ రోహత్గీ అడ్డుతగిలారు. '' తాజ్ హోటల్‌లో కాఫీకి రూ.1,000 వసూలు చేస్తున్నారు. దీనిపై మీరు పరిమితి విధించారా? ఇది అతిథ్యం, సౌకర్యానికి సంబంధించిన విషయం'' అని అన్నారు. దీనిపై జడ్జి స్పందించారు. '' ఇలాగే అధిక ధరలుంటే మల్టీప్లెక్స్‌లకు ఎవరూ రారు''అని అన్నారు. దీంతో న్యాయవాది '' ఖాళీగా ఉండే ఉండనివ్వండి. మల్టీప్లెక్స్‌లకు రాకుంటే నష్టమేమీ లేదు. ఈ తరహా ధరలు మల్టీప్లెక్స్‌లోనే ఉంటాయి. రేటు ఎక్కువ అనుకునే వాళ్లు సాధారణ థియేటర్‌కు వెళ్తారు'' అని అన్నారు. దీంతో జడ్జి 'అసలు ఇప్పుడు అలాంటి థియేటర్లు పెద్దగా లేవు కదా'' అని అన్నారు. ఈ అంశంపై తదుపరి వాదనలను న్యాయస్థానం నవంబర్ 25వ తేదీకి వాయిదావేసింది.

అమెరికాలో 'అహ్మదాబాద్' ఘటన

- గాల్లోకి ఎగిరిన కొన్ని సెకన్లకే కుప్పలికూన కార్గో విమానం
- 9 మంది దుర్మరణం
- పలువురి జాడ గల్లంతు
- లూయిస్‌విల్లే ఎయిర్‌పోర్ట్‌లో ఘోరం

లూయిస్‌విల్లే: ఇటీవల అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి గాల్లోకి ఎగిరిన విమానం సెకన్ల వ్యవధిలో కుప్పకూలిన తరహాలోనే అమెరికాలో ఒక సరకు రవాణా విమానం హఠాత్తుగా కుప్పకూలి పలువురి ప్రాణాలు బలితీసుకుంది. ప్రమాదంవేళ విమానంలోని 1,44,000 లీటర్ల ఇంధనం ఒకేసారి భగ్గున మండటంతో సమీప ప్రాంతాలు మంటల్లో చిక్కుకుపోయాయి. కెంటకీ రాష్ట్రంలోని అతిపెద్ద సిటీ అయిన లూయిస్‌విల్లేలోని మొహమ్మద్ అలీ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వే సమీప ప్రాంతంలో ఈ ఘోర విమాన ప్రమాదం సంభవించింది. విమానం కూలిన ఘటనలో ఇప్పటిదాకా 9 మంది మృతదేహాలను గుర్తించారు. కుప్పకూలాక అగ్నిగుండంలా మారిన విమాన శకలాలు ఎదురుగా ఉన్న పరిశ్రమలు, జనావాసాలపై పడటంతో ఇంకా ఎంత మంది మరణించిఉంటారనేది ఇంకా తెలియరాలేదు. పలువురి జాడ గల్లంతైంది. విషయం తెల్సి రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను ఆర్పుతున్నాయి. విమానం గాల్లోకి ఎగిరే సమయానికి ఎడమ ఇంజన్ నుంచి మంటలు రావడంతో విమానం సెకన్లలో మృత్యుశకటంగా మారిందని తెలుస్తోంది.

అసలేం జరిగింది?

లూయిస్‌విల్లే ఎయిర్‌పోర్ట్ సమీపంలో యూపీఎస్ కంపెనీకి అతిపెద్ద కార్గో 'యూపీఎస్ వరల్డ్‌పోర్ట్' హబ్ ఉంది. సరకు ఎగుమతి, దిగుమతి కోసం రోజూ 300 సరకు రవాణా విమానాలు ఇక్కడికి వచ్చిపోతుంటాయి. గంటకు 4,00,000 ప్యాకెట్ల సామర్థ్యంతో ఈ హబ్ పనిచేస్తుంది. ఇక్కడి నుంచి సరకుతో మెక్‌డోనెల్ డగ్లస్ ఎం-11ఎఫ్ రకం సరకు రవాణా విమానం స్థానికకాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం 5.15 గంటలకు ఎయిర్‌పోర్ట్ నుంచి బయల్దేరింది. టేకాఫ్ తర్వాత విమానం కేవలం 175 అడుగుల ఎత్తుకు లేవగానే విమానం మంటల్లో చిక్కుకుంది. రెప్పపాటులో విమానం పేలిపోయి శకలాలుగా ఎదురుగా ఉన్న పరిశ్రమలు, జనావాసాలపై పడింది. ఇది దగ్గర్లోని ఒక కారు డ్యాష్‌క్యామ్‌లో రికార్డయింది. కూలిన విమానం 34 ఏళ్ల పాతదని సంస్థ రికార్డులు చెబుతున్నాయి.

రెండో 'సరోగసీ' బిడ్డపై సమీక్షించనున్న సుప్రీం

న్యూఢిల్లీ: రెండో దఫా సరోగసీ ద్వారా బిడ్డను కనేందుకు చట్టం అడ్డు తగులుతున్న నేపథ్యంలో ఈ అంశాన్ని పరిశీలించేందుకు సుప్రీంకోర్టు ముందుకొచ్చింది. ఇప్పటికే సాధారణంగా లేదా దత్తత లేదా సరోగసీ ద్వారా భార్యాభర్తలకు ఒక బిడ్డ ఉంటే మరో బిడ్డను సరోగసీ ద్వారా పొందేందుకు చట్టం ఒప్పుకోదు. దీంతో రెండో బిడ్డనూ సరోగసీ ద్వారా కనేందుకు అవకాశం ఇవ్వాలంటూ దాఖలైన పిటిషన్‌ను పరిశీలించేందుకు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం అంగీకారం తెలిపింది. పౌరుల సంతాన భాగ్య హక్కులను ప్రభుత్వాలు ఏ విధంగా సరోగసీ వంటి చట్టాల ద్వారా అడ్డుకోగలవు? అనే కోణంలో కేసును పరిశీలించాలని ధర్మాసనం నిర్ణయించింది. అయితే జనభారతంగా దేశం మారిన నేపథ్యంలో అధిక సంతానం కట్టడి ఉద్దేశంతోనే ప్రభుత్వాలు ఇలా రెండో సరోగసీ బిడ్డకు అడ్డు చెబుతున్నాయని, ఈ కోణంలో తాము ప్రభుత్వంతో ఏకీభవిస్తున్నామని జస్టిస్ నాగరత్న వ్యాఖ్యానించారు. అయితే పౌరుల వ్యక్తిగత జీవితాలు, తమ వారసుల పుట్టుక నిర్ణయాలపై ప్రభుత్వం జోక్యం చేసుకోజాలదని లాయర్ వాదించారు.

కేంద్ర - రాష్ట్ర సంబంధాలు

అంతరాష్ట్ర మండలిని ఎప్పుడు ఏర్పాటు చేశారు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

కేంద్ర ప్రభుత్వం 2017 జూలై 1 నుంచి గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (జీఎస్‌టీ)ను ప్రవేశపెట్టింది. దీన్ని 101వ రాజ్యాంగ సవరణ చట్టం 2016 ద్వారా ఒక దేశం - ఒక పన్ను నినాదంతో అమలు చేసింది.

పరిపాలనా సంబంధాలు..

కేంద్ర, రాష్ట్రాల మధ్య సాధారణ పరిస్థితుల్లో ఉండే పరిపాలనా సంబంధాల గురించి విస్తృతంగా IXవ భాగంలో 256 నుంచి 263 వరకు ప్రకరణల్లో పొందుపరిచారు. ఈ సంబంధాలనే మునిసిపల్ సంబంధాలు అని కూడా అంటారు. దైనందిన పరిపాలన అంశాలను కూడా కేంద్ర ప్రభుత్వం నియంత్రిస్తుంది.

ప్రకరణ 256 ప్రకారం ప్రతి రాష్ట్ర ప్రభుత్వం కార్యనిర్వహణాధికారాలను పార్లమెంటు చేసిన చట్టాలకు లోబడి వినియోగించాలి. దీని కోసం రాష్ట్రాలకు కొన్ని పరిపాలనా ఆదేశాలను కేంద్రం జారీ చేయొచ్చు.

ప్రకరణ 257 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వాహణ అధికారాలను కేంద్రం నియంత్రించవచ్చు. రాష్ట్రాలు వాటి అధికారాలను వినియోగించుకునే సందర్భంలో అవి కేంద్ర ప్రభుత్వ అధికారాలను ప్రశ్నించే విధంగా ఉండకూడదు. రైల్వేలు, టెలికమ్యూనికేషన్లు తదితర కేంద్ర ప్రభుత్వ ఆస్తులను రాష్ట్రాలు పరిరక్షించాలి. వాటి పరిరక్షణకు అయ్యే ఖర్చును కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు తిరిగి చెల్లిస్తుంది.

ప్రకరణ 258 ప్రకారం సంబంధిత రాష్ట్ర గవర్నర్ అంగీకారంతో కేంద్ర ప్రభుత్వానికి చెందిన కొన్ని పాలనా విధులను షరతులతో లేదా షరతులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్రపతి బదలాయించవచ్చు.

ప్రకరణ 258ఎ ప్రకారం కేంద్ర ప్రభుత్వ సమ్మతితో (షరతులతో లేదా షరతులు లేకుండా) రాష్ట్ర ప్రభుత్వ పాలనా విధులను కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర గవర్నర్ బదలాయించవచ్చు. ప్రకరణ 258ఎ లోని అంశాలను 1956లో 7వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.

ప్రకరణ 259ని 1956లో 7వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు.

ప్రకరణ 260 ప్రకారం భారత ప్రభుత్వం ఒక ఒప్పందం ద్వారా భారత్ బయట ఉన్న భూభాగాల పరిపాలనను చేపట్టవచ్చు.

ప్రకరణ 261 ప్రకారం దేశంలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు జారీ చేసిన ధ్రువపత్రాలు, పబ్లిక్ రికార్డులను న్యాయతీర్పులపై నమ్మకం ఉంచి గౌరవించాలి.

నదీ జలాల వివాదాలు..

ప్రకరణ 262(1) ప్రకారం అంతర్రాష్ట్ర నదీ జలాలు, నదీ లోయలకు చెందిన జలాల వినియోగం, పంపిణీ, నియంత్రణకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడానికి పార్లమెంటు ప్రత్యేక ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేయవచ్చు.

ప్రకరణ 262(2) ప్రకారం నదీ జలాల వినియోగానికి సంబంధించి ఫిర్యాదులను లేదా వివాదాలను విచారించే అధికారం సుప్రీంకోర్టు లేదా మరేదైనా న్యాయస్థానం పరిధి నుంచి మినహాయిస్తూ చట్టం చేసే అధికారం పార్లమెంటుకు ఉంటుంది. 1956లో పార్లమెంటు అంతర్రాష్ట్ర నదీ జలాల చట్టాన్ని రూపొందించింది. దీని ప్రకారం అంతర్ రాష్ట్ర నదీ జలాల వివాదాల పరిష్కారానికి ప్రత్యేక ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేస్తారు.

అంతర్రాష్ట్ర మండలి:

ప్రకరణ 263 ప్రకారం భారత రాష్ట్రపతి ఒక అంతర్రాష్ట్ర మండలిని ఏర్పాటు చేయవచ్చు. దీనికి హోదారీత్యా ప్రధానమంత్రి అధ్యక్షులుగా ఉంటారు. అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు,కేంద్రపాలిత ప్రాంతాల పాలకులు ఇందులో సభ్యులుగా ఉంటారు. అంతర్రాష్ట్ర వివాదాలకు సంబంధించిన అంశాలను విచారణ చేసి సలహాలు ఇస్తారు. అంతర్రాష్ట్ర మండలిని మొదటిసారిగా 1990లో ఏర్పాటు చేశారు.

ఆర్థిక సంబంధాలు

రాజ్యాంగంలోని 12వ భాగంలో 264 నుంచి 300 వరకు ఉన్న ప్రకరణలు కేంద్ర, రాష్ట్రాల మధ్య ఆర్థిక, ఆస్తుల ఒప్పందాలు మొదలైన అంశాల గురించి ప్రస్తావించారు.

పన్నుల విభజన:

కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నుల విధింపునకు సంబంధించి కచ్చితమైన విభజన చేశారు. **కేంద్ర పరిధిలోకి వచ్చే పన్నులు:**

- వ్యవసాయేతర ఆదాయంపై పన్ను
- ఎగుమతి, దిగుమతి సుంకాలు
- పొగాకుపై ఎక్సైజ్ సుంకం
- కార్పొరేషన్ పన్ను
- మూలధన విలువపై పన్ను
- వ్యవసాయేతర ఎస్టేట్‌లపై పన్ను
- వారసత్వ పన్ను
- అంతర్రాష్ట్ర రవాణా పన్ను
- స్టాక్ మార్కెట్, స్టాక్ ఎక్స్ఛేంజ్ పన్ను
- చెక్కులు, ప్రామీసరి నోట్లు, బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజ్, ఇన్సూరెన్స్ పాలసీల బదిలీలపై పన్ను
- వార్తా పత్రికలపై అమ్మకం పన్ను, ప్రకటనలపై పన్ను
- అంతర్రాష్ట్ర వ్యాపారంలో విధించే అమ్మకం పన్ను
- అంతర్రాష్ట్ర వాణిజ్యంలో సరకులపై విధించే పన్ను
- సర్వీసులపై పన్ను
- వ్యవసాయేతర భూముల వారసత్వ బదలాయింపు పన్ను

రాష్ట్ర జాబితాలో 45 నుంచి 63 వరకు ఉన్న ఎంట్రీలు, 66వ అంశంతో కలిపి మొత్తం 20 అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం పన్నులు విధించవచ్చు. **అవి:**

- భూమి శిస్తు
- వ్యవసాయ భూములపై వారసత్వ పన్ను
- స్థిరాస్థులపై పన్ను (భూములు, భవనాలు)
- మద్యపానంపై పన్ను
- విద్యుత్ వినియోగం, అమ్మకంపై పన్ను
- ప్రకటనలపై పన్ను
- మోటారు వాహనాలపై పన్ను
- టోల్ టాక్స్ ❖ కస్టడీ పన్నులు
- కేంద్ర జాబితాలోని డాక్యుమెంట్లు మినహా మిగతా వాటిపై స్టాంపు డ్యూటీ
- వ్యవసాయ ఆదాయంపై పన్ను
- వ్యవసాయ భూములపై ఎస్టేట్ పన్ను
- ఖనిజాలపై పన్ను
- స్థానిక ప్రాంతాల్లోకి రవాణా అయ్యే వస్తువులపై పన్ను (ఆక్ట్రాయ్)
- వాణిజ్య పన్ను
- రోడ్డు, జల రవాణాలపై పన్ను
- పశువులపై పన్ను
- వృత్తి పన్ను
- వినోదపు పన్నులు
- రాష్ట్ర జాబితాలోని అంశాలకు సంబంధించిన ఫీ

ఉమ్మడి జాబితాలోని ఎంట్రీ నంబర్లు 35, 44, 47లలో ఉన్న అంశాలపై పార్లమెంటు, రాష్ట్ర శాసన శాఖలు పన్నులు విధించవచ్చు. **అవి:**

- యాంత్రిక శక్తి ఆధారంగా పనిచేసే వాహనాలపై పన్ను
- స్టాంప్ డ్యూటీస్
- మూడో జాబితాలో పేర్కొన్న వాటిపై వసూలు చేసే ఫీ

అవశిష్ట పన్నులు: కేంద్ర, రాష్ట్ర, ఉమ్మడి జాబితాల్లో పేర్కొనని అంశాలపై కేంద్రం పన్నులు విధించవచ్చు. **అవి:**

- బహుమతి పన్ను ❖ సంపద పన్ను
- వ్యయ పన్ను

ప్రకరణ 265 ప్రకారం చట్టబద్ధత లేకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలాంటి పన్నులు విధించరాదు. అయితే ఫీ వసూలు చేయవచ్చు.

ప్రకరణ 266 ప్రకారం కేంద్ర సంఘటిత నిధి, రాష్ట్ర సంఘటిత నిధి, కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ పద్దులు ఉంటాయి.

కేంద్ర సంఘటిత నిధిలోకి కేంద్ర ప్రభుత్వానికి వచ్చే అన్ని ఆదాయాలను, రుణాలను జమ చేస్తారు. అదేవిధంగా రాష్ట్ర సంఘటిత నిధిలోకి రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చే అన్ని ఆదాయాలను జమ చేస్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పద్దుల్లోకి ప్రజల పొదుపు మొత్తాలను జమ చేస్తారు. **ఉదా:** ప్రావిడెంటు ఫండ్, పోస్టల్ సేవింగ్స్, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన పొదుపు పత్రాల ద్వారా వచ్చిన మొత్తం.

ప్రకరణ 267(1) ప్రకారం కేంద్ర ఆగంతుక నిధి, రాష్ట్ర ఆగంతుక నిధి ఉంటాయి. ఊహించని ఖర్చులను ముఖ్యంగా.. ప్రకృతి వైపరీత్యాల ద్వారా జరిగిన నష్టం, ఖర్చులను భరించడానికి రాష్ట్రపతి, గవర్నర్ పేరుతో ఆగంతుక నిధిని నిర్వహిస్తారు. పార్లమెంటు లేదా రాష్ట్ర శాసనసభల ఆమోదానికి లోబడి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ నిధులను నిర్వహిస్తాయి. కేంద్ర ఆగంతుక నిధిని 1957లో భారత ఆగంతుక నిధి చట్టం ద్వారా ఏర్పాటు చేశారు.

ప్రకరణ 268: కేంద్ర రాష్ట్రాల మధ్య వనరుల విభజన: కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల విభజనకు సంబంధించి మౌలిక రాజ్యాంగంలో ప్రస్తావించిన అంశాలకు భారీ మార్పులు చేశారు. 2000లో 80వ, 2003లో 88వ రాజ్యాంగ సవరణల ద్వారా ఈ మార్పులు చేశారు.

10వ ఆర్థిక సంఘం సిఫారసు మేరకు 80వ రాజ్యాంగ సవరణ చేశారు. దీని ప్రకారం కేంద్రానికి వచ్చిన పన్నుల వాటాలో 29 శాతం రాష్ట్రాలకు ఇవ్వాలి. ఈ పద్ధతినే 'ప్రత్యామ్నాయ నిధుల బదిలీ' అంటారు. ఇది 1996 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. దీని ద్వారా కేంద్ర పన్నులైన కార్పొరేషన్ టాక్స్, ఎక్సైజ్ సుంకాల్లో రాష్ట్రాలకు కూడా వాటా ఉంటుంది.

2004లో 88వ రాజ్యాంగ సవరణ ద్వారా ప్రకరణ 266(ఎ)లో సర్వీస్ టాక్స్ అంశాన్ని చేర్చారు. దీన్ని కేంద్ర ప్రభుత్వం విధిస్తుంది. వసూలైన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్రాలు పంచుకుంటాయి.

ప్రకరణ 268 ప్రకారం కొన్ని పన్నులను కేంద్ర ప్రభుత్వం విధిస్తుంది. కానీ, రాష్ట్ర ప్రభుత్వాలు వసూలు చేసి రాష్ట్ర ప్రభుత్వాలే తీసుకుంటాయి.

ఉదాహరణలు:

- బిల్స్ ఆఫ్ ఎక్స్ఛేంజ్
- చెక్కులు
- ప్రామిసరీ నోటు
- బీమా పాలసీ బదలాయింపు
- కంపెనీ షేర్ల బదలాయింపు
- ఆల్కహాల్ ఆధారంగా తయారు చేసిన ఔషధాలు
- టాయ్‌లెట్ సంబంధ వస్తువులపై ఎక్సైజ్ డ్యూటీలు, స్టాంపు డ్యూటీలు

ప్రకరణ 268ఎ ప్రకారం సర్వీస్ టాక్స్ కేంద్ర ప్రభుత్వమే విధిస్తుంది. దీన్ని కేంద్రమే వసూలు చేస్తుంది. వసూలైన మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పంచుకుంటాయి.

ప్రకరణ 269 ప్రకారం కేంద్రం విధించి,కేంద్రమే వసూలు చేసి, రాష్ట్రాలకు బదలాయించే పన్నులు: అంతర్రాష్ట్ర రవాణాలో జరిగే వస్తువుల అమ్మకం, కొనుగోలుపై విధించే పన్నులను కేంద్రమే విధించి, వసూలు చేసి, రాష్ట్రాలకు బదలాయిస్తుంది.

ప్రకరణ 270 ప్రకారం కొన్ని పన్నులను కేంద్రమే విధించి, కేంద్రమే వసూలు చేస్తుంది. వసూలు చేసిన మొత్తం కేంద్ర, రాష్ట్రాల మధ్య విభజిస్తారు. **ఉదా:** వ్యవసాయేతర ఆదాయపన్ను,సెంట్రల్ ఎక్సైజ్, రాష్ట్ర జాబితాలో ప్రస్తావించని ఇతర పన్నులు.

ప్రకరణ 271 ప్రకారం కొన్ని పన్నులపై సర్‌చార్జీలు: పార్లమెంటు ఒక చట్టం ద్వారా **ప్రకరణ 269, 270**లలో ప్రస్తావించిన పన్నులపై సర్‌చార్జీలు విధించొచ్చు.

ప్రకరణ 272లో ఉన్న అంశాలను 2000లో 80వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు.

ప్రకరణ 273 ప్రకారం అసోం, బిహార్, ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు జనుము, జనుము ఆధారిత ఎగుమతి సుంకాలకు సంబంధించి ప్రత్యామ్నాయ గ్రాంటులను కేంద్ర ప్రభుత్వం ఇస్తుంది.

ప్రకరణ 274 ప్రకారం రాష్ట్రాలకు సంబంధించిన పన్నుల విషయంలో పార్లమెంటులో బిల్లులు ప్రవేశపెట్టడానికి రాష్ట్రపతి పూర్వానుమతి అవసరం.

ప్రకరణ 275 (1) ప్రకారం సహాయ నిధులు (Grant-in-aid): కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు ప్రత్యేక అవసరాల అభివృద్ధి కోసం సహాయక నిధులను ఇస్తుంది. ఇవి రెండు రకాలు.. 1. చట్టబద్ధ గ్రాంటులు, 2. విచక్షణ గ్రాంటులు.

చట్టబద్ధ గ్రాంటులు అంటే ఆర్థిక సహాయం అవసరమైన రాష్ట్రాలకు మాత్రమే పార్లమెంటు ఒక చట్టం ద్వారా కేంద్ర ఆర్థిక సంఘం సిఫారసుల మేరకు సాధారణ అవసరాలు, ప్రత్యేక అవసరాలకు (**ఉదా:** ఎస్సీ, ఎస్టీల సంక్షేమం) నిధులు ఇస్తుంది.

ప్రకరణ 275(1)(ఎ) ప్రకారం ప్రత్యేక రాష్ట్ర ప్రతిపత్తి ఉన్న గిరిజన ప్రాంతాల్లో సహాయక గ్రాంట్లు మొత్తం ఆ రాష్ట్రానికే చెల్లిస్తారు.

ప్రకరణ 275(2) ప్రకారం ఆర్థిక సంఘం సలహా మేరకు రాష్ట్రపతి సహాయక గ్రాంట్లను సంబంధిత అధికారులకు మంజూరు చేస్తారు. దీనికి సంబంధించి పార్లమెంటుకు శాసనం చేసే అధికారం కూడా ఉంది.

ప్రకరణ 276 ప్రకారం వ్యక్తి, వ్యాపారం, ఉపాధి అంశాల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం లేదా స్థానిక ప్రభుత్వాలు వ్యక్తులపై రూ. 2500లకు మించకుండా వృత్తి పన్ను విధించవచ్చు.

ప్రకరణ 279 ప్రకారం పన్నుల ద్వారా వసూలైన ఆదాయాన్ని నికర ఆదాయంగా నిర్ణయిస్తారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ దీనికి సంబంధించి నికర ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని ఇస్తారు.

ప్రకరణ 280 ప్రకారం ఆర్థిక సంఘం ఉంటుంది. భారత రాష్ట్రపతి ప్రతి అయిదేళ్లకు ఆర్థిక సంఘాన్ని ఏర్పరుస్తారు. ఇందులో ఒక చైర్మన్, నలుగురు సభ్యులుంటారు. ఇది కేంద్ర, రాష్ట్రాల మధ్య వనరుల విభజనపై సిఫారసులు చేస్తుంది.

ప్రకరణ 281 ప్రకారం ఆర్థిక సంఘం తన సిఫారసులను రాష్ట్రపతికి సమర్పిస్తుంది. ఆ నివేదికను పార్లమెంటు ముందు ఉంచుతారు.

ప్రకరణ 282 ప్రకారం ప్రజా సౌకర్యార్థం ఏ రాష్ట్రానికైనా కేంద్ర ప్రణాళికా సంఘం సిఫారసు మేరకు పార్లమెంటు నిధులు ఇస్తుంది. వీటిని 'విచక్షణా గ్రాంటులు' అంటారు.

ప్రకరణ 285 ప్రకారం కేంద్ర ఆస్తులపై రాష్ట్ర ప్రభుత్వం పన్నులు విధించరాదు.

ప్రకరణ 286 ప్రకారం సరకుల క్రయ విక్రయాలకు సంబంధించిన పన్ను విధింపుపై పరిమితులు ఉంటాయి. రాష్ట్రం వెలుపల జరిగే వస్తువుల క్రయ విక్రయాలు, భారతదేశంలో దిగుమతి, ఎగుమతి చేసే వస్తువులపై రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు విధించకూడదు.

ప్రకరణ 287 ప్రకారం విద్యుత్‌పై పన్ను మినహాయింపు ఉంటుంది.

ప్రకరణ 292 ప్రకారం దేశంలో లేదా విదేశాల్లో కేంద్రం రుణాలు తీసుకోవచ్చు.

ప్రకరణ 293 ప్రకారం రాష్ట్రాలకు దేశం లోపల మాత్రమే రుణాలను తీసుకునే అధికారం ఉంది.

బోధన పద్ధతులు

ఏ విధానంలో విద్య జీవితాంత ప్రక్రియ?

టెట్/డీఎస్సీ - ప్రత్యేకం

తెలుగు - ఎస్ఏ/ఎస్జీటీ

డీఎస్సీ, టెట్+ టీఆర్‌టీ సహా అన్ని రకాల ఉపాధ్యాయ పోటీ పరీక్షలకు తెలుగు బోధన పద్ధతులు తప్పనిసరి అంశం. కాబట్టి అభ్యర్థులు తెలుగు మెథడాలజీపై ప్రత్యేక దృష్టిని సారించాలి. డీఎస్సీలో ఏ విభాగాన్నీ అశ్రద్ధ చేయరాదు. ఎస్‌జీటీ, లాంగ్వేజ్ పండిట్ తెలుగు అభ్యర్థులు డీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాన్ని సేకరించుకొని చదవాలి. గణితం, ఫిజిక్స్, బయాలజీ, సోషల్ స్టడీస్, ఇంగ్లిష్, తెలుగు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు ప్రిపేరయ్యే అభ్యర్థులు విధిగా బీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాన్ని అధ్యయనం చేయాలి. గత టెట్, డీఎస్సీ పరీక్షల్లో తెలుగు అకాడమీ పుస్తకాల నుంచే ఎక్కువ ప్రశ్నలు వచ్చాయి. ఇక్కడ మనం డీఎడ్, బీఎడ్ తెలుగు అకాడమీ పుస్తకాల్లోని **'బోధన ప్రక్రియలు-ఆధునిక బోధన పద్ధతులు'** అధ్యాయంలో వచ్చే ప్రశ్నలను సమగ్రంగా తెలుసుకుందాం.

మాదిరి ప్రశ్నలు

1. **పిల్లల్లో ఆధ్యాత్మిక దృక్పథాన్ని పెంపొందించి వారు మొక్కల నుంచి వచ్చే పుష్పాల సౌరభాన్ని ఆస్వాదించేటట్లు చేయాలని అభిలషించినవారు?**
   1) ఫ్రోబెల్ 2) కిల్‌ప్యాట్రిక్
   3) మాంటిసోరి 4) కాల్డ్వెల్ కుక్
2. **విద్యార్థుల్లో అంతర్లీనంగా ఉన్న శక్తి యుక్తులకు మెరుగుపెట్టి పిల్లలను దైవ స్వరూపులుగా తీర్చిదిద్దాలని ఎవరు కోరుకున్నారు?**
   1) మాంటిసోరి 2) స్టాన్లీహాల్
   3) కాల్డ్వెల్ కుక్ 4) ఫ్రోబెల్
3. **'పిల్లలు స్వభావరీత్యా మృదు స్వభావులైనందువల్ల వారిలో శీలనిర్మాణం సులభంగా చేయవచ్చని' విశ్వసించింది ఎవరు?**
   1) కిల్‌ప్యాట్రిక్ 2) ఫ్రోబెల్
   3) మాంటిసోరి 4) కాల్డ్వెల్ కుక్
4. **కిండర్‌గార్టెన్ విధానానికి ఏ సూత్రం ఆధారం?**
   1) స్వయం అధ్యయనం
   2) కృత్యాలను స్వయంగా నిర్వహించడం
   3) గుణాత్మక విద్యా సాధన
   4) స్వయం వివర్తనం- స్వయంప్రకటన
5. **ఫ్రోబెల్ కిండర్‌గార్టెన్ విధానం భావనలను ఏ పుస్తకంలో పొందుపరిచారు?**
   1) ది టెక్నాలజీ ఆఫ్ టీచింగ్
   2) టాక్సానమీ ఆఫ్ ఎడ్యుకేషనల్ ప్లాన్
   3) ది ఎడ్యుకేషన్ అండ్ ప్లాన్
   4) ది ఎడ్యుకేషన్ అండ్ ఫ్రీడమ్
6. **'మాంటిసోరి పద్ధతి ఒక బోధన పద్ధతి మాత్రమే కాదు, అది విద్యారంగంలో ఒక విప్లవాత్మక ఆలోచనా విధానం' అని ఎవరు అభిప్రాయపడ్డారు?**
   1) ఫ్రోబెల్ 2) గిజూ భాయ్
   3) పెస్టాలజీ 4) జాన్‌డ్యూయి
7. **ఏ విధానం 'శాస్త్రీయ ప్రపంచానికి సంబంధించిన నూతన సత్యాలను ప్రతిపాదించడంతోపాటు ఈనాటి సామాజిక, ఆర్థిక సమస్యలకు పరిష్కారాలను సూచిస్తుందని' గిజూభాయ్ అభిప్రాయం**
   1) క్రీడా పద్ధతి
   2) కిండర్‌గార్టెన్ పద్ధతి
   3) మాంటిసోరి పద్ధతి
   4) ప్రాజెక్టు పద్ధతి
8. **పిల్లల జ్ఞానేంద్రియ శిక్షణకు అధిక ప్రాధాన్యం ఇచ్చిన పద్ధతి?**
   1) ప్రాజెక్టు పద్ధతి 2) క్రీడా పద్ధతి
   3) కిండర్‌గార్టెన్ పద్ధతి
   4) మాంటిసోరి పద్ధతి
9. **శాస్త్రీయ దృక్పథానికి పెద్దపీట వేసిన విధానం?**
   1) డాల్టన్ పద్ధతి 2) మాంటిసోరి పద్ధతి
   3) కిండర్‌గార్టెన్ పద్ధతి
   4) ప్రాజెక్టు పద్ధతి
10. **మాంటిసోరి విధానం ప్రకారం పాఠశాల?**
    1) బాల గృహం 2) ప్రదర్శన శాల
    3) ఉద్యానవనం
    4) ఒక చిన్న ప్రపంచం
11. **మాంటిసోరి విధానంలో బోధన కోసం ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఉపకరణాలను ఏమంటారు?**
    1) ఫ్రోబెల్ కానుకలు
    2) విజ్ఞాన వాహకాలు
    3) ఉపదేశాత్మక పరికరాలు
    4) ఇంద్రియ శిక్షణ ప్రేరకాలు
12. **ఏ విధానంలో బాలలు కాలనిర్ణయ పట్టికలతోపాటు పాఠ్యప్రణాళికలనే సంకెళ్లకు దూరంగా ఉంటారు?**
    1) కిండర్‌గార్టెన్ పద్ధతి
    2) మాంటిసోరి పద్ధతి
    3) క్రీడా పద్ధతి 4) ప్రాజెక్టు పద్ధతి
13. **ఏ విధానంలో విద్య జీవితాంత ప్రక్రియ?**
    1) క్రీడా పద్ధతి 2) డాల్టన్ పద్ధతి
    3) మాంటిసోరి పద్ధతి 4) ప్రాజెక్టు పద్ధతి
14. **ఏ విధానాన్ని అనుసరించి పాఠశాలల్లో సామాజిక దృక్పథం, సామాజిక స్పృహ పెంపొందించడం జరుగుతుంది?**
    1) మాంటిసోరి 2) డాల్టన్
    3) ప్రాజెక్టు 4) కిండర్‌గార్టెన్
15. **ఏ విధానంలో పాఠశాలలోని విద్యార్థులందరూ (ధనిక, పేద తేడా లేదు) సమానులే?**
    1) డాల్టన్ పద్ధతి 2) క్రీడా పద్ధతి
    3) మాంటిసోరి పద్ధతి
    4) ప్రాజెక్టు పద్ధతి
16. **దేశకాలాలు, అవసరాలకు అనుగుణంగా మార్పులు చేర్పులకు వీలైన పద్ధతి?**
    1) కిండర్‌గార్టెన్ 2) మాంటిసోరి
    3) డాల్టన్ 4) ప్రాజెక్టు
17. **ఏ పద్ధతిలో ఉపకరణాలు ఇంద్రియ వికాసం, శబ్ద జ్ఞానం, భౌతిక వ్యాయామం, ప్రకృతి పరిచయం మొదలైన వాటిని విద్యార్థులకు సమకూరుస్తాయి?**
    1) మాంటిసోరి 2) కిండర్‌గార్టెన్
    3) డాల్టన్ 4) ప్రాజెక్టు పద్ధతి
18. **'ప్రాథమిక స్థాయిలో కృత్యాధార పద్ధతి ద్వారా జరిపే బోధన మంచి సత్ఫలితాలనిచ్చి విద్యార్థుల సర్వాంగీణ వికాసానికి తోడ్పడుతుందని' నొక్కి చెప్పిన విద్యా కమిషన్?**
    1) కొఠారి విద్యా కమిషన్
    2) మొదలియార్ విద్యా కమిటీ
    3) ఈశ్వరీభాయ్ పటేల్ విద్యా కమిటీ
    4) జాతీయ విద్యా విధానం
19. **ఏ విధానంలో విద్యార్థులకు అనుభవాల కల్పన చాలా ముఖ్యం?**
    1) ప్రాజెక్టు పద్ధతి 2) కృత్యాధార పద్ధతి
    3) బేసిక్ విద్యావిధానం
    4) కార్యక్రమయుత అభ్యసనం
20. **విద్యార్థుల శారీరక, మానసిక శక్తులను మేల్కొల్పి వారిని స్వయం అధ్యయన శీలురుగా మార్చడానికి తోడ్పడే పద్ధతి?**
    1) మాంటిసోరి పద్ధతి
    2) కిండర్‌గార్టెన్ పద్ధతి
    3) కృత్యాధార పద్ధతి
    4) ప్రాతిపదిక విద్యావిధానం
21. **ఏ విధానం ప్రాథమిక విద్యాక్షేత్రంలో గుణాత్మకతను సాధించడానికి ఎంతగానో తోడ్పడుతుందని విద్యావేత్తల అభిప్రాయం?**
    1) కృత్యాధార బోధన
    2) కిండర్‌గార్టెన్
    3) ప్రాతిపదిక విద్యావిధానం
    4) క్రీడా పద్ధతి
22. **ఒక ఉపాధ్యాయుడే పలు తరగతులకు బోధన చేయాల్సి వస్తే దాన్ని ఏమంటారు?**
    1) బృంద బోధన
    2) నియంత్రిత అధ్యయనం
    3) బహుళ తరగతి బోధన
    4) సూక్ష్మ బోధన
23. **నియోజన పద్ధతి అని దేనినంటారు?**
    1) కృత్యాధార పద్ధతి
    2) కిండర్‌గార్టెన్ పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి
    4) డాల్టన్ పద్ధతి
24. **డాల్టన్ పద్ధతిని మొదట అనుసరించిన విద్యావేత్త?**
    1) మిస్‌గల్ 2) హెలెన్‌పార్క్ హార్స్ట్
    3) కిల్‌ప్యాట్రిక్ 4) బల్లార్డ్
25. **విద్యార్థుల వైయక్తిక భేదాల కారణంగా వారు చదువులో వెనుకంజలో ఉండటం, ముందుండటం జరుగుతుందని విశ్వసించిన విద్యావేత్త?**
    1) ఫ్రోబెల్ 2) మాంటిసోరి
    3) హెలెన్‌పార్క్ హార్స్ట్ 4) మిస్‌గల్
26. **ఏ విధానంలో అన్ని పాఠ్యాంశాలపై నియోజనాలు సిద్ధం చేసి విద్యార్థులకు అందిస్తారు?**
    1) కృత్యాధార పద్ధతి 2) డాల్టన్ పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి
    4) ప్రాతిపదిక విద్యావిధానం
27. **ఏ పద్ధతిలో విద్యార్థులందరూ సక్రియాత్మక భాగస్వాములవుతారు?**
    1) డాల్టన్ పద్ధతి 2) ప్రాజెక్టు పద్ధతి
    3) చర్చా పద్ధతి 4) కృత్యాధార పద్ధతి
28. **సాధారణంగా ఉన్నత పాఠశాలల్లో ప్రతి రోజూ ఏ అధ్యయనానికి ఒక గంట సమయం కేటాయిస్తారు?**
    1) సూక్ష్మ బోధన 2) బృంద బోధన
    3) పర్యవేక్షణాత్మక అధ్యయనం
    4) కార్యక్రమయుత అధ్యయనం
29. **ఏ విధానం అమలు చేయడానికి తరగతి గదుల్లో మూల గ్రంథాలు, పరామర్శ గ్రంథాలు, నిఘంటువులు విద్యార్థులకు అందుబాటులో ఉండాలి?**
    1) పర్యవేక్షణాత్మక అధ్యయనం
    2) డాల్టన్ విధానం 3) ప్రాజెక్టు పద్ధతి
    4) కృత్యాధార బోధన
30. **పద్య బోధనకు ఉత్తమ పద్ధతి?**
    1) పూర్ణ పద్ధతి 2) ఖండ పద్ధతి
    3) పఠన పద్ధతి 4) ప్రశంసా పద్ధతి
31. **పద్యాన్ని మొత్తం తీసుకొని బోధించడాన్ని ఏమంటారు?**
    1) పఠన పద్ధతి 2) పూర్ణ పద్ధతి
    3) ఖండ పద్ధతి 4) తాత్పర్య పద్ధతి
32. **ఉపాధ్యాయుడు నూతన పదాలకు అర్థాలను ఏ పద్ధతిలో చెప్పాలి?**
    1) ప్రశ్నోత్తర పద్ధతి 2) చర్చా పద్ధతి
    3) వాక్యప్రయోగ పద్ధతి
    4) ఉదాహరణ పద్ధతి
33. **ఉపాధ్యాయుడు సంధులు, సమాసాలను బోధించేటప్పుడు ఏ పద్ధతిని అనుసరించాలి?**
    1) చర్చాపద్ధతి 2) వాక్యప్రయోగ పద్ధతి
    3) ప్రశ్నోత్తర పద్ధతి 4) ఉదాహరణ పద్ధతి
34. **పద్యంలోని కవితాశిల్పం, రసం, పాకం, అలంకారం, ధ్వని విశేషాలను బోధించ డానికి తోడ్పడే పద్ధతి?**
    1) పూర్ణ పద్ధతి 2) ప్రతిపదార్థ పద్ధతి
    3) చర్చాపద్ధతి 4) ప్రశంసా పద్ధతి
35. **బోధన సోపానాల్లో ప్రధాన సోపానం?**
    1) ప్రవేశం 2) ప్రదర్శనం
    3) పునర్విమర్శ 4) గైహికం
36. **విద్యార్థుల్లో అభ్యసన పునర్బలనానికి ఉపయోగపడే సోపానం?**
    1) పూర్వజ్ఞాన పరిశీలన
    2) ఉన్ముఖీకరణం 3) పునర్విమర్శ
    4) గైహికం
37. **ఉపాధ్యాయుడు పాఠ్యపుస్తకం చదువుతూ వివరించే పద్ధతి?**
    1) ఉపన్యాస పద్ధతి 2) పఠన పద్ధతి
    3) వివరణ పద్ధతి 4) ప్రవచన పద్ధతి
38. **ఈ పద్ధతిలో గద్య బోధన విద్యార్థులకు అంతగా ఉపయోగకరం కాదు?**
    1) ప్రవచన పద్ధతి 2) చర్చా పద్ధతి
    3) ఉపన్యాస పద్ధతి 4) కథాకథన పద్ధతి
39. **ఉపాధ్యాయుడు పాఠ్యాంశ బోధనకు ఆశించిన లక్ష్యాలు ఏ మేరకు సాధించాడో తెలుసుకోవడానికి దేన్ని చేపట్టాలి?**
    1) ఉన్ముఖీకరణం 2) పునర్విమర్శ
    3) గైహికం 4) ప్రదర్శనం
40. **ఒక నిర్దిష్ట కాలానికి సంబంధించిన భాష స్వరూప స్వభావాలను వర్ణించి, వివరించి తెలియజేసేది?**
    1) వర్ణనాత్మక వ్యాకరణం
    2) చారిత్రక వ్యాకరణం
    3) తులనాత్మక వ్యాకరణం
    4) పైవన్నీ
41. **భాష ఏర్పడినప్పటి నుంచి కాలక్రమంలో భాషలో ఏర్పడిన వివిధ మార్పులు, పరిణామాలు గుర్తించి, వివరించే వ్యాకరణం?**
    1) వర్ణణాత్మక వ్యాకరణం
    2) చారిత్రక వ్యాకరణం
    3) తులనాత్మక వ్యాకరణం
    4) రూపాత్మక వ్యాకరణం

సమాధానాలు

1) 1; 2) 4; 3) 2; 4) 2; 5) 3; 6) 2; 7) 3; 8) 4; 9) 2; 10) 1; 11) 3; 12) 2; 13) 4; 14) 1; 15) 3; 16) 2; 17) 1; 18) 4; 19)2; 20) 3; 21) 1; 22) 3; 23) 4; 24) 2; 25) 3; 26) 2; 27) 3; 28) 3; 29) 1; 30) 1; 31) 2; 32) 3; 33) 4; 34) 4; 35) 2; 36) 4; 37) 4; 38) 1; 39) 2; 40) 1; 41) 2.

విద్య, ఉద్యోగ సమాచారం

ఎస్‌వీఎన్ఐటీ, సూరత్‌లో వివిధ కొలువులు

సూరత్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌వీఎన్ఐటీ).. ఒప్పంద ప్రాతిపదికన వివిధ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 02.
» **ఖాళీల వివరాలు:** జూనియర్ రీసెర్చ్ ఫెలోలు(జేఆర్ఎఫ్)-01, ప్రాజెక్ట్ అసోసియేట్-01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఎంఈ/ఎంటెక్(మైక్రో ఎలక్ట్రానిక్స్/మైక్రో ఎలక్ట్రానిక్స్ అండ్ వీఎల్ఎస్ఐ డిజైన్/ఎంఎస్సీ ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్‌కమ్యూనికేషన్)లో ఉత్తీర్ణతతో పాటు నెట్, గేట్‌లో అర్హత సాధించి ఉండాలి.
» **వయసు:** 35 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు జూనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ. 37,000. ప్రాజెక్ట్ అసోసియేట్‌కు రూ.25,000.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** add@eced.svnit.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 13.11.2025.
» **వెబ్‌సైట్:** https://www.svnit.ac.in

ఐఐటీ ఇండోర్‌లో రీసెర్చ్ అసోసియేట్, జేఆర్ఎఫ్‌లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ఇండోర్ రీసెర్చ్ అసోసియేట్, జూనియర్ రీసెర్చ్ ఫెలోలు (జేఆర్ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 03.
» **ఖాళీల వివరాలు:** రీసెర్చ్ అసోసియేట్-01, జూనియర్ రీసెర్చ్ ఫెలో(జేఆర్ఎఫ్)-02.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో ఎంఎస్సీ(కెమిస్ట్రీ), ఎంఎస్(ఫార్మా), పీహెచ్‌డీ(కెమిస్ట్రీ)లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. నెట్, గేట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తారు.
» **వయసు:** రీసెర్చ్ అసోసియేట్‌కు 35 ఏళ్లు, జూనియర్ రీసెర్చ్ ఫెలోకు 32 ఏళ్లు ఉండాలి.
» **స్టైపెండ్:** నెలకు రీసెర్చ్ అసోసియేట్‌కు రూ.55,000, జూనియర్ రీసెర్చ్ ఫెలోకు రూ.37,000.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఈమెయిల్:** sarkard@iiti.ac.in
» **దరఖాస్తులకు చివరితేది:** 14.11.2025.
» **ఇంటర్వ్యూ తేదీ:** 17.11.2025.
» **వెబ్‌సైట్:** www.iiti.ac.in

‘అర్థశాస్త్రం అంతిమ లక్ష్యం సంక్షేమమే కావాలి’

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ ఎకానమీ

పేదరికం, నిరుద్యోగిత

1. ఎన్.ఎస్.ఎస్.ఒ. 68వ రౌండ్ గణాంకాల ప్రకారం ఛత్తీస్‌గఢ్ తర్వాత అత్యధిక పేదరికం ఉన్న రాష్ట్రం ఏది?
ఎ) బిహార్ బి) ఒడిశా
సి) జార్ఖండ్ డి) ఉత్తరప్రదేశ్
2. ప్రణాళికా సంఘం పేదరికాన్ని గణించడానికి కింది వాటిలో దేన్ని ప్రామాణిక పద్ధతిగా గుర్తించింది?
ఎ) యూనిఫాం రిఫరెన్స్ పీరియడ్
బి) మిక్స్‌డ్ రిఫరెన్స్ పీరియడ్
సి) మాడిఫైడ్ మిక్స్‌డ్ రిఫరెన్స్ పీరియడ్
డి) పైవేవీకాదు
3. పేదరికాన్ని లెక్కించడానికి తలసరి వినియోగ వ్యయం రోజుకు 1.90 డాలర్లుగా ప్రపంచ బ్యాంకు దేని ఆధారంగా నిర్ణయించింది?
ఎ) కొనుగోలు శక్తిసామ్యం
బి) ప్రజల జీవన ప్రమాణం
సి) పేదరిక స్థాయి
డి) పేదరిక అంతరం
4. పేదరికాన్ని గణించడానికి ఎన్.ఎస్.ఎస్.ఒ. 68వ రౌండ్ గణాంకాల్లో గ్రామీణ ప్రాంతాల్లో తలసరి వినియోగాన్ని నెలకు ఎంత మొత్తంగా పరిగణనలోకి తీసుకుంది?
ఎ) రూ. 750 బి) రూ. 790
సి) రూ. 805 డి) రూ. 816
5. గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక రేఖ దిగువన ఉన్న కుటుంబాలను గుర్తించేందుకు నూతన ప్రాతిపదిక రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వం ఎవరి అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసింది?
ఎ) సురేష్ టెండూల్కర్
బి) ఎన్.సి. సక్సేనా సి) రంగరాజన్
డి) పైన పేర్కొన్న ఎవరూ కాదు
6. 2011-12 గణాంకాల ప్రకారం ఏ మతానికి చెందిన వారిలో పేదరికం ఎక్కువ శాతం ఉంది?
ఎ) ముస్లింలు బి) క్రైస్తవులు
సి) జైనులు డి) బౌద్ధులు
7. 16 నుంచి 60 ఏళ్ల మధ్య వయసు కలిగి, పనిచేసే సామర్థ్యం, కోరిక ఉండి, మార్కెట్‌లో లభించే వేతనం వద్ద పనిచేయడానికి సిద్ధంగా ఉన్నవారిని ఏమని పిలుస్తారు?
ఎ) ప్రధాన శ్రామికులు
బి) పనిలో పాలు పంచుకునే రేటు
సి) శ్రామిక శక్తి డి) నిరుద్యోగులు
8. ఒక సంవత్సర కాలంలో 183 రోజులు, అంత కంటే ఎక్కువ పనిదినాలు పొందుతున్న శ్రామిక శక్తిని ఏమంటారు?
ఎ) ప్రధాన శ్రామికులు
బి) ఉపాంత శ్రామికులు
సి) నిరుద్యోగం డి) పైవన్నీ
9. పట్టణ ప్రాంతాల్లో పేదరిక రేఖ దిగువన ఉన్న కుటుంబాలను గుర్తించేందుకు నూతన ప్రాతిపదిక రూపొందించడానికి ప్రభుత్వం 2010 మే 1న ఎవరి అధ్యక్షతన కమిటీ ఏర్పాటు చేసింది?
ఎ) ఎన్.సి. సక్సేనా బి) ఎస్.ఆర్. హసీమ్
సి) రంగరాజన్ డి) వై.వి.రెడ్డి
10. ఒక దేశ ఆర్థిక ప్రగతి, ప్రజల వినియోగ స్థాయిని సూచించే కొలమానం ఏది?
ఎ) తలసరి ఆదాయం
బి) నామమాత్ర ఆదాయం
సి) ఆర్థిక అసమానతలు
డి) సంపద అసమానతలు
11. భారతదేశంలో అంత్యోదయ అన్నయోజన కార్యక్రమం ప్రారంభించడానికి అమర్త్యసేన్ ప్రతిపాదించిన ఏ భావన కారణమైంది?
ఎ) ఆర్థిక అసమానతలు
బి) పేదవారిలోనే అతి పేదవారు
సి) సంపద అసమానతలు
డి) సప్లయ్ వైపు అర్థశాస్త్రం
12. 2011 సాంఘిక - ఆర్థిక కుల గణాంకాల ప్రకారం దేశంలో వ్యవసాయదారులు ఎంత శాతం ఉన్నారు?
ఎ) 25.1 బి) 27.1
సి) 30.1 డి) 31.3
13. ఒక వ్యక్తి పనిచేయడానికి ఇష్టపడి, పనికోసం ప్రయత్నించి ఏడాది కాలం ఖాళీగా ఉండే స్థితిని ఏ విధమైన నిరుద్యోగంగా పేర్కొంటారు?
ఎ) దైనందిన నిరుద్యోగిత
బి) వారం వారీ స్థితి నిరుద్యోగిత
సి) బాహ్య లేదా సాధారణ నిరుద్యోగిత
డి) అల్ప ఉద్యోగిత
14. భారతదేశంలోని నిరుద్యోగం ప్రాథమికంగా ఏ రకమైంది?
ఎ) ప్రచ్ఛన్న నిరుద్యోగిత
బి) పరిమాణాత్మక నిరుద్యోగిత
సి) చక్రీయ నిరుద్యోగిత
డి) ఘర్షిత నిరుద్యోగిత
15. కమాండ్ ఏరియా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ లక్ష్యం ఏమిటి?
ఎ) నీటిపారుదల వినియోగం
బి) గ్రామీణ ఉపాధి
సి) గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి కల్పన
డి) గ్రామీణ ప్రాంత యువకులకు శిక్షణ
16. ‘ప్రజల భాగస్వామ్యంతో సంపూర్ణ గ్రామీణాభివృద్ధి సాధించడం’ ఏ పథకం లక్ష్యం?
ఎ) క్రాష్ స్కీం ఫర్ రూరల్ ఎంప్లాయ్‌మెంట్
బి) దుర్భిక్ష పీడిత ప్రాంతాల కార్యక్రమం
సి) సామాజిక అభివృద్ధి కార్యక్రమం
డి) 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమం
17. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పేద ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడానికి తక్కువ పరిమాణంలో రుణం, పొదుపు, విత్తపరమైన సేవలను కల్పించే విధానం?
ఎ) సూక్ష్మ విత్తం బి) ప్రాధాన్య రంగ పరపతి
సి) రికరింగ్ డిపాజిట్ పథకం
డి) పైవేవీ కాదు
18. భారత్‌లో మొదటిసారిగా కులాల వారీగా జనగణన ఎప్పుడు నిర్వహించారు?
ఎ) 1881 బి) 1891
సి) 1921 డి) 1931
19. గ్రీన్ జీడీపీ కొలమానాన్ని మొదటిసారిగా ప్రవేశపెట్టిన దేశం ఏది?
ఎ) ఇండియా బి) చైనా
సి) బ్రిటన్ డి) కెనడా
20. అర్థశాస్త్రం అంతిమ లక్ష్యం సంక్షేమమే కావాలని ప్రకటించిన ఆర్థికవేత్త?
ఎ) పాల్‌క్రూగ్‌మన్ బి) రఘురామ్ రాజన్
సి) అమర్త్యసేన్ డి) డి.ఆర్. గాడ్గిల్
21. 2011 సాంఘిక - ఆర్థిక కుల గణాంకాల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లోని మొత్తం కుటుంబాల్లో వ్యవసాయ భూమి లేని కుటుంబాలు ఎంత శాతం?
ఎ) 56 బి) 57 సి) 58 డి) 59
22. వ్యాపార కార్యకలాపాలు మందగించడం వల్ల ఏర్పడే నిరుద్యోగాన్ని ఏమంటారు?
ఎ) ప్రచ్ఛన్న నిరుద్యోగం
బి) రుతుసంబంధ నిరుద్యోగం
సి) సాంకేతికపరమైన నిరుద్యోగం
డి) చక్రీయ నిరుద్యోగం
23. 1960-61లో సగటు తలసరి వినియోగం రోజుకు 2250 కేలరీలుగా పరిగణనలోకి తీసుకొని పేదరిక రేఖ దిగువన ఉన్న ప్రజల సంఖ్యను అంచనా వేసింది ఎవరు?
ఎ) మిన్హాస్ బి) పీడీ ఓజా
సి) అహ్లూవాలియా డి) బర్ధన్
24. కింద పేర్కొన్న ఏ చర్య పేదరిక సమస్య పరిష్కారానికి దోహదపడుతుంది?
ఎ) సరళీకరణ, జీడీపీ వృద్ధికి బదులుగా పేదల అనుకూల వృద్ధి వ్యూహానికి అధిక ప్రాధాన్యం ఇవ్వడం
బి) వ్యవసాయ వృద్ధి రేటు పెంపు
సి) అసంఘటిత రంగంలో ఉత్పాదక, ఉపాధి నాణ్యత పెంపు
డి) పైవన్నీ
25. ఎన్డీఏ ప్రభుత్వం ‘పది మిలియన్ ఉపాధి అవకాశాల లక్ష్యం’ దిశగా ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్రూప్ అధ్యక్షులు ఎవరు?
ఎ) ఎస్.పి. గుప్తా బి) రంగరాజన్
సి) డి. సుబ్బారావు డి) వై.వి. రెడ్డి
26. 1972-73లో ఉపాధి హామీ పథకాన్ని మొదటిసారిగా ప్రవేశపెట్టిన రాష్ట్రం?
ఎ) బిహార్ బి) గుజరాత్
సి) మహారాష్ట్ర డి) ఆంధ్రప్రదేశ్
27. 1989 ఏప్రిల్ 28న ‘జవహర్ రోజ్‌గార్ యోజన’ ప్రారంభిస్తున్నట్లు ప్రకటించినవారు?
ఎ) ఇందిరాగాంధీ బి) రాజీవ్‌గాంధీ
సి) ప్రణబ్ ముఖర్జీ డి) వి.పి. సింగ్
28. పేదరికం అంటే ...?
ఎ) నిరుద్యోగిత బి) నిరక్షరాస్యత
సి) ఎంచుకునే స్వాతంత్ర్యం లేకపోవడం
డి) ప్రాథమిక అవసరాల అందుబాటు లోపించడం
29. కేంద్ర ప్రభుత్వం పేదరిక అంచనాల కోసం 1989లో నియమించిన కమిటీ ఏది?
ఎ) సురేష్ టెండూల్కర్ కమిటీ
బి) లక్డావాలా కమిటీ
సి) రంగరాజన్ కమిటీ
డి) హసీమ్ కమిటీ
30. పేదరిక తీవ్రతను గణించడానికి ఉపకరించే సూచీ ఏది?
ఎ) పేదరిక అంతరం
బి) జీవన ప్రమాణం
సి) తలసరి ఆదాయం
డి) వ్యయార్హ ఆదాయం
31. 2004-05లో ఒడిశా తర్వాత అధిక పేదరికం నమోదైన రాష్ట్రం ఏది?
ఎ) ఛత్తీస్‌గఢ్ బి) మధ్యప్రదేశ్
సి) బిహార్ డి) హిమాచల్ ప్రదేశ్
32. సురేష్ టెండూల్కర్ పేదరిక కొలమాన పద్ధతిని సమీక్షించడానికి ప్రణాళికా సంఘం 2012 మే 23న ఎవరి అధ్యక్షతన నిపుణుల గ్రూపును ఏర్పాటు చేసింది?
ఎ) రంగరాజన్ బి) హసీమ్
సి) రఘురామ్‌రాజన్ డి) సక్సేనా
33. 2011-12లో రంగరాజన్ పేదరిక కొలమాన పద్ధతి ప్రకారం అత్యల్ప పేదరికం ఉన్న రాష్ట్రాలు వరసగా?
ఎ) హిమాచల్ ప్రదేశ్, గోవా, లక్షదీవులు, అండమాన్ నికోబార్
బి) అండమాన్ నికోబార్, గోవా, లక్షదీవులు, హిమాచల్ ప్రదేశ్
సి) లక్షదీవులు, గోవా, అండమాన్ నికోబార్, హిమాచల్ ప్రదేశ్
డి) గోవా, లక్షదీవులు, హిమాచల్ ప్రదేశ్, అండమాన్ నికోబార్
34. ఎన్.ఎస్.ఎస్.ఒ. 68వ రౌండ్ (2011-12) గణాంకాల ప్రకారం అత్యల్ప పేదరిక రేటు నమోదైన రాష్ట్రాలు వరస క్రమంలో?
ఎ) కేరళ, గోవా, అండమాన్ నికోబార్, లక్షదీవులు
బి) గోవా, లక్షదీవులు, అంమాన్ నికోబార్, కేరళ
సి) లక్షదీవులు, అండమాన్ నికోబార్, గోవా, కేరళ
డి) అండమాన్ నికోబార్, లక్షదీవులు, గోవా, కేరళ
35. భారత్‌లో పేదరికం, నిరుద్యోగం అంచనాలకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరించేది?
ఎ) జాతీయ అభివృద్ధి మండలి
బి) ప్రణాళికా సంఘం
సి) ఆర్థిక సంఘం డి) కేంద్ర ప్రభుత్వం
36. 1977లో నియమించిన ఏ కమిటీ పేదరిక అంచనాకు గ్రామీణ ప్రాంతాల్లో 2400 కేలరీలు, పట్టణాల్లో 2100 కేలరీల ఆహారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సిఫారసు చేసింది?
ఎ) వై.కె. అలఘ్ బి) హసీమ్
సి) సక్సేనా డి) లక్డావాలా
37. ఐక్యరాజ్య సమితి 1997లో పేదరికాన్ని అంచనా వేయడానికి దేన్ని కొలమానంగా తీసుకుంది?
ఎ) మానవాభివృద్ధి సూచీ
బి) లింగ సంబంధిత అసమానతల సూచీ
సి) లింగ సంబంధిత అభివృద్ధి సూచీ
డి) మానవ పేదరిక సూచీ
38. పేదల సంఖ్యను కింది వాటిలో దేని ఆధారంగా నిర్ణయిస్తారు?
ఎ) తలసరి ఆదాయం బి) దారిద్ర్య రేఖ
సి) ఆదాయ అసమానతలు
డి) ప్రాంతీయ అసమానతలు
39. ప్రణాళికా వ్యూహాలు ఆశించిన స్థాయిలో పేదరికాన్ని తగ్గించడానికి సహకరించడం లేదని వివరించింది ఎవరు?
ఎ) మిన్హాస్ బి) దండేకర్
సి) ఓజా డి) బర్ధన్
40. ఆహార వ్యయం ఆధారంగా పేదరికాన్ని లెక్కించడానికి 1962లో ప్రణాళికా సంఘం ఎవరు సూచించిన కొలమాన పద్ధతిని ఆమోదించింది?
ఎ) బర్ధన్ బి) మిన్హాస్
సి) దండేకర్, రథ్
డి) జాతీయ అభివృద్ధి మండలి
41. భారతదేశంలో పేదరికాన్ని ఆహారం ప్రాతిపదికగా లెక్కించి గ్రామీణ ప్రాంతాల్లో అధిక పేదరికం ఉన్నట్లు అభిప్రాయపడింది?
ఎ) అలఘ్, దండేకర్, నౌరోజీ
బి) మిన్హాస్, బర్ధన్, మాంటెక్‌సింగ్ అహ్లూవాలియా
సి) సురేష్ టెండూల్కర్, సక్సేనా, హసీమ్
డి) పైవేవీ కాదు
42. ప్రణాళికా సంఘం పేదరిక అంచనాలకు నూతన కొలమాన పద్ధతి సూచించడానికి సురేష్ టెండూల్కర్ అధ్యక్షతన నిపుణుల గ్రూపును ఎప్పుడు ఏర్పాటు చేసింది?
ఎ) డిసెంబర్ 2005 బి) ఫిబ్రవరి 2006
సి) ఏప్రిల్ 2006 డి) డిసెంబర్ 2006
43. దారిద్ర్య రేఖ, సగటు పేదరిక రేఖ దిగువన ఉన్న జనాభా మధ్య ఉండే వ్యత్యాసం?
ఎ) అధిక జీవన ప్రమాణం
బి) అధిక తలసరి ఆదాయం
సి) పేదరిక అంతరం
డి) అధిక సహజ వనరుల వినియోగం
44. 2011 సాంఘిక - ఆర్థిక కుల గణాంకాల ప్రకారం దేశంలోని మొత్తం గ్రామీణ కుటుంబాల సంఖ్య?
ఎ) 17.11 కోట్లు బి) 17.91 కోట్లు
సి) 18.11 కోట్లు డి) 18.91 కోట్లు
45. శ్రామిక శక్తిలో భాగంగా ఉండి, వాస్తవంగా ఉపాధి పొందే శ్రామిక శక్తిని ఏమంటారు?
ఎ) పనిలో పాలుపంచుకున్న శ్రామికులు
బి) ప్రధాన శ్రామికులు
సి) నిరుద్యోగులు
డి) ఉపాంత శ్రామికులు
46. ఏ కారణం వల్ల ‘వ్యాపార చక్రాల ప్రభావం భారతదేశం లాంటి ఆర్థిక వ్యవస్థల్లో తక్కువ’ అని భావించవచ్చు?
ఎ) సేవల ఆధారిత వ్యవస్థ
బి) తయారీ రంగ ఆధారిత వ్యవస్థ
సి) వ్యవసాయాధారిత వ్యవస్థ
డి) అధిక పెట్టుబడులు
47. బ్రిటిష్ పాలనలో భారతదేశ ఆర్థిక దోపిడీని కింది ఏ పుస్తకం ద్వారా తెలుసుకోవచ్చు?
ఎ) పావర్టీ ఆఫ్ ఇండియా
బి) డ్రెయిన్ ఆఫ్ వెల్త్
సి) పావర్టీ ఇన్ ఇండియా
డి) ఏదీకాదు
48. ఎన్.ఎస్.ఎస్.ఒ. సర్వే ప్రకారం 2011-12లో పెద్ద రాష్ట్రాల్లో నిరుద్యోగం తక్కువగా నమోదైన రాష్ట్రం ఏది?
ఎ) గుజరాత్ బి) కేరళ
సి) మధ్యప్రదేశ్ డి) ఉత్తరప్రదేశ్

సమాధానాలు

1) సి	2) బి	3) ఎ	4) డి	5) బి
6) డి	7) సి	8) ఎ	9) బి	10) ఎ
11) బి	12) సి	13) సి	14) బి	15) ఎ
16) సి	17) ఎ	18) డి	19) బి	20) సి
21) ఎ	22) డి	23) బి	24) డి	25) ఎ
26) సి	27) బి	28) డి	29) బి	30) ఎ
31) సి	32) ఎ	33) బి	34) డి	35) బి
36) ఎ	37) డి	38) బి	39) ఎ	40) సి
41) బి	42) ఎ	43) సి	44) బి	45) ఎ
46) సి	47) బి	48) ఎ		

Micro-programming introduced by?

BANK EXAMS

COMPUTER AWARENESS

MODEL QUESTIONS

1. If you want to connect to your own computer through the Internet from a different location, you can use _____.
1) E-mail 2) FTP
3) Instant message
4) Telnet 5) None of these
2. The gathering of a medium and its path by two or more devices is called ______.
1) Modulation 2) Encoding
3) Line discipline
4) Multiplexing
5) None of these
3. The server on the internet is also identified as ______.
1) Repeater 2) Host
3) Gateway 4) AND Gate
5) None of these
4. Personal computers can be connected together to form a_____.
1) Server 2) Super computer
3) Network 4) Enterprise
5) None of these
5. DSL is an example of a (n) ______connection.
1) Network 2) Wireless
3) Slow 4) Broadband
5) None of these
6. What's considered the 'backbone' of the World Wide Web?
1) URL 2) HTML 3) HTTP
4) FTP 5) None of these
7. SMTP stands for ______.
1) Simple Mail Transfer Protocol
2) Serve Message Text Process
3) Short Messaging Text Process
4) Short Messaging Transfer Protocol
5) None of these
8. A Proxy server is used for which of the following?
1) To provide security against unauthorized users
2) To process client requests for web pages
3) To provide TCP/IP
4) To process client requests for database access
5) None of these
9. Which term identifies main page of the entire site?
1) URL 2) Web site address
3) Hyperlink 4) Domain name
5) None of these
10. Which of the following is not a network topology?
1) Star 2) Bus 3) Linear
4) Ring 5) None of these
11. A central computer that holds collections of data and programs for many PCs, work stations, and other computers is a(n)_______.
1) Supercomputer
2) Minicomputer 3) Laptop
4) Server 5) None of these
12. When the pointer is positioned on a ______ is shaped like a hand.
1) Grammar error
2) Formatting error
3) Screen Tip
4) Spelling error
5) Hyperlink
13. TCP stands for _______.
1) Transfer control protocol
2) Transfer control process
3) Transmission control protocol
4) Transmission control process
5) None of these
14. Peer-to-peer is a description-
1) Of communications between two dissimilar devices
2) Of communications between two equal devices
3) Of communications between two different devices
4) All of the above
5) None of these
15. The technique where digital signals are converted to its analog form for transmission over an analog facility is called_______.
1) Modulation 2) Digitization
3) Multiprocessing
4) All of the above
5) None of these
16. Narrowband channel is a communication channels _______.
1) That handles low volumes of data
2) Used mainly for telegraph lines and low speed terminals
3) Both a and b 4) All of the above
5) None of these
17. MIME is an acronym for_______.
1) Multiprogramming Internet Mail Extension
2) Multicasting Internet Mail Extension
3) Multiple Internet Mail Extension
4) Multipurpose Internet Mail Extension
5) None of these
18. Which of the following is a network in which computers are located physically close together, often in the same building?
1) WAN 2) PAN 3) MAN
4) LAN 5) None of these
19. What is a modulator/demodulator that is connected to a circuit board or motherboard?
1) Fax modem
2) Network Interface Card (NIC)
3) Internal modem
4) External modem
5) None of these
20. What kind of server converts IP addresses to domain names?
1) File 2) DNS 3) E-mail
4) P2P 5) None of these
21. In the OSI model, the actual transmission of data is handled in the ______ layer.
1) Data link 2) Physical
3) Network 4) Transport
5) None of these
22. Which device cannot be shared in network?
1) Floppy 2) Keyword
3) Computer 4) Printer
5) None of these
23. A network of geographically distant computers and terminals is called a_______.
1) Integrated Services Digital Network (ISDN)
2) Metropolitan Area Network (MAN)
3) Wide Area Network (WAN)
4) Local Area Network (LAN)
5) None of these
24. An example of a wireless medium that sends data through the air or space is:
1) Fiber-optic cable
2) Coaxial cable
3) Twisted pair
4) Microwaves
5) None of these
25. A ____ shares hardware, software, and data among authorized users.
1) Network 2) Protocol
3) Hyperlink 4) Transmitter
5) None of these
26. Granting an outside organization access to internet web pages is often implemented using a(n)?
1) Extranet 2) Intranet
3) Internet 4) Hacker
5) None of these
27. ______ is a process that permits multiple computers to use the same IP address and hide their actual IP addresses from the Internet.
1) Routing
2) Network Address Translation (NAT)
3) Signature referencing
4) Packet filtering
5) None of these
28. The topology where all the nodes are attached in a circular wiring arrangement is called a:
1) Star topology
2) Bus topology
3) Network topology
4) Ring topology
5) None of these
29. Difference engine is the machine introduced by______.
I) Blaze Pascal 2) Napier
3) Charles Babbage 4) Newman
5) None of these
30. Valves are invented in______ generation.
I) I generation 2) II generation
3) III generation 4) IV generation
5) None of these
31. Micro-programming introduced by______.
I) John Mauchley
2) Maurice Wilkies
3) William Shockley
4) Blaise pascal
5) None of these
32. (1024)3 is equivalent to_______.
1) Approx I million
2) Approx 1 billion
3) Approx 10 thousand
4) 3096 5) None of these
33. Convert the (347)8 into binary number
1) 111000101 2) 011100111
3) 101110101 4) 100000111
5) None of these
34. Time required by a sector to reach below the head is known as _____.
1) Seek time 2) Latency time
3) Access time 4) Disk time
5) None of these
35. Function keys, control keys, arrow keys, modifier keys, toggle keys are known as ______.
1) Special keys 2) Alpha keys
3) Esc keys 4) Multimedia key
5) None of these
36. _______can be used with any CRT monitor but not with the LCD monitor.
1) Joystick
2) Light Pen
3) Trackball 4) Mouse
5) None of these
37. _____ Technologies is used by banks for faster processing of large volumes of cheques.
1) OCR 2) OMR
3) MICR 4) Bar code
5) None of these
38. The shortcut key for undo is ___.
1) Win button + E 2) Ctrl + X
3) Win button+ R
4) Ctrl +Z 5) None of these
39. Which of the following is not hardware of a computer?
1) Monitor 2) Windows
3) Processor 4) Printer
5) None of these
40. What is the main folder on a storage device called?
I) Platform 2) Interface
3) Root-Directory
4) Home-Page 5) None of these
41. Ctrl, Shift and Delete are known as______.
1) Modifier Keys
2) Control Keys 3) Toggle keys
4) Function keys
5) None of these
42. When you start your computer from the off position then it is known as ______
1) Hard booting 2) Processing
3) Storage 4) Soft-booting
5) None of these
43. A repair for a known software bug, usually available at no change on the internet is called ______.
1) Version 2) Patch
3) Tutorial 4) FAQ
5) None of these

KEY

1) 4	2) 4	3) 2	4) 3
5) 4	6) 3	7) 1	8) 2
9) 1	10) 3	11) 4	12) 5
13) 3	14) 4	15) 1	16) 1
17) 4	18) 4	19) 3	20) 2
21) 2	22) 2	23) 3	24) 4
25) 1	26) 1	27) 2	28) 4
29) 3	30) 1	31) 2	32) 2
33) 2	34) 2	35) 1	36) 2
37) 3	38) 4	39) 2	40) 3
41) 1	42) 1	43) 2	